ఉప వేదాంగాలు

# బ్రహ్మ సూత్రములు- 2అధ్యాయము- 1పాదము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్

www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

ఓమ్

శ్రీమద్బాదరాయణప్రణీత

# బ్రహ్మసూత్రములు

శ్రీశాంకరశారీరకభాష్య - తదాంధ్రానువాదవిశేషాంశసహితములు

## ద్వితీయాధ్యాయ - ప్రథమపాదము

★

ఆంధ్రానువాదకులు :

వ్యవహారధురీణ, కవితాప్రవీణ, వేదాంతపారీణ, ఆంధ్రశ్రీభగవద్గీతాప్రభృతి గ్రంథకర్త

శ్రీ పాటిబండ సూర్యనారాయణామాత్యులు

శ్రీమద్బాదరాయణప్రణీత

# బ్రహ్మసూత్రములు

## శ్రీశాంకరశారీరకభాష్య-తదాంధ్రానువాద-విశేషాంశసమేతములు

### సమన్వయాఖ్య ద్వితీయాధ్యాయము-ప్రథమపాదము

## స్మృత్యధికరణము

ప్రథమేఽధ్యాయే, సర్వజ్ఞ, స్సర్వేశ్వరో, జగదుత్పత్తికారణం మృత్సు వర్ణాదయ ఇవ ఘటరుచికాదీనాం,

అవతారిక :-

(1) ప్రథమాధ్యాయములోఁ దీర్మానింపఁబడిన విషయములు.

ప్రథమాధ్యాయమందు, కుండ - ఆభరణములు మొదలగువానికి మట్టి - బంగారము మొదలగునవి యెట్లు కారణములగునో, అట్లే యీజగత్తుయొక్క యుత్పత్తికి (పుట్టుకకు) సర్వజ్ఞుఁడైన సర్వేశ్వరుఁడే (బ్రహ్మమే) కారణమనియును (ఉపాదాననిమిత్త కారణములు రెండును- అనఁగా కుండకు మట్టి గుమ్మరవాడునువలె)

ఉత్పన్నస్య, జగతో, నియంతృత్వేనస్థితికారణం, మాయావీవమాయాయాః,

గారడిపనులు సాగుటకు గారడివాడు (ఐంద్రజాలికుఁడు) కారణమెట్లగునో, పుట్టినజగత్తుయొక్క సాగుబాటునకు నియామకుఁడైన యీసర్వేశ్వరుఁడే కారణమనియును,

ప్రసారితస్య, జగతఃపునస్స్వాత్మన్యేవో, పసంహారకారణ, మవనిరివ, చతుర్విధస్య భూతగ్రామస్య,

(పసుపైనచాప యాచాపయందే చుట్టుకొనిపోయిన విధమున) భూమిలో నుండి పుట్టిన (స్వేదాండజరాయూద్భిజ్జములు) నాలుగువిధములైన భూతశరీరసముదాయము భూమిలోనే మఱల నెట్లు చేరిపోవునో, అట్లే తనలోనుండిపుట్టి యీ వ్యాపించియున్న జగత్తు మఱలఁ దనలోలీనమగుటకు నాసర్వేశ్వరుఁడే కారణమనియు,

'సఏవచ సర్వేషాం, న ఆత్మా ఇత్యేతత్.

ఆసర్వేశ్వరుఁడే మన కెల్లరకు 'ఆత్మ' గా (మనయునికికి నాధారముగా) నున్నాడనియు ననుసీసమ స్తవిషయములు

వేదాంతవాక్య సమన్వయ ప్రతిపాదనేన, ప్రతిపాదితం

వేదాంతవాక్యములను సమన్వయముచేసి చూపుటమూలముగా నిరూపింపఁ బడియున్నవి.

ప్రధానవాదాశ్చ శబ్దత్వేన నిరాకృతాః,

మఱియు నాప్రథమాధ్యాయమునందే, 'జగత్తునకు ప్రధానమే కారణ' మని సాంఖ్యులుచేయు వాదములన్నియును (అశబ్దత్వేన=) వేదమున కనుకూలించినవి కావని (=వేదబాహ్యములని) నిరూపించుట మూలముగాఁ దోసివేయఁబడినవి-

(2) రెండవయధ్యాయములోఁ దీర్మానింపఁబడనున్న విషయములు

ఇదానీం స్వపక్షే స్మృతిన్యాయవిరోధపరిహారః, ప్రధానాదివాదానాంచ న్యాయాభాసో పబృంహి- తత్వం, ప్రతివేదాంతంచ సృష్ట్యాది ప్రక్రియాయా అవిగీతత్వ మిత్య స్యార్థజాతస్య ప్రతిపాదనాయ ద్వితీయోఽధ్యాయ ఆరభ్యతే.

ఇప్పుడీ రెండవయధ్యాయము (స్వపక్షు=) వేదాంత (=ఉపనిషన్మత) పక్షమందిదివరలోఁ జేయఁబడిన సిద్ధాంతము కపిలపంచశిఖాది మునిప్రోక్తములైన స్మృతులకును, తర్కాదియుక్తులకును విరోధము (=వ్యతిరేకము) గా నుండునని చేయఁబడు దుర్వాదములను ఖండించుటకును, జగత్సృష్టికిఁ బ్రధానాదులే కారణమని సాంఖ్యాదులుచేయు సిద్ధాంతముల పోషణమునకై చూపించఁబడు (క్రమ యుక్తులుగానివై) యుక్తులవలెఁ బైకిఁజూపట్టి భ్రమపెట్టు దుర్యుక్తి వాక్యములయందుండు దోషములను వెల్లడించుటకును, జగత్సృష్ట్యాది విషయములను వివరించు పట్ల సర్వోపనిషత్తులయందును బరస్పరవిరోధ (=విగీతత్వ) మేమియులేదని స్పష్టీకరించుటకును ఇప్పుడీ రెండవఅధ్యాయ మారంభింపఁబడుచున్నది-

(3) అ 2-1పా-1 అధికరణములోని విషయము.

తత్ర. ప్రథమంతావత్, స్మృతివిరోధముపన్యస్య పరిహరతి.

ACC No 13617



రెండవ యధ్యాయములోని ప్రథమపాదమందలి ప్రథమసూత్రమిప్పుడు కపిలమునికృతమగు సాంఖ్యస్మృతి ననుసరించిన పూర్వపక్షమును ముందువివరించి వెంటనే దానిని ఖండించివైచుచున్నది చూడుఁడు.

## ౧ సూ॥ స్మృత్యనవకాశ దోషప్రసంగఇతిచేన్నా న్యస్మృత్యనవకాశదోషప్రసంగాత్

ప॥ వి :- స్మృత్యనవకాశదోషప్రసంగః + ఇతి + చేత్ - న + అన్యస్మృత్యనవకాశదోషప్రసంగాత్

ప్ర. ప. అ:- (పూర్వపక్ష భాగము)-స్మృత్యన-ప్రసంగః;=స్మృతి=సాంఖ్యాది స్మృతులకు, అనవకాశ = ప్రామాణ్యము లేకపోవుట నెడి, దోష ప్రసంగః=దోషము సంభవించును. ఇతి చేత్ అని యాక్షేపణము చేయుచో-

(సిద్ధాంతభాగము) న=ఆయాక్షేపణము సరిగాదు, (ఎందుచేననఁగా)-అన్యస్మృత్యనవకాశదోషప్రసంగాత్; అన్య=కపిలాదిమునులకంటె నితరులైన మన్వాది మునులయొక్క, స్మృతి=స్మృతులకు, అనవకాశ = ప్రామాణ్యము లేకపోవుట యనెడి, దోషప్రసంగాత్=దోషము సంభవించుటవలన.

సూ. తా:- వేదాంతమత మంగీకరించుచో (వేద విరుద్ధములైన) కపిలాది మునిస్మృతుల ప్రామాణ్యమునకు భంగమువాటిల్లునని వాదించుట సరిగాదు- వేదాంతమతమును నిరాకరించి కపిలాది మునిస్మృతులనే ప్రమాణముగా నంగీకరించుచో (వేదానుకూలములైన) మన్వాదిస్మృతులు నిరర్థకములైపోవుట సంభవించును. వేదవిరుద్ధములైన స్మృతులకు భంగమువాటిల్లిన వాటిల్లుఁగాక. వేదానుకూలములైన స్మృతుల ప్రామాణ్యమునకు ముప్పువాటిల్లెనేని, నిజమైన దోషమే యగును.

పూర్వపక్షము :-

1. ఈశ్వరకారణ విషయములో వేదాంతమత మంగీకరించినచో సాంఖ్యస్మృతి ప్రామాణ్యమునకు భంగమువాటిల్లును-

(1) కపిలస్మృతి పెద్దలచే ప్రమాణముగా నంగీకరింపఁబడినది. దీనిననుసరించిన మఱికొన్ని స్మృతులును గలవు.

* యదుక్తం, బ్రహ్మైవసర్వజ్ఞంజగతః కారణమితి తదయుక్తం కుతః స్మృత్యనవకాశదోషప్రసంగాత్, స్మృతిశ్చతంత్రాఖ్యా పరమర్షిప్రణీతా శిష్టపరిగృహీతా అన్యాశ్చ తదనుసారిణ్యః స్మృతయః

సర్వజ్ఞమైన బ్రహ్మమే జగత్తునకుఁ గారణమని చేయువాదము సరియైనది గాదు, ఎందువలననందురేమో. అట్లువాదించుచో స్మృతిప్రామాణ్యమునకు భంగము వాటిల్లును- స్మృతికిఁ దంత్ర (సాధన) మనిపేరు. 'స్మృతి' యనునది పరమఋషిచేతఁ జేయఁబడినదియయియున్నది. ఈపరమఋషియే కపిలుఁడు. అది పెద్దలచేతఁ బ్రమాణముగా నంగీకరింపఁబడిన విషయమే- ఆకపిలఋషిని ననుసరించి ఆసురి-పంచశిఖుఁడు మొదలగు మఱికొందరు ఋషులుసైతము మఱికొన్ని స్మృతులను రచించియుండిరి.

తా, ఏవం సత్యనవకాశాః ప్రసజ్యేరన్.

ఇట్టి సందర్భములో (వేదాంతమతమంగీకరింపఁబడుచో) ఆకపిలాది స్మృతులన్నియు నప్రమాణములైపోవును.

తాసుహ్య, చేతనం స్వతంత్రం, ప్రధానం, జగతః కారణముపనిబధ్యతే,

ఆకపిలాది స్మృతులయందు అచేతనము- స్వతంత్రమునైన ప్రధానము జగత్తునకుఁ గారణమని వర్ణింపఁబడియున్నది-

(2) కపిలస్మృతి నంగీకరించినను మన్వాదిస్మృతుల ప్రామాణ్యమున కిబ్బందిలేదు. మన్వాదిస్మృతులు ధర్మమునుగూర్చియేఁ జెప్పును.

మన్వాదిస్మృతయస్తావచ్చోదనాలక్షణేనాఽగ్నిహోత్రాదినాఽధర్మజాతే నాపేక్షితమర్థం సమర్పయంత్యః సావకాశాభవంతి,

(కపిలాదిస్మృతు లంగీకరింపఁబడుచో మన్వాదిస్మృతుల ప్రామాణ్యమున కవకాశములేదనుకొందురేమో. అట్టిభయములేదు) మన్వాదిస్మృతులు చెప్పునదియెల్ల- అగ్నిహోత్రములు మొదలగు కర్మకాండకు సంబంధించినవిధు లాచరించుటచేఁ బ్రాప్తించు ప్రయోజనము లుపదేశించుటయే- అందువలన నావిషయములకు సంబంధించినంతవరకు నామన్వాదిస్మృతులు ప్రమాణములుగానే యుండును. వానికిబ్బందిలేదు.

ఆమన్వాదిస్మృతు లుపదేశించు విషయములు మఱికొంత వివరింతుము చూడుఁడు.

అస్య వర్ణస్యాస్మిన్ కాలేఽనేనవిధానేనోపనయన మీదృశశ్చాచార ఇత్థంవేదాధ్యయన మిత్థం సమావర్తన మిత్థం సహధర్మచారిణీసంయోగఇతి తథాపురుషార్థాంశ్చతుర్వర్ణాశ్రమ ధర్మాన్ నానావిధాన్ విదధతి

(1) ఏయేవర్ణములవారికి నేయేకాలములయందు నేయేవిధములచేత నుపనయనాది కర్మములు చేయవలసినదియు (2) ఏవర్ణమందెట్టి యాచారముండవలసినదియు

(3) వేదాధ్యయన మెవరెప్పు డెట్లు చేయవలసినదియు (4) ఎవరెట్లు వివాహమాడ వలసినదియు (5) గృహస్థాశ్రమ ధర్మమెట్లు నిర్వర్తించుకొన వలసినదియు (6) నాలుగువర్ణములవారికి నాలుగాశ్రమముల యందుండువారికిఁ బహువిధములై పలుతెఱంగులైన ధర్మములెట్టెట్టివనియు— ఈమొదలగు విషయములే మన్వాది స్మృతులచే నుపదేశింపఁబడును.

(3) కపిలాదిస్మృతులు మోక్షసాధనమైనజ్ఞానమునుగూర్చిమాత్రమే చెప్పును.

నైవం కాపిలాదిస్మృతీనా మనుష్ఠేయవిషయే నవకాశోऽస్తి

మొదలే పేర్కొనఁబడిన కపిలాదిస్మృతులన్ననో, కర్మ (=అనుష్ఠేయ) విషయముల యద్విధముగానైనను బోధింపవు. వానిలో నీప్రస్థాపనమేయుండదు.

మోక్షసాధన మేవహి సమ్యగ్దర్శన మధికృత్య తాః ప్రణీతాః

సమ్యగ్దర్శనమేయనఁగా పరిపూర్ణజ్ఞానమే మోక్షసాధన మగునను విషయమునుగూర్చి బోధించుటకే యాకపిలాదిస్మృతులు రచింపఁబడినవి.

(4) జ్ఞానవిషయములోఁ గపిలాదిస్మృతులఁ బ్రమాణముగా నంగీకరింపనిచో వానికిక స్థానమే లేదు

యది తత్రాప్య నవకాశాస్స్యుః అనర్థక్య మేవాసాం ప్రసజ్యేత

(తత్రాపి) ఆ మోక్షసాధనవిషయ మొక్కటినిగూర్చి యా కపిలాదిస్మృతులకుఁ బ్రామాణ్య మంగీకరింపనిచో. వానికి నిరర్థకత్వమే సంప్రాప్తమగును.

(5) కపిలాదిస్మృతుల కనుకూలించు రీతిగానే వేదాంతములకర్థము చెప్పితీర వలెను.

తస్మాత్తదవిరోధేన వేదాంతావ్యాఖ్యాతవ్యాః

కాబట్టి (తత్ =) యా కపిలాదిస్మృతులకు నేవిధమగు భంగమురాకుండు లాగుననే— అనఁగా వానికనుకూలముగా నుండులాగుననే యుపనిషత్తుల (వేదాంతముల)లోని విషయముల కర్థము చెప్పితీరవలయును.

(6) సాంఖ్యుల'ప్రధానము'జగత్కారణముగానే నిరూపింపఁబడియుండఁగా, సాంఖ్యస్మృతి ప్రామాణ్యమునుగూర్చి మఱల నీతగులాటయేటికి?

మధ్యస్థుని మొదటిప్రశ్న :-    పూర్వపక్షి సమాధానము :-

కథంపునరీక్షత్యాదిభ్యో హేతుభ్యోబ్రహ్మైవసర్వజ్ఞం జగతః కారణ మిత్యవధారితః

శ్రుత్యర్థః స్మృత్యనవకాశదోషప్రసంగేన పునరాక్షిప్యతే

లోఁగడ బ్ర.సూ. I-1-5 అను ఈక్షత్యధికరణమందే (ఈక్షతి) జగత్తును సృష్టించినపదార్థము సృష్టికిముందు 'సంకల్పించెను' (తదైక్షత) అని శ్రుతులలో నుండుటవలన, ఆ సృష్టించినపదార్థ మచేతనమైన ప్రధానముగానేరదను మొదలగు పెక్కు హేతువులనుబట్టి జగత్తును సృష్టించినది వాస్తవమునకు సర్వజ్ఞమైన (చేతన మైన) బ్రహ్మమని చెప్పుటయే శ్రుతులయొక్క యభిప్రాయమైనట్లు నిశ్చయింపఁ బడియుండఁగా చేతనమైనబ్రహ్మమే సృష్టికర్తయని యంగీకరించుచో కపిలముని స్మృతికి (సాంఖ్యస్మృతికి) ప్రామాణ్యము లేకపోవునను దోషమువచ్చునని మఱల నిప్పుడాక్షేపించుటలో స్వారస్యమేమున్నదని కొందరడ్డగింతురేమో 'సమాధానము చెప్పఁబడును చూడుఁడు.

పూర్వపక్షి సమాధానము :-

(7) స్మృతి సహాయము లేకుండ స్వతంత్రముగా శ్రుతులకర్థము సెప్పుట యలవి గాని పని.

భవేదయమనాక్షేపః స్వతంత్రప్రజ్ఞానాం

మేముచెప్పిన విషయము స్వతంత్రప్రజ్ఞ గలవారమనియెంచు కొందరికి- అనఁగా స్మృతిసహాయము లేకుండ శ్రుతులకు స్వతంత్రముగానే యర్థముచేయఁ గలమని యెంచుకొందరికి (అనాక్షేపః) నచ్చకపోవుఁగాక.

పరతంత్రప్రజ్ఞాస్తు, ప్రాయేణ జనాః

సాధారణముగా జనసామాన్యము శ్రుతులకర్థము సెప్పుటలో స్మృతుల మీదనే యాధారపడియుండును.

స్వాతంత్ర్యేణ శ్రుత్యర్థ మవధారయితు మశక్నువంతః

స్వతంత్రప్రజ్ఞమీదనే యాధారపడి శ్రుతులకర్థము చెప్పగలశక్తి గలిగి యుండనోపరు.

ప్రఖ్యాతప్రణేతృకాసుస్మృతిష్వవలంబేరన్ తద్బలేనచ శ్రుత్యర్థం ప్రతిపిపిత్సేరన్

అందుచేత స్మృతికర్తలై ప్రసిద్ధులగువారి యభిప్రాయములను (enterpre-fetions) ప్రమాణముగాఁదీసికొని వానియాధారము మీదనే శ్రుతుల కర్థమును జేయఁగోరుదురు.

(8) సాంఖ్యస్మృతికర్తయైన కపిలుఁడఖండ ప్రజ్ఞగలవాడు. ఈవిషయమును శ్రుతిగూడఁ జెప్పుచున్నయది. కపిలుఁడు త్రోసివేయఁబడఁదగినవాఁడు కాడు.

అస్మత్కృతేచ వ్యాఖ్యానే నవిశ్వస్యు ర్బహుమానాత్ స్మృతీనాం ప్రణేతృషు

(అట్టిసందర్భములో)సాంఖ్యాదిస్మృతికర్తలైన కపిలాదిమహర్షులయందుండు గౌరవవిశేషమట్టిదైయుండఁగా, అస్మదాదులు (మనవంటివారు) చేయు స్వతంత్ర వ్యాఖ్యానములయం దెవ్వరికి విశ్వాసమేర్పడఁగలదు !

కపిలప్రభృతీనా మార్షం జ్ఞానమప్రతిహతం స్మర్యతే

కపిలాది మహానుభావులయొక్క జ్ఞానమత్యద్భుతమై (=ఆర్షం) నిరాఘాట (=అప్రతిహతం) మైనదనిచెప్పుట యతిశయోక్తి యెంతయును గానేరదు.

శ్రుతిశ్చభవతి 'ఋషింప్రసూతం' ఇతి

ఈ విషయము మేముచెప్పుటయేగాదు శ్రుతిస్వైతమట్లే ఘోషించుచున్నది.

శ్వే V-2 'ఋషింప్రసూతం కపిలంయస్తమగ్రే జ్ఞానైర్బిభర్తి (జాయమానంచ పశ్యేత్)

'(యః=) ఏ పరమేశ్వరుఁడు, (అగ్రే=) సృష్ట్యాదియందు, (ప్రసూతం=) పుట్టిన, (కపిలంఋషిం=) కపిలుఁడను పేరుగల మహర్షిని, (జ్ఞానైః=) జ్ఞానాది ధర్మములచేత (బిభర్తి=) పరిపూర్ణుని జేసెను.

తస్మాన్నైషాం మతమయథార్థం శక్యం సంభావయితుం

కాబట్టి జ్ఞానాచార్యులైన యీకపిలమహర్షియొక్క యభిప్రాయము (=మతం) సత్యమైనదిగాదని తలంచుట కెవరివశము !

(9) కపిలుని సాంఖ్యస్మృతి తర్కబలముచేతఁగూడఁ బ్రతిష్ఠాపనమును జెందియున్నది.

తర్కావష్టంభేనచ తేऽర్థం, ప్రష్ఠాపయంతి.

అంతేగాక మఱియు కపిలమతావలంబికులైన (తే=) సాంఖ్యులు తమతర్క దర్ఢిమ (బలము) చేతఁగూడ నాకపిలమహర్షి ప్రణీతమైన స్మృత్యర్థము నిరవద్య మైనదని స్థాపింపఁగలిగినారు.

(10) 'కపిలస్మృత్యనుసారముగ వేదాంతములకర్థము చెప్పవలసియున్నది' అను నాక్షేపమున కింతవరకుఁ బ్రత్యుత్తరము లేనందున, మఱల నీయాక్షేపమున కవకాశము గలదు.

తస్మాదపి స్మృతిబలేన వేదాంతా, వ్యాఖ్యేయా ఇతి పునరాక్షేపః

కాబట్టి స్మృత్యనుసారముగాని వేదాంతవాక్యము లర్థము చేయవలసియున్న దను మాయాక్షేపణము నిల్చియున్నదిగాని యింతవరకు సమాధాన మీయఁబడ నందున మఱల మఱల మేమాయాక్షేపణముచేయుట యుక్తమే.

II ఈశ్వరకారణ విషయములో వేదాంతమత మంగీకరింపనిచో, మన్వాది స్మృతులకు అప్రామాణ్యదోషము గలుగును.

(1) ఈశ్వరకారణవాద మంగీకరించుచో నొకస్మృతి ప్రామాణ్యమునకు భంగమురావచ్చును- దానినంగీకరింపనిచో బహుస్మృతి ప్రామాణ్యమునకు భంగముగల్గితీరును.

తస్యసమాధి ర్నాన్య స్మృత్యనవకాశ దోషప్రసంగాదితి

పైనఁదెలిపిన పూర్వపక్షమునకు 'అన్యస్మృత్య నవకాశదోష ప్రసంగాత్' అను మాటలతో సూత్రమే (సమాధిః=) సమాధానము చెప్పుచున్నది-

యదిస్మృత్య నవకాశదోష ప్రసంగేన ఈశ్వరకారణవాద ఆక్షిప్యేత, ఏవమప్యన్యా ఈశ్వర కారణవాదిన్యః స్మృతయోఽనవకాశాః ప్రసజ్యేరన్ తా ఉదాహరిష్యామః

ఏదోయొకస్మృతికి (అనగా కపిలసాంఖ్యస్మృతికి) అప్రామాణ్యదోషము సంభవించునను భయముతో ఈశ్వరుఁడే జగత్కర్తయనువాదము త్రోసివేయఁ బడుచో, అప్పుడుసైతము 'ఈశ్వరుఁడే జగత్కర్త' యని యుద్ఘాటించు ననేకము లైన యితరస్మృతులు (అనఁగా మన్వాదిస్మృతులు) అప్రమాణములై పోవు చున్నవి. అందులకేమందురు! ఆ స్మృతులేవియో కొన్నింటి నుదాహరింతుము చూడుఁడు.

(2) ఈశ్వరకారణవాద మంగీకరించు బహుస్మృతులుగలవు చూడుఁడు.

'యత్త' ఇతి, పరబ్రహ్మం, ప్రకృత్య, భా. శాం, అ 334-27, 'యత్తత్సూక్ష్మ మవిజ్ఞేయమ్'

సూక్ష్మమైనదియు, అవిజ్ఞేయ (తెలిసికొనఁబడఁజాలనిది) మైనదియు నేది గలదో యట్టి

అని పరబ్రహ్మము నుద్దేశించి

'సహ్యంత' ఇతిచోక్త్వా, భా. శాం. అ 334-28 'హ్యంతరాత్మభూతానాం, క్షేత్రజ్ఞశ్చేతి కథ్యతే'

ఆపరబ్రహ్మము సర్వభూతములకు నంతరాత్మయనియు క్షేత్రజ్ఞుఁడనియు జెప్పఁబడుచున్నాడు.

ఇత్యాహ భా.శాం అ334-29 'తస్మాదవ్యక్తముత్పన్నం త్రిగుణం ద్విజసత్తమ

'ఓనారదుఁడా! ఆబ్రహ్మమునుండియే త్రిగుణాత్మకమైనమాయ(=అవ్యక్తం) యను నీజగత్సూక్ష్మరూపము పుట్టినది.

అట్లే యీ భారతస్మృతియందు మఱియొకచోట

తథాऽన్యత్రాపి భార..........."అవ్యక్తం పురుషే బ్రహ్మన్నిష్క్రియే సంప్రలీయతే"

'(బ్రహ్మన్=) ఓనారదుఁడా, (అవ్యక్తం=) మాయయను సీప్రపంచము (నిష్క్రియే=) నిర్గుణుఁడైన పురుషునియందు (సంప్రలీయతే=) లయమును జెందుచున్నది.

ఇత్యాహ — ఇట్లని చెప్పఁబడినది. మఱియును—

'అతశ్చ' ఇతిచపురాణే విష్ణుపురాణము : 'అతశ్చ సంక్షేప మిమం శ్రుణుధ్వం' నారాయణ స్సర్వమిదం పురాణః ససర్గకాలేచ కరోతి సర్వం సంహారకాలేచ తదత్తి భూయః'

'ఓఋషులారా ! ఈ సంక్షేపవాక్యమును వినుఁడు ! పురాణ పురుషుఁడైన నారాయణుఁడే ఈసర్వజగత్తు. వాడే సర్వజగత్తును సృష్టికాలమందు సృష్టించుచున్నాడు. సంహారకాలమందు దానిని మఱల సంహరించుచున్నాడు (తనలోలీనమును జేసికొనుచున్నాడు.)

ఇట్లని పురాణమందుఁ జెప్పఁబడియున్నది.

భగవద్గీతాసుచ 'అహం 'ఇతి

మఱియును భగవద్గీతా స్మృతియందు

భ.గీ VII-6 'అహం కృత్స్నస్య జగతః ప్రభవః ప్రళయస్తథా'

"..........కాన సకలభూత జన్మనాశములకు హేతువైన (నాయాంధ్ర భగవద్గీత) ఈశ్వరుఁడే జగత్సృష్ట్యాది కర్తయైనట్లు చెప్పఁబడినది.

పరమాత్మాన మేవచ ప్రకృత్యాऽऽపస్తంభః పఠతి 'తస్మాత్కా ల' ఇతి

ఆ పరమాత్మనుగూర్చి చేసిన ప్రసంగములోనే

ఆ॥ ధర్మసూ. I-8-23 'తస్మాత్కాయాః ప్రభవంతి సర్వే సమూలం శాశ్వతికశ్చ నిత్యః

'ఆ పరమేశ్వరునివలన శరీరములన్నియును బుట్టుచున్నవి. అతఁడే సర్వ జగత్తునకు మూలకారణము (అనఁగా ఉపాదాన కారణము) అతఁడే (శాశ్వతికః=) కూటస్థుఁడు-నిత్యుఁడు.

ఇట్లని స్పష్టముగా వక్కాణింపఁ బడినది—

ఏవమనేకశః స్మృతిష్వపీశ్వరః కారణత్వేనో పాదానత్వేన చ ప్రకాశ్యతే

ఇట్లే పలుచోట్ల ననేకస్మృతులయందు ఈశ్వరుఁడే జగత్తునకు (కుండకు కుమ్మరివానివలె) నిమిత్తకారణమనియు (కుండకు మట్టివలె) ఉపాదానకారణమని యును వర్ణింపఁబడియున్నాఁడు-

స్మృతిబలేన ప్రత్యవతిష్ఠమానస్య స్మృతిబలేనైవోత్తరం ప్రవక్ష్యామీత్యతోఽయ మన్యస్మృత్యనవకాశోపన్యాసః

ఏదోయొక స్మృతిబలముమీద నాధారపడి యీశ్వరజగత్కారణత్వ మధిక్షేపించువానికి అనేకస్మృతులయొక్క బలముతోనే ప్రత్యుత్తరము చెప్పుట మంచిదని 'పూర్వపక్షివాద మంగీకరించుచో అనేకములైన యితర స్మృతులయొక్క ప్రామాణ్యమునకు భంగమువచ్చునని పైనఁజూపినవిధమున నుపన్యసింపఁబడినది.

(3) ఈశ్వరకారణవాదమందే శ్రుతితాత్పర్యము మున్నే (బ్రసూ. I-1 3 లో) నిరూపింపఁబడినది గదా!

దర్శితంతు శ్రుతీనామీశ్వర కారణవాదం ప్రతితాత్పర్యం

'ఈశ్వరుఁడే జగత్తునకుఁగారణ' మని చెప్పుటయే శ్రుతులయొక్క యభిప్రాయమని మున్నే (బ్ర I-1-5 ) నిరూపింపఁబడినది.

(4) శ్రుతితో విరోధించు స్మృతుల ప్రమాణములని జైమినిసైతము సిద్ధాంతపఱచుచున్నారు.

విప్రతిపత్తౌచ స్మృతీనామవశ్యకర్తవ్యే ఽన్యతరపరిగ్రహే ఽన్యతరపరిత్యాగేచ శ్రుత్యను సారిణ్యః స్మృతయః ప్రమాణ, మనపేక్ష్యా ఇతరాః.

శ్రుతితోఁగొన్నిస్మృతులకు మాత్రము భేదము (విరోధము) కనుపించి నప్పుడు, అవశ్యముగా నేస్మృతులను బరిగ్రహించవలయునో, యేస్మృతులను బరిత్యజించవలయునో యనుసంశయము (త్రొక్కులాట) గల్గుచో, శ్రుతికనుకూలించు స్మృతులే ప్రమాణములని స్వీకరించి శ్రుతికి విరుద్ధముగానుండు స్మృతులను (అనపేక్ష్యాః =) అప్రమాణములని త్రోసివేయవలసియుండును.

తదుక్తంప్రమాణలక్షణే, 'విరోధే' ఇతి,

స్మృతిప్రమాణ లక్షణమును నిర్దేశించుపట్ల పూర్వమీమాంసాసూత్రకారుఁడైన జైమినిమహర్షియు నిట్లే చెప్పియున్నాఁడు చూఁడుఁడు.

జై. సూ. I-3-3 'విరోధే, త్వనపేక్షంస్యా దసతిహ్యనుమానమ్'

(స్మృతికి) (విరోధేతు =) శ్రుతితో విరోధము సంభవించుచుండఁగా, నాస్మృతి (అనపేక్షంస్యాత్ =) అప్రమాణమేయగును- (అసతివా=) స్మృతికి

శ్రుతితో విరోధము లేకపోవుచుండఁగా (అనవకాశమ్=) ఆస్మృతియే ప్రమాణ మగును.

(5) అతీంద్రియార్థములు శ్రుతిసహాయము లేకుండ నిశ్చయింపఁబడుట కవకాశము లేదు.

నచాతీంద్రియానర్థాన్ శ్రుతిమంతరేణ కశ్చిదుపలభత ఇతిశక్యం సంభావయితుం-
నిమిత్తాభావాత్

ఇంద్రియముల కందఁజాలని విషయము లిదమిత్థమని శ్రుతిసహాయము లేకుండ నెట్టివాఁడైనను నిశ్చయింపఁగలడని సమ్మానించుట కవకాశముండదు.

అట్టి సమ్మానమునకుఁదగినంత యుపపత్తి (నిమిత్తము- హేతువు) యుండుట యసంభవము.

(6) దర్శిలా పుట్టిన కపిలాదుల ఖండప్రజ్ఞగలవారైనను వీరియభిప్రాయానుసారముగా వేదార్థమును ద్రోసివేయఁగూడదు.

శక్యం కపిలాదీనాం సిద్ధానా మప్రతిహతజ్ఞానత్వా దితిచేత్.

(ఇతరులవిషయములో నది కొంతవరకు వాస్తవమగునేమో కాని) అఖండ ప్రజ్ఞగలిగి సిద్ధులైన (మహిమనుగడించిన) కపిలాదిమహర్షుల విషయములో మాత్ర మట్లనఁగూడదని పూర్వపక్షి వాదించవచ్చును.

న సిద్ధేరపి సాపేక్షత్వాత్

అట్టివాదము నిల్వఁదగినదిగాదు సిద్ధి(=మహిమ) యనునది యెప్పుడును ఆయాపురుషుఁడు చేసిన సాధనము (=అపేక్ష) పై నాధారపడియుండును.

ధర్మానుష్ఠానాపేక్షాహి సిద్ధి

అనఁగా 'సిద్ధి' (=మహిమ) యనునది వేదవిహితములైన పెద్దకర్మ (=ధర్మ) ములనుష్ఠించుటచేఁ గలుగుచుండును.

సచ ధర్మశ్చోదనాలక్షణః

అనుష్ఠించవలసిన కర్మ (=ధర్మ) మెప్పుడును వేదమందు విధి (చోదనా) రూపముగా నుండును.

తతశ్చ పూర్వసిద్ధాయా శ్చోదనాయా అర్థోనపశ్చిమ సిద్ధపురుషవచనవశేనాతిశంకితుం శక్యతే

ఆకారణముచే వేదమందుఁ బూర్వమే (యేదోయొక నిశ్చితార్థముతో) సిద్ధమైయున్న విధివాక్యములయొక్క యర్థమును నిర్ణయించుటకుఁ బూని, (పశ్చిమ సిద్ధపురుష=)

తరువాత (=వేదవాక్యములకుఁదరువాత) మూర్తీభవించి సిద్ధులైన వారి వచనానుసారముగా వాస్తవమైన వేదభావమును త్రోసివేయుటకు సాధ్యముగాదు.

(7) అఖండప్రజ్ఞగల సిద్ధులనేకులున్నప్పు డెవరిపై పక్షపాతము వహింప గలము.

సిద్ధవ్యపాశ్రయ కల్పనాయామపి బహుత్వాత్ సిద్ధానాం ప్రదర్శితేన ప్రకారేణ స్మృతివిప్రతిపత్తౌ సత్యాం న శ్రుతివ్యపాశ్రయా దన్యన్నిర్ణయ కారణమస్తి

ఓసి ! సిద్ధులు మహానుభావులు గాన వారుపోయినపోకడనే యనుసరించుట మంచిదనుకొన్నను, అట్టి సిద్ధపురుషులును వారిచేఁ గల్పింపఁబడిన స్మృతులును బహుళముగా నుండుటచే, పైన వివరింపబడినచొప్పునఁ గొన్నిస్మృతులలోని విష యములు పరస్పర విరుద్ధములై యుండుటయేగాక యందులోఁ గొన్ని స్మృతులు శ్రుతితో నేకీభవించక విరోధముగా నున్నట్టు స్పష్టమగుచుండఁగా ఏ స్మృతిలోని విషయము లాదరణీయములగును? అని కల్గిన త్రొక్కులాటయందు 'శ్రుతి ననుస రించియున్న స్మృతియే ప్రమాణ' మనెడి నిర్ణయమునకు రాకతప్పదు.

(8) స్వతంత్రప్రజ్ఞ లేనివారికైనను కారణములేనిదే యొకనిపై పక్షపాత మేర్పడదు.

పరతంత్రప్రజ్ఞస్యాపి నాకస్మాత్ స్మృతివిశేషవిషయః పక్షపాతో యుక్తః

అట్టి సందిగ్ధవిషయము తటస్థించినప్పుడు, స్వతంత్రప్రజ్ఞ లేనివారునైనను కారణములేకుండ నకస్మాత్తుగా నేదోయొకస్మృతిపైఁ బక్షపాతమును వహింపఁ జాలరు.

కస్యచి త్క్వచిత్ పక్షపాతే సతి పురుషమతివైరూప్యేణ తత్త్వావ్యవస్థాన ప్రసంగాత్

ఎవనికైనను నేదోయొక విషయమందుఁ బక్షపాతముకల్గుననియే యెంచినను' వానివాని పక్షపాతమే సరియైయుండ నోపునని నిశ్చయించుచో ననర్థమునేర్పడును ఎందుచేనందురేమో ! పురుషభేదములు వారి వారి చిత్తవృత్తి భేదములు బహుళ ముగా నుండును పక్షపాతబుద్ధితో నిశ్చితమైయున్న తత్త్వవిషయములో వాడు వాడుచేసిన భిన్నభిన్న నిర్ణయములెల్లను నంగీకార్యములే యగుచో తత్త్వమునకు (అవ్యవస్థానము=) హద్దులేకపోవుటయే తటస్థించును. (తత్త్వమనఁగా సిద్ధవస్తువిష యముగాన నది యెన్నటికిని భిన్నభిన్నములుగా నుండఁజాలదు.)

తస్మాత్తస్యాపి స్మృతివిప్రతిపత్త్యుపన్యాసేన శ్రుత్యనుసారాననుసారవివేచనేనచ సన్మార్గేప్రజ్ఞా సంగ్రహణీయా

కాబట్టి (కారణము లేకుండ) ఏదో యొక స్మృతిపై పక్షపాతబుద్ధిని వహించి యున్నవానికే ముఖ్యముగా 'ఓయీ! నీవనుకొన్నదొక్కటే స్మృతియే గాదు! ఇంకను మఱికొన్ని స్మృతులున్నవి. ఈ స్మృతులలో గొన్ని పరస్పర విరుద్ధాంశములు గలవి. కొన్నిమాత్రమే శ్రుతితో నేకీభవించుచున్నవి. ఇట్టి సందర్భములో నీవే స్మృతిని ప్రమాణముగా నంగీకరింతువు? శ్రుతితో నేకీభవించుచున్న స్మృతులనే ప్రమాణముగా నంగీకరింపక తప్పదుగదా! అని బోధించి యట్టివాని (పక్షపాత) బుద్ధిని (=ప్రజ్ఞను) సన్మార్గమునకీడ్చుట కర్తవ్యము గాకపోదుగదా!

(9) కపిలుఁ డఖండ ప్రజ్ఞగలవాడనుకొన్నను శ్రుతివిరుద్ధమైన యతని స్మృతిప్రమాణముగా నంగీకరింపఁబడఁదగదు.

యాతు శ్రుతిః కపిలస్యజ్ఞానాతిశయం ప్రదర్శయంతీ ప్రదర్శితా నతయా శ్రుతి విరుద్ధమపి కాపిలంమతం శ్రద్ధాతుం శక్యం

కపిలుఁడనువాని కఖండప్రజ్ఞయున్నట్లు చాటుచున్న శ్రుతి యొకటున్నదనుకొన్నను, అంతమాత్రముచేత (అట్టి శ్రుతిని నాధారపరచుకొని) ప్రత్యక్షముగా శ్రుతివిరుద్ధమైయున్న యాకపిలుని సిద్ధాంతమును విశ్వసించుట సాధ్యమగునా!

(10) సాంఖ్యులుదాహరించు (శ్వే V- 2) శ్రుతినిబట్టి అందులోని కపిలుఁడు సాంఖ్యస్మృతికర్తయైన కపిలుఁడేయని నిశ్చయింపవలనుగాదు.

కపిల మితి శ్రుతిసామాన్యమాత్రత్వాత్

కపిలునిగూర్చి యాశ్రుతిమాత్రమేమి చెప్పినదందురు? ఆ శ్రుతి 'కపిల' శబ్దమునుమాత్ర ముదాహరించినది. (ఆకపిలుఁడెవరో వివరించియుండలేదు).

అన్యస్యచ కపిలస్య సగరపుత్రాణాం ప్రతప్తు ర్వాసుదేవనామ్నః స్మరణాత్

సగరుని పుత్రులనెల్లను (ప్రతప్తుః) దహింపఁజేసినట్టియు వాసుదేవనామాంతరుఁడైనట్టియు సగరుఁ' డనుపేరుగలవానిని మఱియొకనిని కొన్నిస్మృతులు పేర్కొనుచున్నవి. (స్మృతియుదాహరించిన కపిలుఁడీ కపిలుఁడో, లేక సాంఖ్య స్మృతిని రచియించిన కపిలుఁడో నిర్ధారణముసేయుట కవకాశములేదు)

అన్యార్థదర్శనస్యచ ప్రాప్తిరహితస్యాసాధకత్వాత్

(కావలసినదానికన్న) మఱియొకవిషయమునే బోధించునట్టియు (=అన్యార్థదర్శనస్యచ), కావలసిన విషయమును వివరింపనట్టియు (=ప్రాప్తిరహితస్య), శ్రుతివాక్యము (అసాధకత్వాత్ =) తానుగోరిన విషయమును సమర్థించుట కెప్పుడును

సాధనముగానేరదు. కపిలుఁడఖండప్రజ్ఞగలవాడని స్థాపించుటకు సాంఖ్యులు చేకొన్న శ్రుతిని బూర్తిగాఁ జూడుఁడు.

శ్వే V-2 యోయోనింయోని మధితిష్ఠత్యేకో విశ్వాని రూపాణియోనీశ్చ సర్వాః

ఋషిం ప్రసూతం కపిలంయస్తమగ్రే జ్ఞానైర్బిభర్తి జాయమానంచ పశ్యేత్

ఎవ్వఁడద్వితీయుఁడై వివిధరూపములైన సర్వయోనులలోఁ బ్రతియోని యందును నధిష్ఠించియున్నాఁడో, ఎవ్వఁడు సృష్ట్యాదిలోఁ దానుబుట్టించిన కపిలుని సర్వజ్ఞానములచేత నిండించెనో, ఎవ్వఁడు (జాయమానం=) ముందుఁబుట్టు దాని గూడఁ జూడఁగలఁడో,

శ్వే V-14 '........దేవం యే విదుస్తే జహుస్తనుమ్'

అట్టి యాదేవుని నెవ్వరు తెలిసికొనుచున్నారో వారు తనువునువదిలి పెట్టుచున్నారు. (వారికిఁ బునర్జన్మములేదు)

ఈ శ్రుతి యొక్క ముఖ్యాభిప్రాయము 'సర్వాత్మయైన వాడెవ్వఁడో చూపించి వానిని దెలిసికొన్నచో ముక్తిచేకూరునని చెప్పుటయేగాని కపిలుని యొక్క యఖండప్రజ్ఞను జూపుటగాదు. మఱియు నందులో 'కపిల' శబ్దముచేతఁ జెప్పఁబడినవాడు 'హిరణ్యగర్భబ్రహ్మ' యని సందర్భములచే సూచింపఁబడుచున్నది. కాబట్టి యీ శ్రుతిలోఁ జర్చనీయాంశ మేమియును లేనందున సాంఖ్యులకుఁ బ్రాప్తిసాధకముగాదు అనఁగా దీనిచే వారివాదము ఋజువుగానేరదు.

(11) మనువుయొక్క మాహాత్మ్యము నుద్ఘాటించు విస్పష్టశ్రుతియు గలదు. (కపిలుని విషయమట్టిదై యుండఁగా నిక మనువునుగూర్చి విచారింతము.)

భవతి చాన్యా మనోర్మాహాత్మ్యం ప్రఖ్యాపయంతీ శ్రుతిః 'యద్వై' ఇతి

శ్రుతికి విరోధముగాని మనుస్మృతిని రచియించిన 'మనువు' అను వాని యొక్క మాహాత్మ్యమును శ్రుతియెట్లు చాటుచున్నదో చూడుఁడు.

తై. సం. II. 2-10-2 'యద్వైకించ మనురవదత్త ద్భేషజమ్'

మనువు ఉపదేశించిన యెంత కొద్దివిషయమైనను, అది (జనులకు) ఔషధప్రాయమైనది.

(12) మనువు సర్వాత్మత్వ మంగీకరించుటచేఁగూడ గపిలవిరోధి.

మనురువాచ 'సర్వ'

మనువు తనస్మృతిలో నిట్లు చెప్పుచున్నాడు.

ఇతి సర్వాత్మత్వ దర్శనం ప్రశంసతా కాపిలం మతం నింద్యతే మను. అ XII-91
'సర్వభూతేషు చాత్మానం సర్వభూతాని చాత్మని సంపశ్యన్నాత్మయాజీవై స్వారాజ్య మధిగచ్ఛతి'

'సర్వ భూతములయందు తన స్వరూపమును తన స్వరూపమునందు సర్వ భూతములను జూపుచు, (ఆత్మయాజీ=) ఆత్మయే సాధనముగాఁగలవాడు (బ్రహ్మా ర్పణ బుద్ధితో జ్యోతిష్టోమాది యజ్ఞములు చేయువాడు) మోక్షమును (సర్వ లోకాధిపత్యమును=స్వారాజ్యమును) పొందుచున్నాడు.

ఇతిగమ్యతే

ఇట్లని సర్వాత్మత్వ జ్ఞానమును (ఆత్మకన్న మఱియొకటిలేదు. అంతయును నాత్మయేయను జ్ఞానమును) ప్రశంసించుట మూలమున అందులకు విరుద్ధమైన కపిల సిద్ధాంతమును నిరసించినట్లు స్పష్టమగుచున్నది.

(13) కపిలుఁడు సర్వాత్మత్వ సిద్ధాంతమునకు వ్యతిరేకి.

కపిలోహి నసర్వాత్మత్వ దర్శనమనుమన్యతే ఆత్మభేదాభ్యుపగమాత్

కపిలుఁడు భిన్నాత్మత్వమును (ఆత్మలుబహుళముగా నున్నవిగాని యొక్కటే యాత్మగాదు— అను సిద్ధాంతమును) నంగీకరించుటవలన సర్వాత్మత్వ సిద్ధాంత మున కనుకూలుఁడు గాదు.

(14) [మనుస్మృతియేగాక] భారతస్మృతియు సర్వాత్మత్వ మంగీకరించు చున్నది

మహాభారతేఽపి "బహవః" ఇతివిచార్య భార శాం 350. "బహవః పురుషాబ్రహ్మ న్నుతాహో ఏక ఏవతు"

జనమేజయుఁడడుగుచున్నాడు 'ఓ బ్రాహ్మణుఁడా ! (ఓ వైశంపాయనుఁడా!) [పురుషాః=] జీవులు [బహవః=] పెక్కుండ్రా? [ఉత=] లేక [అహో ఏకఏవతు] ఒక్కఁడేనా?'

అని యడుఁగఁగా వైశంపాయనుఁడు

'బహవః ' భార 'బహవః పురుషారాజన్ సాంఖ్యయోగ విచారిణామ్'

'ఓ జనమేజయరాజా ! [సాంఖ్యయోగ] కపిల పతంజలి మతములవలం బించి విచారించువారికి జీవులు పలువురుగానుందురు'

ఇతిపరపక్ష ముపన్యస్య తద్వ్యుదాసేన

పరమతము లిట్టివనిచెప్పి వానిని (వ్యుదాసేన) నిరాకరించుచు

'బహూనాం' ఇత్యుపక్రమ్య భార 'బహూనాంపురుషాణాంహి యథైకాయోని

రుచ్యతే తథాతంపురుషంవిశ్వ మాఖ్యాస్యామిగుణాధికమ్'

వివిధ దేహములకు నొక్కపృథివి ఉపాదానకారణ మెట్లగుచున్నదో, అట్లె సర్వజ్ఞత్వాదిగుణములుగల యాపురుషుని (పరమేశ్వరుని) నొక్కండుగాం జెప్పెదను-

అని యారంభించి

'మమాం ఇతిసర్వాత్మా త్రైవనిర్ధారితా 'భార శాం అ 351 'మమాంతరాత్మా తవచ

యేచాన్యేదేహిసంస్థితాః సర్వేషాం సాక్షిభూతోऽసౌనగ్రాహ్యః కేనచిత్క్వచిత్'

'విశ్వమూర్ధా విశ్వభుజో విశ్వపాదా క్షినాసికః ఏకశ్చరతిభూతేషు స్వైరచారీ యథాసుఖమ్'

నాకును నీకును జీవులని చెప్పంబడువారందరికి నొక్కండే ప్రత్యగాత్మ (=అంతరాత్మ), ఆప్రత్యగాత్మ సాక్షాద్ద్రష్ట (=సాక్షిభూతుడు)యై యెక్కడను నెవరిచేతను (మనస్సుచేత) గ్రహింపంబడువాడుగాడు; మఱేమన విశ్వమూర్ధములు విశ్వ భుజములు విశ్వ పాదములు నేత్రములు నాసికలుగలవాడై యున్నాడు. ఆపరమాత్మ యొక్కడే (అద్వితీయుండే) యై సర్వభూతములయందున స్వేచ్ఛగా సంచరించువాడై (యథాసుఖమ్) కేవలానంద స్వరూపుండై యున్నాడు.

అని చెప్పుటమూలమున సర్వాత్మత్వసిద్ధాంతమునే నిశ్చయించియున్నాడు.

(15) శ్రుతులును సర్వాత్మత్వమునే యంగీకరించుచున్నవి.

శ్రుతిశ్చ సర్వాత్మతాయాం భవతి

శ్రుతిసైతము తదనుగుణముగానే సర్వాత్మత్వమునే స్థాపించినది చూడుండు

"యస్మిన్ " ఇతి ఈశావాస్య 7 "యస్మిన్ సర్వాణి భూతాని ఆత్మైవా భూద్వి

జానతః తత్ర కోమోహః కశ్శోకఏకత్వ మనుపశ్యతః

'(విజానతః=) జ్ఞానియైనవానికి (యస్మిన్=) ఏజ్ఞానావస్థయందు సమస్త భూతములు తనయాత్మయే యగుచున్నవో, (తత్ర=) ఆ జ్ఞానకాలమందు అంతయు నొకటియేయను సాక్షాత్కారము గలవానికి మోహమెక్కడిది! శోకమెక్కడిది,

ఏవం విధాః

ఈ యర్థమునుజెప్పు శ్రుతులే మఱికొన్నింటిని సైతము చూడుండు.

(16) ఆత్మభేద కల్పనముచేతనుగూడ స్వతంత్ర ప్రకృతి కల్పనముచేతనే గాక కపిలస్మృతి వేదముతోడను మన్వాది స్మృతులతోడను విరోధించుచున్నది.

అతశ్చాత్మభేదకల్పనయాపి కాపిలస్య తంత్రస్య వేదవిరుద్ధత్వంచ నకేవలం

స్వతంత్ర ప్రకృతి కల్పనయైవేతి

కాఁబట్టి జగత్సృష్టిని జేయఁగలది స్వతంత్రమైన [ప్రకృతి=] ప్రధానమను పేరుగల వస్తువొకటి యున్నదని కల్పించుటచేత మాత్రమేగాక ఆత్మలు [జీవాత్మలు] పెక్కులై యున్నవని కల్పించుటచేతఁ గూడ కపిలస్మృతి సిద్ధాంతము [=సాంఖ్యమత సిద్ధాంతము] వేదమునకు విరుద్ధమైనదియు, వేదప్రమాణ మనుసరించి చేయఁబడిన మనుస్మృతికి సైతము విరుద్ధమైనదనియుఁ జెప్పకతప్పదు.

(17) స్వార్థమునందు వేదము స్వతఃప్రమాణము స్మృతి పరతఃప్రమాణము

వేదస్యహి నిరపేక్షం స్వార్థేప్రామాణ్యం రవేరివరూపవిషయే

వస్తువులయొక్క యాకారరూపములను గ్రహించుటకు [=గుర్తించుటకు] [మఱియొకసహాయము లేకుండ] సాక్షాత్తుగా [తిన్నగా] సూర్యకాంతి యెట్లు ప్రమాణమో, వేదముచెప్పెడి విషయములయొక్క యాథార్థ్యమును గ్రహించుటకు సైతమట్లే [నిరపేక్షం=] మఱియొక సహాయమును గోరకుండ నావేదమే [స్వతః] ప్రమాణముసుమీ !

పురుషవచసాంతు మూలాంతరాపేక్షం వక్తృస్మృతివ్యవహితంచేతి విప్రకర్షః

మనుష్యమాత్రులచేత రచింపఁబడిన స్మృతులలోని విషయము లన్నియో; మూలవేదములోని వాక్యములమీదను స్మృతికర్తలయొక్క బుద్ధిసంపాదనము మీదను లేదా పరంపరగా నేర్పుచువచ్చిన గురువుల యభిప్రాయముల మీదను నాధారపడియుండును గావున వేదమునకు స్మృతులకుఁజాల [విప్రకర్షః] భేదము అందువల్లనే వేదము స్వతః ప్రమాణమనియు, స్మృతిపరతఃప్రమాణమనియుఁ జెప్పఁబడును.

(18) వేదవిరుద్ధాంశమునందు స్మృతిప్రమాణము గాదని చెప్పుటలో దోషమేమియును లేదు.

తస్మా ద్వేద విరుద్ధ విషయే స్మృత్య నవకాశ దోష ప్రసంగో నదోషః

కాబట్టి వేదవిరుద్ధ విషయమును జెప్పునట్టి [సాంఖ్యాది] స్మృతి ప్రమాణమెంతయునుగాదని త్రోసివేయుట [చెప్పుట]లో దోషమెంతమాత్రమును లేదు.

రాఁబోవు సూత్రమున కవతారిక :-

కుతశ్చ స్మృత్యనవకాశ దోష ప్రసంగో నదోషః

[సాంఖ్య] స్మృతిప్రమాణ మెంతయునుగాదని త్రోసివేయుటలో దోషమెంతమాత్రమును లేదు అను విషయము మఱియేకారణము చేతఁగూడఁ జెప్పఁబడుచున్నదో ముందుసూత్రమును జూడుఁడు.

## ౨ సూ॥ ఇతరేషాంచానుపలబ్ధేః

ప॥ వి :- ఇతరేషాం + చ + అనుపలబ్ధేః

ప. ప. అ :- ఇతరేషాం = అన్యములయొక్క (సాంఖ్యస్మృతి చెప్పు ఇరువది యైదు తత్వములలో నిదివరకే ఖండింపఁబడిన ప్రధానముగాక) మిగిలినవానియొక్క- అనుపలబ్ధేః = శ్రుత్యాదులయందు నున్నట్లు కన్పించక పోవుటవలన, చ = గూడ

సూ॥ తా :- సాంఖ్య స్మృతిప్రధాన మనుదానిని- దాని వికారములైన 'మహ'దాదులనెడి మఱి యిరువదినాల్గింటిని మొత్తమున నిరువదియైదుతత్వములు గలవని చెప్పుచున్నది- 'ప్రధాన'మునకు వేదము నందెక్కడను బ్రమాణము లేదని యిదివరకే చెప్పఁబడినది. తక్కినవానిలో 'మహత్తు' 'అహంకార' మనునవిగూడ వేదమునందుఁగాని లోకమునందుఁగాని యెక్కడను వాడఁబడుచున్నట్లు కనుపించదు కాబట్టి సాంఖ్యస్మృతి ప్రమాణ మెంతయునుగాదు.

(భాష్యము) (భాష్యార్థము)

(1) వేదమందును లోకమందును బ్రసిద్ధములుగాని మహత్తత్వాదులను సాంఖ్యస్మృతిచెప్పుట మాత్రముచే నవి ప్రమాణములు గావు.

ప్రధానా దితరాణియాని ప్రధానపరిణామత్వేన స్మృతౌ కల్పితాని మహదాదీని న తాని వేదే లోకే చోపలభ్యంతే

(సాంఖ్య తంత్రమునందు 1) పురుషుఁడు 2) ప్రధానము 3) మహత్తత్వము 4) అహంకారము 5) లగాయతు 9) పంచసూక్ష్మతన్మాత్రలు 10) లగాయతు 14) పంచస్థూలతన్మాత్రలు 15) లగాయతు 19) పంచజ్ఞానేంద్రియములు 20) లగాయతు 24) పంచ కర్మేంద్రియములు 25) మనస్సు అను నిరువదియైదు తత్త్వములుగాఁ జెప్పఁబడినవి.)

ప్రధానముయొక్క వికారము (పరిణామము) లని చెప్పుచు ప్రధానముకంటె నితరములైన 'మహత్తు' అను మొదలగునేవి సాంఖ్యస్మృతియందుఁ గల్పింపఁబడియున్నవో యవి (మహదాదులు) వేదమునందుఁగాని లోకానుభవమందుఁగాని గోచరించుటలేదు.

భూతేంద్రియాణి తావత్ లోకవేదప్రసిద్ధత్వాత్ శక్యంతే స్మర్తుం

స్థూల సూక్ష్మ పంచభూతములు (10), స్థూల సూక్ష్మేంద్రియములు (10)- ఇవియున్నవో లోకానుభవమునందును ప్రసిద్ధములై యుండుటచే వీనిని సాంఖ్యస్మృతిచెప్పినఁ జెప్పవచ్చును.

అలోక వేవ ప్రసిద్ధత్వాత్తు మహదాదీనాం షష్ఠస్యేవేంద్రియార్థస్య నస్మృతిరవకల్పతే

(షష్ఠస్య ఇంద్రియార్థస్య అలోక వేద ప్రసిద్ధత్వాత్ ఇవ=) పంచేంద్రియ విషయము (=అర్థములు) లైన శబ్దరూపరసగంధ స్పర్శములనెడి నైదింటిని మించిన యాఱవ విషయము (=ఇంద్రియార్థము) వేదమునందునూ లోకానుభవమందును ప్రసిద్ధమెట్లుగాదో (అనఁగా నట్టిదొకటియున్నట్లు ఎట్లు తెలియఁబడదో), (మహదాదీనాం అలోక వేద ప్రసిద్ధత్వాత్=) మహత్తత్త్వము అహంకారము అను మొదలగు నవిగూడ వేదమందును లోకమందును ప్రసిద్ధములు గాకపోవుటవలన (అనఁగా— అవియున్నట్లు తెలియఁబడకపోవుటవలన) అట్టివానిని (మహదాదులను) (నస్మృతి రవకల్పతే=) సాంఖ్యస్మృతి గల్పింపఁజాలదు అట్టి వెన్నటికి నుండనేయుండవు).

(2) వేదము పేర్కొన్న మహదాదిశబ్దములకు సాంఖ్యస్మృతిచెప్పు నర్థము గానేరదు.

యదపి క్వచిత్తత్పరమివ శ్రవణమవభాసతే తదప్యతత్పరం వ్యాఖ్యాతం "అనుమానిక మప్యేకేషాం" ఇత్యత్ర– బ్ర సూ. I-4-1 "అనుమానిక మప్యేకేషాం"

వేదములోఁ గొన్నిచోట్ల [కఠ I-3-11 '... మహతః పరమవ్యక్తమ్...' అనుకొన్ని శ్రుతులయందు] సాంఖ్యస్మృతి బోధించునట్టి 'మహదాది' శబ్దములు [సాంఖ్యులకుఁ బ్రమాణములని భ్రమపడునట్లుగా] గన్పించుచున్నవు, అట్టిశ్రుతులలో నాపదములు సాంఖ్యులువాదించు నర్థములో నుపయోగింపఁబడినవిగావని

'కొన్ని వేదశాఖలయందు [అనుమానికమపి=] ప్రధానముగూడఁ జెప్పఁబడియున్న దంటివేని, [అట్లనుట సరి కాదు.]

లోగడ నీసూత్ర వ్యాఖ్యానములో స్పష్టముగా నిరూపింపఁబడినది, చూచుకొనుఁడు.

(3) సాంఖ్య మహదాదులెప్పుడు ప్రమాణములు గావో, వానిని బుట్టించినదని చెప్పు ప్రధానమునైత మప్పుడే ప్రమాణముగాదు.

కార్యస్మృతే రప్రామాణ్యాత్ కారణస్మృతే రప్యప్రామాణ్యంయుక్త మిత్యభిప్రాయః

మహదాదులు 'ప్రధాన' కార్యములుగా, [అనగా 'ప్రధానము'నుండి కల్గిన వానినిగా] జెప్పుట సాంఖ్యస్మృతికి దోష [=అప్రామాణ్యము] మాపాదించినదని యొప్పుకొన్నప్పుడు, 'ప్రధాన' మనుదానిని కారణముగాఁ [అనఁగా మహదాది జగత్తును బుట్టించిన దానినిగా] జెప్పుటలోఁగూడ సాంఖ్యస్మృతియందు దోషము [అప్రామాణ్యమే] గల్గినదని యొప్పుకొనక తప్పదు. [దీనినుండి మఱియొకటి

గ్రంథములెల్ల బద్ధములనో అది మఱియొకదానిని బుట్టించగల్గుటయు నశ్లేయబద్ధములు.]

తస్మాదపి న స్మృత్యనవకాశదోష ప్రసంగో దోషః

కాఁబట్టి యీపైనఁజెప్పిన హేతువువలనఁగూడ 'సాంఖ్యస్మృతి ప్రమాణమెంతయునుగాదని త్రోసివేయుటలో దోషమెంత మాత్రమును లేదు' అను విషయము సిద్ధించుచున్నది.

(ఈ) కపిలుని సాంఖ్యస్మృతికిఁ దర్క బలము సైతముగలదని చేయువాదము నంతను నవిలక్షణత్వాధికరణము ఖండింపఁబడును.

తర్కావష్టంభంతు, "న విలక్షణత్వాత్" ఇత్యారభ్యో న్మథిష్యతి

సాంఖ్యస్మృతి వాదమునకుఁ దర్క [యుక్తి] బలము [అవష్టంభము=ఆధీనము] గూడ నున్నదని చెప్పుకొను విషయమును, ముందురాఁబోవు 'నవిలక్షణత్వాధికరణ' మందుఁ [బ్రసూ I-2-4 లగాయతు 11సూ] బూర్తిగా ఖండింపఁబడును.

---

# యోగప్రత్యుక్త్యధికరణము

అవతారిక :- ఈయధికరణము పతంజలి మహామునియొక్క యోగమతమును ఖండించుటకై యేర్పడినది- ప్రధానమే జగత్కారణమను విషయమును కపిలుని సాంఖ్యస్మృతి చెప్పినట్లే పతంజలుని యోగస్మృతియుఁ జెప్పుచున్నది. మిగిలిన విషయములలోఁ గొంత భేదమును కలదు. యోగస్మృతి యీశ్వరుఁడుఁ గలఁడున్నాడని యొప్పుకొందురు. మఱియు నందులోని యోగవిషయములను గూర్చి శ్రుతిప్రమాణములు సైతముగలవు. ఐనను నందులోని ముఖ్యమైన జగత్కారణ విషయము వేదవిరుద్ధమే యైనందున సాంఖ్యస్మృతితోఁబాటు నీయోగస్మృతియు సమానహేతువులవల్ల ఖండింపఁబడఁదగియున్నదని నిరూపింపఁబడుచున్నది-

## 3 సూ॥ ఏ తే న యో గః ప్ర త్యు క్తః

ప. వి :- ఏతేన+యోగః+ప్రత్యుక్తః

ప్ర. ప. అ :- ఏతేన=ఇందుచేత (అనఁగా లోగడయధికరణమందుఁ జేయఁబడిన ప్రధానవాద ఖండనముచేత) యోగః = పతంజలుని యోగమతము; ప్రత్యుక్తః=ఖండింపఁబడినదే యగుచున్నది-

సూ॥ తా :- రెండును ముఖ్యమైన జగత్కారణ విషయములో వేదవిరుద్ధములేవై యున్నందునఁ గపిలుని సాంఖ్యమతఖండనమునకై లోఁగడియధికరణమందు వినియోగింపబడిన హేతువులే పతంజలి యోగమత ఖండమునకును వినియోగింపఁబడవలసియున్నవి- ఈయోగమతములో వేదవిరుద్ధములుగాని ధ్యానయోగధారణాది విషయములు ఆత్మైకత్వ విజ్ఞానసాధనములుగా నంగీకరించుచో నాక్షేపణము లేదనియుఁ దెలుపఁబడుచున్నది.

భాష్యము - భాష్యార్థము :

I జగత్కారణాది ముఖ్యవిషయములలో యోగస్మృతియు సాంఖ్యస్మృతి వంటిదే గావున సాంఖ్యస్మృతి యెట్లో యోగస్మృతియునట్లే ప్రమాణముగాదు.

ఏతేన సాంఖ్యస్మృతిప్రత్యాఖ్యానేన యోగస్మృతి రపి ప్రత్యాఖ్యాతేత్యతిదిశతి

(ఏతేన=) లోఁగడ స్మృత్యధికరణములోఁ జేయఁబడిన కపిలుని సాంఖ్యమత నిరాకరణమే పతంజలియోగ మతమునకును వర్తించునని గ్రహించునది- అని చెప్పుటమూలమున నీసూత్రము లోఁగడి సాంఖ్యమతఖండన పద్ధతినే యోగమత ఖండనమునకును (అతిదిశతి=) వ్యాపింపఁ జేయుచున్నది.

తత్రాపి శ్రుతివిరోధేన ప్రధానం స్వతంత్రమేవ కారణం మహదాదీని చ కార్యాణ్య లోకవేద ప్రసిద్ధాని కల్ప్యంతే

(తత్రాపి=) ఈ పతంజలుని యోగమతమందును (కపిలునిసాంఖ్యమతమందు వలెనే) స్వతంత్రమైన జగత్కారణముగా శ్రుతివిరుద్ధమైన 'ప్రధాన' మను వస్తువొకటియు- ఆ ప్రధానమువలనఁ బుట్టినకార్యములుగా లోకవేద ప్రసిద్ధములుగానట్టి మహదాదులనెడి పదార్థములు మఱికొన్నియుఁ గల్పించఁబడినవి.

II 1) సమానవైఖరిగల సాంఖ్యస్మృతి యిదివరకే నిరసింపఁబడియుండఁగా ప్రత్యేకమొక సూత్రముచేత యోగస్మృతి నిరసింపఁబడవలసినంతటియవసరమేమి?

నన్వేవంసతి సమానన్యాయత్వాత్ పూర్వేణైవేత ద్గతం కిమర్థం పునరతిదిశ్యతే

సాంఖ్యమత నిరాకరణమునకే హేతువు లుపయోగింపఁబడెనో యా హేతువులే యోగమత నిరాకరణమునకు సైతము వర్తించుచో, పూర్వాధికరణ సూత్రముల చేతనే యోగమతముసైతము నిరాకరింపఁ బడినదని తలఁచవచ్చును. క్రొత్త సూత్రముచే నీయతిదేశమును (extension of the rule) ప్రత్యేకముగాఁ జెప్ప నేలయని యడుగవచ్చును. (సమాధానమును వినుఁడు)

II 2) సాంఖ్యమత విషయములోఁ గలుగని యొక క్రొత్తశంక. అనగా

యోగమతము ప్రమాణమేయగునేమో యనునట్టిది యోగమత విషయములోఁ గల్గుట కవకాశమున్నది.

అస్తి హ్యత్రాభ్యధికాశంకా

సాంఖ్యమత విషయములోఁ గల్గుట కవకాశములేని యొకక్రొత్తశంక యీ యోగమత విషయములోఁ గల్గుట కవకాశమున్నది.

ఎ) యోగము సమ్యగ్దర్శన సాధనమని వేదమే యొప్పుకొనుచున్నది.

సమ్యగ్దర్శనాభ్యుపాయో హియోగో వేదే విహితః 'శ్రోతవ్య' ఇతి

యోగము ఆత్మైకత్వ విజ్ఞానము (=సమ్యగ్దర్శనమ్) నకు గొప్పసాధనమని వేదమందే చెప్పఁబడియున్నది చూడుఁడు.

బృ IV-4-5 'శ్రోతవ్యోమంతవ్యోనిదిధ్యాసితవ్యః'

'(బ్రహ్మము) వినఁబడ వలసినది. ఆలోచింపఁ బడవలసినది' తదేకధ్యానము చేయఁబడ వలసినది'

నిదిధ్యాసమనఁగా యోగసంబంధమైన ధ్యానమేయైనట్లు కనఁబడుచున్నది.

బి) యోగము వివరించు నాసనాదులను శ్వేతాశ్వతరోపనిషత్తు పుష్కలముగాఁ జేర్కొనియున్నది.

'త్రిరున్నతం' ఇత్యాదినా శ్వే II-8 'త్రిరున్నతం స్థాప్య సమం శరీరమ్'

మఱియును-

(త్రిరున్నతం—) కాయము శిరము గ్రీవ (మెడ) యను మూడున్నత స్థానములుగల (శరీరమ్=) శరీరమును (సమంస్థాప్య) సమముగానిల్పి (యోగాభ్యాసము చేయవలసినది.)

ఆసనాది కల్పనాపురస్సరం బహుప్రపంచం యోగవిధానం శ్వేతాశ్వతరోపనిషది దృశ్యతే

ఇట్లు శరీరమునకు సంబంధించిన యాసనములు మొదగువానిని గల్పించి చెప్పుటమూలమున శ్వేతాశ్వరోపనిషత్తునందు యోగవిధానమంతయుఁ బుష్కలముగా వివరింపఁబడియుండుట గన్పించుచున్నది.

(సి) యోగార్థప్రకాశక వాక్యములు పెక్కులు వేదమందున్నవి.

లింగానిచ వైదికానియోగవిషయాణి. సహస్రశ ఉపలభ్యంతే

మఱియును నాయోగవిషయమందుఁ (లింగాని=) దదర్థప్రకాశక వాక్యములు సైతము వేదములో (సమాస్రితః=) పెక్కులు గన్పట్టుచున్న యవి. ఎట్లనగ-

కఠ II-6-11 'తాంయోగమితి మన్యంతే స్థిరామింద్రియధారణాం'

ఇంద్రియములను జలింపకుండ నేకాగ్ర్యమును జేయుటయే 'యోగ' మని చెప్పుదురు.

అనియును,

తాంయోగమితి విద్యామేతాం ఇతి చైవమాదీని కఠ- II-6.18 'విద్యా మేతాం యోగవిధించ కృత్స్నమ్'

యముఁడు నచికేతునకుఁ జెప్పిన దేమనగా.-

ఈపుష్కలముగాఁ జెప్పఁబడిన యోగవిధులను (ముక్తిసాధనములుగా) దెలిసికొనవలయును. అనియును, ఇట్టివే మఱికొన్ని వాక్యములును వేదములందక్కడక్కడఁ జెప్పఁబడినవి.

(డి) యోగము సమ్యగ్దర్శనసాధనమని యోగస్మృతికర్త యారంభమందే స్పష్టీకరించియున్నాడు.

యోగశాస్త్రేపి 'అథతద్ద'

పతంజలిమహాముని చేసిన యోగశాస్త్రమందును నారంభమందు

ఇతిసమ్యగ్దర్శనాభ్యుపాయత్వేనైవ యోగోఽంగీక్రియతే యోగ సూ I-1-1 'అథ తద్దర్శనాభ్యుపాయో యోగః'

ఇక (తద్దర్శన=) సమ్యజ్ఞానమునకు- అనఁగా నాత్మైకత్వ విజ్ఞానమునకు (అభ్యుపాయం=) గొప్పసాధనమైన (యోగః=) ధ్యానపద్ధతి చెప్పఁబడఁబోవుచున్నది. అని చెప్పుటమూలమున 'యోగ' మనునది సమ్యగ్జ్ఞానము (ఆత్మైకత్వ విజ్ఞానము) నకు ముఖ్యసాధనముగా నంగీకరింపఁబడినది.

(ఈ) పై యనుకూలహేతు బాహుళ్యమునుబట్టి యోగస్మృతి ప్రమాణమే యగునను కొద్ది తర్శంక యోగస్మృతివిషయములోఁ గల్గుచున్నది.

అతస్సంప్రతిపన్నార్థైకదేశత్వాత్ అష్టకాదిస్మృతివత్ యోగస్మృతిరప్యనపవదనీయా భవిష్యతీతి'

కాబట్టి పతంజలియొక్క యోగస్మృతిలో (సంప్రతిపన్నార్థైకదేశత్వాత్=) ముఖ్యభాగమైన దెన్నగాఁ గనుపట్టు యోగపద్ధతి వేదోపదేశములో నేకీభవించుచున్నది

యగుటచే, 'అష్టకాదిస్మృతి' ప్రమాణమై యెట్లంగీకరింపఁబడుచున్నదో, పతంజలుని యోగస్మృతిసైతమట్లే (అనపవదనీయా=) నిరాకరింపఁబడుట కవకాశము లేనిదై, (అన్నివిషయములలోను) ప్రమాణముగా నంగీకరించఁబడవలసినదేగదా యను శంకయొకటి క్రొత్తగాఁ గలుగ వచ్చును-

N. B. హేమంత శిశిరఋతువులలో అమావాశ్యతరువా నెన్మిదవనాడు (అష్టమినాడు) చేయవలసిన తర్పణము లష్టకములనఁబడును- వీనినిఁగూర్చి విస్తరించి చెప్పునది 'అష్టకాదిస్మృతి'- ఇది శ్రుతికనుకూలించియే యున్నందునఁ బూర్వమీమాంసకులకీస్మృతి ప్రమాణమేయగును.

II (3) సాంఖ్యస్మృతి విషయములోఁ గలుగని క్రొత్తశంక యోగస్మృతి విషయములోఁ గల్గుచున్నందున ప్రత్యేకసూత్రముచే యోగస్మృతిసైతము నిరసింపఁబడవలసి వచ్చినది.

ఇయ మభ్యధికాశంకా$\text{s}$ తిదేశేన నివర్త్యతే

ఈయోగస్మృతివిషయములోఁ గల్గుట కవకాశమున్నట్టియు, పైనవివరింపఁబడినట్టియు శంకను నివర్తింపఁజేయుటకే యోగస్మృతిని వేరిడిచూపి యీయతిదేశసూత్రము ('సాంఖ్యమత నిరాకరణహేతువులే యోగమత నిరాకరణమునకును వర్తించుచున్నవి' అని తెలుపుసూత్రము) ప్రత్యేకముగా రచింపఁబడినది- (కాని యనవసరముగా మాత్రముగాదు)

(4) శ్రుతితో విరోధించు స్మృతి ప్రమాణముగాక యనుకూలించు స్మృతిమాత్రమే ప్రమాణమగునని యెట్లు చెప్పఁబడినదో అట్లే ఒకస్మృతిలోని శ్రుతిలో విరోధించుభాగము ప్రమాణముగాక, యనుకూలించుభాగము ప్రమాణముగావచ్చును.

అర్థైకదేశసంప్రతిపత్తావప్య ర్థైకదేశ విప్రతిపత్తేః పూర్వోక్తాయాదర్శనాత్

(ఒక స్మృతి శ్రుతితో నేకీభవించి మఱియొక స్మృతి శ్రుతితో విరోధించుచో, శ్రుతితో నేకీభవించిన స్మృతియే ప్రమాణముగాని శ్రుతితో విరోధించిన స్మృతిప్రమాణముగాదని లోఁగడియధికరణవ్యాఖ్యానమందుఁ జూపఁబడినది. అట్లే) ఒకేస్మృతిలోనే యొకభాగము శ్రుతితో నేకీభవించుచున్నను, మఱియొక భాగము శ్రుతితో విరోధించుచున్నచో, ఏకీభవించు భాగమే ప్రమాణమగును గాని విరోధించుభాగ మెప్పటికిని బ్రమాణముగా నేరదు-

III (1) ఆత్మవిషయమును జెప్పుచు శ్రుతితో నేకీభవించని స్మృతులు పెక్కులుండఁగా, సాంఖ్యయోగస్మృతులు రెండే ప్రత్యేకముగా నిరాకరింపఁబడనేల!

సతీష్వప్య ధ్యాత్మవిషయాసు బహ్వీషు స్మృతిషు సాంఖ్యయోగస్మృత్యోరేవ నిరాకరణాయ యత్నఃకృతః

ఆత్మవిషయమునుగూర్చి వివరించుచు (వేదముతో నేకీభవించని) స్మృతులు పెక్కులుగానున్నను, కపిలుని సాంఖ్యస్మృతి, పతంజలియోగస్మృతియను నీరెంటిని మాత్రమే ప్రమాణములుగావని త్రోసివేయుటకు మాచేఁ బ్రయత్నము చేయఁ బడినది. ఎందుచేనందురేమో,

(౨) సాంఖ్యయోగస్మృతులు మోక్షసాధనములని లోకప్రఖ్యాతిగలవు. అవి శిష్టులచేఁ బరిగ్రహింపఁబడినవి- సాంఖ్యయోగములను శ్రుతియేస్పష్టముగాఁ జెప్పుచున్నది-

సాంఖ్యయోగౌ హి పరమపురుషార్థసాధనత్వేన లోకేప్రఖ్యాతౌ

సాంఖ్యయోగస్మృతులు రెండును పరమపురుషార్థమైన మోక్షసాధనములనుగూర్చి వివరించిచెప్పునని లోకమందుఁ బ్రఖ్యాతిని బడసియున్నవి.

శిష్టైశ్చపరిగృహీతౌ, లింగేనచ శ్రౌతేనచో పబృంహితౌ

మఱియు నవిరెండును పెద్దలగువారిచేఁ బరిగ్రహింపఁబడి (అంగీకరింపఁబడి) యున్నవి- అంతేగాక వేదమందున్న కొన్ని (లింగేన=) తదర్థ ప్రకాశకవాక్యములతోనవి (ఉపబృంహితౌ=) పుష్టిని జెందియున్నవి- శ్రుతినిజూడుఁడు.

'తత్కారణం ' ఇతి శ్వే VI-13 'తత్కారణం సాంఖ్యయోగాభిపన్నం జ్ఞాత్వా దేవం ముచ్యతే సర్వపాశైః'

(తత్కారణం=) కామాదులకుఁ గారణమైనవాడును, సాంఖ్యయోగ స్మృతులు బోధించు జ్ఞానధ్యానములచేఁ దానుగాఁ బొందఁబడువాడును నగు (దేవం ) పరమాత్మను (జ్ఞాత్వా=) దెలిసికొని (సర్వపాశైః=) అవిద్యామోహాది సర్వదుఃఖములచేత (ముచ్యతే=) విడువఁబడినవాడగుచున్నాడు-

అని శ్రుతియే సాంఖ్యయోగములను శ్లాఘించినది.

(౩) అట్లయినను సాంఖ్యయోగములు వేదసహాయములేకుండ మోక్షసాధనములు గాఁజాలనందున, అవిరెండును ప్రత్యేకము పేర్కొనఁబడి నిరసింపఁబడినవి.

నిరాకరణంతు నసాంఖ్యస్మృతిజ్ఞానేన వేదనిరపేక్షేణ యోగమార్గేణవా నిశ్శ్రేయస మధిగమ్యతఇతి

అట్లగుచో సాంఖ్యయోగస్మృతులేల నిరాకరింపఁబడెనందురేమో, ఏలయన:- "సాంఖ్యస్మృతి బోధించు జ్ఞాన (సాధన) ముగాని యోగస్మృతి బోధించు

నాసనధారణ ధ్యానపద్ధతిగాని వేదసహాయము లేకుండ సరాసరిగా (నిశ్శ్రేయసం=) మోక్షమును బొందింపలేవు''— అను హేతువుచేతనే యవి నిరాకరింపఁబడినవగు చున్నవి.

(4) (ఎ) వేదమొక్కటియే ఆత్మైకత్వవిజ్ఞానమును జెప్పను- దానికిమించిన మోక్షసాధనమే లేదు.

శ్రుతిర్హి వైదికాదాత్మైకత్వవిజ్ఞానా దన్యన్నిశ్శ్రేయససాధనం వారయతి

వేదమొక్కటిమాత్రమే బోధించిన దానిసామ్ముయగు నాత్మైకత్వ విజ్ఞానము (జీవాత్మ పరమాత్మ భేదములేకుండ నంతయు నొక్కటియే యాత్మయను జ్ఞానము) కన్న మించినదేదియు మోక్షసాధనముగా నేరదని శ్రుతియే స్పష్టముగాఁ జెప్పుచున్నది చూడుఁడు !

తమేవ-ఇతి శ్వే III-8 'తమేవ విదిత్వాఽతిమృత్యు మేతి నాన్యఃపంథా విద్యతేఽయనాయ'

(తమేవ=) ఆపరమాత్మనే (తానుగా) తెలిసికొని (మృత్యుం=) సంసారమును (అతి+ఏతి) తరించుచున్నాఁడు. (అయనాయ=) మోక్షముచెందుటకు (అన్యఃపంథా.=)మఱియొకమార్గము (నవిద్యతే=) గనఁబడదు.

(బి) సాంఖ్యులు యోగులు. జీవపరమాత్మ భేదదర్శులుగాని, ఆత్మైకత్వ దర్శులుగారు కావున వారుచూపించు సాధనములంతగా శ్రేయస్కరములుగావు.

ద్వైతినో హి తే సాంఖ్యా యోగాశ్చ నాత్మైకత్వ దర్శినః

సాంఖ్యులుగాని యోగులుగాని జీవపరమాత్మ భేదమును జెప్పువారే (ద్వైతినః=) గాని ఆత్మైకత్వ విజ్ఞానమును నొప్పుకొనువారు (న=) గారు.

(5) సాంఖ్యయోగశబ్దములను శ్రుతిస్మృతులలో నున్నసందర్భ మతాంతరములనుగూర్చి గాదు ఆశబ్దముల కర్థములైన విజ్ఞానసాధనములైన 'జ్ఞానధ్యానములు' లనియే చెప్ప వలసియున్నది.

యత్తుదర్శనముక్తం 'తత్కారణం ' ఇతి వైదికమేవ తత్రజ్ఞానం ధ్యానంచ సాంఖ్యయోగశబ్దాభ్యా మభిలప్యేతే ప్రత్యాసత్తే రిత్యవగంతవ్యం

అట్లైనిఁ బైనఁజూపిన శ్వే VI_13 లోని 'తత్కారణం సాంఖ్యయోగాభిపన్నం' అను శ్రుతిసాక్షాత్తుగా సాంఖ్యయోగ మతద్యోతకశబ్దములనేలఁ బేర్కొనవలయునని సంశయింపఁ బనిలేదు. ఎందుచేతననఁగా:- శ్రుతిలోనియా 'సాంఖ్య యోగ' శబ్దములవలన (ఆత్మైకత్వ విజ్ఞానములకు సాధనములుగా), వేదము బోధించు 'జ్ఞానధ్యానములు' లనియే గ్రహించవలసియున్నది. (కాని సాంఖ్యయోగ

మతములుమాత్రము గాఁజాలవు)- (ప్రత్యాసత్తేః=పొందించుటవలన=) శ్రుతిలో నుపయోగింపఁబడిన యాశబ్దముల సామీప్యపూర్వాపర సందర్భములను బట్టి యవి యాత్మైకత్వ విజ్ఞానమును బొందించు (జ్ఞానధ్యానములనెడి) సాధనములైనట్లుగానే బోధపడుచుండును-

(6) శ్రుతిచెప్పిన విషయ వివరములనే సాంఖ్యయోగస్మృతులు మఱలఁ జెప్పుచో, నవి ప్రమాణములుగావని యెవరందురు.

యేనత్వంశేన నవిరుధ్యేతే తేనేష్టషేవ సాంఖ్యయోగస్మృత్యోస్సావకాశత్వం

ఆసాంఖ్యయోగస్మృతు లేయొకయంశమందేని శ్రుతితో విరోధించకుండు నేని, యాయాయంశమందుమాత్రమవిరెండును ప్రమాణములే కావచ్చునని యొప్పుకొనుటలో మాకాక్షేపణము లేదు.

తద్యథా

అది యెట్లంటేని:-

'అసంగో ' ఇత్యేవ మాది శ్రుతిప్రసిద్ధమేవ పురుషస్య విశుద్ధత్వం నిర్గుణ పురుషనిరూపణేన సాంఖ్యై రనుగమ్యతే బృ VI-3-16 'అసంగో హ్యయం పురుషః'

(ఉపనిషత్తులు బోధించు ఈపురుషుఁడు బ్రహ్మము) దేనితోడను నంటు లేనివాఁడు సుమా! ఉపనిషత్పురుషుఁడు కేవల పరిశుద్ధుఁడు అని యీ మొదలగు శ్రుతులు చాటుచున్నదాని ననుసరించియే సాంఖ్యులుసైతము వారిమతములోని 'నిర్గుణపురుషుని' నిరూపించుచున్నారు.

తథాచ యోగైరపి 'అథపరి ' ఇత్యేవ మాది శ్రుతిప్రసిద్ధమేవ నివృత్తినిష్ఠత్వం ప్రవ్రజ్యాద్యుపదేశే నానుగమ్యతే' జాల 5 'అథపరివ్రా ద్వివర్ణవాసా ముండో ఽపరిగ్రహః బ్రహ్మ భూయాయభవతి'

పిమ్మట (పరివ్రాట్=) సన్న్యాసియై సంచరించువాఁడు (వివర్ణవాసాః=) కాషాయవస్త్రములను ధరించినవాఁడును (ముండః=) బోడితలనుజేయించుకొన్న వాఁడును (అపరిగ్రహః=) ఎవరివల్లను దేనిని గ్రహింపనివాఁడునునై బ్రహ్మ మగుట కర్హుఁడగుచున్నాఁడు. (నివృత్తి నిష్ఠత్వం=) బ్రహ్మైక్యమునకుఁగావలసిన వైరాగ్యస్థితినిజాటు నీమొదలగు శ్రుతివాక్యముల ననుసరించియే యోగులు సైతము సర్వసన్న్యాసి కుండవలసిన వైరాగ్యలక్షణము లుపదేశించుచున్నారు.

IV (1) సాంఖ్యయోగ స్మృతులు నిరాకరింపఁ బడినట్లే, ఇతర తర్క-స్మృతులుసైతము నిరాకరింపఁబడ వలసియున్నవి.

ఏతేన సర్వాణి తర్కస్మరణాని ప్రతివక్తవ్యాని

(ఏతేన=) సాంఖ్యయోగ స్మృతుల విషయమై యీ పైనఁ దెలిపిన ప్రతివాదము (=ఖండన పద్ధతి) చేతనే తర్కమునే (యుక్తులనే) యాధారముగాఁ గొని వాదించు స్మృతులుసైతము (ప్రతివక్తవ్యాని=) ఖండింపఁ బడఁదగి యున్నవి (వైశేషికన్యాయాయికాది స్మృతులు తర్క స్మృతులేయై యున్నవి)

(2) తర్కస్మృతులు చెప్పు తర్కోపపత్తులేవైనను తత్వజ్ఞానబోధసాధనములైనఁ గావచ్చును.

తాన్యపి తర్కోపపత్తిభ్యాం తత్వజ్ఞానాయో పకుర్వంతీతిచేత్ ఉపకుర్వంతునామ

అట్లయినను నాతర్కస్మృతులు వివరించు (తర్క=) యుక్తులు (ఉపపత్తి=) వాక్యసమన్వయ రీతులు తత్త్వజ్ఞానబోధ సాధనములుగా నేటికుపయోగింపఁ గూడదన్నచో, నుపయోగించిన నుపయోగించుఁగాక. (ఆ విషయమై మా యాక్షేపణము లేదు.)

(3) తత్వము మాత్రము వేదాంతముల వలనఁ దెలియ వలసినదే- వేరు మార్గము సాధనములేదు.

తత్వజ్ఞానం తు వేదాంతవాక్యేభ్య ఏవ భవతి

తత్త్వము (=ఆత్మైకత్వము) మాత్రి మీ క్రింద నుదాహరింపఁబడిన యీ మొదలగు వేదాంత (=ఉపనిషత్) వాక్యములచేతఁ దెలియఁబడ వలసినదేగాని వేరుమార్గము లేదు.

తై. బ్రా III-12-9 'నావేదవిన్మనుతే తం బృహంతం'

'(అవేదవిత్=) వేదమెఱుఁగని వాడు (తంబృహంతం=) ఆ సర్వవ్యాపకుఁడగు పరమేశ్వరుని (నమనుతే=) తెలియఁజాలఁడు'

బృ V-9-16 'తం త్వౌపనిషదం పురుషం పృచ్ఛామి ఇత్యేవమాదిశ్రుతిభ్యః

'(తం+తు+ఔపనిషదం+పురుషం=) ఉపనిషత్తులవల్ల మాత్రిమే తెలియఁదగిన యీ పురుషునిగూర్చి (పృచ్ఛామి=) చెప్పుమని నిన్నడుఁగుచున్నాను.

# నవిలక్షణత్వాధికరణము

బ్ర. సూ II-1-4 to 11

భాష్యము ఆంధ్రీకరణము

అవతారిక అధికరణావతారిక :-

(1) బ్రహ్మ జగత్కారణవిషయమై సాంఖ్యాదిస్మృతుల ననుసరించి చేయఁబడిన యాక్షేపము లింతకుమున్ను పరిహరింపఁబడినవి.

బ్రహ్మాస్య జగతః కారణం ప్రకృతిశ్చేత్యస్య పక్షస్యాక్షేపః స్మృతినిమిత్తః పరిహృతః

ఈజగత్తునకు (కారణం ప్రకృతిశ్చ=) నిమిత్తోపాదానకారణములు బ్రహ్మమే యను సిద్ధాంతముపై సాంఖ్యాదిస్మృతుల నాధారముచేసికొని చేయఁబడిన యాక్షేప మింతవరకుఁ బరిహరిఁపఁబడినది.

(2) తర్కమునను సరించి చేయఁబడు నాక్షేపమిందుఁ బరిహరింపఁబడనున్నది.

తర్కనిమిత్త ఇదానీమాక్షేపః పరిహ్రియతే

ఇప్పుడా సిద్ధాంతముపై తర్కము (=యుక్తివాదము) నాధారముచేసికొని చేయఁబడు నాక్షేపము పరిహరింపఁబడుచున్నది.

(3) బ్రహ్మ జగత్కారణ విషయము శ్రుత్యర్థముచేత నిర్ధారితమై యుండఁగా, తర్కమున కవకాశమెట్లువచ్చును!

కుతః పునరస్మిన్నవధారితే ఆగమార్థే తర్కనిమిత్తస్యాక్షేపస్యావకాశః

ఈ విషయమున (ఆగమార్థే=) శ్రుత్యర్థము (అవధారితే=) నిర్ణీతమై యుండఁగా. తర్కాధారముచేతఁ జేయఁబడు నాక్షేపమున కవకాశ మెందుండి వచ్చినది?

(4) ధర్మజ్ఞానమున కెట్లు శ్రుతి యాధారమో బ్రహ్మజ్ఞానమునకు సైత మట్లే శ్రుతి యాధారమేలకాక పోవలెను.

నను ధర్మ ఇవ బ్రహ్మణ్యనపేక్ష ఆగమో భవితుమర్హతి

ధర్మ (వైదికకర్మ) విషయములో నెట్లో బ్రహ్మవిషయములోసైత మట్లే (ఆగమః=) శ్రుతి (అనపేక్షః=) యుక్తిపై నాధారపడియుండదని చెప్పుటకవకాశమేల లేకపోవలెను?

పూర్వపక్షావతారిక :-

1 (1) ధర్మమనుష్ఠేయముగావున శ్రుతియవసరము- బ్రహ్మము పరినిష్పన్నముగావున శ్రుతిప్రమాణముతో నవసరములేదు.

భవేదయమవష్టంభో యదిప్రమాణాంతరా నవగాహ్య గమమాత్ర ప్రమేయో ఽయమర్థస్స్యాదనుష్ఠేయరూపఏవధర్మః

(అయమవష్టంభః=) ఈచేయఁబడిన యాక్షేపకప్రశ్నము (భవేత్=) సరియైనదేయని (వారిలోవారు) తలంచిన తలంతురుగాక! కాని మఱియేయితర

(ప్రత్యక్షానుమానాది) ప్రమాణములచేతను దెలియఁబడనిదై ఒక్క శ్రుతిమాత్ర ప్రమాణముచేతనే తెలిసికొనఁబడఁదగిన విషయమేయది (బ్రహ్మము)యైనచో నట్లు తలంచినఁ దలంచుటలోఁ గొంత విశేషముండవచ్చును. ఏలయన:- ధర్మ (=వైదిక కర్మ) మనఁగా ఒక చేయఁదగిన కార్యస్వరూపమైనదియే యగునుగదా!

పరినిష్పన్న రూపంతు బ్రహ్మావగమ్యతే

ఇక బ్రహ్మమన్ననో, (ఎట్టిచేయుటలో నవసరములేకముండే) (పరినిష్పన్న=) సంసిద్ధమైయున్న వస్తుస్వరూపమేయైనట్లు ఒప్పుకొనఁబడుచున్నదిగదా!

పరినిష్పన్నేచ వస్తునిప్రమాణాంతరాణా మస్త్యవకాశో యథా పృథివ్యాదిషు

పృథివి మొదలగు సంసిద్ధమై (ఇదివరకే యేర్పడినవై) యున్న భూతములను గ్రహించుటకు (ప్రత్యక్షాది) ఇతర ప్రమాణముల కెట్లవకాశమున్నదో, యట్లె సంసిద్ధమైయున్న బ్రహ్మమును గ్రహించుటకు సైత మితరప్రమాణముల కవకాశ ముండియేతీరును.

(2) శ్రుతులలోఁ బరస్పర విరోధమున్నప్పుడు ప్రబలశ్రుతిని ననుసరించు నట్లె- శ్రుతి స్మృతులకుఁ బరస్పరవిరోధమున్నప్పుడు స్మృతినే యనుసరింపవలెను.

తథాచ శ్రుతీనాం పరస్పరవిరోధే సత్యేకవశేనే తరానీయంతే

శ్రుతులలో నొకదానితో మఱియొకటి విరోధించుచున్నట్లు కనుపించు చున్నప్పుడు వానిలో (ప్రబలముగానుండు) నొకదానిని బట్టుకొని దానికనుకూలించులాగున (దుర్బలముగానుండు) తక్కినవానికర్థము చెప్పఁబడుచుండునుగదా.

ఏవంప్రమాణాం తరవిరోధేపి తద్వశేనైవ శ్రుతిర్నీయేత

అట్లే సాంఖ్యస్మృత్యాదులకును శ్రుతికిని విరోధము గన్పించుచున్నప్పుడు, ఆసాంఖ్యస్మృత్యాదుల కనుకూలించులాగుననే శ్రుతికిసైత మర్థము చెప్పవలసి యుండును.

ప్రత్యక్షము నాధారముచేసికొని పరోక్షమును జెప్పునదియే యుక్తి. కాబట్టి యనుభవమునకు యుక్తి సమీపమందును, శ్రుతి దూరమందును నుండును.

'దృష్టసాధర్మ్యేణ చాదృష్టమర్థం సమర్పయంతీ

(3) ప్రత్యక్షముగా గోచరించు వస్తువునందుఁ గన్పట్టు (అనుభవసిద్ధములగు) సమానధర్మముల నాధారముచేసికొని (కనుపించకుండ) పరోక్షమందుండు వస్తువుయొక్క యునికిని నూహించుటయే యుక్తియనఁబడును.

యుక్తిరనుభవస్య సన్నికృష్యతే విప్రకృష్యతే తుశ్రుతిరైతిహ్యమాత్రేణ స్వార్థాభిధానాత్

/

అందువలన 'యుక్తి' యెప్పుడును అనుభవమునకు (సన్నికృష్యతే=) మిక్కిలి సమీపమందుండును (ఐతిహ్యమాత్రేణ=) సాంప్రదాయమాత్రముచేత (=కథగాఁజెప్పుచు వచ్చుచుండుటమాత్రముచేత) విషయమును దెలుపునదియే 'శ్రుతి' యనఁబడును. కావున 'శ్రుతి' యెప్పుడును అనుభవమునకు (విప్రకృష్యతే=) మిక్కిలి దూరమందుండును.

(4) బ్రహ్మవిజ్ఞానమనుభవావసానమగుట నిర్వివాదము- అందులకుయుక్తియే యుపకరించును.

అనుభవావసానంచ బ్రహ్మవిజ్ఞాన మవిద్యాయా నివర్తకం మోక్షసాధనంచ దృష్టఫలతయేష్యతే

అవిద్యను (=అజ్ఞానమును) సమూలముగా విచ్ఛేదమును జేయునట్టియు, మోక్షమును (=బంధములనుండి విడుదలను) జేకూర్చునట్టియు బ్రహ్మవిజ్ఞానమనునది ప్రత్యక్షఫలానుభవమును బొందుటయే- అనఁగా- బ్రహ్మసాక్షాత్కారమును బొందుటయేగాక మఱియింకనేమియు లేదని (ఇష్యతే=) యంగీకరింపఁబడు విషయమేగదా-

(5) బ్రహ్మవిజ్ఞానమునకు యుక్తిసైతముపయోగింపఁబడవలెనని శ్రుతియే యంగీకరించుచున్నది.

శ్రుతిరపి 'శ్రోతవ్యో' బృ. IV 4-5 'శ్రోతవ్యో మంతవ్యోనిదిధ్యాసితవ్యః'

(బ్రహ్మమునుగూర్చి) వినవలసినది, యుక్తిచేతఁ జింతింపవలసినది, నిదిధ్యాసము (=          ) చేయవలసినది.

ఇతిశ్రవణ వ్యతిరేకేణ మననంవిదధతీ తర్కమప్యాదర్తవ్యందర్శయతి

ఈపై మొదలగు శ్రుతులుసైతము బ్రహ్మమును వినుటచేతనేగాక అందులకు భిన్నమైన యుక్తిచేతనుగూడ మననము చేయవలసినది యని చెప్పుటమూలమున, యుక్తిరూపమైన తర్కముసైత మాదరింపఁబడవలసినదేయని స్పష్టగించుచున్నది.

(6) కాబట్టి తర్కమును (యుక్తిని) బురస్కరించుకొనిచేయఁబడు నాక్షేపమున కవకాశము గలదు.

అతస్తర్కనిమిత్తః పునరాక్షేపః క్రియతే న విలక్షణత్వాదస్యేతి

(అతః=) ఈహేతువునుబట్టియే తర్కమును (=యుక్తిని) బురస్కరించుకొని 'న, విలక్షణత్వాదస్య' అను సూత్రాక్షరములచేత జగదీశ్వరకారణ వాదమును (జగత్తునకీశ్వరుఁడే నిమిత్తోపాదాన కారణములనెడి - వాదమును గూర్చి మఱల నీయాక్షేపణము చేయఁబడుచున్నదిసుమా!

## ౪ సూ॥ 'న విలక్షణత్వాదస్య తథాత్వం చ శబ్దాత్'

ప॥ వి :- న + విలక్షణత్వాత్ + అస్యతథాత్వంచ + శబ్దాత్.

ప్రతి ప. అ :- న = కాదు (బ్రహ్మము జగత్కారణముగాదు)? విలక్షణత్వాత్ = (బ్రహ్మముకంటె జగత్తు) విలక్షణముగా (=భిన్నముగా) నుండుటవలన-

అస్య = దీనికంటె (ఈజగత్తుకంటె) తథాత్వంచ = (వైలక్షణ్యమనునదియును) బ్రహ్మము విలక్షణముగానుండు విషయముగూడ; శబ్దాత్ = వేదమువలన (తెలియబడు మన్నది).

తాత్పర్యం :- (ఇది కేవల పూర్వపక్షసూత్రము). బ్రహ్మము జగత్కారణముగాదు- ఎందుచేతననగా బ్రహ్మముకంటె జగత్తు విలక్షణమైనదిగాఁగన్పించుచున్నది- ఈజగత్తుకంటె బ్రహ్మము విలక్షణమైదను విషయము సైతము వేదమువలన తెలియవచ్చుచున్నది.

భాష్యము

II చేతనమైన బ్రహ్మము (అచేతనమైన) జగత్తునకు నిమిత్తోపాదాన కారణములుఁ గాఁజాలదు.

యదుక్తం చేతనం బ్రహ్మ జగతః కారణం ప్రకృతిశ్చేతి తన్నోపపద్యతే

చేతనవస్తువైన బ్రహ్మము జగత్తుయొక్క (కారణం=) నిమిత్తకారణమును (ప్రకృతిశ్చ=) ఉపాదానకారణమును అగునని చేయువాదము (నోపపద్యతే=) యుక్తియుక్తముగాదు-

(1) (కారణమైన) బ్రహ్మము (కార్యమైన) జగత్తుకంటె విలక్షణముగావుననే-

కస్మాద్విలక్షణత్వాదస్య వికారస్య ప్రకృత్యాః

ఎందుచేతనందురేమో! (అస్యవికారస్య=) ఈవికారభూతమైన జగత్తు (ప్రకృత్యాః=) దానికుపాదానకారణమని చెప్పఁబడెడు మూలపదార్థమైన బ్రహ్మముకంటె (విలక్షణత్వాత్=) భిన్నమైనదిగాఁ గన్పట్టుచున్నందున (నట్లు చెప్పినారము)

విలక్షణమెట్లనగా :- జగత్తు అచేతనము- అశుద్ధము.

ఇదంహి బ్రహ్మకార్యత్వేనా భిప్రేయమాణం జగద్బ్రహ్మ విలక్షణమచేతన మశుద్ధంచ దృశ్యతే

బ్రహ్మముయొక్క కార్యముగా- అనఁగా బ్రహ్మమునుండి పుట్టినదిగాఁ దలంచఁబడుచున్న యీజగత్తు అచేతనము- అశుద్ధమునై బ్రహ్మమునకంటె భిన్నమైనదిగాఁ (ప్రత్యక్షముగా) గన్పట్టుచున్నదిగదా!

బ్రహ్మము చేతనము- శుద్ధము

బ్రహ్మజగద్విలక్షణం చేతనం శుద్ధంచ శ్రూయతే

ఇక బ్రహ్మమన్ననో, చేతనమనియు శుద్ధమనియు కాఁబట్టియే జగత్తుకంటె భిన్నమైనదనియు (శ్రూయతే=) వినఁబడుచున్నదిగదా !

(2) విలక్షణములుగా నుండునవి కారణకార్యములుగానేరవు- దృష్టాంతములను దిలకింపుఁడు:-

నచవిలక్షణత్వే ప్రకృతివికారభావో దృష్టః

కారణకార్యములు రెండును (విలక్షణత్వే=) కేవలము భిన్నములగుచుండఁగా (ప్రకృతివికారభావః=) ఒకటి యుపాదానకారణముగుటయు మఱియొకటి దానికార్య (అందుండి పుట్టినది) మగుటయు నెన్నటికిని సంభవింపదు. ఎట్లంటే-

నహిరుచకాదయో వికారా మృత్ప్రకృతికా భవంతి శరావాదయోవా సువర్ణప్రకృతికాః

(వికారాః=) కార్యములైన (అనఁగా- చేయఁబడినవస్తువులైన) బంగారు సొమ్ములు మొదలగునవి (మృత్ప్రకృతికాః=) మట్టినుండి తమస్వరూపమును బొందుటయు, మూకుడు కుండ మొదలగునవి (సువర్ణప్రకృతికాః=) బంగారునుండి తమ స్వరూపమును బొందుటయు (కానేరవుగదా)

మృదైవతు మృదన్వితా వికారాః ప్రక్రియంతే

మట్టిమయములైన (మట్టితోఁగూడుకొనియుండు) వస్తువులు (మృదా+ఏవతు=) మట్టిచేతనే (ప్రక్రియంతే=) చేయఁబడుచున్నవి.

సువర్ణేన చ సువర్ణాన్వితాః

బంగారు మయములైన (బంగారముతో గూడికొనియుండు) వస్తువులు బంగారముతోనే చేయఁబడవలయును.

తథేదమపిజగదచేతనం సుఖదుఃఖమోహాన్వితం స దచేతనస్యైవసుఖదుఃఖమోహాత్మకస్య కారణస్య కార్యం భవితు మర్హతి

అట్లే (సుఖదుఃఖమోహాన్వితంసత్=) సత్త్వరజస్తమోగుణమయమైనదై అచేతనమైన యీజగత్తు సైతము (సుఖదుఃఖమోహాత్మకస్య=) సత్త్వరజస్తమోగుణరూపమై అచేతనమైయుండు (ప్రధానమువంటి) ఒకకారణమునుండియైన కార్యమేయై యుండవలయును (అనఁగా నట్టికారణముతోనే చేయఁబడి యుండవలయును)- కాని

నవిలక్షణస్య బ్రిహ్మణః బ్రహ్మావిలక్షణత్వం చాస్యజగతో౽శుద్ధ్య చేతనత్వ దర్శనాదవగంతవ్యం

(జగత్తుకంటె) విలక్షణముగానుండు బ్రహ్మమునుండియైన కార్యమైయుండఁ జాలదు.

ఈజగత్తు బ్రహ్మమునకంటె విలక్షణమైనదను విషయము అది యశుద్ధము నచేతనమై యుండుటచేతనే స్పష్టమగుచున్నది-

(3) సుఖదుఃఖమోహాత్మకముగాన జగత్తు అశుద్ధము.

అశుద్ధం హీదంజగత్ సుఖదుఃఖమోహాత్మకతయా ప్రీతియతే ప్రీతిపరితాప విషాదాది హేతుత్వాత్ స్వర్గనరకాద్యుచ్చావచ ప్రపంచత్వాచ్చ

ఈజగత్తు అశుద్ధమైనదియని చెప్పుట యెట్లంటేని— అది కేవలము సుఖ దుఃఖమోహస్వరూపమైనదై (ప్రీతిపరితాప విషాదాది=) యిష్టానిష్ట దుఃఖాదులకు (హేతుత్వాత్=) మూలమగుటయేగాక (ఉచ్చావచ=) హెచ్చు తగ్గులుగానుండు స్వర్గ నరకాది (=సుఖదుఃఖ) స్థాన బాహుళ్యమై యుండుటచేతఁగూడ నట్లు చెప్పఁ బడుచున్నది.

(4) చేతనమున కుపకరణ మగునది గావున జగత్తు అచేతనము.

అచేతనం చేదం జగచ్చేతనం ప్రతికార్యకరణభావే నోపకరణ భావోపగమాత్

మఱి యీ జగత్తు అచేతనమైనదని చెప్పుట యెట్లంటేని— అది (కార్య కరణభావేన=) ప్రయోజనమును జేకూర్చు సాధనమగుటనుబట్టి చేతనముచేత (ఉపకరణ భావోపగమాత్=) భోగసాధనముగా నుపయోగింపఁ బడుచుండుట వలన నట్లు చెప్పఁబడుచున్నది.

నహిసామ్యే సత్యుపకారోపకారక భావో భవతి

రెండును నొకేతరగతిలోఁ జేరిన సమానవస్తువులే యగుచో, ఉపయోగించు కొనునది— ఉపయోగింపఁ బడునదియను భేదభావ మెన్నటికిని గుదరదుగదా.

నహి ప్రదీపౌ పరస్పర ముపకురుతః

(అంధకార ప్రదేశమునకు దీపముపయోగించినట్లు) ఒకచోనున్న రెండు పెద్దదీపము లొకదానికొకటి యుపయోగింపవుగదా !

(5) స్వామిభృత్య న్యాయమున భోక్తృ భోగ్యములు రెండును ఏల చేతన ములై యుండఁగూడదు?– అను నాక్షేపము

నను చేతనమపి కార్యకరణం స్వామిభృత్యన్యాయేన భోక్తురుపకరిష్యతి

(ఒకటి మఱియొకదానికి భోగసాధనమైనప్పు డది యచేతనమేయై యుండ వలయునన్న నియమములేదు. ఎట్లనఁగా)— (స్వామిభృత్య న్యాయేన=) ఇరువురును జేతనవస్తువులేయై యున్నను సేవకుఁడు యజమాని కుపయోగించినట్లు చేతనము మాత్రము [చేతనుఁడేయైన] భోక్తకు [కార్యకరణం=] భోగసాధనముగా నేల యుపయోగ పడఁగూడదు? అను నాక్షేపము రావచ్చును.

(బి) పై యాక్షేపము సరిగాదు. స్వామిభృత్య విషయములో సైతము చేతనములోని యచేతనభాగమే భోగ్యమై చేతనమైన భోక్తకుపకరించు చున్నది. అట్టి యాక్షేపము సరిగాదు

స్వామిభృత్యయో రప్యచేతనాంశస్యైవ చేతనం ప్రత్యుపకారకత్వాత్

యజమాని సేవకుల విషయములో సైతము చేతనుఁడైన యజమానునికి సేవకునిలోనుండు నచేతన భాగము మాత్రమే (భోగసాధనముగా) ఉపయోగించు చున్నట్లు కనుపించుచున్నది అనఁగా :—

యో హ్యేకస్య చేతనస్య పరిగ్రహో బుద్ధ్యాది రచేతనభాగః సఏవాన్యస్య చేతన స్యోప కరోతి నతు స్వయమేవ చేతనశ్చేతనాంతరస్య ఉపకరోత్యపకరోతి వా

చేతనుఁడుగానుండు నొకనియొక్క— అనఁగా వానిని (పరిగ్రహః=) నంటి యున్న బుద్ధి-మనస్సు-స్థూలసూక్ష్మేంద్రియములు మొదలగు నచేతనభాగ మేది గలదో, అదిమాత్రమే చేతనుఁడుగానుండు(యజమానుఁడు మొదలగు)మఱియొకనికి (భోగాది సాధనముగా) నుపయోగించు చున్నదని తలంచవలయునుగాని, ఒకని యందుండు చేతనభాగమే స్వయముగా మఱియొకనియందుండు చేతనభాగమునకు మంచికో చెడ్డకో సాధనమగుచున్నదని వాదించుట కవకాశములేదు.

(సి) సాంఖ్యమతానుసారమునఁ గూడ పురుషులందరు (చేతనులు) సమానులు. అన్యోన్యము భోగ్యములుగాఁ జాలరు. భోగ్యమగునది యచేతనమే.

నిరతిశయాహ్య కర్తారశ్చేతనా ఇతి సాంఖ్యామన్యంతే

సాంఖ్యసిద్ధాంతము సైత మీవిషయమును బలపఱచుచున్నది. ఎట్లన వారి మతానుసారము చేతనులు అనఁగా పురుషులు (జీవులు) అందరును (నిరతిశయాః=) సమానులు. వారు (అకర్తారః=) కర్తలు (పనిచేయువారు)గారు భోక్తలు (=అనుభవించువారు) మాత్రమగుదురు (అనఁగా :— చేతనులైన పురుషులు పరస్పర ముపయోగింపఁ జాలరు. అందరును అచేతనమైన జగత్తును అనుభవించువారే)

తస్మాదచేతనం కార్యకరణం

కాబట్టి అచేతనము మాత్రమే

(కార్యే=) భోగ కార్యమునకు (కరణం=) సాధనము గాఁగలదు. (పురుషుని చేత భోగసాధనముగా నుపయోగించఁ బడుచున్న జగత్తనుపదార్థ మచేతనమే యని నిశ్చయింపక తప్పదు.)

(6) జగద్భాగముగానుండు కాష్ఠలోష్ఠాదులు అచేతనములేయని లోకములోఁ బ్రత్యక్షవిషయమేగదా!

న చ కాష్ఠ లోష్ఠాదీనాం చేతనత్వే కించిత్ప్రమాణమస్తి

మఱియును (జగత్తులో భాగములుగానుండు) మొద్దులు, దుంగలు, ఱాలు ఱప్పలు (బ్రహ్మమే జగత్కారణమని చెప్పువారి మతానుసారము) చేతనములేయగునని వాదించుట కాధారము (=ప్రమాణము) గానఁబడదు.

ప్రసిద్ధశ్చాయం చేతనాచేతన విభాగో లోకే

అదిగాక లోకమందు వస్తుజాలమంతయు చేతనములని- అచేతనములని చేయఁబడియున్న విభజనము ప్రత్యక్షమై ప్రసిద్ధమై యున్నది. (అట్లుకాదనుట కెవకాశము)

(7) కాబట్టి చేతనమైన బ్రహ్మము అచేతనమైన జగత్తునకుఁ గారణము గాఁజాలదు.

తస్మాద్బ్రహ్మ విలక్షణత్వాన్నేదం జగత్ప్రకృతికం

కాబట్టి యీ (అచేతనమైన) జగత్తు [చేతనమైన] బ్రహ్మముకంటె విలక్షణముగా నున్నందున, బ్రహ్మము [జగత్ప్రకృతికం] జగత్కారణ మెన్నటికిని గాఁజాలదు. [అనఁగా :- బ్రహ్మమే యుపాదానకారణముగా జగత్తు చేయఁబడియున్నదని చెప్పుట యెంతమాత్రమును పొసఁగదు]

[౨] పూర్వపక్షి తనవాదముపై మఱియొక యాక్షేపమును నుత్ప్రేక్షించుకొనుచున్నాఁడు. ఎవఁడైనను నొకఁడు శ్రుతిచెప్పినచొప్పున బ్రహ్మకార్యమైన జగత్తుసైతము చేతనమేయని నమ్మి.

యోఽపి కశ్చిదాచక్షీత శ్రుత్వా జగతశ్చేతనప్రకృతికతాం తద్బలేనైవ సమస్తం
జగచ్చేతన మవగమిష్యామి; ప్రకృతిరూపస్య వికారేఽన్వయ దర్శనాత్

ఎవఁడైనను బ్రహ్మ జగత్కారణమని చెప్పుశ్రుతిని విని యీక్రిందివిధమున వాదింపవచ్చును. జగత్తు చేతనమైన బ్రహ్మమునుండియే యేర్పడినదని శ్రుతులు చెప్పుచున్నవిగదా; కావున ఆశ్రుతి ప్రమాణబలముచేతనే యీజగత్తంతయు చేతనమే యని (గట్టిగా) నమ్ముచున్నాను.

అందుచేతనే మఱియు (మట్టిరూపమే కుండకున్నట్లు) ఉపాదానకారణమైన బ్రహ్మ లక్షణమే [అనఁగా చైతన్యమే] [వికారే=] బ్రహ్మకార్యమైన జగత్తునందును అనుసరించి కనుపడుచునే యున్నది.

[బి] జగత్తు చేతనముగాఁ దెలియఁబడకపోవుట [అవిభావనము] కారణమైన చేతనమందుఁ గల్గిన పరిణామవిశేషముచేత నేర్పడినదని సరిపుచ్చుకొనవచ్చును.

అవిభావనంతు చైతన్యస్య పరిణామవిశేషా ద్భవిష్యతి

కాని [అవిభావనంతు=] యీజగత్తు చేతనముగాఁ దెలియఁబడుటలేదే యని పూర్వపక్షము రావచ్చును- చైతన్యమునందుఁ [బ్రహ్మమునందు] గల్గిన పరిణామవిషయముచేత అనఁగా మార్పుయొక్క హెచ్చుతగ్గులచేత చేతనముగాఁ [పైకిఁ] దెలియఁబడక పోవచ్చునని సమాధానము చెప్పఁదగియున్నది.

యథాస్పష్టచైతన్యానా మప్యాత్మనాం స్వాపమూర్ఛాద్యవస్థాసు చైతన్యం న విభావ్యతే

అదెట్లన:- స్పష్టముగాఁ జేతనులేయని యొప్పుకొనఁబడుచున్న [ఆత్మనాం] జీవులకుగూడ వారినిద్రామూర్ఛాద్యవస్థలలోఁ జైతన్యమున్నట్లు తెలియఁ బడుటలేదుగదా!

ఏవం కాష్ఠలోష్ఠాదీనామపి చైతన్యం నవిభావయిష్యతే

అట్లే మొద్దులు దుంగలు రాలు అప్పలుగానుండు జగత్తుస్సైతము [కారణమైన బ్రహ్మమువలె వాస్తవమునకుఁ జేతనమే యైయున్నను] చేతనముగాఁ దెలియఁబడక పోవచ్చును.

(సి) మఱియును సర్వమును అనఁగా భోక్తృ భోగ్యములు చేతనములేయై యున్నను- విభావనావిభావనములవలనను రూపాదిభావాభావములవలనను సమానత్వము స్ఫురింపమి భోక్తృభోగ్యభావ మేర్పడి యుండవచ్చునని దృష్టాంతసహితముగా వాదించవచ్చును.

ఏతస్మాదేవచ విభావితత్వా విభావితత్వ కృతా ద్విశేషా ద్రూపాదిభావా భావాభ్యాంచ కార్యకరణానా మాత్మనాంచ చేతనత్వావిశేషేపి గుణప్రధానభావో నవిరోత్స్యతే

ఈ కారణము చేతనే అనఁగా (విభావితత్వావిభావితత్వకృతాద్విశేషాత్ =) పరిణామములేనప్పు డెక్కువ యభివ్యక్తి-పరిణామమున్నప్పు డెక్కువ యనభివ్యక్తి) పరిణామముచే నేర్పడిన విశేషించి తెలియఁబడుట- విశేషించి తెలియఁబడక పోవుట అను (=ప్రకాశ్యా ప్రకాశ్యములచేత) భేదము వలనను, (రూపాది భావాభావాభ్యాంచ=) చైతన్య మెక్కువగా స్ఫురించుచోట రూపాకారములు తక్కువగానుండుట, చైతన్యము తక్కువగానుండుచోట రూపాకారము

లెక్కవగానుండుటవలనను, [కార్యకరణానాం=] పైకి అచేతనములుగాఁగనుపించు భోగసాధన వస్తువులును [ఆత్మనాంచ=] స్పష్టముగాఁ జేతనములుగాఁ గనుపించు పురుషులును [చేతనత్వా విశేషేఽపి=] వాస్తవమునకుఁ జేతనములే యైయున్నను [గుణప్రధానభావః=] పురుషుల యొక్క భోగకార్యమునకు మిగిలిన వస్తువులు సాధనములుగా నుపయోగపడుట [నవిరోత్స్యతే=] ఎన్నటికిని భంగముచెందదు.

యథాచ పార్థివత్వా విశేషేఽపి మాంససూపౌదనాదినాం ప్రత్యాత్మవర్తినో విశేషాత్ పరస్పరోపకా రిత్వంభవతి

అది యెట్లనఁగా :— [మాంససూపౌదనాదీనాం=] మాంసము-సూపము-అన్నము మొదలగు పదార్థములు [పార్థివత్వా విశేషేఽపి=] బృథివిసంబంధమైన వస్తువులగుటలో భిన్నములు కానప్పటికి అనఁగా సమానములేయైనప్పటికి [ప్రత్యాత్మవర్తినో విశేషాత్=] వానిలో వానికుండు రూపాకార భేదములవలనఁ బరస్పరముపయోగ పడుచున్నవిగదా [అనఁగా మాంసవృద్ధికి సూపాన్నము లుపయోగకారులగుచున్నవిగదా]

(డి) మఱియును బైనఁదెలిపిన విభావనా విభావనములే లోకప్రసిద్ధమైయున్న చేతనాచేతన విభాగమునకు హేతువనియును జెప్పవచ్చును.

ఏవమిహాపి భవిష్యతి ప్రవిభాగప్రసిద్ధిర వ్యతఏవ నవిరోత్స్యత ఇతి

అట్లే యీ విషయమందును— అనఁగా- పురుషకాష్ఠలోష్ఠాదుల విషయమందును (అన్నియుఁ జేతనములేయై యున్నను) పరస్పరముపయోగపడుచుండును. పరస్పరోపయోగ కారణమువలన (ప్రతిభాగ ప్రసిద్ధిరపి=) విభావితత్వా విభావితత్వ విభాగము- అనఁగా కొన్ని చేతనములుగాఁ దెలియఁబడుట— కొన్ని చేతనములుగాఁ దెలియఁబడకపోవుట అను విచక్షణ మాత్రము భంగపడిపోదు. (లోకములోఁ బ్రసిద్ధమైయుండు చేతనాచేతన విభాగమనఁగా చేతనముగాఁబైకిఁదెలియఁబడుట- చేతనముగాఁ బైకిఁదెలియఁ బడకపోవుట మాత్రమే యైయున్నది.)

(9) ఉత్ప్రేక్షించుకొన్న యాక్షేపమును బూర్వపక్షి పరిహరించు కొనుచున్నాడు.

(ఎ) ప్రత్యక్షమగు చేతనాచేతన విభాగమును ఆక్షేపకుఁడు సరిపుచ్చిన విధము తృప్తికరముగాదు.

తేనాపి కథంచి చ్చేతనత్వాచేతనత్వలక్షణం విలక్షణత్వం పరిహ్రియతే

పైనఁ దెలిపిన వాదసరణివలన (లోకమందుఁ బ్రసిద్ధముగాఁ గనుపించు) చేతనాచేతన రూపమైన భేదము వాస్తవమైనది గానట్లు ఏదోయొకరీతిగా సమర్థింప

బడినది- (కారణమైన బ్రహ్మమునకును గార్యమైన జగత్తునకును జేతనా చేతనత్వ భేదములేదని ఎట్లో సమర్థించినంత మాత్రముచేతఁ బ్రయోజనములేదని భావము)

(బి) చేతనాచేతన విభాగమెట్లో సరి పుచ్చఁబడినను బ్రహ్మజగత్తుల మధ్య నుండు శుద్ధ్యశుద్ధి రూపమగు విలక్షణత్వము మాత్రము త్రోసివేయబడ జాలదు.

శుద్ధ్యశుద్ధిలక్షణంతు విలక్షణత్వం నైవపరిహ్రియతే

కాని ఒకటి (అనఁగా బ్రహ్మము) శుద్ధమైనది, మఱియొకటి (అనఁగా జగత్తు) అశుద్ధమైనది (సుఖదుఃఖ మోహాన్వితము) అను భేదముమాత్రము లేదని త్రోసివేయుటకు సాధ్యముగాదు.

(సి) వాస్తవమునకు చేతనాచేతనవిభాగమునైతము త్రోసివేయఁబడజాఁదు.

నచేతరదపి విలక్షణత్వం పరిహర్తుం శక్యత ఇత్యాహ

మేము (పూర్వపక్షి) చెప్పుచున్న (ఇతరదపి=) చేతనాచేతన విభాగ మేమియు వాస్తవమైనదిగాదని పరిహరించుటకు సాధ్యమగునాయనియు యోచింప వలసియున్నది. (అనఁగా సాధ్యముకానేకాదని భావము)

(డి) చేతనాచేతన విభాగమువలనఁ గలిగిన వైలక్షణ్యమును వేదమే యొప్పు కొనుచున్నది- శ్రుతియే శరణమగు వారీవిషయమొప్పుకొనక తప్పదు.

తథాత్వంచ శబ్దాత్ ఇతి

(తథాత్వంచ=) బ్రహ్మమునకును జగత్తునకునుగల చేతనత్వా చేతనత్వ భేదము- అనగా వైలక్షణ్యము (శబ్దాత్=) వేదమువలనఁగూడఁ దెలియఁబడు చున్నది- (అని సూత్రాక్షరములే చెప్పుచున్నవి).

అనవగమ్యమాన మేవహీదంలోకే సమస్తస్య వస్తునశ్చేతనత్వం చేతన ప్రకృతికత్వ శ్రవణా చ్ఛబ్దశరణతయా కేవలయో త్ప్రేక్ష్యేత

(ప్రత్యక్షానుమానాది ప్రమాణములచేత) చేతనములేయని తెలియఁబడఁ జాలని యీలోకములోని సమస్తవస్తువులు (చేతనప్రకృతికత్వశ్రవణాత్=) చేతన మైన బ్రహ్మమునుండి పుట్టినవని వేదమునుండి వినుటవలన- (శబ్దశరణ తయా కేవలయా=) అనఁగా కేవలము వేదప్రమాణమువలన మాత్రమే (ఉత్ప్రేక్ష్యేత=) తెలియఁబడుచున్నది. (ఇట్లు తెలియఁబడుట ఉత్ప్రేక్షచేతనైనదేగాని ప్రత్యక్షమైనదిగాదని భావము)

తచ్ఛ శబ్దేనైవ విరుధ్యతే యతశ్శబ్దాదపి తథాత్వమవగమ్యతే

(తచ్ఛ=) అట్లుచెప్పుట (శబ్దేనైవ=) వేదముతోనే విరోధించుచున్నది (అనఁగా వేదమునకనుసరించిలేదు)- ఎందుచేతననఁగా (శబ్దాదపి=) వేదమువలననే

(తథాత్వమ్=) బ్రహ్మముకంటె దానికార్యమని చెప్పఁబడు జగత్తునకుగల వైలక్షణ్యము (=భేదము) తెలియఁబడుచున్నది.

తథాత్వమితి ప్రకృతి విలక్షణత్వం కథయతి

(సూత్రములోనున్న) తథాత్వమనఁగా ప్రకృతి విలక్షణత్వము- అనఁగా:- (జగత్తునకు నుపాదానకారణమని చెప్పఁబడు) ప్రకృతికంటె అనఁగా బ్రహ్మమున కంటె విలక్షణ (=భిన్న) మై యుండుటను.

(ఈ) వైలక్షణ్యమునుజెప్పు శ్రుతిని బరికింపుఁడు.

శ్రుతిరపి 'విజ్ఞానంచా విజ్ఞానంచ' ఇతికస్యచి ద్భాగస్య చేతనతాంశ్రావయన్ చేతనాద్బ్రహ్మణో విలక్షణ మచేతనం జగచ్ఛ్రావయతి తై II-6 'విజ్ఞానంచా విజ్ఞానంచ'

శ్రుతియు యిట్లు చెప్పుచున్నది- చూడుఁడు!

(విజ్ఞానంచ=) జ్ఞానమేయగు చేతనమును (అవిజ్ఞానంచ=) అజ్ఞానమేయగు నచేతనమును (సృష్టికర్తయగు బ్రహ్మమయ్యెను) ఈ శ్రుతి బ్రహ్మముయొక్క యొకభాగము చేతనమని (వినిపించి=) చెప్పి చేతనమైన యాభాగమునకంటె విలక్షణమై (భిన్నమైనదై) అచేతనమైనదే జగత్తుఅని (శ్రావయతి=) చెప్పుచున్నది.

ముందు రీ సూత్రమున కవతారిక.

III కొన్ని యచేతనములను అనఁగా భూతేంద్రియములను చేతనములుగా శ్రుతులు చెప్పుచున్నవిగదాయని పూర్వపక్షియా శంకించుకొనుచున్నాఁడు.

ననుచేతనత్వమపి క్వచిదచేతనత్వాభిమతానాం భూతేంద్రియాణాం శ్రూయతేయథా

నీచే అచేతనములుగా నంగీకరింపబడుచున్న (అనఁగా అచేతనములేయని నీవు తలంచుచున్న) భూతేంద్రియములు (సైతము): చేతనములుగానే శ్రుతులు చెప్పుచున్నవి. చూచితివా? ఎట్లంటేని:-

మృదబ్రవీ' ఇతి శ. బ్రా VI-1-3-2 మృదబ్రవీ దాపోఽబ్రువన్'

(మృత్=) భూమి (అబ్రవీత్=) పలికెను (ఆపః=) ఉదకములు (అబ్రువన్=) పలికినవి-

'తత్తేజ' ఇతిచైవమాద్యా భూతవిషయా చేతనత్వ శ్రుతిః ఛా VI-2-3-4 'తత్తేజ ఐక్షత-' 'తాఆపఐక్షంత' చేతనత్వ శ్రుతిః

ఆఅగ్ని(ఐక్షత=)చూచెను అనఁగా సంకల్పించెను ఆయుదకములు(ఐక్షంత=) చూచినవి అనఁగా సంకల్పించినవి. ఈమొదలగు శ్రుతులు పృథివ్యాది భూతములు చేతనములని నిరూపించుచున్నవి.

ఇంద్రియవిషయా అపి

అట్లె యింద్రియములను గూర్చి చెప్పు శ్రుతులును గలవు.

'తే హేమే' ఇతి. బృ VII-1-7 'తే హేమే ప్రాణా అహంశ్రేయసే వివదమానా బ్రహ్మజగ్ముః'

(తే + హ + ఇమే + ప్రాణాః =) ఆయా యింద్రియములు ప్రాణములు (అహంశ్రేయసే =) తనతన శ్రేష్ఠత్వముకై (వివదమానాః =) కలహించుచున్నవై (బ్రహ్మ =) చతుర్ముఖ బ్రహ్మమునుగూర్చి (జగ్ముః =) వెళ్ళినవి-

'తేహవాచ' ఇతిచైవమాద్యేంద్రియ విషయేతి బృ III-3-2 'తేహవాచ మూచుస్త్వం న ఉద్గాయ'

(తే + హ =) ఆయింద్రియములు (వాచం =) వాక్కునుగూర్చి వాక్యమును (ఊచుః =) పలికినవి- (త్వం =) నీవు (నః =) మాకొఱకు (ఉద్గాయ =) గానము చేయుము. ఈ మొదలగు శ్రుతులు ప్రాణాదింద్రియములు చేతనములుగాఁ జెప్పుచున్నవి- (ఇందులకేమి చెప్పెదవు?)

అతఉత్తరం పఠతి

(పూర్వపక్షిచే) ప్రత్యుత్తరము చెప్పఁబడుచున్నది.

## ౫ సూ॥ అభిమానివ్యపదేశస్తు విశేషానుగతిభ్యామ్

పదవి :- అభిమానివ్యపదేశః + తు + విశేషానుగతిభ్యామ్॥

ప్ర. ప. అ :- అభిమానివ్యపదేశః; అభిమాని = భూతేంద్రియాభిమాని యగు దేవతను, వ్యపదేశః = చెప్పుట- తు = ఆక్షేపమునరిగాదు. విశేషానుగతిభ్యామ్; విశేష = విశేషము (చేతనాచేతన విభాగవిభేదము) వలనను, అనుగతిభ్యామ్ = అనుగతి (భూతేంద్రియముల ననుసరించి దేవతలులుండుట) వలనను ఆక్షేపము సరిగాదు-

సూ॥ తా॥ పై శ్రుతులలో అచేతనములు చేతనములుగాఁ జెప్పుటయునది ఆ యచేతనములను నుద్దేశించిగాదు; ఆ యచేతనములను అభిమానించియుండు (వాని నాశ్రయించియుండు) దేవతలను నుద్దేశించి చెప్పుటయే సుమీ! ఎందుచే ననఁగా అచేతనములు- చేతనములు అను విభాగభేదము శ్రుతులయందుఁగన్పట్టు చుండుటవలనను మఱియును అచేతనపదార్థములను నధిష్ఠించి (అనుసరించి) దేవత లున్నట్లుగా శ్రుతులు చెప్పుచుండుటవలనను అట్లు చెప్పఁబడినది.

భాష్యము భాష్యార్థము

IV అవతారికలోఁ బూర్వపక్షి కలుగఁజేసికొన్న యాశంకకుఁ బూర్వ పక్షి యీ సూత్రముచే సమాధానము చెప్పుకొనుచున్నాడు.

అభిమానివ్యపదేశః

'అచేతనములుగాఁ గనుపించునవి వాస్తవమునకుఁ జేతనములుగానే శ్రుతులు వ్యవహరించుచున్నట్టున్నది' అను శంకను నివారించుటకు 'తు' అను శబ్దము సూత్రములో నుపయోగింపఁబడినది.

తుశబ్దః 'మృదబ్రవీత్' ఇత్యేవం జాతీయకయా శ్రుత్యా భూతేంద్రియాణాం చేతనత్వమాశంకితమ్

శత. బ్రా VI1-3-2 'మృదబ్రవీత్ = భూమి పలికెను' అను శ్రుతివల్లను ఇట్టివే మఱికొన్ని శ్రుతులవల్లను భూతేంద్రియములు చేతనములుగాఁ జెప్పఁబడినవి— అను శంక పెట్టుకొనఁ దగినదిగాదు.

(1) అచేతనముల విషయములో శ్రుతులు చేతనములుగాఁ జెప్పినది కేవలమచేతనములను గూర్చి కాదు ఆ యచేతనముల నభిమానించియుండు దేవతలను గూర్చి మాత్రమే యగును.

యతోఽభిమాని వ్యపదేశ ఏషః

ఎందుచేతననఁగా :— చేతనములైనట్టుగాఁ జెప్పఁబడినది 'అచేతనములను గూర్చిగాదు'— (అభిమాని) ఆ యచేతనముల నభిమానించి వానియందుండు చేతనులగు దేవతలను గూర్చియే యట్లు చెప్పఁబడినది.

మృదాద్యభిమానినో వాగాద్యభిమానిన్యశ్చ చేతనాదేవతావదన విసంవదనాదిషు చేతనోచితేషు వ్యవహారేషు వ్యపదిశ్యంతేన భూతేంద్రియమాత్రం

చేతనములయందే సంభవములగు (వదనవిసంవదాదిషు=) మాట్లాడుట పోట్లాడుట మొదలగు వ్యవహారములు భూమి మొదలగు భూతములను వాగాదీంద్రియములను నభిమానించియుండు చేతనులగు దేవతలనుగూర్చి చెప్పఁబడినవి గాని కేవలము భూతేంద్రియములను గూర్చి కాదు.

కస్మాత్ ।

ఎందుచేనందురేమో !

(2) అభిమాన దేవతలను గూర్చియే శ్రుతులట్లు పలుకుచున్నవన్నందులకు హేతువులు రెండు— 1) విశేషము 2) అనుగతి

విశేషానుగతిభ్యాం

విశేషమువలనను (అనఁగా ఆయా శ్రుతులలోఁ జెప్పఁబడిన చేతనాచేతన భేదము) వలనను అనుగతివలనను (అనఁగా జడ=అచేతన) పదార్థములను అనుస రించి యభిమానదేవత లుండుటవలనను) అచేతనములనుగూర్చిగాదని నిశ్చయించు చున్నాము.

(ఎ) అచేతనములను జేతనములుగాఁ జెప్పినశ్రుతులే చేతనాచేతన విభా గము చెప్పుకొనుచున్నయవి. ఇదియే విశేషము.

విశేషోహి భోక్తౄణాం భూతేంద్రియాణాంచ చేతనాచేతన ప్రవిభాగ లక్షణః ప్రాగ భిహితః సర్వచేతనాతాయాంచాసౌ నోపపద్యేత

విశేషమనఁగా భేదము- అనఁగా భోక్తలైన జీవులే చేతనులనియు భూమ్యాది భూతములు వాగాదీంద్రియములు అచేతనములనియు చేయఁబడిన భేద విభాగము (ఆయాశ్రుతులలో) మున్నే చెప్పఁబడియున్నది- సర్వపదార్థములు చేతనములేయని వాదించుపక్షములో, మున్నుచేయఁబడిన విభాగమున కాస్పద ముండదు.

(బి) చేతనములుగాఁ జెప్పఁబడిన యచేతనముల అభిమానదేవతలే యన్నం దుకు అనఁగా విశేషమునకు శ్రుతిప్రమాణములు.

అపిచ కౌషీతకినః ప్రాణసంవాదే కరణమాత్రాశంకావినివృత్తయే తదధిష్ఠా తృచేతనపరిగ్రహాయ దేవతాశబ్దేన విశింషంతి

కౌషీతకీశాఖవారు వారియుపనిషత్తులో ప్రాణాదీంద్రియములయొక్క కలహమును జెప్పినభాగమందు ఆ కలహించినది కేవలమింద్రియములేమోయని కలుగఁదగు పొరబాటును దీసివేయుటకుఁగాను ఆయాయింద్రియముల నభిమానించి యుండు చేతనవ్యక్తులే కలహించిన 'దేవత' లుగా స్పష్టముగా విశేషించి నిరూ పించియున్నది- అదియెట్లో చూడుఁడు.

'ఏతాహవై' ఇతి కౌ II 1 'ఏతాహవైదేవతా అహంశ్రేయసే వివదమానాః'

(ఏతాహవై దేవతాః=) ఈయింద్రియాధిష్ఠానదేవతలే (అహం శ్రేయసే=) తమతమ శ్రేష్ఠత్వమునకై (వివదమానాః=) కలహించుచు

'తావాఏతాస్సర్వా' ఇతిచ కౌ II-14 'తావాఏతాస్సర్వాదేవతాః ప్రాణేనిశ్శ్రేయ సంవిదిత్వా'

ఆ యింద్రియాధిష్ఠానదేవతలు (ప్రాణే=) ముఖ్యప్రాణమందు (నిశ్శ్రేయ సం=) శ్రేష్ఠత్వమును (విదిత్వా ) దెలిసికొనియుండెను. ఇట్టివేమతికొన్ని శ్రుతు లును గలవు.

(సి. సమస్త జడపదార్థములను అనుసరించి యభిమాన దేవతలుందురు ఇదియే అనుగతి.

అనుగతాశ్చ సర్వత్రాభిమానిన్య శ్చేతనా దేవతా మంత్రార్థవాదేతిహాస పురాణాదిభ్యో ఽవగమ్యంతే

(సర్వత్ర=) సమస్తమైనజడ (అచేతన) వస్తువులయందును (అనుగతాశ్చ=) అనుసరించి (అభిమానించి-అధిష్ఠించి) చేతనులగు దేవతలు ఉన్నట్టుగా మంత్రముల యందును, అర్థవాదముల (స్తుత్యాదివాక్యముల) యందును ఇతిహాసములయందును పురాణములు మొదలగువానియందును గన్పట్టుచున్నయది. చూడుఁడు.

(డి) అనుగతికి శ్రుతి ప్రమాణములు.

'అగ్నిర్వాగ్భూత్వా ' ఇత్యేవమాదికావశ్రుతిః కరణేష్వనుగ్రాహికా దేవతా అనుగతా దర్శయతి ఐత ఆ II. 4-2-4 'అగ్నిర్వాగ్భూత్వా ముఖం ప్రావిశత్'

'(అగ్నిః=) అగ్ని దేవుఁడు (వాగ్భూత్వా=) వాగింద్రియమై (ముఖం=) ముఖరంధ్రమును (ప్రావిశత్=) ప్రవేశించెను. ఈ మొదలగు శ్రుతులు (కరణేషు=) ఇంద్రియములయందు (అనుగ్రాహికాః) అనుగ్రహించినవగు— అనఁగా నధిష్ఠించిన వగు (దేవతాః=) దేవతలు (అనుగతాః=) ఆయా యచేతన వస్తువుల ననుసరించి యుండునవిగాఁ జెప్పుచున్నయవి.

ప్రాణసంవాద వాక్యశేషేచ

(ప్రాణ=) ఇంద్రియములకుఁ బ్రాణమునకుఁ బరస్పరము జరిగిన వివాదమునుగూర్చి చెప్పిన యుపనిషద్వాక్యాంతమందు

'తేహప్రాణాః ' ఛాం v-1-6 'తేహప్రాణాః ప్రజాపతిం పితరమేత్యోచుః'

'(తేహప్రాణాః=) ఆ యింద్రియములు' (పితరం=) తమ తండ్రియైన (ప్రజాపతిం=) చతుర్ముఖబ్రహ్మను (ఏత్య=) సమీపించి (ఊచుః=) ఇట్లు పలికినవి.

ఇతిశ్రైష్ఠ్య నిర్ధారణాయ ప్రజాపతిగమనం తద్వచనా చ్చైకైకోత్క్రమణే నాన్వయ వ్యతిరేకాభ్యాం ప్రాణే శ్రైష్ఠ్యప్రతిపత్తిః

ఇవ్విధమున నింద్రియములుఁ ప్రాణము తమలో , శ్రేష్ఠుఁడెవఁడో నిర్ధారణము చేసికొనుటకుఁ జతుర్ముఖ బ్రహ్మయొద్దకుఁబోవుటయు, ఆయనమాటచొప్పున వారిలోనేయొక యింద్రియమైనను దేహమునువిడిచి లేచిపోవుచో దేహముపోక నిల్చియుండునో, ప్రాణముపోవుచో దేహమునైతము పోవునోయను పరీక్షాసందర్భమునుబట్టి తమలోఁ బ్రాణమే శ్రేష్ఠతమమైనదని తెలిసికొనుటయు,

"తస్మైబలిహరణం" ఇతిచైవం జాతీయకోऽ స్మదాదిష్వివ వ్యవహారోऽ నుగమ్య మానోऽభి మానివ్యప దేశం ద్రఢయతి బృ VIII-1-13 "తస్మైబలిహరణం"

(తస్మై=) ఆప్రాణమునకు నింద్రియములు (బలిహరణం=) పన్నును జెల్లించుటయు అప్పటినుండియు నింద్రియములు ప్రాణమునకులోఁబడియుండుటయు నిట్టి వ్యవహార ప్రసంగమంతయుఁ (చేతనులై మనుష్యులమైన) మన యెండెట్లు జరుగుచున్నదో యట్లే యనుసరించి కల్పించుటయు (అభిమానివ్యపదేశం=) నా యింద్రియాదులయం దభిమానించియుండు దేవతలనుగూర్చియే చెప్పినట్లు దృఢ మగుచున్నది.

"తత్తేజఐక్షత" ఇత్యపి పరస్యా ఏవదేవతాయా అధిష్ఠాత్ర్యా స్స్వవికారే ష్వను గతాయా ఇయమీక్షా వ్యపదిశ్యతఇతి ద్రష్టవ్యం ఛాం VI-2-3 "త త్తేజఐక్షత"

'ఆ అగ్ని [ఐక్షత=] సంకల్పించెను' ఈ వాక్యములోఁ గన్పించు [చేత నులయందేయుండు] సంకల్పము [=ఈక్షా] సైతము [స్వవికారేషు=] తనవలన సృష్టికాఁబడిన భూతములయందు నధిష్ఠించి యనుసరించి యుండు పరదేవతను గూర్చియే చెప్పఁబడినదై నట్లు స్పష్టపడుచున్నది.

(3) రాఁబోవు 6 వ సూత్రమునకిది యవతారిక :- పై 4-5 సూత్రములలో పూర్వపక్షి చేసిన యాక్షేపణలకు రాఁబోవు 6 సూత్రముచే సిద్ధాంతి సమాధానము చెప్పుచున్నాడు.

తస్మాద్విలక్షణ మేవేదం బ్రహ్మణోజగ ద్విలక్షణత్వాచ్చనబ్రహ్మప్రకృతిక మిత్యా క్షిప్తే ప్రతివిధత్తే

కాబట్టి యీజగత్తు బ్రహ్మముకంటె విలక్షణమైనది (భిన్నమైనది); విలక్షణమైయుండుటనుబట్టియే యది (నబ్రహ్మప్రకృతికం=) బ్రహ్మమునుండి యేర్పడినదిగాదు అని పై రెండుసూత్రములచేత నాక్షేపమురాఁగా రాఁబోవు సూత్రములచేత నాయాక్షేపము ప్రతిఘటింపఁబడుచున్నది. (=సమాధానమీయఁ బడుచున్నది).

## ౬ సూ॥ దృ శ్య తే తు

ప॥ వి :- దృశ్యతే+తు

ప్రతిప- అ :- దృశ్యతే = కనుపించుచున్నది

తు = అట్లుకాదు.

సూ. తా:- (తు=) పై రెండుసూత్రములలోఁ బూర్వపక్షులగు తార్కి కులచేఁ జేయఁబడిన యాక్షేపములు సరియైనవికావు. ఎందుచేతననఁగా, (దృశ్యతే)

కారణముకంటె విలక్షణ (=భేద) మగు కార్యము పుట్టుటయగునది లోకమందు సాధారణముగాఁ గనుపించుచునే యున్నది- ఎట్లనఁగా చేతనులైన పురుషులనుండి యచేతనములైన నఖరోమాదులు అచేతనములైన గోమయాదులనుండి చేతనములైన వృశ్చికాదులు పుట్టుచున్నట్లు కనుపించుచున్నదిగదా!

భాష్యం భాష్యార్థము

[I] వైలక్షణ్య హేతువును బట్టి బ్రహ్మము జగత్కారణము గానేరదు అను పూర్వపక్షమునకు ఖండనము

(1) సూత్రము లోని 'తు' శబ్దము పూర్వ పక్షమును దోసి వేయుచున్నది

తుశబ్దః పక్షం వ్యావర్తయతి

సూత్రము లోని 'తు' అను శబ్దము (పక్షం =) పూర్వ పక్షమును (అనగా - చేతనము నుండి యచేతనము గలుగదు - అను విషయమును) దోసి వేయుచున్నది.

(2) కారణ కార్యములకు వైలక్షణ్యము (భేదము) ఉండగూడదను నియమము లేదు.

యదుక్తం విలక్షణత్వాన్నేదం జగత్బ్రహ్మ ప్రకృతికమితి నాయమేకాంతః;

బ్రహ్మముకంటె జగత్తు భిన్నమైనదిగా నుండుటవలన నిది (=ఈజగత్తు) బ్రహ్మమే ఉపాదాన (Material) కారణముగాఁగలదిగాదు- (యదుక్తం=) అని చెప్పఁబడు (అయం) (న+ఏకాంతః=) నియమము- అనఁగా తప్పనిసరిగా జరిగి తీరవలసిన దేయను సిద్ధాంత మెందును లేదు.

(3) కారణకార్యములకు వైలక్షణ్యముండునని చూపుటకు తేలికదృష్టాంతములు పురుషాదులనుండి నఖకేశాదులు గోమయాదులనుండి వృశ్చికాదులు.

దృశ్యతే హిలోకే చేతనత్వేన ప్రసిద్ధేభ్యః పురుషాదిభ్యో విలక్షణానాం కేశనఖాదీనా ముత్పత్తి రచేతనత్వేన ప్రసిద్ధేభ్యో గోమయాదిభ్యో వృశ్చికాదీనాం

చేతనులుగాఁ బ్రసిద్ధులై యుండు పురుషాదులనుండి వారికంటె భిన్నములైన (అచేతనములైన) గోళ్లు మొదలగువానియొక్క యుత్పత్తియు (పుట్టుకయు) అచేతనములుగాఁ బ్రసిద్ధములై యుండు పేడ మొదలగువానినుండి (వానికంటె భిన్నములై చేతనములైన) తేళ్ళు మొదలగు చేతనములయొక్క యుత్పత్తియు లోకములో సాధారణముగా) (దృశ్యతేహి=) జూడఁబడుటలేదా!

(4) పై సఁజూపిన దృష్టాంతములలో అచేతనభాగమునుండి అచేతనభాగమే పుట్టుచున్నట్టు చేతనమునుండి యచేతనము- అచేతనమునుండి చేతనము పుట్టుచున్నట్టులేదు- అనునాక్షేపము.

నన్వచేతనాన్యేవ పురుషాదిశరీరాణ్య చేతనానాం కేశనఖాదీనాం కారణాని అచేతనాన్యేవ వృశ్చికాది శరీరాణ్య చేతనానాం గోమయాదీనాం కార్యాణీతి

పై నఁదెలిపిన దృష్టాంతములలోఁ జేతనములనుండి యచేతనములు- అచేతనములనుండి చేతనములు పుట్టుచున్నవనుట కవకాశములేదు ఎందుచేననఁగా) అచేతనములైన వెంట్రుకలు- గోళ్ళు మొదలగువానిని బుట్టించునది చేతనములైన పురుషులుగారు- అచేతనములైన పురుషశరీరములనియును- అట్లె అచేతనములైన పేడ మొదలగువానివలనఁ బుట్టునవి. చేతనములైన తేళ్లు మదలగునవిగాదు మఱేమన తేళ్ళు మొదలగువానియొక్క (అచేతనములగు) శరీరములేయనియును, ఏలచెప్పఁగూడదు ? అని ప్రశ్నింతురేమో-

(5) పైనాక్షేపమునకు సమాధానములు

ఉచ్యతే

అందులకు సమాధానము చెప్పఁబడుచున్నది- వినుఁడు-

(ఎ) ఏదియెట్లైనను కార్యకారణవైలక్షణ్యము మాత్రము తప్పలేదు పురుషకేశనఖాదుల విషయములో కొంతయచేతనము చేతనమునకు శరీరముగా నిల్చియుండుట- మఱికొంతకార్యముగా మారుట-

ఏవమపికించిద చేతనం చేతనస్యాయతన భావముపగచ్ఛతి కించిన్నేత్య స్త్యేవవైలక్షణ్యం

(ఏవమపి=) అట్లయినప్పటికి అనఁగాఁ బైనఁదెలిపిన కారణకార్యములలో కారణములోని యచేతనభాగమే (పురుషశరీరము) కార్యమును (వెంట్రుకలు- గోళ్ళు) బుట్టించినదనుకొన్నను కారణకార్యములకు భేదములేకపోలేదు ఎట్లనఁగా, పురుషశరీరమందలి కొంతయచేతనము చేతనుఁడైన జీవునకు శరీరముగా నిల్చియున్నది; మఱికొంత యచేతనము (కార్యములైన) వెంట్రుకలు గోళ్ళుగామారి యందుఁ జేతనముతో నెట్టిసంబంధమును లేకుండగనే యున్నది- కారణమందలి యచేతనము చేతనమున కాధారముగా (శరీరముగా) నుండుట- కార్యమందలి యచేతనము, చేతనసంబంధము లేకుండ నచేతనముగానే యుండుట- ఇదియే కారణ కార్యములకున్న భేదము (=వైలక్షణ్యము).

(బి) దృష్టాంతములలోని కారణ కార్యములకు ఆకారరూపాదులయందు వైలక్షణ్యముండుట

మహాంశ్చాయం పారిణామికః స్వభావవిప్రకర్షః పురుషాదీనాం కేశనఖాదీనాంచ రూపాదిభేదాత్

కారణములైన పురుషాదులకును, కార్యములైన కేశనఖాదులకును (వెంట్రుకలు గోళ్ళు మొదలగువానికిని) ఆకారరూపము లు భిన్నములుగా నుండుటనుబట్టి, (పారిణామికః=) పరిణామము (కారణము కార్యముగా మారుట) వలన అనఁగా మార్పువలన స్వభావముగాఁ గలిగిన (విప్రకర్షః=) వైలక్షణ్యము (కారణ కార్య భేదము) గొప్పదేగాని కొద్దిదిగాదు)

తథాగో మయాదీనాం వృశ్చికాదీనాంచ

(కారణ కార్యములైన పురుష కేశాదుల మధ్యనెట్లో) అట్లే కారణకార్యములైన గోమయ వృశ్చికాదులమధ్య నైతము పైనఁ జూపఁబడిన వైలక్షణ్యము (=భేదము) గొప్పదిగానే యున్నది.

(6) కారణకార్యములకెట్టి వైలక్షణ్యమును లేనిచోఁ గార్యకారణ భావమే యుండదు.

అత్యంతసారూప్యేచ, ప్రకృతివికారభావ ఏవ ప్రవిలీయేత

కారణకార్యములమధ్య ఆకారరూపాదులయందు నెట్టిభేదమునులేక సమానత్వమే యున్నచోఁ, (ప్రకృతి=) ఒకటి కారణమనియు (వికార=) మఱియొకటి కార్యమనియుఁ జెప్పఁదగియుండుటయే (ప్రవిలీయేత=) పూర్తిగా నశించి పోవలసి యున్నది. (అనఁగా=) కారణకార్యభేద వ్యవహారమే యొత్తుగానుండదు.

(7) అచేతనమునుండి పుట్టిన యచేతనమునకు రూపాకారాదులయందు భేదమున్నను పార్థివత్వాది వస్తుస్వభావలక్షణ మొక్కటియే గదా- యను నాక్షేపము-

అథోచ్యేత, అస్తికశ్చిత్పార్థివత్వాది స్వభావః పురుషాదీనాం కేశనఖాదిష్వనువర్తమానో గోమయాదీనాంచ వృశ్చికాదిష్వితి

(కారణకార్యముల మధ్య ఆకారరూపాదుల విషయములో భేదమున్నను) కారణములైన పురుషాదుల యొక్కయు గోమయాదుల యొక్కయు పార్థివత్వాది స్వభావము (అనఁగా పృథివి మొదలగు వస్తు సంబంధమైన గుణము- (earthen-matter) వాని వాని కార్యములైన కేశనఖాదుల యందును, వృశ్చికాదుల యందును (అనువర్తమానః=) అనుసరించి వచ్చుచునే యున్నదిగదా యని పూర్వపక్షి (అథ+ఉచ్యేత=) ఎదుర్కొనవచ్చును.

(8) బ్రహ్మజగత్తులకు మాత్రము వైలక్షణ్య మెట్లున్నను సత్తాలక్షణము సామాన్యమేగదా- యని సమాధానము.

బ్రహ్మణో౽పి తర్హి సత్తాలక్షణః స్వభావ ఆకాశాదిష్వనువర్తమానో దృశ్యతే

(తర్హి=) అవును. అట్లే కారణమైన బ్రహ్మముయొక్క సత్తా (=ఉనికి యను) లక్షణమునైతము దాని కార్యమైన జగత్తునందును అనుసరించి వచ్చుచునే యున్నట్లు కనుపించుచున్నదిగదా (అని యేల చెప్పఁగూడదు.)

N. B. :- సత్తు - చిత్తు - ఆనందము అనునవి బ్రహ్మలక్షణములు- అందు మొదటి లక్షణము 'సత్తా' అనఁగా 'ఉండుట' యని చెప్పఁబడును. 'బ్రహ్మము ఉన్నది- జగత్తు ఉన్నది' అనువ్యవహారములో 'ఉండుట' యను బ్రహ్మమందున్న లక్షణము జగత్తునందు లేకపోలేదుగదా! కారణకార్యములైన బ్రహ్మజగత్తులకు ఆకారరూపాదులయందు భేదమున్నను 'సత్తా=ఉండుట' యను స్వభావ లక్షణము రెంటియందును సమానముగానే యున్నదిగదా! యని సిద్ధాంతభావము.

(9) కార్యకారణ వైలక్షణ్యముపై నాధారపడి పూర్వపక్షముసేయువారు వైలక్షణ్య హేతువేమియో చెప్పవలసియున్నది.

విలక్షణత్వేన చ కారణేన బ్రహ్మ ప్రకృతికత్వం జగతోదూషయతా

(విలక్షణత్వేనచ కారణేన=) వైలక్షణ్య (భేద) హేతువునుబట్టి జగత్తువస్తు రీత్యా (=ఉపాదాన కారణముద్వారా) బ్రహ్మమునుండి పుట్టినదిగాదని (దూషయతా=) దుర్వాదము చేయువారు.

(1) కిమశేషస్య బ్రహ్మస్వభావస్యా ననువర్తనం విలక్షణత్వ మభిప్రేయతే?

(1) బ్రహ్మమునకు జగత్తునకుఁ గన్పించు వైలక్షణ్యము (భేదము) బ్రహ్మ లక్షణము (=స్వభావము) పూర్తిగా జగత్తునందు లేకపోవుటచే నేర్పడినదని యభిప్రాయ పడుచున్నారా? లేక.

(2) ఉతయస్య కస్యచిత్?

(2) బ్రహ్మలక్షణములలో నేదోయొకటి యైనను జగత్తునందు లేకపోవుటచే (ఆ వైలక్షణ్యము) నేర్పడినదని యభిప్రాయ పడుచున్నారా? లేక

(3) అథచైతన్యస్య? ఇతి వక్తవ్యం

(3) బ్రహ్మలక్షణములలోఁ జైతన్యము మాత్రము జగత్తునందు లేకపోవుటచే నేర్పడినదని యభిప్రాయ పడుచున్నారా? వీనిలోనే హేతువునుబట్టి యట్లు వాదించుట కల్గినదో ముందుగాఁ జెప్పవలసియున్నది!

(౧) బ్రహ్మలక్షణములు పూర్తిగా జగత్తునందు లేకపోవుటయే వైలక్షణ్య హేతువన్నచో, పూర్తిగానున్నచో కారణకార్య ప్రసంగమే యుండదు.

ప్రథమే వికల్పే సమస్తప్రకృతి వికారభావోచ్ఛేద ప్రసంగః, నహ్యసత్యతిశయే, ప్రకృతి వికారభావ ఇతి భవతి

(1) మొదటిహేతువే (వికల్పము=alternative) సరియైనదని యెంచుచో అనఁగా బ్రహ్మలక్షణములు పూర్తిగా జగత్తునందు లేవని యెంచుచో, అనఁగా బ్రహ్మమున్నట్టె (అచ్చున గుద్దినట్లు) జగత్తు లేదని యెంచుచో లోకములో (ప్రకృతి వికార) కారణకార్య భావమును జెప్పుకొనుటయే సంభవింపదు. అనఁగాఁ బ్రకృతి (కారణము) యందుకంటె వికారము (కార్యము) నందు నేదోకొంత యతిశయము (=విశేషము) లేనప్పుడు, ఒకటికారణమనియు నొకటి కార్యమనియుఁ జెప్పుకొను టయే పొసఁగదు (అనఁగా రెండును నేవిధమైన హెచ్చుతగ్గులు లేకుండ నొకే తీరుననున్నప్పుడు ఒకటి కారణమని చెప్పుటయెట్లు! మఱియొకటి కార్యమని చెప్పుటయెట్లు! అదియె యిది- ఇదియే యదియని చెప్పవలసియుండును.

(బి) బ్రహ్మలక్షణములలో నొకటియైనను జగత్తునందు లేదన్నచో సత్తా లక్షణము ప్రత్యక్షముగా రెంటియందును సమానముగానే యున్నదిగదా-

ద్వితీయేచా సిద్ధత్వం దృశ్యతేహి సత్తాలక్షణో బ్రహ్మస్వభావ ఆకాశాది ష్వనువర్తమాన ఇత్యుక్తం

రెండవహేతువే సరియైనదని యెంచుచో, అనఁగా- బ్రహ్మలక్షణములలో నేదోయొకటి జగత్తునందు లేదనియెంచుచో, ఈయాక్షేపము కేవల ప్రత్యక్షవిషయ విరుద్ధము ఎందుచేననఁగా బ్రహ్మస్వభావమైన సత్తా (ఉండుట) లక్షణము బ్రహ్మమునుండి పుట్టిన యాకాశాది సమస్తభూతములయందును (ఉన్న యాకాశము- ఉన్నభూమి- ఉన్నజలము అను మొదలగువానియందు) అనుసరించి వచ్చుచున్నట్లు ప్రత్యక్షముగాఁ గనుపించుచున్నదిగదా అనువిషయ మిదివరకే వక్కాణింపఁబడియున్నది (గాన మఱల నిచ్చటఁజెప్పవలసిన పనిలేదు)

(సి) బ్రహ్మలక్షణములలో చైతన్యముమాత్రము జగత్తునందు లేదన్నచో, అందులకు దృష్టాంతమే లేదు.

తృతీయేతు దృష్టాంతాభావః

మూడవహేతువే సరియైనదని యెంచుచో, అనఁగా బ్రహ్మలక్షణములలోఁ జైతన్యముమాత్రము జగత్తునందు లేదనియెంచుచో, ఇందులకు సరియైన దృష్టాంతమే లేదు. [అనఁగా (యద్బ్రహ్మ ప్రకృతికం తచ్చిదన్వితమ్=) బ్రహ్మమునుండి పుట్టినదియెల్ల చైతన్యముతోఁగూడుకొన్నదేయై యుండవలెనను ప్రతిజ్ఞ దృష్టాంతముతోఁ జూపినఁగాని నమ్ముటకు వీలులేదు]

కింహియ చ్చైతన్యేనా నన్వితం తదబ్రహ్మ ప్రకృతికం దృష్టమితి బ్రహ్మకారణ
వాదినం ప్రత్యుదాహ్రియేత సమస్తస్యాస్య వస్తుజాతస్య బ్రహ్మ ప్రకృతికత్వా
భ్యుపగమాత్

చైతన్యముతోఁగూడియుండని దేదియో యదియెల్ల (అబ్రహ్మప్రకృతికం=) బ్రహ్మమునుండి పుట్టినదిగాదు అని నిశ్చయించుటకై బ్రహ్మకారణవాదుల (బ్రహ్మమే జగత్తునకెల్లను కారణమని చెప్పువారి) ముందెట్టిదృష్టాంతము పెట్టి నమ్మించఁగలరు! ఎందుచేననఁగా సమస్తవస్తుజాతముతోఁజేరిన యీజగత్తు బ్రహ్మమునుండియే పుట్టినదని బ్రహ్మకారణవాదులు (శ్రుతిప్రమాణములచే) గట్టిగా నమ్మియున్నారు.

(10) జగత్తునకు బ్రహ్మమే నిమిత్తోపాదానకారణములు రెండును నగునని శ్రుతితాత్పర్యమైనట్లు ఇదివరకే (బ్ర సూ I-4-23) మథించి తేల్చఁబడినది.

ఆగమవిరోధస్తు ప్రసిద్ధఏవ చేతనంబ్రహ్మ జగతఃకారణం ప్రకృతిశ్చేత్యాగమ
తాత్పర్యస్య ప్రసాధితత్వాత్

బ్రహ్మకారణ వాదమునకు వ్యతిరేకముగాఁ జెప్పునదియెల్లను శ్రుతులకు విరోధమని (ప్రసిద్ధఏవ) తేటతెల్లముగాఁ దేలినవిషయమే- ఎట్లనఁగా చేతనమైన బ్రహ్మమే జగత్తునకు (కారణం=) నిమిత్తకారణమనియును (ప్రకృతిశ్చ=) ఉపాదానకారణము సైతమనియును జెప్పుటయే (ఆగమ=) శ్రుతులయొక్క తాత్పర్యమైనట్లు (ప్రసాధితత్వాత్=) ఇదివరకే మథించి నిశ్చయింపఁబడిన విషయమై యున్నది-

(బ్ర సూ I-4-23 సూత్రముపై భాష్యమును జూడుఁడు)

II 'బ్రహ్మముపరి నిష్పన్నము (సిద్ధవస్తువు) గాన బ్రహ్మవిజ్ఞానమునకు ప్రమాణాంతరములే యుపయోగించును. అను పూర్వపక్షముపై ఖండనము

యత్తూక్తం పరినిష్పన్నత్వాత్ బ్రహ్మణి ప్రమాణాంతరాణి సంభవేయురితి తదపి
మనోరథ మాత్రం

బ్రహ్మము (ఎట్టిచేఁతతో నవసరములేకముందే) (పరినిష్పన్న=) సంసిద్ధమై యున్న వస్తువైయుండుటవలన, (ప్రమాణాంతరాణి=) ప్రత్యక్షానుమాన ప్రమాణాంతరములచే (శ్రుతులతో నవసరములేకయే) (సంభవేయుః=) గ్రహింపఁబడుట కవకాశమున్నది యని తలంచుట (మనోరథమాత్రం=) కేవలభ్రాంతియే

(1) బ్రహ్మమాకార రూపములు లేనిది గావున, ప్రత్యక్ష ప్రమాణము నిష్ప్రయోజనము.

రూపాద్యభావాద్ధినాయ మర్థః ప్రత్యక్షగోచరః

ఆకారరూపములు లేనిదియగుటచే బ్రహ్మము (ప్రత్యక్ష ప్రమాణ గోచరము=) ఇంద్రియ గోచరముగాదు

(2) పర్వతాగ్నినుండి వెలువడు ధూమమువంటి లింగమేదియు బ్రహ్మమునకు లేదుగావున, అనుమాన ప్రమాణమునైతము నిష్ప్రయోజనము.

లింగాద్య భావాచ్చ నానుమానాదినాం

(లింగాది=) అగ్నికిలింగము (గుర్తు) ధూమమువలెనే బ్రహ్మమునకు లింగమేదియు లేనందున అది (బ్రహ్మము) యనుమానాది ప్రమాణములకు గోచరముగాదు.

(3) వైదిక ధర్మమువలె బ్రహ్మము నైతము శ్రుతి ప్రమాణములచేతఁ దెలియఁబడ వలసినది.

ఆగమమాత్ర సమధిగమ్య ఏవత్వయ మర్థోధర్మవత్

వైదికధర్మమెట్లు శ్రుతులవలన మాత్రమే తెలిసికొనఁబడఁ దగియున్నదో యట్లే (అయమర్థః=) బ్రహ్మమొకటి యున్నదను నీవిషయము నైతము శ్రుతుల వలన మాత్రమే తెలిసికొనఁబడఁ దగియున్నది.

(4) ఈ విషయమందు అనఁగా బ్రహ్మవిజ్ఞానమునకు తర్కాది యుక్తులు నిష్ప్రయోజనములు- అను విషయమునకు శ్రుతిప్రమాణములు గలవు.

తథాచ శ్రుతిః "నైషాతర్కేణ " ఇతి

శ్రుతియు నట్లే ఘోషించుచున్నది- చూడుఁడు !

కఠ I-2-9 'నైషాతర్కేణ మతిరాపనేయా ప్రోక్తాన్యే నైవసుజ్ఞానాయ ప్రేష్ఠ'

(ప్రేష్ఠ=) ఓ ప్రియుఁడవగు నచికేతుఁడా! (ఏషామతిః=) ఈ జ్ఞానబుద్ధి (తర్కేణ=) కేవల యుక్తులచేత (న+ఆపనేయా=) పొందఁబడునది గాదు- (అన్యేన+ఏవ=) శ్రుతిసహాయము చేతనే (సుజ్ఞానాయ=) మంచిజ్ఞానము కొఱకు (ప్రోక్తా=) బోధింపఁబడినది'

ఋ. సం I-30-6 'కోఅద్ధావేద? క ఇహ ప్రవోచత్? ఇయంవిసృష్టి ర్యత ఆబభూవ'

'(కః=) ఎవఁడు (అద్ధా=) ప్రత్యక్షముగా (వేద=) ఎఱుఁగఁగలఁడు? (కః=) ఎవఁడు (ఇహ=) ఈ లోకములో (ప్రవోచత్=) చెప్పఁగలఁడు? (యతః=) ఎవని నుండి (ఇయంవిసృష్టిః=) ఈవిధమగు సృష్టి అనఁగా జగత్తు (ఆబభూవ=) అంతటను వ్యాపించియున్నది?

ఇతిచైతే ఋచౌ సిద్ధానా మపీశ్వరాణాం దుర్బోధతాం జగత్కారణస్య దర్శయతః

[ఏతేఋచౌః=] ఈపై రెండు మంత్రములు- [సిద్ధానాం=] మహామహిమలు గల [ఈశ్వరాణాం+అపి=] దేవతలవంటివారికి సైతము [జగత్కారణస్య=] ఈజగత్తు ఎవనినుండి కలిగెనో యీ విషయముయొక్క [దుర్బోధతాం=] దుర్బోధతను [=తెలిసికొనఁబడఁజాలక పోవుటను] [దర్శయతః=] చూపించుచున్నయవి-

(బి) అందులకు స్మృతిప్రమాణములు సైతము గలవు. చూడుఁడు-

స్మృతిరపి భవతి. "అచింత్యాః "

ఈ విషయమును బ్రదర్శించు స్మృతులుసైతము గలవు. పరికింపుఁడు-

'అచింత్యాఃఖలుయేభావా నతాంస్తర్కేణయోజయేత్ ప్రకృతిభ్యః పరంయచ్చ తదచింత్యస్య లక్షణమ్'

(యేభావాః=) ఏవస్తువులు (అచింత్యాః=) చింతింపఁజాలనివో (తాం=) వానిని (తర్కేణ=) యుక్తులచేత (నయోజయేత్ ఖలు=) సమన్వయింపరాదుగదా! (ప్రకృతిభ్యః=) ప్రత్యక్షముగాఁ గనుపడువానికంటె (పరం=) విలక్షణమేదియో (తత్=) అదియే [అచింత్యస్యలక్షణమ్=] చింతింపఁజాలనిదానికి గుఱుతు-

'అవ్యక్తోఽయ' భగీ II-25 'అవ్యక్తోఽయమచింత్యోఽయ
నమేవిదుస్సురగణాః' అవికార్యోఽయముచ్యతే

తే॥ గీ॥ చక్షురాదులకెందుఁ గోచరముగాదు
బుద్ధికందదే వికృతియుఁ బొందఁబోదు

[నా యాంధ్రభగవద్గీత]

ఇతిచైవం జాతీయకా భగ X-2 'నమేవిదుస్సురగణాః ప్రభవం నమహర్షయః అహమాదిర్హి దేవానాం మహర్షీణాంచ సర్వశః'

తే॥ గీ॥ మత్ప్రభావం బెఱుఁగరు బ్రహ్మమొదలైన
యమరగణము, భృగ్వాది మహర్షిగణము;
తాపసగణంబునకు దేవతాగణంబు
నకును నేన యెందును గారణంబుపార్థ!

(నా యాంధ్ర భగవద్గీత)

ఇట్టివే మఱికొన్నియును గలవు.

III బ్రహ్మవిజ్ఞానమునకు తర్కాదియుక్తు లుపకరించునని పూర్వపక్షి చూపిన యాశ్రిందిప్రమాణము [బృ IV-4-5] నిరర్థకము.

యదపిశ్రవణ వ్యతిరేకేణ మననం విదధచ్ఛబ్ద ఏవ తర్కమప్యాదర్తవ్యం
దర్శయతీత్యుక్తం బృ IV-4-5 'శ్రోతవ్యోమంతవ్యో నిదిధ్యాసితవ్యః'

బ్రహ్మమునుగూర్చి వినవలసినది, యుక్తిచేతఁ జింతింపవలసినది, నిదిధ్యాసము చేయవలసినది. ఈపై మొదలగు శ్రుతులుసైతము బ్రహ్మమును శ్రుతులద్వారా వినుటయేగాక యందులకు భిన్నముగా (మననం=) విచారణచేయవలసినది- అని చెప్పుటమూలమున 'తర్కము (యుక్తి) కూడ నాదరింపఁబడవలసినదే' యని శ్రుతులే యొప్పుకొన్నట్టు పూర్వపక్షులు చెప్పుచున్నారు (ఇదిసరిగాదు).

(1) శుష్కతర్కముచేత బ్రహ్మవిజ్ఞానము గల్గుననియా శ్రుతిభావముగాదు.

నానేనమిషేణ శుష్కతర్కస్యాత్రాత్మలాభ స్సంభవతి

(అనేనమిషేణ=) ఈమిషనే యాధారముచేసికొన్నట్లయిన, శుష్కతర్కము (శ్రుతిపోషణములేని కేవల యుక్తివాదము) న కెప్పుడును ఆత్మలాభము గలుగ నేరదు (అనఁగా శ్రుతిభావ వ్యతిరేకములైన కేవలయుక్తులచేత ఆత్మవిజ్ఞానము గలుగనేరదు- బ్రహ్మము తెలిసికొనఁబడఁజాలదు)

(2) శ్రుత్యర్థమున కనుకూలించు యుక్తిమాత్రమే బ్రహ్మవిజ్ఞానమున కుపకరింపఁగలదని యాశ్రుతిభావము.

శ్రుత్యనుగ్రహత ఏవహ్యత్ర తర్కోఽనుభవాంగత్వేనా శ్రీయతే

(అత్ర=) పై శ్రుతియొక్క భావమేమనఁగా :- (శ్రుత్యనుగృహీతః=) శ్రుతిచేతననుగ్రహింపఁబడిన- అనఁగా:- శ్రుతిసహాకారముగాఁగల- అనఁగా శ్రుతికి వ్యతిరేకముగాని (తర్కః) యుక్తిమాత్రమే (అనుభవాంగత్వేన=) అనుభవజ్ఞానమునకంగముగా (ఆశ్రీయతే=) ఆశ్రయింపఁబడుచున్నది (=అంగీకరింపఁబడుచున్నది)- (అనుభవజ్ఞానమే యుపనిషదర్థము- ఉపనిషదర్థమును గ్రహింపఁజేయు యుక్తులపై నాధారపడవచ్చును గాని యందులకు విరుద్ధమైన యుక్తులెప్పుడును నాదరణీయములుగావు- ఆత్మజ్ఞానమునకు నిష్ప్రయోజనములు- అని పై శ్రుతి యొక్క యభిప్రాయముసుమా).

(3) శ్రుత్యర్థమున కనుకూలించు యుక్తులెట్టివో యుదాహరణములు.

స్వప్నాంతబుద్ధాంతయో రుభయో రితరేతర వ్యభిచారాదాత్మనో ఽనన్వాగతత్వం;

(శ్రుతిపోషణముగల యుక్తివాదమెట్టిదియో మచ్చునకుదాహరింపఁబడును జూడుఁడు) జీవునకుఁగలవని చెప్పఁబడు (స్వప్నాంత=) స్వప్నావస్థయు, (బుద్ధాంత=) జాగ్రదవస్థయు నొకటియున్నప్పుడు మఱియొకటి గన్పింపదుగావున, ఆరెండవస్థలును (ఆత్మనః=) ఆత్మను (అనన్వాగతత్వం=) అంటివచ్చునవిగావు- అనఁగా:- ఆత్మకుస్వభావమున జాగ్రత్స్వప్నావస్థలతో నెట్టిసంబంధమును లేదు. (ఇది శ్రుత్యర్థమనియే యెఱుంగునది).

సంప్రసాదేచ ప్రపంచత్యాగేన సదాత్మనాసంపత్తే ర్నిష్ప్రపంచ సదాత్మకత్వం

జీవుఁడు (సంప్రసాదేచ=) సుషుప్త్యవస్థయందు అనఁగా గాఢనిద్రావస్థ యందు (ప్రపంచత్యాగేన=) సర్వప్రపంచవాసనను వదలుటమూలముగా (సదాత్మనా=) సర్వదా సత్యమునకొక్కటియేయైయుండు నాత్మతో (సంపత్తేః=) నేకమైపోయినట్టు కన్పించుటవలన, వాస్తవమున ఆ జీవుడు (నిష్ప్రపంచ=) ప్రపంచసంబంధములేని (సదాత్మకత్వం=) సత్స్వరూపమైన యాత్మయేయై యున్నాడు (ఇదియే శ్రుత్యర్థము)

ప్రపంచస్యచ బ్రహ్మప్రభవత్వాత్ కార్యకారణానన్యత్వన్యాయేన బ్రహ్మావ్యతిరేకః ఇత్యేవం జాతీయకః

ఈప్రపంచము బ్రహ్మము (ఈశ్వరుని) నుండి కల్గినదిగావున కార్యమును గారణమును స్వభావమున (అనన్యత్వన్యాయేన=) అభిన్నములేయైయుండునను న్యాయానుసారముగా [బ్రహ్మావ్యతిరేకః=] ప్రపంచమును [కార్యమును] బ్రహ్మమును [కారణమును] వాస్తవమున నొక్కటియేయైయున్నవిగాని [యద్విషయమందును] వేరువేరుగావు [ఇదియే శ్రుత్యర్థమనియెఱుంగునది] శ్రుత్యనుకూలమైన తర్క [=యుక్తి] వాదమిత్తెఱఁగుననే యుండును.

(బ్రహ్మము చేతనము- జగత్తు అచేతనముగావున జగత్తు బ్రహ్మమునుండి పుట్టినదిగాదు- ఇట్లనునదియే శుష్కతర్కవాదమని చెప్పఁబడును).

'తర్కాప్రతిష్ఠానాదితిచ కేవలస్య తర్కస్య విప్రలంభకత్వం దర్శయిష్యతి'

ముందురాఁబోవు 'తర్కాప్రతిష్ఠానాత్' (బ్ర సూ II-1-11) అను సూత్రమునందు 'కేవల తర్కము (విప్రలంభకత్వం=) నమ్మియుండఁదగినదికాదు అను విషయము స్థాపింపఁబడును.

IV సృష్టియొక్క చేతనాచేతన విభాగమునుజూపు శ్రుతియే (తై II-6) గలదన్న పూర్వపక్షముపై ఖండనము.

(1) బ్రహ్మము సర్వజగత్కారణమని చెప్పు శ్రుతిప్రమాణమును విశ్వసించినవాడు ఆశ్రుతియెచెప్పిన విజ్ఞానావిజ్ఞాన విభాగము విభావనావిభావన విభాగమేయని శ్రుతిభావమైనట్లు సులభముగా గ్రహింపఁగలఁడు.

యోపిచేతనకారణ శ్రవణబలేనైవ సమస్తస్య జగతశ్చేతనతా ముత్ప్రేక్షతే

చేతనమైన బ్రహ్మమే జగత్తునకుఁ గర్తయని యుద్ఘాటించు (=గట్టిగాఁ జెప్పు) (శ్రవణబలేనైవ=) శ్రుతులనుమాత్రమే (తై II 6) మొదలగునవి యాధారపఱచుకొని 'ఈసమస్త ప్రపంచముసైతము (దానిని గల్గించిన బ్రహ్మమువలెనే) చేతనమే' యని యెవఁడంగీకరించి విశ్వసించునో (=ఉత్ప్రేక్షతే) వానికి మాత్రమే.

తస్యాపి 'విజ్ఞానంచా విజ్ఞానంచ' ఇతిచేతనాచేతవిభాగ శ్రవణం తై II-6 'విజ్ఞానంచా విజ్ఞానంచ........అభవత్'

ఆ 'సత్' అను వస్తువే (=బ్రహ్మమే) (=విజ్ఞానంచ) చేతనమును (అవిజ్ఞానంచ=) అచేతనమును ఆయెను. (చేతనాచేతన విభాగశ్రవణం=) 'సృష్టిలోఁ గొంత చేతనము- కొంతయచేతనము' అని శ్రుతిచేతఁ జేయఁబడిన విభాగము- (చైతన్యస్య=) (సృష్టికర్తయైన) చేతనపదార్థమొకటియే.

విభావనా విభావనాభ్యాం చైతన్యస్య శక్యత ఏవ యోజయితుం

[విభావనా విభావనాభ్యాం= ] తెలిసికొనఁబడుట [manifertation]- తెలిసికొనఁబడకపోవుట [non manifertation] అను హేతువులచేత అట్లుకొంత చేతనముగాను- కొంత అచేతనముగాను- కనుపించుట సంభవించినట్లు తెలుపుటయే యా శ్రుతిభావమైనట్లు [యోజయితుం=] సరిపుచ్చుకొనుటకు [=కూర్చుకొనుటకు]- [శక్యతఏవ] సాధ్యమగుచున్నది [సమస్త ప్రపంచము- అనఁగా చేతనాచేతనములుగాఁ గనుపించు సమస్తజగత్తు సత్పదార్థము వల్లనే యేర్పడినదని చెప్పిన శ్రుతియే- 'కొంతచేతనము- కొంత యచేతనముగా నైనదనికూడ చెప్పుచున్నందున మొదటిభాగమును నమ్మినవాడు పైనఁదెలిపిన చొప్పున రెండవభాగమును సైతము నమ్ముటకు శక్యముగానే యుండును.

[2] జగత్కారణమా శ్రుతి చెప్పినచొప్పునఁగాక మఱియొక విధముగా స్వతంత్రుఁడై కల్పించువానికా శ్రుతిభావమట్లు తెలియఁగలదు, ఎందుచేననఁగా- జగత్తుసృష్టించిన బ్రహ్మను సృష్టికిఁ బూర్వమూ జగత్స్వరూపముతో నున్నట్లా శ్రుతియే చెప్పుచున్నది.

పరస్యైవత్వ్రదమపి విభాగశ్రవణం న యుజ్యతే

(పరస్యైవతు=) శ్రుతిచెప్పినచొప్పునఁగాక అనఁగా చేతనమైన బ్రహ్మమే జగత్కారణమని గాక మఱియొకవిధముగా స్థాపించువాడు (అనఁగా:- అచేతనమైన ప్రధానమే జగత్కారణమని వాదించు సాంఖ్యుఁడు) సృష్టియందలి చేతనాచేతన విభాగమును జెప్పు శ్రుతియొక్క యర్థమును (నయుజ్యతే=) సమర్థింపఁజాలఁడు (ఈ వాక్యమునకు మఱియొకవిధమునఁగూడ నర్థముచేయవచ్చును. అదెట్లన) (ఇదమపివిభాగశ్రవణం=) ఈచేతనాచేతన విభాగమున్నట్లుగా శ్రుతిచెప్పుట (జగత్తునకే యన్వయించునుగాని) (పరస్యైవతు=) పరబ్రహ్మమునకన్ననో (నయుజ్యతే=) సరిపోదు,

కథం ?

ఎందుచేనంటురేమో !

పరమకారణస్య హ్యాత్రి సమస్త జగదాత్మనా సమవస్థానం శ్రావ్యతే 'విజ్ఞానంచా విజ్ఞానంచాభవత్' ఇతి తై II 6

జగత్కారణము చేతనమును- అచేతనమును ఆయెను అను శ్రుతివలన జగత్తుయొక్క- పరమ (=మొదటి) కారణమైన చేతనబ్రహ్మమే సర్వ (చేతనా చేతన) జగత్స్వరూపముతో (సమవస్థానం=) నున్నట్లుగా స్పష్టమగుచున్నది. (అనఁగా :- శ్రుతి చేతనబ్రహ్మమే సర్వజగత్కారణమని చెప్పుచు, వెంటనే చేతనముగానుండు జగద్భాగము; అచేతనముగానుండు జగద్భాగము రెండును నదియే (బ్రహ్మమే) యైనదని స్పష్టపరచినప్పుడు, ఈశ్రుతిని దనవాదమున కను కూలముగా సాంఖ్యుఁడెవ్విధముననేని సమర్థించుకొనఁజాలఁడు)

V సృష్టియందలి చేతనాచేతన విభాగమునుబట్టి చేతనబ్రహ్మము జగత్కార ణము కాఁజాలనట్లె అచేతన ప్రధానాదులునైతము జగత్కారణము కాఁజాలవుగదా!

తత్రయథాచేతనస్యాచేతన భావో నోపపద్యతే విలక్షణత్వాత్ ఏవమచేతనస్యాపి చేతనభావో నోపపద్యతే

(తత=) అచేతనమైన ప్రధానమే జగత్కారణమనిచెప్పు విషయమందు శ్రుతిచెప్పిన చేతనాచేతన విభాగము సరిపెట్టఁబడఁజాలదు- ఎందుచేతననఁగా :- (విలక్షణత్వాత్=) బ్రహ్మముకంటె జగత్తు విలక్షణముగానుండు హేతువునుబట్టి సాంఖ్యుని వాదానుసారము (చేతనస్య=) చేతనమైనబ్రహ్మము (అచేతనభావః+ నోపపద్యతే=) అచేతనమైన జగత్తు ఎట్లుకాఁజాలదో, (ఏవం=) అట్లే (అచేత నస్య=) అచేతనమైన ప్రధానమునైతము (చేతనభావః+నోపపద్యతే=) చేతన భాగమైన జగత్తు కాఁజాలదుగదా!

VI వైలక్షణ్య హేతువు పూర్తిగా ఖండింపఁబడినందున శ్రుతిచెప్పినట్లు చేతనబ్రహ్మమే జగత్కారణమైనట్లు నమ్మితీరవలసినదే-

ప్రత్యుక్తత్వాత్తు విలక్షణత్వస్య యథాశ్రుత్యైవచేతనం కారణంగ్రహితవ్యం భవతి

(విలక్షణత్వస్య=) కారణమందుకంటె కార్యమందుండు వైలక్షణ్య (భేద) హేతువు (ప్రత్యుక్తత్వాత్తు=) ఖండింపఁబడియుండుటవలన (యథాశ్రుత్యైవ=) శ్రుతి యెట్లుచెప్పినదో యట్లే- యనఁగా (చేతనం కారణం=) చేతనమైన బ్రహ్మమే జగత్కారణమగునను విషయము (గ్రహీతవ్యంభవతి) అంగీకరింపఁబడవలసినదగు చున్నది.

7 సూత్రావతారిక :- బ్రహ్మజగత్కారణ వాదముపై యీయధికరణ ములోని మొదటి రెండు (సూ 4-5) సూత్రములలోఁ జేయఁబడిన యాక్షేపణములు

సూ 6 చే ఖండింపబడినవి- మఱియు నొకక్రొత్త యాక్షేపణము దానిపై ఖండన మీయేడవ సూత్రమందుఁ బ్రదర్శింపఁబడుచున్నవి-

## 8 సూ॥ అసదితిచేన్న ప్రతిషేధ మాత్రత్వాత్

ప॥ వి :- అసత్-ఇతి-చేత్-న-ప్రతిషేధమాత్రత్వాత్.

ప్ర. ప. అ :- అసత్=లేనిది- అభావము; ఇతిచేత్=అన్నట్లయిన; న=కాదు; ప్రతిషేధమాత్రత్వాత్=లేదనిచెప్పుటమాత్రమువలన,

సూ॥ తా॥ పూర్వపక్ష భాగము- (అసత్+ఇతి+చేత్)

(అసత్+ఇతి+చేత్) కార్యము పుట్టుటకుఁ బూర్వమది (అసత్=) లేనిదే యని యన్నచో అనఁగా 'అసత్' గానే యున్నదన్నచో (సిద్ధాంతభాగము).

(న=) అట్లుగాదు అనఁగా; కార్యము పూర్వము లేనిదేయని సిద్ధాంతులనరు (ప్రతిషేధమాత్రత్వాత్=) సిద్ధాంతులేమందురనఁగా :- కార్యరూపము (ప్రతిషేధము=) లోగడలేనిదియనిమాత్రమందురు అనఁగా కార్యరూపము మిథ్యయని యందురు. అనఁగా :- 'సత్' అను పదార్థమే కార్య (జగత్)రూపముగానున్నది గాని- కార్యరూపముగాఁ గనుపించురూపము ప్రతిషేధమని మాత్రము చెప్పఁబడును. (=కాదు) ఇట్టిదానిని వివర్తవాదమందురు. ఇదిగాక ఆరంభవాదము- పరిణామవాదము- అని మఱిరెండువాదములు గలవు. ఈమూటిని ఉదాహరణము లతోఁ జూపఁబడును చూడుఁడు

(1) ఇది యద్వైతులుపయోగించు వివర్త వాదము.

(1) వెన్న పాలరూపముగానే యున్నది. క్రొత్తగావచ్చినదనుకొను రూపము లేనిదే (=ప్రతిషేధమే)- అనఁగా పాలేవెన్నగా వివర్తమైనది వెన్నఁగాఁ గనుపించుటమాత్రమగుచున్నది- ఈకనుపించుట వాస్తవమైనదిగాదు.

(2) ఇది నైయాయికులుపయోగించు ఆరంభవాదము.

(2) పాలలోఁ బూర్వము లేని వెన్న చిలుకుట చేత నారంభమైనది.

(3) ఇది సాంఖ్యులుపయోగించు పరిణామవాదము.

(3) పాలలోనున్న వెన్న యభివ్యక్తమైనది. అనఁగా పరిణామమైనది.

భాష్యము భాష్యార్థము

I పూర్వపక్షము:- 'సత్' (=ఉన్నది) అనిచెప్పఁబడు జగత్తు- పుట్టుక పూర్వము అసత్=(లేనిది) అనిచెప్పఁబడవలసినదే యగునుగదా!

యదిచేతనం శుద్ధం శబ్దాదిహీనంచ బ్రహ్మ తద్విపరీత స్యాచేతనస్యాశుద్ధస్య
శబ్దాదిమతశ్చ కార్యస్య కారణమిష్యేత

కారణమైన బ్రహ్మము చేతనమును శుద్ధమును, శబ్దాదిగుణములు లేనిదియు, అందులకు విరుద్ధముగా కార్యమైన జగత్తు అచేతనమును అశుద్ధమును శబ్దాదిగుణములుగలదియు నని యంగీకరించు పక్షమందు,

'అసత్తర్హి కార్యంప్రాగుత్పత్తేరితిప్రసజ్యేత అనిష్టంచైత త్సత్కార్య వాదినస్తవేతిచేత్

కార్యమైనట్టిజగత్తు పుట్టకపూర్వము 'అసత్' (= సత్' అనఁగా నున్నదియు, 'అసత్' అనఁగా లేనిదియు)- అనఁగా లేనిదే యని ('అభావ' మే యని) ప్రాప్తించునుగదా! (పుట్టకపూర్వ మాకార్యము కారణరూపముగానున్నదన్నచో, కార్యకారణములు పరస్పర విరుద్ధలక్షణముగలవని పైనఁ జూపఁబడినందున, కార్యము పూర్వము కారణరూపముగా నున్నదని చెప్పుట యుక్తియుక్తముగాదని భావము)- కార్యము పుట్టకపూర్వము (అసత్ =) లేనిదియే యగుచో, (ఏతత్ =) ఈవిషయము సత్కార్యవాదివైన నీకు (అనఁగా :- అద్వైతసిద్ధాంతికి) ఇష్టముగానిదియేసుమా; (=అంగీకారము లేనిదియేసుమా) అని పూర్వపక్షి యాక్షేపించినట్లయిన- (సత్కార్యవాదియనఁగా- ఉన్నకార్యమేయని- అనఁగా కార్యముపుట్టకపూర్వము సైతమున్నదియేయని- వాదించువాడు- ఇట్టివాడద్వైతియే)

II సమాధానము 'సత్ (=ఉన్నజగత్తు)' పుట్టకపూర్వము 'అసత్ (=సత్తుగానిది=లేనిది) అని చెప్పఁబడదు. ప్రతిషేధమాత్రము (=కాదు) అనఁగా 'అసత్తుగాదు అనిమాత్రమగును.

నైషదోషః ప్రతిషేధమాత్రత్వాత్ ప్రతిషేధమాత్రంహీదం;

సిద్ధాంతిచెప్పుచున్న సమాధానమేమనఁగా := (న ) పూర్వపక్షిచేసిన దోషారోపణము చెల్లఁదగినదిగాదు- (అనఁగా:- మేము- సిద్ధాంతులము- ముందుగాని తరువాతగాని యెప్పుడైనను నొకప్పుడు 'సత్' అనునది 'అసత్' గా నున్నదని చెప్పము- సృష్టికిఁబూర్వము 'సత్ (=జగత్తు) అసత్తు' గానున్నదని చెప్పుచున్నప్పుడుగదా మాసత్కార్యవాదమునకు దోషముగలుగుట- మావాదాను సారము 'కారణముగనున్నప్పుడును సత్తే-కార్యరూప మేర్పడినదన్నప్పుడును సత్తే- ఎప్పుడును 'సత్తు' కంటె నన్యమైనదిలేదు' అని చెప్పుదుము- (ప్రతిషేధమాత్రత్వాత్ =) మేము 'కాదు' అని మాత్రమే చెప్పుదుము- అనఁగా:- మావాదానుసారము (ఇదం=) ఈజగత్తు ప్రతిషేధము (=న=కాదు) మాత్రమే- [కాని 'అసత్' (న+సత్) =సత్ కానిదియని యెప్పుడును జెప్పము]

(బృ IV-4-2 లో 'నేతిహోవాచ= 'న' అనిపల్కెను అని యున్నది- ఈ 'న' అను దానిచేతఁ బ్రతిషేధింపఁబడినది జగత్తు)

నాస్య ప్రతిషేధస్య ప్రతిషేధ్యమస్తి

(అస్యప్రతిషేధస్య=) ఈప్రతిషేధముచేత అనఁగా ఈ (ప్రతిషేధము=న=) 'కాదు' అనుదానిచేత (ప్రతిషేధ్యమ్=) త్రోసివేయఁబడునది యేదియు (=object=విషయము) (న+అస్తి) లేదు (అనఁగా.— 'అసత్' అనుమాటను (న+సత్) గా విడఁదీసి దీనికి 'సత్తుగానిది' యని యర్థముచెప్పుచో, కానిది యని యర్థమిచ్చు 'న' అనుదానివలన 'సత్తు' త్రోసివేయఁబడుచున్నది- 'అసత్' అను మొత్తపుసమాసమునకు (న=) కాదు- అని యర్థముచెప్పుచో, దీనివలనఁ ద్రోసివేయఁబడునది యేదియునులేదు = ఇప్పుడును సత్తేపుట్టకపూర్వమును సత్తే =అసత్తుకానిదియే=సత్తు)

నహ్యయంప్రతిషేధః ప్రాగుత్పత్తేః సత్త్వంకార్యస్య ప్రతిషేద్ధుం శక్నోతి

(అయంప్రతిషేధః=) ఈ 'కాదు' అనునది (ప్రాగుత్పత్తేః=) పుట్టకపూర్వము (కార్యస్యసత్త్వం=) కార్యమునకుఁగల యునికిని (ప్రతిషేద్ధుం=) లేదనిత్రోసి వేయుటకు (నహిశక్నోతి=) సమర్థమైనదిగాదు- [అనఁగా:— కార్యమైన జగద్విష యములో నుపయోగింపఁబడిన 'అసత్' అను సమాసమునకు 'సత్తుగానిది' యని యర్థముచెప్పకుండఁ గేవలము 'కాదు' అని మాత్రమర్థముచెప్పుచో- కార్యమైన జగత్తు పుట్టకపూర్వము లేదు— అనిభావమేర్పడదు)

కథం

అదెట్లు ? అని యడుగుదురేమో !

యథైవహీదానీమిదం కార్యంకారణాత్మనాత్మవత్ ఏవంప్రాగుత్పత్తేరపీతిగమ్యతే

(ఇదంకార్యం=) ఈకార్యస్వరూపమైన జగత్తు (ఇదానీం=) ఇప్పుడు (కారణాత్మనా=) కారణమైన బ్రహ్మస్వరూపమేయై (యథైవ+ఆత్మవత్) (=సత్) ఎవ్విధముననున్నదో (ఏవం=) ఇవ్విధముననే (ప్రాగుత్పత్తేరపి=) పుట్టకపూర్వము సైతము (ఇతి=) ఉన్నదని (గమ్యతే=) తెలియఁబడుచున్నది (అనఁగా కార్యమైన 'కుండ' కుండఁగానున్నప్పుడు కారణమైన 'మట్టి' స్వరూపమై యెట్లున్నదో కుండగాక పూర్వము సైతము 'మట్టి' స్వరూపమే యైయున్నదనుట నిశ్చయము- అనఁగా కారణకార్యావస్థల రెంటియందును వాస్తవమునకు 'మట్టి' తప్ప మఱేమియును లేదనిభావము)

నహీదానీ మపీదం కార్యం కారణాత్మానమంతరేణ స్వతంత్రమేవాస్తి

(ఇదానీమపి=) ఇప్పుడైనను (ఇదంకార్యం=) ఈకార్యమైన జగత్తు (కార ణాత్మానమంతరేణ=) కారణమైన బ్రహ్మస్వరూపముగాకుండ (స్వతంత్రం=)

స్వతంత్రమైనది (=భిన్నమైనది) నహి+అసి,+ఏవ=) కానేకాదు (కుండగానున్న కాలములోఁగూడ 'మట్టి' యేతప్ప మఱికొత్తదేదియును లేదు) ఈయర్థమునే

'సర్వం తం పరా' ఇత్యాది శ్రవణాత్ బృ IV-4-6 'సర్వం తం పరాదాద్యోన్య త్రాత్మన స్సర్వంవేద'

(యః=) ఎవడు, (సర్వం=) పై నవివరింపఁబడిన సమస్తజగత్తును (ఆత్మనః+అన్యత్ర=) బ్రహ్మముకంటె వేరుగా నున్నదని (వేద=) తెలిసికొనుచున్నాడో (సర్వం=) అట్లు తెలిసికొనుటయంతయును (తం=) అట్టివానిని- అనఁగా ఆఅజ్ఞానిని, (పరాదాత్=) శ్రేయోమార్గమునుండి తొలగించును.

కారణాత్మనా తు సత్త్వం కార్యస్య ప్రాగుత్పత్తే రవిశిష్టం

ఈమొదలగు శ్రుతులు వక్కాణించుచున్నవి కార్యము కారణస్వరూప ముతో (సత్త్వం=) ఉండుటయనునది (ప్రాగుత్పత్తేః=) కార్యముగాఁ బుట్టక పూర్వమును (అవిశిష్టం=) సమానముగానే యున్నది (అనఁగా- కార్యముగాఁబుట్టిన పిమ్మట కారణముగానే యెట్లున్నదో, బుట్టకపూర్వమును నట్టుగానే యున్నది) (కుండగానున్న కాలములో నేదిగానున్నదో, కుండగాకపూర్వమును నదిగానే యున్నది)

నను శబ్దాదిహీనం బ్రహ్మజగతః కారణం

శబ్దాదిగుణములులేని మొదలగు లక్షణములుగల బ్రహ్మము (శబ్దాదిగుణ ములుగల) జగత్తునకుఁ మొదలగులక్షణములుగల- గారణమెట్లగునని యాక్షేపము రావచ్చును (సమాధానమును వినుఁడు)

బాఢం

నిజమేగాని

నతు శబ్దాది మత్కార్యం కారణాత్మనాహీనం ప్రాగుత్పత్తే రిదానంవా స్తీతి

శబ్దాది గుణములు గలట్టియు అచేతనము- అశుద్ధము- నైనట్టియు కార్యము (జగత్తు) (ప్రాగుత్పత్తేః వా ఇదానీంవా) పుట్టకపూర్వముగాని పుట్టినతరువాత నిప్పుడుగాని (కారణాత్మనాహీనం=) కారణస్వరూపముతో సంబంధించకుండా (కారణపదార్థములేకుండా- మట్టిలేకుండా కుండయనుదానివలె)-(నతు+అస్తీతి=) ఉండఁజాలదుగదా.

తేన నశక్యతే వక్తుం ప్రాగుత్పత్తే 'రస' త్కార్యమితి

(తేన=) అంతమాత్రముచేత- అనఁగా లక్షణములు వేరుగానున్నంత మాత్రముచేత పుట్టకపూర్వ మీకార్యములేదని చెప్పుటకు సాధ్యముగాదు (మట్టి

యందే కుండయున్నదిగాన- అనఁగా మట్టికంటె వేరుగా కుండ యుండఁజాలదుగాన- కుండయని ప్రత్యేక పిలుపకపూర్వముగూడ కుండలేదని చెప్పుటకు వశముగానట్లే- జగత్తు పుట్టకపూర్వము జగత్తులేనిది (అసత్తు=) అని చెప్పుటకు సాధ్యముగాదు)

విస్తరేణ చైతత్కార్యకారణానన్యత్వావాదే వక్ష్యామః

(ఏతత్=) ఈవిషయము అనఁగా కారణకార్యములకుఁజూపట్టుభేదము వాస్తవమైనదిగాదు అనువిషయమును- అనఁగా కార్యమే కారణము- కారణమేకార్యము అను విషయమును ముందురాఁబోవు బ్రసూ II-1-14 (తదనన్యత్వమారంభణ శబ్దాదిభ్యః) అను సూత్రముక్రింద (విస్తరేణ=) విపులముగా (వక్ష్యామః=) చెప్పఁబోవుచున్నారము.

సూత్రావతారిక :- రాఁబోవునది కేవల పూర్వపక్షిసూత్రము=సత్కార్యవాదమును నిలఁబెట్టుటకై యనఁగా కార్యమెప్పుడును గారణముకంటె భిన్నముగా నుండదని సిద్ధాంతీకరించుచో, కార్యమందుండు దోషములు కారణమందుసైత ముండియేతీరునని చెప్పుచు కార్యకారణానన్యత్వ సిద్ధాంతముపై పూర్వపక్షి దోషములను గుణించుచున్నాడు.

## ౮ సూ॥ అపీతౌ తద్వత్ప్రసంగా దసమంజసమ్

ప॥ వి :- అపీతౌ-తద్వత్ప్రసంగాత్ - అసమంజసమ్.

ప్ర. ప. అ :- అపీతౌ=ప్రళయమందు, తద్వత్ప్రసంగాత్; తద్వత్= అట్టిదే (కార్యమువంటిదే కారణము) యని ప్రసంగాత్=చెప్పవలసివచ్చుటవలన; అసమంజసమ్=అయుక్తము-

సూ॥ తా॥ కార్యకారణానన్యత్వ మంగీకరింపఁబడుచో, (అపీతౌ=) ప్రళయకాలమందు కార్యము కారణములో లీనమైపోయినప్పుడు (తద్వత్ప్రసంగాత్= కార్యమువలె దోషములుగలదియే కారణమని చెప్పవలసివచ్చునుగావున అట్టి సిద్ధాంతమును బోధించు నుపనిషన్మతము సరిగాదని పూర్వపక్షి తన హేతువులతో నిరూపించుచున్నాడు.

భాష్యము భాష్యార్థము :-

బ్రహ్మ జగత్కారణవిషయములో సాంఖ్యపూర్వపక్షి మఱికొన్ని యాక్షేపణములను జేయుచున్నాడు. అవి యేమన :-

I (మొదటి యాక్షేపణము) ప్రళయకాలములో, అశుద్ధమైన జగత్తు శుద్ధమైన బ్రహ్మమందు లీనమైపోగా- బ్రహ్మముసైత మశుద్ధమై సర్వజ్ఞముగా నిల్చియుండనోపదు- అట్టి యశుద్ధబ్రహ్మము పునస్సృష్టిచేయుట కెట్లు సమర్థమగును?

అత్రాహ, యదిస్థౌల్య సావయవత్వా చేతనత్వ పరిచ్ఛిన్నత్వా శుద్ధ్యాదిధర్మకం కార్యంబ్రహ్మ కారణకమభ్యుపగమ్యేత

(స్థౌల్య=) లావుతనము- (సావయవత్వ=) అవయవములు (=భాగములు) గలిగియుండుట- (అచేతనత్వ=) చైతన్యము లేకపోవుట- (పరిచ్ఛిన్నత్వ=) మిత ప్రదేశములయందిమిడియుండుట- (అశుద్ధి=) సుఖదుఃఖమోహాదులతో నశుద్ధమై యుండుట అను మొదలగు ధర్మములుగల కార్యమైన యీజగత్తు (సూక్ష్మము- నిరవయవము- చేతనము- అపరిచ్ఛిన్నము- శుద్ధమునైన) బ్రహ్మమునుండి పుట్టిన దని యెంచుపక్షమున (=జగత్తునకు బ్రహ్మమే కారణమని నిశ్చయించుపక్షమున)

తదపీతౌ ప్రళయే ప్రతిసంసృజ్యమానం కార్యం కారణావిభాగమాపద్యమానం కారణమాత్మీయేన ధర్మేణదూషయేది

(తత్ కార్యం=) ఈ కార్యమైనజగత్తు (అపీతౌ=) ప్రళయకాలమందు (ప్రతి సంసృజ్యమానం=) కారణమైన బ్రహ్మముతోఁ (లవణము నీటితోవలె) గలసి పోయినదగుచుండఁగా, (కారణావిభాగమాపద్యమానం) ఇది కారణమని యిది కార్యమని చేయఁదగు (భేదము=) విచక్షణము లేకపోవుట సంభవించినప్పుడు కారణమైన బ్రహ్మమును కార్యము తనయొక్క (అశుద్ధ్యాది) ధర్మములచేత (ఉప్పని లవణము చప్పనినీటినివలె) చెడఁగొట్టివేయును (ఇతి=) గావున-

త్యపీతౌకారణస్యాపి బ్రహ్మణః కార్యస్యైవాశుద్ధ్యాది రూపతా ప్రసంగాత్సర్వజ్ఞం బ్రహ్మజగతఃకారణ మిత్యసమంజస మిదమౌపనిషదం దర్శనం

(అపీతౌ=) ఆప్రళయకాలమందు కారణమైన బ్రహ్మమునకు కార్యమైన జగత్తుయొక్క యశుద్ధ్యాది లక్షణము లంటియుండుట తప్పదని యొప్పుకొని తీర వలసిన సందర్భములలో- (అనఁగా:- ప్రళయకాలమందుఁ గార్యకారణముల శుద్ధ మైన యొకేపదార్థమైపోయి యప్పుడును నది బ్రహ్మమేయని చెప్పవలసినసందర్భ ములో) సర్వజ్ఞమైన (స్వచ్ఛమైన) బ్రహ్మమే జగత్తునకుఁ గారణమగునని బోధించు నుపనిషత్సిద్ధాంతము (అసమంజసం=) విశ్వాసనీయమైనది గాకపోవునుగదా!

II (రెండవ యాక్షేపణము) ప్రళయకాలములో జగద్బ్రహ్మములు (కారణకార్యములు) విచక్షణములేకుండ నేకమైపోయినప్పుడు ప్రళయానంతర సృష్టిలో (హఠాత్తుగా) భోక్తృభోగ్యభేదములతో జగత్తు బ్రభవించుటెట్లు?

అపిచ సమస్తస్య విభాగస్యా విభాగప్రాప్తేః పునరుత్పత్తౌ నియమకారణా భావాత్ భోక్తృభోగ్యాది విభాగేనోత్పత్తిర్న ప్రాప్నోతీత్యసమంజసం

(మఱియును) ప్రళయకాలమందు (సమస్తస్య=) (బ్రహ్మములో) కలిసి పోయిన జగత్తునకు (విభాగమునకు) బ్రహ్మముతో నవిభాగము ప్రాప్తించగా - అనఁగా జగత్తులోని వివిధ విభాగములు రెండును బ్రహ్మములో లీనమైపోగా,

(పునరుత్పత్తౌ=) ప్రళయానంతర జగత్సృష్ట్యారంభములో (నియమ=) ఎట్టి భేదమున కవకాశము లేనందున సృష్టియంతయు నొకేరూపమున నుండును అనఁగా భోక్తయనియు భోగ్యపదార్థమనియు నీ మొదలగు విభాగములు పునస్సృష్టిలో నుండకపోవుటచే (ప్రపంచమే సాగకపోవుటకు హేతువగుటచే) నుపనిషత్సిద్ధాంతము విశ్వసనీయమైనదిగాదు

III (మూడవ యాక్షేపణము) భోక్తలైన జీవులు వారివారి కర్మాది నిమిత్తములతోసహా ప్రళయకాలమందు బ్రహ్మములో లీనమైపోయి పునస్సృష్టిలో మఱల జన్మింతురన్నచో ప్రళయాత్పూర్వము ముక్తులై ప్రళయమందు బ్రహ్మములో నైక్యమగువారుగూడ పునస్సృష్టిలో మఱల జన్మించవలసినదిగదా

> అపిచ భోక్తౄణాం పరేణ బ్రహ్మణ్యా విభాగంగతానాం కర్మాదినిమిత్త ప్రళయేऽపి పునరుత్పత్తావభ్యుపగమ్య మానాయాం, ముక్తానామపి పునరుత్పత్తి ప్రసంగా దసమంజసమ్

ప్రళయకాలమందు జగత్తు బ్రహ్మములో మఱియును ప్రళయకాలమందు జీవులు పరబ్రహ్మముతో విచక్షణము లేకుండ నేకీభావమును జెంది సృష్టికాలమునఁ బుట్టుదురన్నచో మఱల జన్మమెత్తింపఁగల పూర్వకర్మములు నిశ్శేషముగా ప్రళయాత్పూర్వమై నశించిపోయిన వారైనను మఱలఁ బుట్టుదురనవలసి వచ్చును అట్లగు పక్షమునఁ ప్రళయాత్పూర్వమే ముక్తికర్హులై ప్రళయకాలములో బ్రహ్మమందైక్యమై పోయినవారికైనను బునర్జన్మము తప్పదనుదోష మాపాదించుచున్నదిగావున నుపనిషత్సిద్ధాంతము విశ్వసనీయ మైనదిగాదు (అనఁగా వేదాంత సిద్ధాంత మంగీకరించినచో నిజమైనముక్తియే లేకపోవును)

IV (నాల్గవ యాక్షేపణము) ప్రళయకాలమందుసైతము జగత్తు (=కార్యము) బ్రహ్మముతో (=కారణముతో) విభక్తముగానే యుండునని వాదించుచో, నిజమైన ప్రళయమే లేదని చెప్పవలసి వచ్చునుగదా! ప్రళయమే లేదనఁగా కారణాభిన్నమైన కార్యమే లేదనుటసుమీ! (కార్యకారణ విభాగమే లేనిచో, ఒకనాటికైనను ప్రళయము సంభవించుటయెట్లు?)

> అథేదం జగదవతామపి విభక్తామేవపరేణ బ్రహ్మణ్యావ తిష్ఠేతఏవ మప్యపీత రేవన సంభవతి కారణావ్యతిరిక్తంచ కార్యం న సంభవతీత్యసమంజసమేవేతి

మఱియు నొకవేళ నీజగత్తు ప్రళయకాలమందు సైతము పరబ్రహ్మములో (విచక్షణము లేకుండ నేకమైపోక) విచక్షణస్థితిలోనే యుండునని వాదించు పక్షములో, (అట్టిస్థితి ప్రళయమని చెప్పఁబడఁ జాలదుగావున) ప్రళయ మెప్పటికిని సంభవింపకయే పోవలెను ఎందుచేతననఁగా:- (ప్రళయమే లేదన్నప్పుడు) కార

ణముకంటె వ్యతిరేకముగా (అనఁగా వేరుగా) కార్యముండుటయే యెన్నడును తట స్థింపదు (అనఁగా - కారణ కార్యములని వేరువేరుగాఁ జెప్పుకొనుటయే కలుగదు- వేరువేరుఁగా నున్నప్పుడే, ఒకనాటికైనను గార్యమునకుఁ గారణమందు (బ్రళయ మగునని చెప్పుట సంభవించును) ఇదియు నొకదోషమే - కావున నుపనిషత్సిద్ధాం తము విశ్వసనీయముగాదు

అత్రోచ్యతే:- ఈపై నాల్గాక్షేపణములకు రాఁబోవు సూత్రముచే సమా ధాన మీయఁబడును చూడుఁడు-

9 సూత్రావతారిక :-

కార్యకారణానన్యత్వ విషయములో సాంఖ్యపూర్వపక్షిలోఁగడి 8వ సూత్ర ములోఁ జేసిన నాల్గు ఆక్షేపణములకు నీక్రింది 9 సూత్రములో సమాధానము లీయఁబడుచున్నవి-

## ౯ సూ॥ నతుదృష్టాంత భావాత్

ప॥ వి :— న—తు—దృష్టాంతభావాత్.

ప్ర॥ ప :- నతు = పూర్వపక్షిచేసిన యాక్షేపణములు సరియైనవికావు, దృష్టాంతభావాత్ ; దృష్టాంత=దృష్టాంతములు, భావాత్ = ఉండుటవలన.

సూ॥ తా॥ కార్యకారణానన్యత్వమును ఒప్పుకొన్నచో లోఁగడి సూత్ర ములోఁ బూర్వపక్షిచేఁ జేర్కొనఁబడిన దోషములు సంభవించుననుట సరిగాదు- కార్యగుణములు కారణమును జెఱుపఁజాలవనుటకు దృష్టాంతములు గలవు.

భాష్యము భాష్యార్థము

నైవాస్మదీయే దర్శనేకించిదసామంజస్యమస్తి యత్తావదభిహితం కారణమపి గచ్ఛత్కార్యం కారణమాత్మీయేన ధర్మేణదూషయేదితి న తద్దూషణం కస్మాత్

(అద్వైతసిద్ధాంతియిచ్చు ప్రత్యుత్తరము) మాయొక్క (దర్శనే=) యుపనిష త్సిద్ధాంతమునందు (అసామంజస్యం=) విప్రతిపత్తి (=అసందర్భము) యెంత మాత్రమును లేదు- కారణమందు (అపిగచ్ఛత్=) లీనమైన కార్యము (ఆత్మీ యేన=) తనయొక్క గుణములచేతఁ గారణమును (దూషయేత్) జెఱుచునని (యత్తావదభిహితం=) నీచేఁజెప్పఁబడిన దేదిగలదో యది దోషములోఁ జేరినది గాదు.

ఎందుచే దోషముగాదందురేమో !

I కార్యము కారణములో నేకమైపోయినప్పుడు, కార్యదోషములు కారణమున కంటవనెడి వేదాంతసిద్ధాంతమునకు లోకదృష్టాంతములు గలవు-

దృష్టాంతభావాత్

దోషముగాదనుటకు దృష్టాంతములుండుటవలన,

సంతిహి దృష్టాంతాః యథాకారణ మపిగచ్ఛత్ కార్యంకారణ మాత్మీయేన ధర్మేణ నదూషయతి,

(1) కార్యమందు లీనమగు కార్యము తన గుణములచేతఁ గారణమును జెఱుపఁ జాలదనుటకు దృష్టాంతములు గలవు

ఆ దృష్టాంతము లెవ్వియన:-

(ఎ) కుండమట్టిలో నేకమైపోయినప్పుడు, కుండయందుండు విశేషములు మట్టియందుఁ గన్పించునా?

తద్యథా శరావాదయో మృత్ప్రకృతికా వికారా విభాగావస్థాయా ముచ్చావచ మధ్యమ ప్రభేదాస్యంతః పునఃప్రకృతి మభగచ్ఛంతో నతామాత్మీయేన ధర్మేణ సంస్పృజంతి

(మృత్ప్రకృతికా=) మట్టిలోనుంచి పుట్టిన వికారములైన (మార్పులైన) (శరావాదయః) మూకుడు మొదలగునవి (విభాగావస్థాయాం=) వేరు వేరుగా నున్నప్పుడు (ఉచ్చావచ మధ్యమ ప్రభేదాస్సంతః=) ఉత్తమములని-నీచములని-మధ్యమములని (పెద్దవని-నడిమిరకపువని-చిన్నవని) మొదలగు భేదములతో నున్నను (అవి పగిలిపోయి) మఱల వాని మూలపదార్థమైన మట్టిలోఁ (=ప్రకృతిలో) గలిసినప్పుడు తమతమ (ఉత్తమత్వ నీచత్వ-మధ్యమత్వములు మొదలగు) గుణములను (ప్రకృతియైన) మొదటిమట్టికి (=నసంస్పృజంతి) నంటింపఁ జాలవుగదా!

(బి) ఆభరణములు బంగారముగా మారినప్పుడు, ఆభరణము లందుండు విశేషములు బంగారమున కంటియుండునా?

రుచకాదయశ్చ సువర్ణ వికారా అపీతౌ న పునస్సువర్ణ మాత్మీయేన ధర్మేణ సంస్పృజంతి

బంగారమునుండి పుట్టిన యాభరణములు మొదలగునవి (అపీతౌ=) వాని స్వరూప నాశనముకాఁగా (అనఁగా ఆభరణ వస్తురూపముచెడి) మఱల మొదటి బంగారమైనప్పుడు లోగడి యాభరణములు తమయొక్క గొప్ప కొద్ది గుణములను బంగారమున కంటింపఁ జాలవుగదా!

(సి) పృథివిలోనుండి పుట్టిన భూతములు పృథివియై పోయినప్పుడు భూతలక్షణములు పృథివి కంటియుండునా!

పృధివీవికార శ్చతుర్విధో భూతగ్రామో నపృధివీ మపీతావాత్మీయేన ధర్మేణ సంసృజంతీతి

పృధివినుండి పుట్టిన చతుర్విధ భూతసముదాయము (అనఁగా జరాయుజములు, అండజములు. స్వేదజము ఉద్భిజ్జములు) లవి (అపీతౌ=) నాశనము చెందునప్పుడు అనఁగా నాశనమై మఱలఁ బృధివిలోఁ గలసినప్పుడు తమతమ గుణములను పృధివికంటింపఁ జాలవుగదా!

(సాంఖ్యపూర్వ పక్ష వాదమునకు దృష్టాంతమే లేదు)

త్వత్పక్షస్య తు న కశ్చిద్దృష్టాంతోఽస్తి

(ఓయి సాంఖ్యుఁడా!) నీవుచేయు పూర్వపక్షవాదమున కనఁగా కార్యము కారణములోఁ స్వరూపనాశనమై చేరినప్పుడు కార్యగుణములు కారణమున కంటునను వాదమునకు దృష్టాంత మొకటైననుఁ జూపఁజాలవుసుమా!

కార్యగుణములు కార్యనాశనమందు కారణములో నిల్చియుండుచో, కార్యస్వరూప నాశనమని చెప్పఁదగు ప్రళయమే యుండఁజాలదు

అపీతిరేవహి న సంవర్తేత యదికారణే కార్యం స్వధర్మైవావతిష్ఠేత

కార్యము తన గుణములతోనే కారణమందుఁ (యది + అవతిష్ఠేత=) జేరి నిల్చియుండునన్నచో, కార్యముయొక్క స్వరూపనాశన మనఁబడు (అపీతిరేవ=) ప్రళయమన్నదే (నసంవర్తేత=) సంభవింపక పోవలెను.

కార్యకారణ నన్యత్వమందును, కార్యము కారణస్వరూపమె, కారణము మాత్రము కార్యస్వరూపముగాదు

అనన్యత్వేఽపి కార్యకారణయోః కార్యస్య కారణాత్మత్వం, నతు కారణస్య కార్యాత్మత్వం

కార్యకారణము యొకటికన్న మఱియొకటి భిన్నములు కాకపోయినను, కార్యము కారణస్వరూపముగా నుండునుగాని, కారణమెప్పుడును గార్యస్వరూపముగా నుండదని యెఱుంగునది!

ఆరంభణ శబ్దాదిభ్య ఇత్యత్ర వక్ష్యామః

ఈ విషయమును (మఱింత విపులముగా) రాఁబోవు బ్ర సూ II-1-14 (తదనన్యత్వ మారంభణ శబ్దాదిభ్యః) అను సూత్రముక్రిందఁ జెప్పఁబోవుచున్నాము.

(౨) కార్య కారణానన్యత్వ మెల్లప్పుడును (స్థితి ప్రళయకాలముల రెంటియందును) ఉండియేయున్నదని వేదాంతమత సిద్ధాంతము

అత్యల్పం చేదముచ్యతే. కార్యమపీతా -వాత్మీయేన ధర్మేణకారణం సంస్పృజేదితి

(ఓయి సాంఖ్యుఁడా!) ప్రళయకాలమందుఁ గారణమందు లీనమగుకార్యము తన గుణములను గారణమున కంటించునుగదా?' అని నీవు వేసినప్రశ్నను నీకుఁ గల్గిన సంశయ మతిస్వల్పమని తెలుపుచున్నది (నిజముగాఁ గలుగఁదగిన సంశయ మేదియో తెల్పి సమాధాన మీయఁబడుచున్నది)

స్థితావపి హి సమానోऽయం ప్రసంగః కార్యకారణయో రనన్యత్వాభ్యుగమాత్

(ఎల్లప్పుడును) కార్యమే కారణమని, కారణమే కార్యమని మేము చెప్పు నప్పుడు, ఒక్క ప్రళయకాల మందననేమి! నీవుచెప్పిన దోషము స్థితి ప్రళయకాల ముల రెంటియందును సమానముగానే సంభవింపవచ్చును

కారణముకంటెఁ కార్యము భిన్నముగాదన్నందులకు శ్రుతిప్రమాణములు

'ఇదం సర్వం' బృ IV-4-6 'ఇదం సర్వం యదయమాత్మా'

'(యాదయమాత్మా) ఏయీయాత్మ (ఇదం సర్వం=) యీ సమస్తమైనజగత్తు అయియున్నదో'

ఛాం VII-25-2 'ఆత్మై వేదం సర్వం'

'ఆత్మయే యీ సర్వజగత్తు'

ముం II 2 12 'బ్రహ్మైవేద మమృతం పురస్తాత్'

'(పురస్తాత్=) ముందును - అంతటను (ఇదం=) ఈజగత్తు (అమృతం బ్రహ్మ+ఏవ=) శాశ్వతమైన బ్రహ్మమేగాని మఱియొకటిగాదు'

ఛా III 14 1 'సర్వం ఖల్విదం బ్రహ్మ'

'(ఇదం సర్వం=) ఈసమస్తము (జగత్తు) బ్రహ్మఖలు= బ్రహ్మమేగదా,

ఇత్యేవమాద్యాభిః శ్రుతిభిరవిశేషేణ త్రిష్వపికాలేషు కార్యస్యకారణాదనన్యత్వం శ్రావ్యతే

ఈ మొదలగు శ్రుతులు (ఒక్క ప్రళయకాలమందేగాక) సర్వ (త్రి) కాల ములయందును ఎట్టి భేదమునులేక కార్యము కారణముకంటె నన్యముగాదనియే చెప్పుచున్నవి.

కార్యకారణములకు భిన్నత్వము చెప్పుట యజ్ఞానముచేత మాత్రమేయై యున్నది- నిజముగా లేక యజ్ఞానముచేత నారోపింపఁబడిన భేదమునుబట్టి వచ్చు కార్యదోషములు స్థితియందుఁగాని ప్రళయమందుగాని కారణమునకంటఁజాలవు.

తత్రయఃపరిహారః కార్యస్య తద్ధర్మాణాం చావిద్యాధ్యారోపితత్వా న్నతైఃకారణం సంస్పృజత ఇతి అపీతావపి నసమానః

కారణముకంటె కార్యము మించియున్నదనిగాని, కారణమందులేని ధర్మములు కార్యమందున్నవనిగాని చెప్పుట (అవిద్యాధ్యారోపితత్వాత్ =) అజ్ఞానముచేతఁ గల్పింపఁబడిన మిథ్యారోపణము మాత్రమే యైయున్నందువలన (అనఁగా:- ఆ భేదములు వాస్తవమునకు లేనివే యైయున్నందువలన) అట్లు కల్పింపఁబడిన తన ధర్మములను గార్యముకారణమున కంటింపఁజాలదను (పరిహారః =) సమాధానము స్థితికాలవిషయమందువలె (అపీతౌ + అపి =) ప్రళయకాల విషయమందుఁగూడ సమానమే యైయున్నది

వేదాంతసిద్ధాంతమునకు దృష్టాంతములు.

అస్తిచాయ మపరో దృష్టాంతః

ఈమా సిద్ధాంతమును ఋజువుచేయుటకు దృష్టాంతము లీయఁబడును చూడుఁడు.

(ఎ) గారడిపనులు గారడివాని కెట్లంటవో సంసార (జగత్) మాయా కార్యములట్లు పరమాత్మకంటవు.

యథాస్వయం ప్రసారితయా మాయయా మాయావీత్రిష్వపికాలేషు న సంస్పృశ్యతే అవస్తుత్వాత్

(మాయావీ =) ఇంద్రజాలకుఁడు (స్వయంప్రసారితయామాయయా =) తన చేతఁ జేయఁబడిన గారడిపనులు (అవస్తుత్వాత్ =) వాస్తవములైనవి కానందున అట్టి పనులచేత మూడుకాలములయందు (యథానసంస్పృశ్యతే =) ను వాడంటఁబడకపోవుట యెట్లో-

ఏవం పరమాత్మాపి సంసారమాయయా న సంస్పృశ్యత ఇతి

అట్లె పరమాత్మసైతము తననుండి కల్గినట్లు చూపట్టు సంసారమాయచేత ననఁగా నీజగత్సృష్టిస్థితి ప్రళయములచేత నంటఁబడువాడు కాడు-

(బి) స్వప్నమాయా దృశ్యములు మేల్కాన్నవాని కెట్లంటవో సృష్టిస్థితి ప్రళయావస్థలట్లు పరమాత్మ కంటవు.

యథాచ స్వప్న దృగేకః స్వప్నదర్శన మాయయా న సంస్పృశ్యతే ప్రబోధ సంప్రసాదయోరనన్వాగతత్వాత్;

(స్వప్నదృక్ + ఏకః =) స్వప్నమును గాంచువాడొకఁడు తన స్వప్నమందలి మాయాదృశ్యములు (ప్రబోధసంప్రసాదయోః =) తన జాగ్రదవస్థనుగాని సుషుప్త్యవస్థనుగాని వెంబడింపకపోవుటవలన (=అంటరాకపోవుటవలన) ఆయాస్వప్న మాయాదృశ్యములచేత నాటఁబడకపోవుట యెట్లో.

ఏవమవస్థాత్రయ సాక్ష్యేకో౽వ్యభిచార్యవస్థాత్రయేణ వ్యభిచారిణా న సంస్పృశ్యతే

అట్లే (అవస్థాత్రయసాక్షీ=) సృష్టిస్థితి ప్రళయావస్థలను జూచువాడును (అవ్యభిచారీ=) ఆయా యవస్థలచేత నెట్టిమార్పును జెందనివాడును (ఏకః=) ఒకఁడునునైన పరమాత్మ (=బ్రహ్మము) (వ్యభిచారిణా అవస్థాత్రయేణ=) ఒకటియందు మఱియొకటి నిల్చియుండకుండ వచ్చిపోవుచుండు నాయా యవస్థలచే నంటఁబడువాఁడు కాఁడు

అవస్థాత్రయములు పరమాత్మ కంటియున్నవనుట సర్వదోషములు త్రాటియం దున్నవనుకొనుట వంటిది

మాయామాత్రం హ్యేతత్ యత్పరమాత్మనో౽వస్థాత్రయాత్మనావభాసనం, రజ్జ్వ ఇవసర్పాది భావేనేతి

(యత్పర...భాసనం=) అవస్థాత్రయ స్వరూపముతోఁ బరమాత్మయున్నట్టు తోఁచుట యేదిగలదోయది (రజ్జ్వ...భావేన) త్రాడు పామువలె తోఁచుటవంటిదే యగు (మాయా... హ్యేతత్=) మాయయేగాని మఱేమియునుగాదు (మాయ; యా=ఏది, మా=లేదో యది-లేనిది యున్నట్టుగాఁ దోఁచుట-భ్రాంతి)

(వేదాంతార్థ సంప్రదాయ వేత్తయగు గౌడపాదాచార్యుని యభిప్రాయము నైత మట్టిదియే)

అత్రోక్తం వేదాంతార్థ సంప్రదాయ విద్భిరాచార్యైః

ఈ విషయమందు వేదాంతార్థ సంప్రదాయముల (the true traditions) నెల్ల బాగుగా గుర్తెఱింగిన గౌడ పాదాచార్యులవారు తమ కారికలలో నేమి చెప్పిరో చూతుఁడు.

'అనాదిమాయ తవా' మాం II-16 లో గౌ. కారిక I-16 'అనాదిమాయయాసుప్తో యదా జీవః ప్రబుధ్యతే అజమనిద్ర మస్వప్న మద్వైతం బుధ్యతే తదా'

'(జీవః=) జీవుఁడు (అనాదిమాయయాసుప్తః=) ఆదిలేని మాయచేత నిద్రపోవుచున్నవాఁడై- అనఁగా తెలియని మూఢుఁడై (యదా ప్రబుధ్యతే=) ఎప్పుడు మేలుకొనునో అనఁగా ఎప్పుడు జ్ఞానమునుబొందునో, (తదా=) అప్పుడు (అజ-ద్వైతం=) పుట్టువులేని-నిద్రలేని-స్వప్నములేని అనఁగా జన్మస్థితిలయ శూన్యమగు నద్వైత స్వరూపమును- (బుధ్యతే=) తెలిసికొనుచున్నాఁడు.

ఇట్టి సందర్భములో ప్రళయకాలమందు కార్యదోషములు కారణమునంటుట సంభవింపనే సంభవింపదు.

తత్ర యదుక్త మపీతౌ కారణస్యాపి కార్యస్యేవ స్థౌల్యాది దోషప్రసంగ ఇత్యేత త్తదయుక్తం

(తత్ర=) ఇట్టిస్థితిలోననఁగా పైనఁజెప్పఁబడినట్లు పరమాత్మకు అవస్థాత్రయ సంబంధమేమియు వాస్తవమునకులేని విషయములో- కార్యమైన జగత్తునందుఁ గన్పించు స్థౌల్యము (లావు గట్టి) మొదలగు దోషములు ప్రళయకాలమందు కారణ మైన పరమాత్మకంటునని (యదుక్తం=) చెప్పుట (తదయుక్తం=) యుక్తముగాదు.

II ప్రళయానంతర జగత్సృష్టిలో భోక్తృభోగ్య భేదమున కవకాశములేద నుట సరిగాదు.

యత్పునరే తదుక్తం సమస్తస్య విభాగస్యా విభాగప్రాప్తేః, పునర్విభాగేనోత్పత్తౌ నియమకారణం నోపపద్యత ఇతి. అయమప్య దోషః దృష్టాంతభావాదేవ

(ప్రళయకాలములో) (సమస్తస్య=) బ్రహ్మములోఁ గలిసిపోయిన జగత్తు యొక్క విభాగమునకు (భిన్నస్థితికి) నవిభాగము (=అభేదము) ప్రాప్తించఁగా- అనఁగా జగత్తు- లోని వివిధభాగములు బ్రహ్మములో లీనమైపోఁగా ప్రళయానం తర జగత్సృష్ట్యారంభములో (భోక్తృభోగ్యాది) కట్టిభేదమున కవకాశము లేనం దున సృష్టియంతయు నొకేరూపమున నుండవలసివచ్చునని చేయఁబడిన యాక్షేప ణము సైతము చెల్లఁదగినదికాదు- ఎందుచేతననఁగా, ఆ యాక్షేపణమును ద్రోసి వేయుట కాధారముగా దృష్టాంత మేగలదు చూడుఁడు.

సుషుప్తిసమాధి నిద్రావస్థలలోలేని జగద్భేదము జాగ్రదవస్థలో మిథ్యా జ్ఞానముచే నెట్లువచ్చినదో యట్లే ప్రళయానంతర సృష్టిలో

యథాహి సుషుప్తి సమాధ్యాదౌ సత్యామపి స్వాభావిక్యా మవిభాగప్రాప్తౌ

ఒకఁడు సుషుప్తిని (గాఢనిద్రను) గాని, సమాధిని గాని లేక మూర్ఛ మొదలగు నవస్థనుగాని బొందినాడనుకొందము- అప్పుడీ విభాగములతోఁగూడిన జగత్తంతయు స్వభావముగా (=జ్ఞానోదయము లేకుండ) నవిభాగమును జెందినది గదా- అనఁగా నీకార్యమైన జగత్తు కారణమైన తనలో (బ్రహ్మములో) తాత్కాలికముగా లీనమైపోయినది గదా.

మిథ్యాజ్ఞానస్యానపోదితత్వాత్ పూర్వవత్పునః ప్రబోధేవిభాగో భవ:త్యేవమిహాపి భవిష్యతి

బ్రహ్మమునుండి యీజగత్తు వేరుగానున్నదని మిథ్యాజ్ఞానము (క్రమమైన యద్వైతజ్ఞానముచేత) నశింపఁజేయఁబడకుండ నిల్చియున్నందున, ఆసుషుప్తి సమాధి మూర్ఛావస్థలుపోయి (ప్రబోధే) తెలివివచ్చినప్పుడు, పూర్వమున్నట్లుగా ననే జగత్తు విభాగములతో భోక్తృభోగ్యాదిభేదములతో) బ్రత్యక్షమగుచుండును- అట్టి (ఇహాపి) ప్రళయకాలమందు సైతము తనలో (బ్రహ్మములో) లీనమైపోయిన

జగత్తు ప్రళయానంతరము పూర్వపు విభాగములతోఁ బ్రత్యక్షమగు (ననుటలో నాశ్చర్యములేదు)

అందులకు శ్రుతిప్రమాణము

శ్రుతిశ్చాత్ర భవతి

ఈవిషయములో శ్రుతిప్రమాణమునై శము గలదు చూడుఁడు.

'ఇమాస్సర్వాః' ఇతి ఛాం $V_I$-9-2 'ఇమాస్సర్వాః ప్రజాఃసతి సంపద్య న విదుః .
'సతి సంపత్స్యా మహే ఇతి'

ఈసకాల జీవులును (నిత్యమును సుషుప్త్యాద్యవస్థలలో)-(సతి=) బ్రహ్మము నందు (సంపద్య=) లీనమగుచుండియు (సతిసంపత్స్యామహే=) బ్రహ్మమందు లీనమగుచున్నాము అని (నవిదుః=) తెలిసికొనజాలకున్నారు. (ఆయాయవస్థలలో మిథ్యాజ్ఞానము నిల్చియే యుండుటచే యథార్థజ్ఞానము కలుగలేదని భావము)

ఛా VI-9-3 'త ఇహ వ్యాఘ్రోవా సింహోవావృకోవా వరాహోవా కీటోవాపతం
గోవాదంశోవామశ కోవాయద్య ద్భవంతి తదా భవంతి'

'(తే=) ఆ జీవులు (ఇహ=) సుషుప్త్యాదులకుఁ బూర్వము సింహముగానో తోడేలుగానో పందిగానో పురుగుగానో పక్షిగానో యీగగానో దోమగానో (యద్యద్భవంతి=) ఎట్లెట్లుగానుండునో (తదా=) ఆ యవస్థలనుండి లేచినప్పుడును నట్లె (భవంతి=) యగుచున్నవి.

ఈ జగత్తు పరమాత్మయం దభిన్నముగానున్నను మిథ్యాజ్ఞానము తొలఁగి పోకుండుటచే ప్రళయానంతర స్మృతినై తము పూర్వమువలె భోక్తృభోగ్య భేదము లన్నియుఁ జూపట్టుచునే యుండును.

యథాహ్య విభాగేऽపి పరమాత్మని మిథ్యాజ్ఞాన ప్రతిబద్ధో విభాగవ్యవహారః స్వప్న
వద వ్యాహతి స్థితో దృశ్యతే

యథార్థమునకు నీ జగత్తంతయుఁ బరమాత్మయందు (అవిభాగేఽపి) అభిన్న ముగా (=వేరుగాకుండ) నున్నను, వేఱుగానే యున్నదను మిథ్యాజ్ఞానముచేఁ బ్రతి బద్ధుఁడై (కట్టఁబడి) జీవుఁడున్నందున అనఁగా యథార్థమును గ్రహింపలేని స్థితిలో నున్నందున స్వప్నావస్థయందు నాస్వప్నదృశ్యములన్నియుఁ దనకంటె వేరుగా నున్నవని యప్పుడెట్లు తలంచునో యట్లే యీ జాగ్రదవస్థయందును తొలఁగిపోని మిథ్యాజ్ఞానములో నున్నందున వానికి (విభాగవ్యవహారః=) ఈ జగద్భోక్తృభోగ్య భేద వ్యవహారము (దృశ్యతే=) ఉండనేయుండును.

ఏవ మపీతావపి మిథ్యాజ్ఞాన ప్రతిబద్ధైవ విభాగశక్తి రనుమాస్యతే

అట్లై ప్రళయ కాలమందును సత్యాసత్యములను వేఱుచేయఁదగిన విభాగ శక్తి మిథ్యాజ్ఞానమునులోఁ గట్టఁబడియే యున్నందున (అనఁగా జీవునకు మిథ్యాజ్ఞానవిముక్తి కలుగనందున) ప్రళయానంతరమందు జగద్విభాగము పూర్వమువలెనే తోచుచుండును.

III భేదసృష్టికిఁ గారణమైన కర్మాదులు తొలగిపోవుటయే మిథ్యాజ్ఞానము పోవుట ఇదియే ముక్తి- ఇది యబ్బినపిమ్మట ముక్తునకుఁ బునర్జన్మము గలుగుటయే యసంభవము.

ఏతేన ముక్తానాం పునరుత్పత్తి ప్రసంగః ప్రత్యుక్తః, సమ్యగ్ జ్ఞానేన మిథ్యాజ్ఞానస్యాపోదిత త్వాత్

ప్రళయాత్పూర్వమే ముక్తికర్హులై ప్రళయకాలములో బ్రహ్మమందైక్యమై పోయినవారికైనను బునర్జన్మము తప్పదను నాక్షేపణము సైతము (ఏతేన=) పైనఁ జెప్పఁబడిన హేతువుచేతనే (ప్రత్యుక్తః=) కొట్టివేయఁబడినది యగుచున్నది (=సమాధానము పొందినదే యగుచున్నది)— ఎట్లనఁగా:— ముక్తియనఁగా సమ్యగ్ జ్ఞానము— అనఁగా యథార్థజ్ఞానము- అనఁగా జగత్తంతయు బ్రహ్మమే— రెండును వేఱు వేఱుగావు- అనునదియేసుమా ! (సమ్యగ్ జ్ఞానేన=) ఇట్టి జ్ఞానముచేత (ఇట్టి జ్ఞానమెప్పుడు గల్గునో యప్పుడే) మిథ్యాజ్ఞానము (=అవిరెండును వేఱు- వేఱు. అని తలంచుట) (అపోదితత్వాత్ =) తొలగింపఁబడినదగును- (ఇట్టి సందర్భములో ముక్తులకుఁ బునర్జన్మము గల్గునను సంశయముగల్గుటకే యవకాశములేదు.)

IV ప్రళయకాలమందు జగత్తు పరమాత్మతో విభక్తముగా నున్నదని వేదాంతులెప్పుడును చెప్పరు ఈ యాక్షేపణమున కవకాశములేదు ప్రళయమందు గాని స్థితియందుగాని జగత్తు పరమాత్మకంటె భిన్నముగానున్నదని చెప్పుట మిథ్యాజ్ఞానము.

యః పునరయ మంతే వికల్ప ఉత్ప్రేక్షితోఽఽదం జగదపీతావపి విభక్తమేవపరేణ బ్రహ్మణ్యావతిష్ఠేతేతిసోఽప్యనభ్యుప గమాదేవ ప్రతిషిద్ధః

(అంతే=) పూర్వ సూత్రములోఁ గట్టకడపట (ఉత్ప్రేక్షితః వికల్పః=) పూర్వపక్షి యూహించిన కల్పము (alternation) అనఁగా- (ఇదంజగత్ =) ఈ జగత్తు (అపీతౌ + అపి=) ప్రళయకాలమందు సైతము పరబ్రహ్మముతో నేకీభవింపక విచక్షణస్థితిలోనే యున్నదనుకొను పక్షమిచ్చుటఁ జర్చనీయమేగాదు. ఏల యన- (సోఽపి=) అట్టిపక్షమెప్పుడును వేదాంతులవలన (అనభ్యుపగమాదేవ =) అంగీకరింపఁబడనిదే యగుటవలన- (ప్రతిషిద్ధః=) నాకడపటి యాక్షేపముమాచేఁ బ్రతిషేధింపఁబడిన దగుచున్నది అనఁగా ప్రళయకాలమందేగాదు స్థితికాలమందుఁ

కూడ బ్రహ్మముకంటె జగత్తువేఱుగా లేదని వేదాంత మతమగుటచే ప్రతిపక్షి చేసిన యట్టి వికల్పమునకే యవకాశము లేదు

తస్మాత్సమంజస మిదమౌపనిషదం దర్శనం

కాబట్టి మా (ఔపనిషదం దర్శనమ్=) యుపనిషత్సిద్ధాంతము సమంజస మైనదియే యనఁగా సరియైనదియే (కావున విశ్వసనీయమైనదే)

## ౧౦ సూ॥ స్వ ప క్ష దో షా చ్చ

ప॥ వి :– స్వపక్షదోషాత్ –చ

ప్ర॥ ప॥ అ :– స్వపక్షదోషాత్; స్వ = తనయొక్క (సాంఖ్యునియొక్క) పక్ష = పక్షమందు (సిద్ధాంతమందు) దోషాత్ = దోషములేయగుటవలన, చ = కూడ–

సూ తా॥ పై సూత్రములలో సాంఖ్యుఁడు (వేదాంత=) ఉపనిషన్మతమున కారోపించిన దోషములు తన సాంఖ్యసిద్ధాంతమునందేగలవుగాని కార్యమిథ్యాత్వ మును ప్రళయమందును స్థితియందును కారణముకంటె భిన్నముగాఁ (ప్రత్యేక ముగా) గార్యములేదనిచెప్పు నుపనిషన్మత (=వేదాంతమత) మందవి లేవు.

భాష్యము భాష్యార్థము

స్వపక్షేచైతే ప్రతివాదినః సాధారణా దోషాః ప్రాదుష్ష్యుః

(ఏతే=) సాంఖ్యపూర్వపక్షిచే వేదాంతమతముపై విసరఁబడి (మాచేఁ గొట్టివేయఁబడిన) యీదోషములు (ప్రతివాదినః స్వపక్షే–) పూర్వపక్షికిఁ దన పక్షమందే– అనఁగా సాంఖ్యమతసిద్ధాంతమందే (సాధారణాః=) సాధారణములై (సహజముగానున్నవియేయై) (ప్రాదుష్ష్యుః = ప్రాదుర్భవేయుః=) చూపట్టుచున్న యవి– (మాపైఁగొట్టఁదలఁచిన దోషములు మాకుఁదగులక వెనుకకుఁ దిరిగి వారినే కొట్టుచున్నయవి)

కథమిత్యుచ్యతే?

ఎట్లని యడుగుదురేమో? చెప్పుచున్నాము, వినుఁడు.

I గుణరహితమైన ప్రధానము గుణసహితమైన జగత్తునకుఁ గారణమనియు, ప్రళయమందు జగత్తు ప్రధానములో లీనమై పునస్సృష్టిలో మరలఁబుట్టుననియు సాంఖ్యుల మతసిద్ధాంతమైనందున– ప్రళయమందు జగద్దోషములు ప్రధానమున కంటుననునాక్షేపము సాంఖ్యమతముమీదనే పడుచున్నయది–

యత్త్వావదభిహితం విలక్షణత్వాన్నేదం జగ ద్బ్రహ్మప్రకృతికమితి

(ఇదంజగత్ =) ఈజగత్తు (విలక్షణత్వాత్ =) బ్రహ్మముకంటె భిన్నముగా నుండుటవలన (న బ్రహ్మప్రకృతికం=) బ్రహ్మమునుండి పుట్టినదికాదని (యత్త్వావదభిహితం=) నీచేఁజెప్పఁబడినదిగదా!

ప్రధానప్రకృతికతాయామపి సమానమేతత్

ఈజగత్తు ప్రధానమే కారణముగాఁగలది- యనఁగా ప్రధానమునుండియే పుట్టినది. యని చెప్పు నీసాంఖ్యమతమందుగూడ నీవిలక్షణత్వ (కారణముకంటె గార్యము భిన్నముగానున్నదని చెప్పు.) దోషము సమానముగానే యున్నదిసుమా! అదియెట్లంటేని-

శబ్దాదిహీనాత్ ప్రధానాచ్ఛబ్దాదిమతోజగత ఉత్పత్త్యభ్యుపగమాత్

శబ్దాదిగుణములు (శబ్దము వికారములు-అవయవములు) లేని ప్రధానము నుండి శబ్దాదిగుణములుగల జగత్తుయొక్క ఉత్పత్తిని సాంఖ్యులు (అభ్యుపగమాత్ =) అంగీకరించుటవలన- (కారణమైన ప్రధానముకంటె కార్యమైన జగత్తు భిన్నముగానున్నట్టు నీవొప్పుకొనవలసినదియేగదా!)

అతఏవచ విలక్షణకార్యోత్పత్త్యభ్యుపగమాత్ సమానః ప్రాగుత్పత్తేరసత్కార్యవాద ప్రసంగః

ఈహేతువువలన అనఁగా- కారణముకంటె విలక్షణమైన కార్యముయొక్కయుత్పత్తిని సాంఖ్యులంగీకరించుటవలన- కార్యముపుట్టకపూర్వమది (=ఆకార్యము) లేదు- అని చెప్పు అసత్కార్యవాదదోషము మీసాంఖ్యమతమందే యున్నది. (క్రొత్తగాఁ బుట్టినదిగాక యెల్లప్పుడును కారణమందే కార్యమున్నదను సత్కార్యవాదము వేదాంతులదని తెలుపఁబడియేయున్నది)

II ప్రళయమందు జగత్తు కర్మాదినిమిత్తమైన నియమకారణముతో సహ ప్రధానములో లయమైపోవుచుండఁగా, నియమకారణము లేకుండఁగనే మఱల భేద జగత్తు పుట్టుట కవకాశములేదను నాక్షేపముగూడ సాంఖ్యమతము మీదనే పడుచున్నయది.

తథాఽపీతౌ కార్యస్య కారణా విభాగాభ్యుపగమాత్, తద్వత్ప్రసంగోఽపి సమానః

మఱియును (అపీతౌ=) ప్రళయకాలమందుఁ గార్యము (=జగత్తు) విచక్షణము లేకుండ కారణములో (ప్రధానములో) నేకీభవించి పోవుటను సాంఖ్యులంగీకరించు చుండుటవలన, వేదాంతమతముపై సాంఖ్యులచే నారోపింపఁబడినదోషమే సమానముగా వారిమతమందు సైతమున్నది.

తథా మృదిత సర్వ విశేషేషు వికారేష్వ పీతావవిభాగాత్మతాం గతేషు 'ఇదమస్య పురుషస్యోపాదాన మిద మస్యన'

ఎట్లనఁగా :- జగత్తునందున్న వికారవు (విభాగము) లన్నియు (మృదిత సర్వ విశేషేషు) వానివాని సర్వభేదములు పూర్తిగా నశించిపోయినవై ప్రళయ కాలములోఁ బ్రధానమందు (అవిభాగాత్మతాం గతేషు) ఎట్టి పోలికలేకుండలీనమై పోవు (నని సాంఖ్యులొప్పుకొను) సందర్భములో (ప్రళయానంతర మీ జగత్తు పూర్వమువలె మఱల మూర్తీభవించినదని చెప్పుట కవకాశము లేదు ఎందుచేత ననఁగా-)

ఇతి ప్రాక్ప్రళయాత్ ప్రతిపురుషం యేనియతాభేదానతే తథైవ పునరుత్పత్తౌ నియంతుం శక్యంతే, కారణాభావాత్

ప్రళయమునకుఁ బూర్వము జగత్తులోఁ బ్రతిపురుషుని విషయములో- ఈ కర్మాదిక మితనికి (ఉపాదానం=) సుఖాదిభోగ సాధనమైనది, మఱియు నిది యతని కట్లుగాదు- అని ప్రత్యేకింపఁ (=వివేచింప) దగియుండు నియతములగు భేద ములు (ఇప్పుడెట్లున్నవో యట్లె) ప్రళయానంతర సృష్ట్యారంభమం దేర్పడఁ జాలవు. అట్టి భేదముల నేర్పరచు నియమకారణము లన్నియుఁ బ్రళయకాలమందు బీరులేకుండ నశించియే పోవుచున్నట్లు చెప్పఁబడినదిగదా. (శరీరములు సుఖాది భోగసాధనములు- ప్రళయములో నీస్థూలశరీరములేగాక కారణశరీరములుసైతము నిల్చియుండక లీనమైపోవును. పునస్సృష్టిలో మఱల వివిధశరీరముల నేర్పఱచు నియమకారణములే లేనందున మఱల జగత్తేర్పడుట కవకాశము లేదు.)

III ముక్తులైనవారు సైతము ప్రళయానంతర సృష్టిలోఁ బుట్టవలసివచ్చు ననెడి యాక్షేపముసైతము సాంఖ్యమతముమీద నే పడినది. ప్రళయకాలమునకు ముక్తులుగాని వారికిఁగూడఁ గర్మాది నిమిత్తములయామై పోయినది- ఇట్టివారే ముక్తులుసైతము ముక్తులుగానివారు మఱలజన్మించినట్లె ముక్తులైన వారుగూడ జన్మించవలసి వచ్చును.

వినైవచ కారణేన, నియమేఽభ్యుపగమ్య మానే కారణాభావ సామ్యాత్ ముక్తానా మపి పునరంధ ప్రసంగః

పునస్సృష్టిలో భేదములయొక్క నియమము లేర్పడుటకెట్టి కారణము లేకుండఁగనే, అట్టినియమము లుండునని యంగీకరించు పక్షమందు, కారణములేక పోవుట యనునది ముక్తులైన జీవులకెట్లో ముక్తులుగాని జీవులకుసైతమట్లె వర్తించు చున్నదని చెప్పవలెను. కారణము లేకపోయినను ముక్తులుగాని జీవులెట్లు ప్రళయా నంతర సృష్టిలోఁ బూర్వభేదములతో బంధయుక్తు లగుచున్నారో, ముక్తులైన

జీవులుసైత మళ్లి పునస్సృష్టిలో బంధయుక్తులై పుట్టుచునేయుందురని యొప్పు కొనకతప్పదు (భేదజగత్తు-ముక్తజీవులు-ప్రళయము-పునస్సృష్టి- అను నీవిషయము లొప్పుకొను సాంఖ్యులు ప్రళయములో జీవులందఱు ప్రధానములో భేదములేకుండఁ గలిసిపోయినట్లు చెప్పుచున్నప్పుడు, ముక్తజీవులుసహా యందరును పునస్సృష్టిలోఁ బుట్టుచున్నారని యొప్పుకొనవలెను గాని కారణములేకయే కొందరు వత్తురు కొందరు రారనిచెప్పుటకు వీలులేదు.)

VI ముక్తులైనవారు ప్రధానమందేకమైపోయి ముక్తులుగానివారు మాత్రము ప్రళయకాలమందు ప్రధానముకంటె భిన్నముగానుండి మఱల పునరస్సృష్టిలో పూర్వమువలె జన్మింతురన్నచో- ముక్తులుగానివారికి ప్రధానము కారణమేగాదని చెప్పవలసివచ్చును. కారణమేయైనచో ప్రళయమందు కార్యము కారణములోఁ గలిసియే పోయియుండును.

అథకేచిద్భేదా అపీతావ విభాగమాపద్యంతే కేచిన్నేతిచేత్ యేనాపద్యంతే తేషాం ప్రధానకార్యత్వం న ప్రాప్నోతీ త్యేవమేవదోషాః సాధారణత్వా న్నాన్యతరస్మి న్పక్షేచోదయితవ్యాభవం తీత్యదోషతామేవైషాందర్శయతి

పైనఁ దెలిపిన యసందర్భమును దప్పించుకొనుటకై ప్రళయమందు [కేచిద్భేదాః=) గొందరు (ముక్తులైన జీవులు) మాత్రమే కారణమైన ప్రధాన మందు భేదములేకుండఁ గలిసిపోదురనియు, (కేచిత్ =) మఱికొందరు (బద్ధులుగా నున్న జీవులు) ప్రధానమందునభేదముగాఁగలిసిపోక వేరుగానే యుందురనియు వాదించవలసియుండును. ఇట్లు వాదించినను, ఏజీవులు ప్రధానమందైక్యమును గాంచరో, వారు పునస్సృష్టిలో ప్రధానప్రకృతికులుగారు- అనఁగా వారు (సర్వ జగత్తునకుఁ గారణమని చెప్పఁబడు) ప్రధానమునుండి యేర్పడినవారుకారు- అని యొప్పుకొనవలసివచ్చును (ప్రధానమునుండి పుట్టినవారేయగుచో ప్రళయమందుఁ బ్రధానమందుఁ గలసిపోవువారే యనక తప్పదు. కాబట్టి వేదాంతముపై సాంఖ్యుఁ డేకరువుబెట్టిన దోషములు సాంఖ్యమతముమీద సైతము మోపఁదగిన సామాన్య ములేయై యున్నందున, అట్టివాని నన్యోన్యముపయోగింపఁదగదు.

సాంఖ్య పూర్వపక్షిచేసిన యాక్షేపములు సాంఖ్యమతమునకే వర్తించు చున్నవి. వేదాంతమతమునకట్టి దోషములులేవు కావున వేదాంతమతమే యాశ్ర యింపఁబడవలసినది-

అవశ్యాశ్రయితవ్యత్వాత్

రెండుమతములయందట్టి దోషములు సాధారణముగానే యున్నప్పుడే 'ఏమత మాశ్రయింపఁబడవలసినది' యని తేల్చిచెప్పవలసివచ్చుచో, అట్టి దోష

ములు వేదాంతమతమును భంగపఱచునవిగా వని లోగడిసూత్రమందే సిద్ధాంతము చేయఁబడియున్నందున, ఆసిద్ధాంతము వేదాంతమతముయొక్క నిర్దోషత్వమునే (ద్రఢయతి=) బలపఱచుచున్నది.

11వ సూత్రమున కవతారిక :-

ఒకానొక తర్కమున కప్రతిష్ఠాన (నిలుకడలేమియను) దోషమున్నను, ఎట్టి దోషము లంటకుండగనే నిర్దుష్టతర్క మనుమానింపఁబడవచ్చునని పూర్వపక్షి వాదించుచో, జగత్కారణమగు బ్రహ్మమును దెలిసికొను విషయములో కేవల తర్క ముపయోగింపఁజాలదనియు, ఒక్కయుపనిషత్తులు. వానియర్థమున కనుకూలించు తర్కముమాత్రమే యుపయోగించుననియు నిరూపించుట కీక్రిందిసూత్రము చెప్పఁబడుచున్నది.

## ౧౧ సూ॥ తర్కా ప్రతిష్ఠానాదప్యన్యథాను మేయమితిచే, దేవ మప్యవిమోక్ష ప్రసంగః

ప॥ వి :- తర్కాప్రతిష్ఠానాత్-అపి-అన్యథా-అనుమేయం-ఇతి-చేత్-ఏవం-అపి అవిమోక్ష ప్రసంగః.

ప్ర. ప, అ :- తర్కానాత్; తర్క తర్కముయొక్క, అప్రతిష్ఠానాత్= నిలుకడలేమి-హద్దులేమి-పునాదిలేమి వలన-, అపి=అయినను, అన్యథా=మతియొక విధముగా, అనుమేయం=యోచింపఁదగినది, ఇతిచేత్ = అనిచెప్పచో, ఏవమపి= ఇట్లయినను, అవిమోక్ష ప్రసంగః; అవిమోక్ష=మోక్షము (=విడుదల) లేకపోవుట యొక్క, ప్రసంగః=ప్రాప్తి

సూ॥ తా:- తర్కములకు సామాన్యముగా స్థిరత్వము లేకపోవుటయను దోషముగలదనుకొన్నను, అట్టిదోష మేదియు రాకుండఁగనే సాంఖ్యమత సిద్ధాంతములో నిర్దుష్టతర్కమే యుపయోగింపఁబడినట్లెంచఁదగియున్నదని సాంఖ్యపూర్వపక్షి వాదించినను ప్రస్తుతాంశమునకుఁ బ్రయోజనకారికాదు జగత్కారణ మేదియని నిర్ణయించు విషయములో సాంఖ్యతర్క దోషమునుండి విముక్తిగలుగదు-వేదాంతమతమునే యంగీకరింపవలెనుగాని సాంఖ్యమతావలంబనముచే మోక్షము లేకపోవుటయే ప్రాప్తించును,

భాష్యము భాష్యార్థము

ఇతశ్చనాగమగమ్యేకర్థేకేవలేన తర్కేణ ప్రత్యవస్థాతవ్యం

ఈ కారణమువలనఁగూడ (=తర్కమునకు నిలుకడలేనందువలనఁ గూడ)

శ్రుతివలన మాత్రమే తెలియఁబడఁదగిన విషయమందు కేవలతర్క (యుక్తి) బలముచేత (నప్రత్యవస్థాతవ్యం=) వాదమునకు బయల్దేరఁగూడదు-

I సూత్రములోని పూర్వపక్షభాగము- 'తర్కాప్రతిష్ఠానాదప్యన్యథానుమేయమితిచేత్'

(౨) పూర్వపక్షి యనువదించిన సిద్ధాంతభాగము 'తర్కాప్రతిష్ఠానాదపి'

యస్మాన్నిరాగమాః పురుషోత్ప్రేక్షామాత్రనిబంధనా స్తర్కా భవంతి ఉత్ప్రేక్షాయా నిరంకుశత్వాత్

ఎందుచేననఁగా (నిరాగమాః=) శ్రుతికి వ్యతిరేకములుగాఁ గేవల పురుష బుద్ధ్యతిశయముచేతఁ (నిబంధనాః=) గూర్పఁబడిన (తర్కాః=) యుక్తులు (అప్రతిష్ఠాతాః=) నిలుకడగలవిగావు- అనఁగా- అవే యప్రతిహతములుగా నిల్చియుండఁదగినవిగావు ఇందులకు హేతువు- ఊహ కెప్పుడును నిర్బంధము (హద్దు) లేకపోవుటయే (ఎప్పుడును నూహాపై నూహవచ్చుచునే యుండును)

తథాహి క్వైశ్చిదభియుక్తైర్యత్నేనో త్ప్రేక్షితా స్తర్కా అభియుక్తతరై రన్యైరాభాస్యమానా దృశ్యంతే తైరప్యుత్ప్రేక్షితా స్తదన్యైరాభాస్యంత ఇతినప్రతిష్ఠితత్వం తర్కాణాం శక్యం సమాశ్రయితుం పురుష మతివైరూప్యాత్

అదెట్లనఁగా- కొందరు (అభియుక్తైః=) తెలివిగలవారిచేతఁ బ్రయత్నపూర్వకముగా నూహించి చేయఁబడిన యుక్తులు (అభియుక్తతరైః=) అంతకంటెఁ దెలివిగలవారగు మఱికొందరిచేత నూహించి చేయఁబడిన యుక్తులకు (ఆభాస్యమానాః=) లొంగిపోవుటను జూచుచున్నారము- ఈపెద్దయుక్తులు సైతమంతకన్న పెద్దవారి పెద్దయుక్తులచే నోటమిని (అపజయమును) జెందుచునే యున్నవి- ఇందుచేతనే యుక్తులకు నిలుకడగలదని సమర్థించుటకు శక్యముగాదు యుక్తులనఁగా బురుషభావములే- ఈపురుషభావము లెప్పుడును (వైరూప్యాత్=) ఒకటిగానొకతీరుగా నుండునవిగావు (నిలుకడలేదని చెప్పుటకిదియే కారణము-

అథకస్యచిత్ప్రసిద్ధమాహాత్మ్యస్య కపిలస్యాన్యస్యవా సమ్మత స్తర్కః ప్రతిష్ఠిత ఇత్యాశ్రీయేత

అట్లయిననేని, లోకప్రసిద్ధుఁడై గొప్పమాహాత్మ్యముగల కపిలమహర్షిగాని లేక యంతవాఁడగు మఱియొకఁడుగాని మార్షించినతర్క (యుక్తి) మెప్పుడును నిలుకడగలదిగానే యుండును గావున నిట్టితర్కమవలంబింపఁబడవలసినదే యని వాదింపఁబడవచ్చును.

ఏవమప్య ప్రతిష్ఠితత్వమేవ; ప్రసిద్ధమాహాత్మ్యానుమతానామపి తీర్థకరాణాం కపిల కణభుక్ప్రభృతీనాం పరస్పర విప్రతిపత్తి దర్శనాత్

అట్టి గొప్పవారు సమ్మతించినదైనను నాతర్కము (అప్రతిష్ఠితత్వమేవ=) సరియైన పునాదిలేనిదియే; లోకప్రసిద్ధమైన మాహాత్మ్యముగలవారై (తీర్థకరాణాం=) ప్రత్యేకమార్గస్థాపకులైన యనఁగా ప్రత్యేకమత సిద్ధాంతకర్తలైన కపిల మహర్షి (కణభుక్=) కణాదుఁడు గౌతముఁడు పతంజలి- జైమిని మొదలగువారి మతములలోఁ బరస్పర వైలక్షణ్యములు (భేదములు) లేకుండెనా! (అనఁగా భేదములు గన్పట్టుచునే యున్నవి. గాన నంతవారిమతములు సైతము ప్రతిష్ఠితములే) ఇట్టిది వేదాంతులవాదమని పూర్వపక్షిచే ననువదింపఁబడినది.

(బి) పూర్వపక్షి యనువదించిన సిద్ధాంతభాగమునకుఁ పూర్వపక్షియిచ్చెడి సమాధానము 'అన్యథానుమేయమ్'

(పూ॥ ప)

(అథ+ఉచ్యేత=) పూర్వపక్షి సమాధాన మేమనఁగా:—

అథోచ్యేతాన్య థావయమను మాస్యామహేయ థానాప్రతిష్ఠితత్వదోషోభవిష్యతి;

అట్టి ప్రసిద్ధపురుషుల సిద్ధాంతములకు (అప్రతిష్ఠితత్వదోషః=) సరియైన పునాదిలేదనెడి దోషమారోపించుట కవకాశములేని రీతిగానే యాసిద్ధాంతములను (వయం+అనుమాస్యామహే=) మేము యుక్తులచేత నిల్వఁబెట్టఁగలము!

నహిప్రతిష్ఠిత స్తర్కఏవనాస్తీతి శక్యతే వక్తుం;

(ప్రతిష్ఠితః+తర్క.=) హద్దుతో ముగిసిపోయిన- అనఁగా- పైయుక్తితో నెదిరింపఁబడుట కవకాశములేని తర్కమే (యుక్తియే) (నాస్తీతి=) లేదనిచెప్పుటకు (న—శక్యతే ) సాధ్యముగాదు.

ఏతదపిహి తర్కాణామ ప్రతిష్ఠితత్వం తర్కేణైవ ప్రతిష్ఠాప్యతే

(ఏతదపిహి=) ఈవిషయమునుగూడ ననఁగా (తర్కా...తత్వం=) తర్కము (యుక్తు) లెప్పుడును సరియైనపునాదులుగలవి కావు' అని నీవుచేసిన నిర్ధారణమునుగూడ (వేదాంతి) (తర్కే...ప్యతే=) తర్కము(యుక్తి) చేతమాత్రము నిల్వఁబెట్టవలసినదే (ఋజువుచేయవలసినదే) (గాని నీకు గత్యంతరములేదు)

కేషాంచిత్తర్కాణాం మప్రతిష్ఠితత్వ దర్శనేనాన్యేషామపి తజ్జాతీయానాం తర్కాణామప్రతిష్ఠితత్వ కల్పనాత్,

అశ్లేటికనుచున్నామనఁగా— కొన్నితర్కములు (యుక్తులు) సరియైనపునా

దులుగలవి (గట్టి నిలుకడగలవి) కానట్లు కన్పట్టుచున్నందున, తత్సంబంధములైన యితరతర్కములుకూడ నిలుకడగలవి కావు- అని నీవు (యుక్తిచేతమాత్రమే) కల్పించి చెప్పుచున్నావు- [నీవుచేసిన నిర్ధారణమునకు నీకుసైతము యుక్తియే యాధారమై యున్నదిగదా !]

సర్వతర్కాప్రతిష్ఠాయాంచ సర్వలోక వ్యవహారోచ్ఛేద ప్రసంగః

సర్వతర్కములు నిలుకడలేనివే- యనఁగా వానిపై నాధారపడుటకు వీలు లేనివేయని నిశ్చయించు పక్షమున [కేవలము యుక్తులమీదనే యాధారపడి యుండు] సర్వలోక వ్యవహారములు పూర్తిగా భంగపడిపోవలసినదేగదా [లోక వ్యవహారములే సాగవనిభావము]

అతీత వర్తమానా ధ్వ సామ్యేన హ్యనాగతేష్వ ధ్వని సుఖదుఃఖప్రాప్తి పరిహారాయ ప్రవర్తమానో లోకదృశ్యతే

ఎందుచేననఁగా— లోకములో సుఖమును సంపాదించుకొనుటకు దుఃఖమును బోఁగొట్టుకొనుటకుఁ బ్రవర్తింప యత్నించు ప్రతిపురుషుడును (సాధారణముగాఁ దనవంటివారిచే) భూత వర్తమానకాలములం దెట్టిమార్గము లవలంబింపఁ బడినవో ముందట్టి మార్గములనే తానును నవలంబించుట సహజము. (గత కాలమెట్లు జరిగినదో యాగతకాలము సైతమట్లె జరుగునను యుక్తిసాధనముతో లోకముప్రవర్తించుచుండుట సహజము- ఇట్టియుక్తిని నిరాకరించుచో లోకపు నడకయేసాగదు)

శ్రుత్యర్థ విప్రతిపత్తౌ చార్థాభాస నిరాకరణేన సమ్యగర్థ నిర్ధారణం తర్కేణైవ వాక్య వృత్తి నిరూపణ రూపేణ క్రియతే

(శ్రుతులుచెప్పినట్లే పోవలెనను పట్టుదలగలవారికి సైతము) ఒకే విషయమునుజెప్పు పెక్కుశ్రుతులయొక్క యర్థమందుఁ బరస్పర విరోధము తటస్థించినప్పుడు (లేక యొక్క శ్రుతియర్థమే రెండువిధములుగాఁ దోచునప్పుడు) (అర్థాభాస=) సరిగాక సరియైనదానివలె భ్రమపెట్టు (సుష్టువుగాని) యర్థమేదియో దానిని ద్రోసివేయుటకుఁగాను, (వాక్యవృత్తి=) శ్రుతివాక్యములయొక్క సరియైన యర్థము లెట్లు తీయవలయునో నిరూపించు సూత్రరూపములైన తర్కములే యుపయోగింపఁ బడుచుండును.

మనురపి చైవ మేవమన్యతే

ఈ విషయమందు స్మృతికారుఁడైన మనువుసైతమిట్లే చెప్పుచున్నాడు చూడుఁడు—

'ప్రత్యక్ష ' మనుస్మృతి XII-105 'ప్రత్యక్ష మనుమానంచ శాస్త్రంచ వివిధాగమమ్ త్రియం సువిదితం కార్యం ధర్మశుద్ధి మభీప్సతా'

'(ధర్మశుద్ధిం=) ధర్మముయొక్క నిజస్వరూపమును (అభీప్సతా=) తెలియఁ గోరువానిచేత (ప్రత్యక్షం=) ప్రత్యక్షప్రమాణమును (అనుమానంచ=) అనుమాన ప్రమాణమును (వివిధాగమం-శాస్త్రంచ=) వివిధరీతులలోఁ గూడిన స్మృత్యాది శాస్త్రమును (త్రయం=) అనునీమూఁడును (సువిదితం=) బాగుగా గ్రహింపఁబడఁ దగినవి

'ఆర్షం ' మనుస్మృతి XII-106 'ఆర్షం ధర్మోపదేశం చ వేదశాస్త్రా విరోధినా యస్తర్కేణాను సంధత్తే, సధర్మం వేదనేతరః'

'(యః=) ఎవఁడు (ఆర్షం=) ఋషిప్రోక్తమైన వేదమును (ధర్మోపదేశంచ=) స్మృతులుబోధించుదానిని (వేదశాస్త్రావిరోధినా=) వేదశాస్త్రములకు వ్యతిరేకింపని (తర్కేణ=) తర్కముతో-యుక్తులతో (అనుసంధత్తే=) జోడించుచున్నాఁడో (సఃధర్మంవేద=) వాఁడే ధర్మమెఱిఁగినవాఁడు- (న+ఇతరః=) ఇతరుఁడు ధర్మ మెఱిఁగినవాఁడుగాఁడు'

ఇతిచ బ్రువన్

అని మనువు చెప్పుచున్నాఁడు.

అయమేవచ తర్కస్యాలం కారోయద ప్రతిష్ఠితత్వం నామ

(యద ... నామ=) తర్కమునకు నిలుకడలేదని నీవాక్షేపించుటేది గలదో (అయమేవచ=) యదియే (మా) తర్కమున కలంకారము- అనఁగా తర్కమునకు మెఱుఁగు దెచ్చునదిసుమా ! (ప్రతితర్కము నిలుకడగలదియే యనఁగా హద్దుగలదియే యగుచో వాదోపవాదమే యుండఁజాలదు వాదోపవాదయుక్తమైనదే తర్కమనఁబడును.

ఏవంహిసావద్య తర్క పరిత్యాగేన నిరవద్యస్తర్కః ప్రతిపత్తవ్యో భవతి

ఎందుచేతననఁగా- (పూర్వపక్షియైనవానిచే) దోషముతోఁగూడిన యుక్తివాదమొక విషయమందుఁ జేయఁబడినప్పుడు దానిని దోసిపేయుటకు సిద్ధాంతి యుపయోగించు నిర్దోషమైన (ఖండనరూపు) తర్కము (ప్రతిపత్తవ్యోభవతి=) గ్రహింపఁబడఁదగినదియేగదా !

(తర్కమున్న దెల్లను నిర్దోషమేయగుచో. పూర్వపక్షమేయుండదని చెప్పవలెను. పూర్వపక్షములేనిది సిద్ధాంతమునకు మెఱుఁగురాదు- కాబట్టి దోషసహిత తర్కము దానిని ఖండించు నిర్దోషతర్కము ఉండుటయే తర్కశాస్త్రముయొక్క శక్తి- పూర్వపక్ష సిద్ధాంతములుగలదియే తర్కమనఁబడును)

నహిపూర్వజోమూఢ ఆసీదిత్యాత్మనాపిమూఢేన భవితవ్యమితి కించిదస్తి ప్రమాణం

ఇద్దఱన్నదమ్ములలో పెద్దవాడు మూఢుఁడైనందునఁ జిన్నవాడు సైతము మూఢుఁడేయై తీరవలయునని వాదించుట కెంతమాత్ర మవకాశముండదు. (ఇట్లే పూర్వపక్షి యుపయోగించిన తప్పుయుక్తి నిలుకడగలది గాదు గావున అందుపై సిద్ధాంతి ప్రయోగించిన ఖండనయుక్తి సైతము నిలుకడగలదిగాదని చెప్పఁదగదు. సరియైన యుక్తికి రావలెనన్న నంతకుముందు సరిగాని యుక్తియొకటి యుండనే యుండును. మొదటియుక్తి సరిగానిది గావున యుక్తులన్నియు సరిగానివేయని చెప్పదగదు.

తస్మాన్నతర్కా ప్రతిష్ఠానందోషః

కాబట్టి తర్కమునకు నిలుకడలేకపోవుట యనునది సర్వసామాన్యముగాఁ దర్కములన్నింటికిఁ జెప్పఁదగిన దోషముగాదు.

II సూత్రములోని సిద్ధాంతభాగము (ఏవమప్య విమోక్షప్రసంగః)

ఇతిచేదేవమప్య విమోక్షప్రసంగః

ఇట్లని తర్కమును స్థాపించుట కింతగా వాదముచేయఁబడినను (పెనుగులాడఁ బడినను) దోషమునుండి తర్కమున కెప్పుడును విముక్తిలేదు. అనఁగా తర్కమెట్టిదైనను దోషయుక్తముగానే యుండును. (తర్కశాస్త్రముమీఁదనే యాధారపడి యుండునెడల నిజమైనమోక్షమే చేకూరదు- అనియుఁ జెప్పఁదగును)

యద్యపిక్వచిద్విషయే తర్కస్య ప్రతిష్ఠితత్వ ముపలక్ష్యతే తథాపిప్రకృతే తావద్విషయే ప్రసజ్యత ఏవాప్రతిష్ఠితత్వ దోషాదనిర్మోక్షస్తర్కస్య

ఎందుచే నట్లందురేమో- ఎక్కడనో యేదోయొక విషయమందు తర్కము నిలుకడ (నిశ్చలత్వము) గలదిగాఁ బట్టినను, ప్రస్తుతము విచారించఁబడుచున్న విషయమందు (బ్రహ్మ జగత్కారణ విషయమందు) మాత్రము 'నిలుకడ (హద్దు) లేనిదోషము' నుండి తర్కమునకు విముక్తిలేదనియే చెప్పవలసి యున్నది. (=జగత్కారణమేదియని నిశ్చయించు విషయమునకుఁ దర్కముపై నాధారపడి ప్రయోజనములేదు)

నహీదమతిగంభీరం భావయాథాత్మ్యం ముక్తినిబంధన మాగమంతరేణో త్ప్రేక్షితుమపిశక్యం

ఈ (భావయాథాత్మ్యం=) యథార్థభావము- అనఁగా నీజగత్కారణ విషయము మిక్కిలి గంభీరమైనది (లోతైనది- ఊహాలకు యుక్తులకు నందనిది) యు- (ముక్తినిబంధనం=) ముక్తిని నిశ్చయించునది- (అనఁగా దానిని దెలిసికొనుటయే

ముక్తిస్వరూపముగాఁగలది) (ఆగమమంతరేణ=) వేదవాక్యసహాయము లేకుండ నిట్టిదని యూహించుటకైనను సాధ్యముగానిదియునై యున్నది.

రూపాద్యభావాద్ధి నాయమర్థః ప్రత్యక్షస్య గోచరో లింగాద్యభావాచ్చ నానుమా
నాదీనామిత్యవోచామ

(అయమర్థః=) ఈవిషయము- అనఁగా జగత్కారణము (=బ్రహ్మము) రూపము- ఆకారము లేనిదిగావున ప్రత్యక్ష (ఇంద్రియ) ప్రమాణముల (నగోచరః=) కింకనపడదనియు, (లింగాద్యభావాచ్చ=) అగ్నికి ధూమమువలెఁ బైకిఁగనుపించు నట్టిచిహ్నములు (గుర్తులు) లేనిది గావున అనుమానాది (ఊహాదితర్కములకు) ప్రమాణముల (నగోచరః=) కలవికానిదనియు నని (నిదివరకే) చెప్పి యుంటిమిగదా!

అపిచ సమ్యగ్ జ్ఞానాన్మోక్షఇతి సర్వేషాం మోక్షవాదినామభ్యుపగమః

మఱియు మోక్షమనునది యొకటున్నదని యొప్పుకొను సర్వమతస్థులు (సమ్యగ్జ్ఞానాత్=) యథార్థ జ్ఞానమువలననే మోక్షము చేకూరుననువిషయ (మభ్యుపగమః) మంగీకరించునదియే.

తచ్చ సమ్యగ్ జ్ఞానమేక రూపం వస్తుతంత్రత్వాత్

ఆయథార్థజ్ఞానమన్ననో, (వస్తుతంత్రత్వాత్=) అది తెలుపు వస్తువెట్టిదో యట్టిదేయై యుండునుగావున, నది (ఏకరూపం=) పలుతెఱంగులుగాఁగాక యొకరే రూపమున నుండును.

ఏకరూపేణ హ్యవస్థితో యోऽర్థః స పరమార్థః

ఒకవస్తు వెట్టి వికారమును (మార్పులు) భేదములును లేకుండ నెప్పుడొకే రూపమున స్థిరమై నిల్చియుండునో, ఆవస్తువే (పరమార్థః=) వాస్తవమైనదని- (సత్యమైనదని- ఉత్కృష్టతమ విషయమని-) చెప్పఁబడును.

లోకే తద్విషయం జ్ఞానం సమ్యగ్జ్ఞాన మిత్యుచ్యతే యథాగ్ని రుష్ణఇతి

లోకమందట్టివస్తువును దెలుపునదియే 'జ్ఞాన' మందురు- అట్టి వస్తుజ్ఞానమే- అనఁగా 'నిప్పు వేడిది' యని తెలుపుట యెట్టిదియో యట్టి జ్ఞానమె 'సమ్యక్ జ్ఞానము' (సంపూర్ణజ్ఞానము-యథార్థజ్ఞానము) అని చెప్పఁబడును.

తత్రైవంసతి సమ్యగ్ జ్ఞానే పురుషాణాం విప్రతిపత్తి రనుపపన్నా

ఇట్టిసందర్భములో 'సమ్యగ్ జ్ఞాన' విషయమందు- అనఁగా వస్తుయథార్థ జ్ఞానవిషయమందు (వస్తువెట్టిదో తెలిసికొనుటయందు) పురుషులలోఁ (విప్రతిపత్తిః=) బరస్పరవిరోధముండుట యెన్నటికిని (అనుపపన్నా) సంభవింపదు.

(నిప్పుట్టిది ? యని యడుగఁగా, ప్రతిమనుష్యుఁడును 'వేడిది' యనియే చెప్పునుగాని మార్పుగాఁ జెప్పఁబడరుగదా ! మార్పుగాఁ జెప్పుట సంభవించినచో, ఆవస్తువు యొక్క యథార్థజ్ఞానము (సమ్యగ్జ్ఞానము) లభింపలేదనియే చెప్పకతప్పదు.

తర్కజ్ఞానానాం త్వన్యోన్యవిరోధాత్ ప్రసిద్ధావిప్రతిపత్తిః యద్ధికేనచిత్తార్కికేణే దమేవసమ్యగ్ జ్ఞానమితి ప్రతిష్ఠాపితం తదపరేణ వ్యుత్థాప్యతే

తర్కశాస్త్రములన్ననో యొకటిచెప్పిన దానికంటె మఱియొకటి (కొంత కొంత) వ్యతిరేకముగాఁ జెప్పుచున్నందున, నవి విశ్వసనీయములుగావను విషయ మందరకుఁ దెలిసినదియే- ఎందుచేననఁగా:- ఒకానొక తార్కికుఁడు 'ఇదియే సమ్యగ్జ్ఞాన' (=యథార్థజ్ఞాన) మని (తనతన యుక్తులచేత) స్థాపించినవిషయమే మఱి యొకతార్కికునిచేత (వ్యుత్థాప్యతే=) నెగరఁగొట్టివేయఁబడుచున్నది.

తేనాపిప్రతిష్ఠాపితం తతోఽపరేణ వ్యుత్థాప్యతఇతి ప్రసిద్ధంలోకే

ఈరెండవ తార్కికుఁడు నిజమని స్థాపించినవిషయమే వానికంటె గట్టివాఁడగు మఱియొకనిచేత (వ్యుత్థాప్యతే=) ద్రోసివేయఁబడుచున్నది. ఇట్లగుట లోకములోఁ దేటతెల్లముగాఁ గనుపట్టుచునే యున్నది,

కథమేకరూపానవస్థితవిషయం తర్కప్రభవం సమ్యగ్జ్ఞానంభవేత్ ?

ఇట్టి సందర్భములోఁ దర్కము (యుక్తివాదశాస్త్రము) వలనఁ దేల్చఁబడినను నొక్కరూపము (రీతి) మీఁద నిల్చియుండని విషయము 'సమ్యగ్జ్ఞాన' మని యెట్లు చెప్పఁబడఁగలదు ?

నచప్రధానవాదీ తర్కవిదా ముత్తమ ఇతి సర్వైస్తార్కికైః పరిగృహీతః, యేన తదీయం మతం సమ్యగ్ జ్ఞానమితి ప్రతిపద్యేమహి

(నైయాయిక - వైశేషిక - సాంఖ్య - యోగులు మొదలగు) తర్కవేత్త (సిద్ధాంతు) లందరిలోఁ బ్రధానవాది (సాంఖ్యమతమును స్థాపించిన కపిలుఁడు యుత్తముఁడని యందరు తార్కికులచేత నంగీకరింపఁబడు విషయమేగావున నా కపిలమహర్షి నిల్వఁబెట్టిన సిద్ధాంత (=మత)మే 'సమ్యగ్జ్ఞాన' మని యేల విశ్వసింపఁగూడదని ప్రతిపక్షి యడుగవచ్చును.

నచశక్యంతే

అట్లనుటకు సాధ్యముగాదు.

అతీతానాగత వర్తమానా స్తార్కికా ఏకస్మిన్ దేశే కాలేచ సమాహర్తుం యేన తన్మతి రేకరూపైకార్థ విషయా సమ్యఙ్మతి రితిస్యాత్

(అతీ...మానాః=) భూతభవిష్యద్వర్తమాన కాలములయందుండు సమస్త తార్కికుల నొకేకాలమందొకే ప్రదేశములోఁ (సమాహర్తుం=) గూర్చుటకు సాధ్యమై (ఏకార్థవిషయా=) యొకవస్తువిషయమున (తన్మతిః=) వారందరిచ్చు నభిప్రాయము (ఏకరూపా=) ఒకేరూపముననుండు నట్టిదిగాఁ జేయఁగల్గినచో నది (సమ్యఙ్మతిః) 'సమ్యగ్జ్ఞాన'మని చెప్పవచ్చును. (అట్టిది సాధ్యమేగాదు)

వేదస్యతు నిత్యత్వే విజ్ఞానోత్పత్తి హేతుత్వేచసతి వ్యవస్థితార్థ విషయత్వోపపత్తేః

వేదమన్ననో నిత్యమైనదియు, విజ్ఞానమును (విశేషమైన యనుభవజ్ఞానమును) బుట్టింప సామర్థ్యముఁగలదియునై యున్నందున నయ్యది (వ్యవస్థితార్థ విషయత్వోపపత్తేః=) బోధించువిషయము లెల్లను వ్యవస్థితార్థములని— అనఁగా— అట్టిటుమారుటకు వీలులేనివని నమ్మఁదగియుండును.

తజ్జనితస్య జ్ఞానస్య సమ్యక్త్వ మతీతానాగత వర్తమానైః సర్వైరపి తార్కికై రపహ్నోతు మశక్యం

కాబట్టి వేదబోధవలనఁ గలుగుజ్ఞానమే (సమ్యక్త్వం=) సమ్యగ్ జ్ఞానమని (=సరియైనజ్ఞానమని) చెప్పఁదగి యుండుటయేగాక దానిని (అపహ్నోతుం=) గాదని త్రోసివేయుటకు భూతభవిష్యద్వర్తమాన కాలములయందుండు నెట్టి తార్కికుల కైనను సాధ్యముగాదు.

అతస్సిద్ధమస్యై వౌపనిషదస్య జ్ఞానస్య సమ్యగ్జానత్వం

అందుచేతనే (వేదాంశ=) ఉపనిషత్సంబంధమైన— అనఁగా... ఉపనిషత్తులు బోధించు జ్ఞానమే సమ్యగ్జ్ఞానమని చెప్పఁదగియుండుట నిశ్చయము.

అతోఽన్యత్ర సమ్యగ్జానత్వా నుపపత్తేః సంసారా విమోక్ష ఏవ ప్రసజ్యేత

(అతోఽన్యత్ర=) ఉపనిషత్తులకంటె మఱియొకమార్గమున సమ్యగ్జ్ఞానము లభించుట సంభవముగానందున అట్టి సమ్యగ్జ్ఞాన మవలంబింప కున్నచో— జనన మరణాది దుఃఖరూప సంసారమునుండి యెప్పటికిని (అవిమోక్షః=) విడుదలలేకపోవుటయే (ప్రసజ్యేత=) కలిగితీరును.

అత ఆగమవశేనా గమానుసారి తర్కవశేన చ. చేతనం బ్రహ్మజగతః కారణం ప్రకృతిశ్చేతి స్థితం

కాబట్టి వేదముచేయు బోధనుబట్టి చూచినను, వేదోపదేశమునకు విరుద్ధముగాని (=అనుసారి) తర్కమునుబట్టి చూచినను చేతనమైన బ్రహ్మమే యీ జగత్తునకు (కారణం=) నిమిత్తకారణమును (ప్రకృతిశ్చ=) ఉపాదానకారణమును అగు ననుట (స్థితం=) నిశ్చయము.

# 4 శిష్టాపరిగ్రహాధికరణం

అధికరణావతారిక :—

ప్రధాన కారణవాదులైన సాంఖ్యులమతము లోఁగడి యధికరణముచేత ఖండింపఁ బడినది. ప్రధానకారణవాదము కొన్నియంశముల యందైనను వేదవిరుద్ధముగాకయు, విశేష తర్కబలముగలిగియు, పెద్దలచే నంగీకరింపఁబడియు నున్నది. ఐనను జగత్కారణ విషయమై వేదాంతమతమునకు విరుద్ధముగా నున్నందున అయ్యదియే నిరాకరింపఁబడినందున వేదముతోఁ బూర్తిగా నేకీభవించినట్టియు, మనువు మొదలగు పెద్దలచేనెందును బరిగ్రహింపఁ బడనట్టియు అణ్వాది కారణ వాదులగు కాణాదమతములగతి వేఱచెప్ప నేల? సాంఖ్యమతము నిరాకరింపఁబడిన హేతువులచేతనే, తర్క-కాణాదాదిమతములు సైతము ఖండింపఁబడినట్లెయెంచ వలయునని రాఁబోవు నధికరణము చెప్పుచున్నయది. ఇట్టిదానిని 'అతిదేశ న్యాయ' మందురు—

## ౧౨ సూ॥ ఏతేనశిష్టాపరిగ్రహా అపివ్యాఖ్యాతాః

ప. వి :— ఏతేన - శిష్టాపరిగ్రహాః - అపి వ్యాఖ్యాతాః

ప్ర. ప. అ :— ఏతేన=ఇందుచేత- (సాంఖ్యమత నిరాకరణముచేత); శిష్టాపరిగ్రహాః=శిష్ట=శిష్టులచేత (పెద్దలచేత), అపరిగ్రహాః = అంగీకరింపఁబడని మతములు; అపి=సైతము; వ్యాఖ్యాతాః=ఖండింపఁబడినవి.

సూ తా :— శిష్టులగు మను వ్యాసాదులచేతనే యొక్క యంశమందును నంగీకరింపఁబడని అణ్వాది కారణవాదములు (కాణాదాది మతములు) సైతము, పూర్వాధికరణమందుఁ జేయఁబడిన సాంఖ్యవాద నిరాకరణముచేతనే ప్రతిషేధింపఁ బడినవి పనికిరావని (త్రోసివేయఁబడినవి) యగుచున్నవి.

భాష్యము    భాష్యార్థము.

(అధికరణ భాష్యావతారిక)

వైదికస్య దర్శనస్య ప్రత్యాసన్నత్వాత్, గురుతర తర్కబలోపేత త్వాత్, వేదానుసారి భిశ్చ కైశ్చిచ్ఛిష్టైః కేనచిదంశేన పరిగృహీత త్వాత్ ప్రధానకారణవాదం తావద్వ్యపాశ్రిత్యయ స్తర్కనిమిత్త ఆక్షేపో వేదాంతవాక్యేషూద్భావితః సపరిహృతః

సాంఖ్యమతము (సత్కార్యవాదము మొదలగు కొన్ని విషయముల నంగీకరించుటచే) వేదాంత (=ఉపనిషత్) మతమునకు (ప్రత్యాసన్నత్వాత్=) మిక్కిలి

సమీపముగా నుండుటవలనను, గంభీరతరములైన (తర్కాః=) యుక్తులబలముమీద నాధారపడియున్నందు వలనను, వైదికమార్గావలంబకులగు కొందరు (దేవలుఁడు మొదలగు) పెద్దలచేత నేదోయొక యంశమునందైనను (ప్రమాణముగా) నంగీకరింపఁబడియుండుట వలనను, (అట్టి సాంఖ్యమత ఖండనమును బ్రప్రథమమందుఁ జేయుట యవసరమనియెంచి) సాంఖ్యమత సిద్ధాంతమైన ప్రధాన కారణవాదమును (ప్రధానము వలననే జగత్తుగల్గినదను వాదమును) నిలఁబెట్టుకొనుటకై తర్కమును (యుక్తులను) నూతగాఁ జేసికొని వేదాంత వాక్యములయందుఁ (ఉద్భావితః ఆక్షేపః=) గల్పింపఁబడిన యాక్షేపణములెల్ల (సమాధానములీయుట మూలముగా) పరిహరింపఁ బడినవిగదా !

ఇదానీ మణ్వాదివాదవ్య పాశ్రయేణాపి కశ్చిన్మంద మతిర్వేదాంత వాక్యేషు పున స్తర్క నిమిత్త మాక్షేపమాశంకేతేత్యతః ప్రధానమల్లనిబర్హణ న్యాయేనాతిదిశతి

(సాంఖ్యమతమున కున్నంతబలము లేకపోయినను) కాణాదాది మతసిద్ధాంతమైన అణ్వాదివాదమును (అణువులు మొదలగు వానిచేతనే జగత్తుగల్గినదను వాదమును) నిలఁబెట్టుకొనుటకై బుద్ధిహీనుఁడెవఁడైనను మఱల తర్కమునే (యుక్తులనే) యూతగాఁజేసికొని వేదాంత వాక్యములయందు దోషములను గుణించిన గుణించవచ్చును కాబట్టి ప్రధాన మల్లనిబర్హణ న్యాయముచేత ననఁగా కుస్తీపట్టుటకై పలువురు జెట్టీలువచ్చి డీకొనినప్పుడు వారిలోఁ బ్రధానుఁడైన (మల్లః=) జెట్టీతో మొదలు కుస్తీచేసి యోడించిన వానిపై గెలుపు మఱలఁ గుస్తీతోఁ బని లేకయే- కొద్దిజెట్టీలపైఁగూడ గెలుపేయగునని చెప్పినట్లు- (అతిదిశతి=) సాంఖ్యమతఖండన హేతువులే అణ్వాదిమత ఖండనమునకును సరిపోవునని సూత్రము చెప్పుచున్నది.

I సూత్రభాష్యము

పరిగృహ్యంత ఇతిపరిగ్రహాః నపరిగ్రహాః అపరిగ్రహాః శిష్టానామపరిగ్రహాః శిష్టాపరిగ్రహాః

పరిగ్రహింపఁబడునవి (స్వీకరింపఁబడునవి) పరిగ్రహములని చెప్పఁబడును- పరిగ్రహములుగానివి అపరిగ్రహములని చెప్పఁబడును. శిష్టులకు (=వైదికమార్గావలంబకులైన పెద్దలకు) పరిగ్రహములు (అంగీకారములు) కానివి 'శిష్టాపరిగ్రహము (సూత్రములోనిమాట) లని చెప్పఁబడును.

ఏతేన ప్రకృతేన ప్రధానకారణవాద నిరాకరణేన శిష్టైర్మనువ్యాసప్రభృతిభిఃకేనచిదప్యంశేనా పరిగృహీతాయే ఽణ్వాదికారణవాదా స్తేఽపి ప్రతిషిద్ధతయా వ్యాఖ్యాతా నిరాకృతా ద్రష్టవ్యాః తుల్యత్వాన్నిరాకరణస్య నాత్రపునరా శంకితవ్యం కించిదస్తి

వేదమార్గావలంబకులలోఁ బెద్దలగు మనువు వ్యాసుఁడు మొదలగువారిచేత నేదోయొకవిషయమందైనను స్వీకరింపఁబడని యేఅణ్వాదికారణ వాదములుగలవో

(తేఽపి=) అవియెల్లను (ప్రతిషిద్ధతయా=నిషిద్ధములుగా) (ఏతేన......నేన) ఇందు చేతననఁగా ప్రస్తుతము చేయఁబడిన ప్రధానకారణ వాదఖండన హేతువులచేతనే (వ్యాఖ్యాతాః నిరాకృతాః) నిరాకరింపఁబడినవైనట్లు వ్యాఖ్యానము చేయఁబడినవిగా (ద్రష్టవ్యాః-) భావించవలయును. ఖండనహేతువు లక్కడను నిక్కడను (ప్రధానకారణవాద విషయములోను అణ్వాదికారణవాద విషయములోను) సమానముగానే యున్నందున ఇప్పుడు క్రొత్తగాఁ దీర్చవలసిన సందేహములేమియు నుండుట కవకాశములేదు.

తుల్యమత్రాపి పరమగంభీరస్య జగత్కారణస్య తర్కానవగాహ్యత్వాం తర్కస్యాచా ప్రతిష్ఠితత్వమన్యథానుమా నేవ్యవిమోక్ష ఆగమవిరోధశ్చేత్యేవం జాతీయకం నిరాకరణ కారణం

సమానములైన ఖండహేతువులేమనఁగా :-

(1) పరమగంభీరమైన జగత్కారణము తర్కములకందునది గాకపోవుట.

(2) ఎట్టితర్కమునకైనను నిలుకడ (హద్దు-పునాది) గలదిగాదను దోషముండుట.

(3) (11 వ సూత్రములోఁ జెప్పఁబడినట్లు) దోషమేదియును నంటని విధముగానే తర్కింపఁబడ వచ్చుననుట కవకాశములేక దోషమునుండి తర్కమునకు మోక్షమే లేకపోవుట- (అనఁగా దోషములేని తర్కమేలేకపోవుట)

(4) (శ్రుతివిరుద్ధమైన తర్కము) శ్రుతిసమ్మతముగాకపోవుట.

## భోక్త్రాపత్త్యధికరణము

అధికరణావతారిక :- తర్కముపై నాధారపడి బ్రహ్మజగత్కారణవాదము గూర్చి చేయఁబడిన యాక్షేపణము లిదివరలోఁ గొన్ని పరిహరింపఁబడినవి. తర్కాధారముమీఁదనే చేయఁబడు మఱియొకనూతనాక్షేపణమీ యధికరణమునఁ బరిహరింపఁబడనున్నది. జగత్తంతటికిని బ్రహ్మమే కారణమని వేదాంతులు చెప్పుచున్నారుగదా- సామాన్యముగా భిన్నములుగాఁగనుపడు ఘటపటములకు మృత్తంతువులనెడి భిన్నకారణములే యగుననుట ప్రత్యక్షము అట్లె భేదయుక్తమైయున్న జగత్తులోఁగల భోక్తృభోగ్యములనెడి భిన్నపదార్థములకు భిన్నకారణములేయై యుండవలెనుగాని అన్నింటికిని నొక్కబ్రహ్మమే కారణమగుననిచెప్పుట యుక్తము గాదు- అను నాక్షేపమే యిందుఁ బరిహరింపఁబడనున్నది.

## ౧౩ సూ॥ భోక్త్రాపత్తేరవిభాగశ్చేత్స్యాల్లోకవత్

ప॥ వి :- భోక్త్రాపత్తేః-అవిభాగః- చేత్ -స్యాత్ -లోకవత్ -

ప్రి॥ ప॥ అ :- భోక్త్రాపత్తేః — భోక్తృ=భోక్తృభోగ్యమును భోగ్యము భోక్తయు, ఆపత్తేః=అగుటవలన; అవిభాగము = విభాగములేకపోవుట; చేత్ = అగుచో, స్యాత్=అగును; లోకవత్=లోకమందువలెనే.

సూ. తా .- I పూర్వపక్షము :- (భోక్త్రాపత్తేరవిభాగశ్చేత్) అద్వితీయ బ్రహ్మమే జగత్కారణమని చెప్పఁబడుచున్నదిగదా! అట్లగుచో సమస్తజగత్తు కారణమైన బ్రహ్మముతో నేకమేయగును- అట్లగుపక్షమునఁ బ్రపంచములోనుండు భోక్తృభోగ్యములలో భోక్తయనునది భోగ్యమైపోవుటయు, భోగ్యమనునది భోక్తయైపోవుటయు సంభవించి, లోకసిద్ధమైయున్న భోక్తృభోగ్యవిభాగము లేక పోవలసియేవచ్చును- ఇట్లనుట యుక్తముగాదు-

II సమాధానము :-

జగత్తంతటికి నొక్క బ్రహ్మమే కారణమైనప్పటికి భోక్తృభోగ్య విభాగ వ్యవహారమునకు భంగములేదు- ఎట్లన లోకమందు- సముద్రమునుండిపుట్టిన ఫేన తరంగబుద్బుదాదులు సముద్రస్వరూపమేయైయున్నను ఫేనమని- తరంగములని- బుద్బుదములని చెప్పఁబడు విభాగమెట్లు నిల్చియుండునో, అట్లె భోక్తలు భోగ్యములు బ్రహ్మస్వరూపములేయైయున్నను వానిలో వానికుండు విభాగమట్లె నిల్చియుండును.

భాష్యము భాష్యార్థము.

(అధికరణ భాష్యావతారిక)

అన్యథా పునర్బ్రహ్మకారణవాద స్తర్కబలే నైవాక్షిప్యతే

తర్కమునుమాత్రగాఁజేసికొనియే మఱియొకవిధముగా బ్రహ్మకారణవాదము- అనఁగా- బ్రహ్మమునుండియే జగత్తు పుట్టినది- అను వేదాంతసిద్ధాంతము ఆక్షేపింపఁబడుచున్నది-

యద్యపిశ్రుతిః ప్రమాణం స్వవిషయే భవతి తథాపి ప్రమాణాంతరేణ విషయాపహారేఽన్యపరాభవితు మర్హతి

ప్రత్యక్షానుమానాదులగు నితరప్రమాణములవలనఁ దెలియఁబడఁజాలక (స్వవిషయేః) శ్రుతిజెప్పినందువలనమాత్రమే తెలిసికొనవలసియుండు (బ్రహ్మ జగత్కారణమను) విషయమందు నాశ్రుతి శబ్దతః ప్రమాణమైనఁగావచ్చును. ఒక

విషయమునుగూర్చి శబ్దతః శ్రుతి చెప్పినదటుంచి (ప్రమాణాం-పహారే=) ప్రత్యక్షాది ప్రమాణాంతరముచేత నావిషయ మింకొకవిధమున నిశ్చయింపఁగల్గినప్పుడు, ఆశ్రుతి ముఖ్యార్థమును (శబ్దతః తెలియఁదగిన యర్థమును) గాక (అన్యపరా=) గౌణార్థమునే- అనఁగా నముఖ్యార్థమునే తెలుపుచున్నదని చెప్పఁదగియుండును.

యథామంత్రార్థవాదౌ

ఈవిషయము వేదమందుండు మంత్రములపట్లను- అర్థవాద వాక్యముల పట్లను దేటపడఁగలదు: (వేదమందు 'ఆదిత్యోయూపః=సూర్యుఁడు యజ్ఞశాలా స్థంభము' అనియున్న యర్థవాదవాక్యమునకు గౌణార్థమునే అలంకారికార్థమునే చెప్పవలయునుగాని ప్రత్యక్షప్రమాణ విరుద్ధమగు ముఖ్యార్థమును అనఁగా శబ్దార్థమును జెప్పఁదగదు)

తర్కోऽపి స్వవిషయా దన్యత్రా ప్రతిష్ఠితస్స్యాత్ యథాధర్మాధర్మయోః

తర్కమునైతము (స్వవిషయాదన్యత్ర=) తానుజెప్పఁదలఁచిన స్థలమందుఁగాక మఱియొక స్థలమందు- అనఁగా తనయధికారమునకు మించిన స్థలములయందు అనఁగా వేదమువలనమాత్రమే తెలియదగిన ధర్మాధర్మములనెడి విషయములందు 'అప్రతిష్ఠిత' మనియే అనఁగా 'అసాధు' వనియే చెప్పవచ్చును-

కిమతోయద్యేవః మతఇద మయుక్తం యత్ప్రమాణాం తరప్రసిద్ధర్థ బాధనంశ్రుతేః

(కిమతోయ ద్యేవం ? =) ఈయుపన్యాసమువలనఁ దేలినసారాంశ మేమందు రేమో! ఇదిగోచూడుఁడు! ప్రత్యక్షాది ప్రమాణములవలనఁ దేటతెల్లముగా స్పష్టముగాఁ దెలియఁదగిన విషయమును శ్రుతి బాధించునని చెప్పుట యుక్తమెంతయును గాదు- భిన్నవస్తువులగు ఘటపటములు భిన్నద్రవ్యములైన మృత్తంతువులవలన నేర్పడినవైనట్లు ప్రత్యక్షాది ప్రమాణములచే స్పష్టపడుచున్నది- ఇందుకు విరుద్ధముగా శ్రుతిచెప్పుననుట యుక్తముగాదు.

కథంపునః ప్రమాణాంతర ప్రసిద్ధోऽర్థః శ్రుత్యాబాధ్యత ? ఇతిఅత్రోచ్యతే

(ప్రమాణాంతర ప్రసిద్ధమైన- అనఁగా శ్రుతివలనఁగాక మఱియొక ప్రమాణముచేతఁ దేటతెల్లముగాఁ దెలియఁదగిన యేవిషయమును- అందుకు విరుద్ధముగా శ్రుతి చెప్పుచున్నదని యడుగుదురేమో ? చెప్పుచున్నాము- వినుఁడు (పైనఁజూపిన మృత్తంతు దృష్టాంతమునుబట్టి ప్రపంచములోని వివిధభేదములకు వివిధ వస్తువులే కారణములై యుండవలెనుగాని యొకటేకారణమై యుండఁజాలదని తర్కముచేత (=యుక్తి) స్పష్టపడుచుండఁ అందులకు విరుద్ధముగా ప్రపంచమంతటికిని ఒక్క బ్రహ్మమే కారణమని చెప్పు శ్రుతివాక్యము సరికాదను పూర్వపక్షము అట్టితర్కము బ్రహ్మ జగత్కారణవాదమును బాధింపఁజాలదను సిద్ధాంతము ఈసూత్రముచేఁ బ్రకటింపఁ బడుచున్నవి)

I ' భోక్త్రాపత్తేర విభాగశ్చేత్ ' సూత్రము లోని పూర్వపక్ష భాగము

ప్రసిద్ధోహ్యయం భోక్తృభోగ్య విభాగో లోకే

లోక మందు భోక్తలనియు, భోగ్యము లనియు విభాగము ప్రసిద్ధమైయే యున్నది గదా!

భోక్తా చేతన శ్శారీరః

భోక్త యనగా చేతనుఁడైన జీవుఁడు

భోగ్యాశ్శబ్దాదయో విషయా ఇతి

భోగ్యము లనగా ఇంద్రియములచే గ్రహింపఁబడు శబ్దాదులగు విషయములు

యథాభోక్తా దేవదత్తః భోజ్యఓదన ఇతి

భోక్త కుదాహరణము దేవదత్త నామక జీవుఁడు, భోజ్యము (భోగ్యము) నకుదాహరణము అన్నము (=ఓదనము) మొదలగునది.

తస్యచవిభాగస్యా భావః ప్రసజ్యేత యది భోక్తాభోగ్య భావమాపద్యేత, భోగ్యం వా భోక్తృ భావమాపద్యేత?

భోక్త భోగ్యమేమైపోవు పక్షమునను భోగ్యముభోక్తయేమై పోవుపక్షమునను లోకమందు భోక్తృభోగ్య విభాగ మన్నదియే ( విచక్షణామే ) లేకుండఁ బోవును.

తయోశ్చేతరేతరభావాపత్తిః పరమకారణా ద్బ్రహ్మణోऽనన్యత్వాత్ ప్రసజ్యేత

భోక్తృ భోగ్యములు రెండును ఒకటి మఱియొకటియై పోవుట యెట్లనఁగా-జగత్తులోఁ జేరిన యీభోక్తృభోగ్యములుఁ బరమ కారణమైన బ్రహ్మముకంటె నన్యములుగానందున (వేదాంత సిద్ధాంతానుసారము) కార్యము కారణమైపోవుట తప్పనిసరిగా జరుగవలసినదే గదా !

నచాస్యప్రసిద్ధస్య విభాగస్య బాధనం యుక్తం

ప్రపంచములోఁ బ్రసిద్ధమై (స్థిరముగా నాటుకొనిపోయి) యున్న యీ భోక్తృభోగ్య విభాగమునకు భంగముగలుగుట యుక్తము (ప్రయోజనకారి) గాదుసుమా (అనఁగా నష్టకారియేయగునుసుమా)

యథాऽద్యత్వేభోక్తృభోగ్యయోర్విభాగో దృష్టః

లోకమందీ భోక్తృభోగ్య విభాగము (అద్యత్వే=) ప్రస్తుత కాలమందెట్లు గాఁగన్పించు చున్నదో .

తథాऽతీతా నాగతయోరపి కల్పయితవ్యః

అట్లె (అతీతానాగత=) భూతవర్తమానములయందు నైతమున్నట్లె యెంచ వలసి యున్నది.

తస్మాత్త్రిసిద్ధస్యాస్య భోక్తృభోగ్య విభాగస్యా భావప్రసంగా దయుక్తమిదం బ్రహ్మకారణ తావధారణ మితిచేత్ కశ్చిచ్చోదయేత్

కాబట్టి (త్రి)కాలములయందుఁ బ్రసిద్ధమై (నాటుకొనిపోయి) యున్న యీ భోక్తృభోగ్య విభాగము లేకపోవలసివచ్చుచున్నందున, ఈజగద్బ్రహ్మకారణ వాదమునం దభిమానమును వదలుకొనుటయే శ్రేయస్కరమని యెవఁడైనను ఆక్షేపణపూర్వకముగా నిరాకరించుచో,

తంప్రతి బ్రూయాత్

అట్లాక్షేపణము చేసినవానికి సమాధానము జెప్పఁబడును. చూడుఁడు.

స్యాల్లోకవదితి

II 'స్యాల్లోకవత్' పై పూర్వపక్షమునకు సమాధానము-

ఉపపద్యత ఏవాయమస్మత్పక్షేऽపి విభాగః ఏవంలోకే దృష్టత్వాత్

మా వేదాంతపక్షమందును- అనఁగా జగత్తునకు బ్రహ్మమే కారణమని వాదించు మా పక్షమందీవిభాగము సవ్యమైనదియే (విరుద్ధమైనదిగాదు)- ఎందుచే ననఁగా (మాసిద్ధాంతమునకు భంగములేకుండ) అట్టివిభాగములు లోకమందుఁ జూచుచు నేయున్నాముగదా !

తథాహిసముద్రాదుదకాత్మనో ऽనన్యత్వేऽపి తద్వికారాణాం ఫేనవీచీ తరంగ బుద్బుదాదీనా మితరేతర విభాగ ఇతరేత సంశ్లేషాది లక్షణశ్చ వ్యవహార ఉపలభ్యతే

ఎట్లంటేని- (ఉదకాత్మనః=) ఉదకస్వరూపమైన (సముద్రాత్ ==) సముద్రముకంటె (అనన్యత్వేऽపి) భిన్నములుగాకపోయినను, ఆసముద్రోదకవికారము (nodipiohons- మార్పులు) లైన (ఫేన=) నురుగు. (వీచీ=) చిన్నయలలు (తరంగ=) కెంటముల (బుద్బుదాః=) బుడగలుమొదలగునవి తమలోఁదాము విడిపోయి వేఱువేఱుగానుండుటయు, నొకదానితో మఱియొకటి (సంశ్లేష=) కూడుకొనుచుండుటయుఁ జూచుచుండుటలేదా !

నచ సముద్రాత్మనోऽ నన్యత్వేऽపి తద్వికారాణాం ఫేనతరంగాదీనా మితరేతర భావాపత్తి ర్భవతి, నచ తేషామితరేతర భావా పత్తావపి సముద్రాత్మనోऽన్యత్వం భవతి;

సముద్రోదకవికారములైన యీ నురుగు-కెరటములు-బుడగలు మొదలగు నవి సముద్రముకంటె భిన్నములు గాకపోయినను (నచ ఇతరేతర భావాపత్తిః=) సముద్రముతోఁ బూర్తిగాఁ గలిసిపోవుట సంభవింపదు.

మఱియు నవి సముద్రముతోఁ బూర్తిగా కలిసిపోవుట సంభవించనప్పటికి, అవి సముద్రోదకములే యగుచున్నవిగాని భిన్నములు గానేరవు.

ఏవమిహాపి

బ్రహ్మ జగద్భేద విషయములో నైతమంతయే-

న భోక్తృభోగ్యయో రితరేతర భావాపత్తి ర్నచ పరస్మాద్బ్రహ్మణోఽన్యత్వ మితి భవిష్యతి

జగత్తులోనుండు భోక్తృభోగ్యములు అన్యోన్య మొకదానితో నొకటిగలిసి కొనిపోవుట యెట్లు సంభవింపదు అంతమాత్రముచేత నవి వానియొక్క బరమ కారణమైన బ్రహ్మముకంటె నన్యము (భిన్నము) లగుటయు నెన్నటికిని సంభ వింపదు.

యద్యపి భోక్తానబ్రహ్మణో వికారః 'తత్సృష్ట్వా ' ఇతి స్రష్టురేవా వికృతస్య కార్యానుప్రవేశేన భోక్తృత్వ శ్రవణాత్ తై. II-6-2 'తత్సృష్ట్వా తదేవాను ప్రావిశత్'

'జగత్తును సృష్టించి జగత్తులోఁ బ్రవేశించెను' ఏ వికారమును (=ఎట్టి మార్పును) బొందకుండ సృష్టినిగావించిన సాక్షాద్బ్రహ్మమే (కార్యానుప్రవేశేన=) తనచే సృష్టింపఁబడిన జగత్తునందుఁదాను బ్రవేశించుట మాత్రమున భోక్తయగు చున్నదని యీ పై శ్రుతి చెప్పుచుండుటవలన, (యద్యపి....వికారః) జగత్తులో భోక్తయని పిలువఁబడువాడు వాస్తవమునకు బ్రహ్మముయొక్క వికారము )మార్పును జెందినవాడు) గాకపోయినను (అనఁగా భోక్తయు వాస్తవమునకుసాక్షా ద్బ్రహ్మమే యైయున్నను)

తథాపికార్య మనుప్రవిష్ట స్యాస్త్యుపాధి నిమిత్తో విభాగః ఆకాశస్యేవ ఘటాద్యుపాధి నిమిత్తః

కార్యమైన జగత్తునందుఁ బ్రవేశించినవాడు- అని చెప్పఁబడుటచే వాని కొక యుపాధి (=దేహము) యేర్పడినట్లును, అందుమూలమున విభాగ (separation భేదము) మేర్పడినట్లును జెప్పవలసివచ్చినది ఎట్లనగా- ఆకాశములో (మెరా బాలో) నొకకుండను బోర్లించఁగా, ఆకాశములో గొంతయాకుండలోఁ బ్రవేశించి నట్లును, అట్లు ప్రవేశించినయాకాశము అసలాకాశములోవిభాగమైనట్లును అనియర్థ

మిచ్చులాగు 'కుండలోని యాకాశము' అని చెప్పుట యెట్టిదో జగత్తులోఁ బ్రవేశించిన బ్రహ్మము 'భోక్త' యని చెప్పుటయు నట్టిదే. ఆకాశమునకుఁ గుండయను నుపాధియెట్టిదో బ్రహ్మమునకు 'జగద్భేదములు అనునవియునట్టి యుపాధులే

ఇత్యతః పరమకారణాత్ బ్రహ్మణోఽనన్యత్వేఽపి ఉపపద్యతే భోక్తృభోగ్య లక్షణో విభాగః సముద్రతరంగాది న్యాయేనేత్యుక్తం

కాబట్టి పరమకారణమైన బ్రహ్మముకంటెనన్నియు నభిన్నములై యున్నను, భోక్తలనియు భోగ్యములనియుఁ జేయఁబడిన విభాగము, అన్నియు సముద్రస్వరూపమేయైయున్నను తరంగములని - బుడగలని - నురుగులని చేయఁబడిన విభాగము వంటిదేయని యెఱుంగునది.

## ఆ ర ం భ ణా ధి క ర ణ ము

అధికరణావతారిక :—

ఇందుకుఁ బూర్వము చెప్పఁబడిన భోక్త్రాపత్త్యధికరణమునకును, ఈ యారంభణాధికరణమునకును విషయ మొక్కటియే— భేదములతోఁగూడిన జగత్తంతటికిని నొక్క-బ్రహ్మమే కారణమన్నచో, భోక్తృభోగ్యవిభాగము లేకుండఁబోవునన్న యాక్షేపమునకు, సముద్రవీచీతరంగ బుద్బుదములవలె విభాగముండును గావున బ్రహ్మకారణవాదమున కిబ్బంది లేదని పూర్వాధికరణమందు సమాధానము చెప్పఁబడినది ఈ సమాధానమువలన సముద్రమునకును అందులోనుండి పుట్టిన వీచీతరంగ బుద్బుదములకును బరిణామము (మార్పు) వలనఁగల్గిన భేదమెట్టిదియో, బ్రహ్మమునకును అందులోనుండియే పుట్టినదని చెప్పఁబడు (భోక్తృభోగ్యాది) జగద్భేదములకును బరిణామమువలనఁగల్గిన భేదమునైత మట్టిదియేయని చెప్పినట్లైనది— ఈ పరిణామవాదము సూత్రకారుని నిజమైన యభిప్రాయముగాదు ఈ పరిణామవాదమువలన బ్రహ్మమునకును జగత్తునకును నెట్టిదియో యొకభేద మొప్పకొన్నట్లైనది— వ్యవహారమునకుమాత్ర మట్టిసమాధానము చెప్పఁబడినది. వివర్తవాదమందే సూత్రకారుని నిజమైన యభిప్రాయమైనట్లు యధికరణముచే స్పష్టపడఁగలదు వివర్తమనఁగా కానిదైనట్లు తోఁచుటయే, బ్రహ్మమునకును జగత్తునకును గన్పించుభేదము కల్పితముగాని నిజమైనదిగాదనియు, రెంటికి నభేదమేయనియు నీ యధికరణమందు స్థాపింపఁబడఁ బోవుచున్నది.

### సూ॥ ౧౪ తదనన్యత్వ, మారంభణ శబ్దాదిభ్యః

ప. వి :— తదనన్యత్వమ్ — ఆరంభణ శబ్దాదిభ్యః॥

ప్ర. ప. అ :— తదనన్యత్వమ్; తత్ = దానికంటె అనఁగా కారణమైన బ్రహ్మముకంటె, అనన్యత్వమ్ = (కార్యమైన జగత్తునకు) అభేదము; ఆరంభణ శబ్దా

దిభ్యః; ఆరంభణ 'ఆరంభణశబ్ద' మనుశబ్ద ముపయోగించిన ఛాం VI-1-4 శ్రుతి వలనను, అట్టివే మఱికొన్ని శ్రుతులవలనను కారణకార్యములని చెప్పఁబడు బ్రహ్మ జగత్తుల కభేదమేయని స్పష్టపడఁగలదు.

సూ॥ తా :- I (తదనన్యత్వమ్) కారణమైన బ్రహ్మమునకుఁ గార్యమైన జగత్తునకు వాస్తవమునకు భేదములేదు లోఁగడి యధికరణమందు సముద్ర తరంగ దృష్టాంతముచేతఁ జెప్పఁబడిన భేదము వ్యావహారికమేగాని పారమార్థికముగాదు.

II (వాచారంభణ శబ్దాదిభ్యః) కారణ కార్యాభేదము ఛా VI-1-4 'వాచారంభణం వికారోనామధేయమ్' అను మొదలగు శ్రుతులవలన స్పష్టపడును కారణమైన మృత్తికయందుకంటె దాని వికారము (కార్యము) లైన ఘటాదులయందు విశేషమేమియు లేదు. ఘటాదులని వేఱువేఱు పేర్లు వాక్పూర్వకముగా వ్యవహారమునకుఁ గల్పింపఁబడినవే- మృత్తికయే సత్యము ఘటాది నామములు కల్పితములు.

భాష్యము భాష్యార్థము-

I కారణకార్యానన్యత్వము అనఁగా అద్వైతము-శ్రుతిసిద్ధము

(1) భోక్తృభోగ్యవిభాగము పరిణామవాద మనుసరించి సముద్రవీచీతరంగ దృష్టాంతముచేత లోఁగడిసూత్రమందు సమర్థింపబడినది.

అభ్యుపగమ్యచే మంవ్యావహారికం భోక్తృభోగ్య లక్షణం విభాగం 'స్యాల్లోకవ' దితి పరిహారోఽభిహితః;

(బ్రహ్మకార్యమైన జగత్తులో) భోక్తలనియు- భోగ్యములనియు వ్యవహారమునకుఁ (లోకపునటనలో) గన్పించు నీవిభాగమును (అభ్యుపగమ్య=) ఉన్నది యున్నట్లుగా (తాత్కాలికమునకు) నంగీకరించి యాక్షేపణీయముగా నేరదని లోఁగడి సూత్రము (బ్ర సూ II-1-13) లోని 'స్యాల్లోకవత్ = సముద్రతవీచీతరంగముల వలె' అను దృష్టాంతముచేత (పరిహారోఽభిహితః =) సమాధానము చెప్పఁబడినది-

(2) అట్టి విభాగము పరమార్థమున లేదు- కార్యము కారణమునకంటె భిన్నముగాదు- వివర్తవాదమే వాస్తవము.

నత్వయం విభాగః పరమార్థతోఽస్తి

(పరమార్థత...) వాస్తవమున కట్టివిభాగము లేనేలేదు.

యస్మాత్తయోః కార్యకారణయో రనన్యత్వమవగమ్యతే

(యస్మాత్ =)ఎందుచేనందురేమో- ఆకార్యకారణములకు (జగద్బ్రహ్మ

ములకు) అభేదమే(=అనన్యత్వం) మాచే (వేదాంతులచే) నుద్ఘాటింపఁబడుచున్నది. (అనఁగా-బ్రహ్మమేజగత్తు=రెంటికిని భేదమే లేదు అని చెప్పుదుము)

కార్యమాకాశాదికం బహుప్రపంచం జగత్ కారణం పరబ్రహ్మ

కార్యమనఁగా-ఆకాశము మొదలుకొని నానావిధములుగా వ్యాపించియున్న జగత్తు- కారణమనఁగా- పరబ్రహ్మము.

తస్మాత్కారణాత్ పరమార్థతోఽనన్యత్వం వ్యతిరేకేణాభావః కార్యస్యావగమ్యతే

కార్యమైన యీజగత్తు (పరమార్థతః=) వాస్తవమునకు కారణమైన బ్రహ్మముకంటె నన్యముగాదు- అనఁగా- బ్రహ్మమునకంటె వ్యతిరేకముగా (భిన్నముగా) జగత్తు లేదు- అని మేమంగీకరించుచున్నాము.

(కే) వివర్తవాదమునకు (అనఁగా అద్వైతవాదమునకు ఛాందోగ్యశ్రుతి (ఛా VI-1-4) యే ప్రమాణము.

కుతః ?

ఎందుచే నట్లంగీకరింతురందు రేమో!

ఆరంభణశబ్దాదిభ్యః. ఆరంభణశబ్దస్తావదేకవిజ్ఞానేనసర్వ విజ్ఞానం ప్రతిజ్ఞాయ దృష్టాంతాపేక్షయా ముచ్యతే

(ఛాం VI-1-4) '(ఆరంభణ' శబ్దముగల శ్రుతియునట్టివే మఱికొన్నియుఁ బ్రమాణములుగా నుండుటవలన నట్లంగీకరించుచున్నాము. ఒకటిని (కారణమును) దెలిసికొన్నచో సర్వమును (కార్యమంతయు) దెలిసికొన్నట్లే యగునని చేయఁబడిన ప్రతిజ్ఞ (=assertion) ను నిల్వఁబెట్టుటకుఁగాను జూపఁబడిన దృష్టాంతముమీఁద నాధారపడియే 'ఆరంభణ' శబ్దము శ్రుతిలోఁ (ఛాం VI-1-4) బ్రయోగింపఁబడి నది. (ఈవిషయములో 'ప్రకృత్యధికరణమును' బ్ర సూ I-4-23 ల 27 జూచునది)

'యథా సోమ్యైకేన

ఆ శ్రుతి యిదిగో చూడుడు.

ఏతదుక్తం భవతి' ఛా VI-1-4 'యథా సోమ్యైకేన మృత్పిండేన సర్వం మృన్మయం విజ్ఞాతం స్యాత్, వాచారంభణం వికారో నామధేయం మృత్తికేత్యేవ సత్యం'

ఒకటి తెలిసికొనఁబడినచో సర్వమెట్లు తెలిసికొనబడినట్లగునను ప్రశ్నమునకు సమాధానముగా- '(సోమ్య!=) ఓయిపిల్లవాడా ! (ఏకేనమృత్పిండేన) ఒక్క మంటిముద్దను దెలిసికొన్నచో, (సర్వం మృన్మయం=) ఆమంటిముద్దచేనైన ఘటాది సర్వవస్తువులు (విజ్ఞాతంస్యాత్=) తెలిసికొనఁబడిన వట్లగునో-అట్లే- (ఎందుచే ననఁగా) - (వికారః=) కార్యమనునది - కుండ - చట్టిమూకుడు మొదలగునవి-

(వాచారంభణం=) వాక్కుచేఁ జెప్పఁదగిన (నామధేయం=) పేరు మాత్రమే- పేరుకన్న మఱియెక్కువేమియు కార్యమందు లేదు- (మృత్తికా-ఇతి-ఏవ=) మంటి ముద్దయనునదియే (సత్యం=) వాస్తవమైనది. కార్యములైన కుండ-చట్టి మొదలగు వానిలో కారణమైన మంటిముద్దకంటె విశేషమేమియు లేదు ఎక్కువ పేర్లుమాత్రము నోటితోఁ బలుకఁ బడుచున్నవి.

(4) అద్వైతవాదమునకు శ్రుతిగతమైన మృత్పిండ దృష్టాంతము

ఏకేన మృత్పిండేన పరమార్థతో మృదాత్మనా విజ్ఞాతేన సర్వం మృణ్మయం ఘట
శరావోదంచనాదికం, మృదాత్మత్వావిశేషాద్విజ్ఞాతం భవేత్

కేవలమృత్పిండ (=మంటిముద్ద) మొకటి (పరమార్థతః=) వాస్తవమునకు మృత్స్వరూపమని (మన్నుతప్ప మఱియొకటియందు లేదని) తెలిసికొనఁబడినప్పుడు, మృత్తునుండికల్గిన కుండ, (శరావము=) మూకుడు, (ఉదంచనము=) చట్టి మొదలగు పాత్రలన్నియును (మృదాత్మత్వావిశేషాత్=) మృత్స్వరూపముతో నభిన్నములైనవిగానే (అనఁగా వానిలో మృత్తుకంటె మఱియొకటి లేనట్టుగానే) (విజ్ఞాతం భవేత్=) తెలిసికొనఁబడినవి యగుచున్నవి.

(5) పై శ్రుతిలోని 'వాచారంభణం' – 'మృత్తికేత్యేవసత్యం' అను పదములే యద్వైతవాదమును వికారం-నామధేయం అని స్థిరపరచుచున్నవి.

యతో వాచారంభణం వికారో నామధేయం వాచాకేవలమస్తీత్యారభ్యతే వికారో ఘట
శ్శరావ ఉదంచనం చేతి

(యతః=) ఎందుచేతననఁగా- (వికారః-) వికారమైన కార్యమంతయు (వాచారంభణం=) వాక్కుచేత నుచ్చరింపఁబడు (నామధేయం=) పేరుమాత్రమే మైయున్నవి- అనఁగా= (వికారో...చనంచ=) మృత్తుచేఁ గల్గినకుండ-మూకుడు-చట్టి మొదలగు వికారములనెడి కార్యములు (వాచా-రభ్యతే=) వాక్కుచేత వేఱు వేఱు పేర్లుగాఁ బలుకఁబడినవిగాని

నతువస్తువృత్తేన వికారో నామకశ్చిదస్తి

(వస్తువృత్తేన=) వస్తుస్వభావముచేత (=matereall = వాస్తవమునకు) వికార (=కార్య) మన్న దెట్టియు లేనే లేదు-

నామధేయమాత్రం హ్యేతదనృతం మృత్తికేత్యేవ సత్యమితి

(ఎందుచేనందు రేమో వికారమైన కార్యమందు గారణమందుకన్నఁ బెచ్చుగాఁ గన్పించునది) (నామధేయమాత్రంహి=) వేరు వేరు పేర్లు మాత్రమే గదా! (ఏతదనృతం=) ఈ పేర్లన్నవి (అనృతం=) వాస్తవమునకు (= materiall)

లేనివే- (మృ_త్తి...సత్యమితి=) మృ_త్తిక (మన్ను) యనునది యొకటియే వా_స్తవ మునకున్నది. (అని శ్రుతియే స్పష్టముగాఁ జెప్పుచున్నది చూచితిరా!

(6) మృత్తు-ఘటశరావాదులు ఎట్టివో- బ్రహ్మము జగత్తు నట్టివే.

ఏషబ్రహ్మణో దృష్టాంత ఆమ్నాతః తత్రశ్రుతాద్వాచారంభణ శబ్దాద్దార్ష్టాన్తికేऽపి బ్రహ్మవ్యతిరేకేణ కార్యజాతస్యా భావఇతి గమ్యతే

(బ్రహ్మణః) బ్రహ్మమునకు (ఏషఃదృష్టాంతః=) ఈమృ_త్తిక దృష్టాంతము (ఆమ్నాతః=) చెప్పఁబడినది- (తత్ర=) ఆ ఛా VI-1-4 శ్రుతియందు (వాచా- శబ్దాత్=) 'వాక్కు-చేతఁ బలుకఁబడునది' యను శబ్దములుండుటవలన (దార్ష్టాన్తికేऽపి=) కార్యమైన జగత్తునందు సైతము కారణమైన బ్రహ్మమునకంటె భిన్న (కార్యజాతస్య+అభావః ఇతిగమ్య) వివిధవస్తుజాత మేమియును లేదనియే స్పష్ట పడుచున్నది.

(7) కారణముకంటె భిన్నముగా కార్యమందేమియు లేదని తరువాత శ్రుతి వాక్యమె (చ VI-4-1) నిశ్చయించుచున్నది.

పునశ్చతేజోऽబన్నానాం బ్రహ్మ కార్యతాముక్త్వా తేజోऽబన్న కార్యాణాం తేజోऽ బన్న వ్యతిరేకణాభావం బ్రవీతి 'అపాగాత్....సత్యమ్' ఇత్యాదినా

ఛాందోగ్యశ్రుతి షష్ఠప్రపాఠకమందు ప్రథమఖండములో (ఛాం VI- 1-456) బ్రహ్మమునకు మృత్పిండాదిదృష్టాంతములను జెప్పినపిమ్మట ద్వితీయఖండ ములో (ఛాం VI-2-314) అగ్నియు ఉదకములు - పృథివి యనునవి బ్రహ్మము నుండి కలిగిన వికార (=కార్య)ములని చెప్పి యాపైన నాయగ్న్యుదక పృథువుల నుండి కల్గిన వికారము (=కార్యములు) లేవియున్నవో యవి యెల్లను ఆయగ్న్య దక పృథువులకంటే వేఱేమియును గావని యీక్రిందివిధమునఁ జెప్పుచున్నది చూడుఁడు.

ఛాం VI-4-1'... అపాగా దగ్నేరగ్నిత్వం వాచారంభణాంవికారో నామధేయం త్రీణిరూపాణీత్యేవసత్యం

(ఛాం VI 3లో ఈకనుపించునది త్రివృత్కరణముచే నగ్ని మొదలగు మహా భూతములనుండి కల్గిన కార్యమని జెప్పి (అగ్నేః) అగ్నియొక్క (అగ్నిత్వం) అగ్ని భావము -అగ్ని బుద్ధి- (అపాగాత్) పోయెను. 'అగ్ని' యని మనము ప్రత్యక్ష ముగాఁ జూచు (త్రివృత్కృతమైన యగ్ని) నగ్నిలో నెఱుపు తెలుపు నలుపు- అను మూఁడురూపములు గలవు. అని ఛాం VI-4-1 లో ముందుఁ జెప్పఁబడిన విష యమును గ్రహించినచో 'అగ్ని' యను దానియందు బూర్వము గల్గియున్నయగ్ని భావము (ఇదియగ్నియనుబుద్ధి) నిల్చియుండఁజాలదు, మూఁడురూపములు మాత్రమే

నిల్చియుండును అని నిరూపించుటకుఁగాను- (వికారః) ఆ మూడు భూతములవలన గలిగిన వికారము-కార్యములన్నియును (వాచారంభణం నామధేయం) నోటితోఁ బలుకఁబడు పేరుమాత్రమె (త్రీణి...త్యేవ) ఎఱుపు- తెలుపు, నలుపు, అను రూపములు మాత్రమె (సత్యం=) వాస్తవమైనవి. మృత్తుఘటమునకుఁ గారణమనియు మఱేవిశేషములేదనియుఁ దెలిసికొన్న పిమ్మట 'ఘటమందు ఘటభావముగాని ఘటనామముగానినిల్చియుండవు అట్లేమూడురూపములే యగ్నికిఁ గారణమని తెలిసికొన్నపిమ్మట అగ్నియందు అగ్నిభావముగాని అగ్నినామముగాని నిల్చియుండవు బ్రహ్మజగత్తుల విషయములో సైతమట్లేయని బోధింపఁబడినది.

సూత్రమందు ఆరంభణశబ్దాదిభ్యః

(8) అద్వైతవాదమునకు మరికొన్ని ప్రమాణములు

ఆరంభణ శబ్దాదిభ్యఇత్యాది శబ్దాత్ - 'ఐతదాత్మ్య........' నేహ నానాస్తికించన"

(ఆరంభణ శ్రుతి మొదలగు ప్రమాణములవలన) అని చెప్పబడుటవలన, ఆ (ఆది-) 'మొదలగు' పదములచేఁ సూచింపఁబడిన నితరప్రమాణము లీక్రిందనుదాహరింపఁబడుచున్నవి చూడుఁడు.

ఛాం. VI-8-7 'ఐతదాత్మ్యమిదం సర్వం'

'ఇదం సర్వం=) ఈసమస్తజగము (ఐతదాత్మ్యం=) ఈయొకటియైన యాత్మవలననే కల్గినది.

ఛాం. VI-8-7 "తత్సత్యం స ఆత్మా'

'(తత్ =) ఆమూలకారణమైన 'సత్' అను పదార్థమె (సత్యం), వాస్తవమైనది- (సః ఆత్మా=) ఆసత్ అను పదార్థమె 'ఆత్మ'యై యున్నది అనఁగా 'ప్రత్యగాత్మ=జీవాత్మ'యై యున్నది.

ఛాం. VI-8-7 'తత్త్వమసి'

(త్వం-) ఆ ప్రత్యగాత్మయైన నీవే (తత్ =) ఆ 'సత్' అను మూలకారణబ్రహ్మమై యున్నావు.

బృ. IV-4-6 'ఇదంసర్వం యదయమాత్మా'

'(యదాత్మా=) 'ఏఆత్మ' తెలిసికొనబడినవాడు- అని పైనఁ జెప్పఁబడెనో, (ఇదంసర్వం=) ఆయీప్రపంచస్వరూపమంతయును (అయమాత్మా=) ఈజీవాత్మయే.

ముం. II-2-11 'బ్రహ్మైవేదం సర్వం'

'(ఇదం సర్వం=) ఈసమస్తప్రపంచము (బ్రహ్మ + ఏవ-) బ్రహ్మమే.

ఛాం. VII-25-2 'ఆత్మైవేదం సర్వం'

('ఇదం సర్వం–) ఈ సమస్త ప్రపంచము (ఆత్మ+ఏవ–) ఆత్మయే'

బృ. VI 4-19 'నేహ నానాస్తి కించన'

(ఇహ–) ఈ బ్రహ్మమునందు (కించన=) ఏకొద్దిదైన (నానా=) భేద జాతము (న+అస్తి=) లేదు.

ఇత్యేవమాద్య పాత్మైకత్వ ప్రతిపాదన పరంవచనజాత ముదాహర్తవ్యం

ఈపైన నుదాహరింపఁబడిన శ్రుతులు మొదలగునవి యన్నియును గూడ ఆత్మైకత్వ ప్రతిపాదన పరం=) అంతటను అన్నియును నొక్క–యాత్మగానే యున్నదని చెప్పునట్టి (వచనజాతం=) ప్రమాణవచనములుగానే (ఉదాహర్తవ్యం=) చూపఁబడఁదగియున్నవి–

(9) (ఆత్మైకత్వవాదము శ్రుతిసమ్మతముగానిచో, ఛాం VI-1-3 లోని 'అశ్రుతం శ్రుతంభవత్య మతంమతమవిజ్ఞాతం విజ్ఞాతం' అనఁగా 'ఏకవిజ్ఞానేన సర్వ విజ్ఞానం' అను వాక్యార్థము సిద్ధింపదు.

నచాన్యథైక విజ్ఞానేన సర్వవిజ్ఞానం సంపద్యేత

(అన్యథా=) మఱియొకరీతిగానగుచో–!అనఁగా ఆత్మైకత్వమునేచెప్పనిచో, (ఏకవిజ్ఞానేన=) ఒకటైన కారణమును దెలిసికొనుటచేత (సర్వవిజ్ఞానం=) దాని కార్యరాశియైన సమస్తము దెలిసికొనఁబడుట (నచసంపద్యేత=) సంభవింపఁజాలదు.

(10) కార్యకారణా నన్యత్వమునకు ఘటకరకా మృగతృష్ణికోదకదృష్టాంతములు.

తస్మాద్యథాఘట కరకాద్యా కాశానాం మహాకాశాదనన్యత్వం

కాబట్టి (ఘట....శానాం=) ఘటమందున్న యాకాశము', కరక (=వడగల్లు) యందున్న యాకాశము అనునవి (మహాకాశాత్=) బయలుగానుండు పెద్ద యాకాశమునకంటె (యథా=) ఏ ప్రకారముగా (అనన్యత్వం=) భిన్నములుగావో,

యథా మృగతృష్ణకోదకాదీనా మూషరాదిభ్యోఽనన్యత్వం దృష్టనష్ట స్వరూపత్వాత్

(మృగ....దకాదీనాం=) ఎండమావులయందుఁ గన్పట్టుజలములు (దృష్ట... త్వాత్=) కనుపించుట నశించుటయే (ఉన్నట్టు కనుపించుటయు లేకపోవుటయే) స్వరూపముగాఁ గల్గియున్నందువలన (ఊషరాదిభ్యః=) ఊషరక్షేత్రములకంటె (యథా=) ఏ ప్రకారముగా (అనన్యత్వం=) భిన్నములుగావో

ద్రడ

(11) శుద్ధాద్వైతమే నిర్దుష్టము

స్వరూపేణ త్వనుపాఖ్యత్వాత్. ఏవ మస్య భోక్తృభోగ్యాది ప్రపంచ జాతస్య బ్రహ్మవ్యతిరేకేణాభావ ఇతి ద్రష్టవ్యం

(స్వరూపేణతు =) స్వరూపముచేత (By iedejendant etistence) (అనుపాఖ్యత్వాత్ =) నిర్ణయించుటకు వీలులేనందున (భోక్తృ...జాతస్య=) భోక్తలని-భోగ్యములని వేరువేరుగాఁ గనుపించు జగద్విభాగము లన్నియును (బ్రహ్మ వ్యతిరేకేణ=) బ్రహ్మముకంటె భిన్నములుగా (అభావః-ఇతి) లేనివేయని (ద్రష్టవ్యః=) గ్రహించవలసి యున్నది.

పూర్వపక్షము :—

II (ఎ) భేదాభేదమత (=ప్రస్తుత విశిష్టాద్వైత) సిద్ధాంతము

(1) వృక్షశాఖా దృష్టాంతము

నన్వనేకాత్మకం బ్రహ్మ, యథా వృక్షోऽనేకశాఖః ఏవమనేకశక్తి ప్రవృత్తియుక్తం బ్రహ్మ అత ఏకత్వం నానాత్వంచో భయమపి సత్యమేవ

బ్రహ్మమనేక స్వరూపమని చెప్పఁగూడదా యేమి? అనేక శాఖలతోఁ గూడిన వృక్షమెట్లున్నదో, యట్లే యనేక శక్తులతోడను ఆయా శక్తులకు సంబంధించిన (ప్రవృత్తి=) వ్యాపారముల తోడను బ్రహ్మము గూడియున్నదని యేల చెప్పఁగూడదు? అందుచే బ్రహ్మమందు ఏకత్వము-నానాత్వము అనునవి రెండునువాస్తవములే గావచ్చును-

యథావృక్ష ఇత్యేకత్వం, శాఖా ఇతిచ నానాత్వం

మొత్తమున వృక్షమును గూర్చి మాట్లాడునప్పుడు అదియొకటి యనియే (దానియందు ఏకత్వమునే) చెప్పవచ్చును, దానిశాఖలనుగూర్చి మాట్లాడునప్పుడు అది యనేకమనియే (దానియందు నానాత్వమునే) చెప్పవచ్చును.

(2) సముద్ర మృత్తికాదులును అట్టివే.

యథావా సముద్రాత్మనైకత్వం, ఫేనతరంగాద్యాత్మనా నానాత్వం

అట్లే 'సముద్ర' మన్నప్పుడొకటియు, ఫేనతరంగాది ప్రసంగము వచ్చినప్పుడు సముద్రమనేకమనియు- అనఁగా సముద్రమందు ఏకత్వము - నానాత్వము రెండును జెప్పవచ్చును.

యథాచ మృదాత్మనైకత్వం ఘటశరా వాద్యాత్మనా నానాత్వం

అట్లు మట్టియు 'మృత్తు' అని మొత్తమునఁ జెప్పునప్పు డొకటియు, కుండ-మూకుడు-చట్టియని విడివిడిగాఁ జెప్పుచున్నప్పుడా 'మృత్తే' యనేకమనియుఁ జెప్పవచ్చును.

(3) బ్రహ్మముసైతము ఏకము—అనేకము నగును.

తత్రైకత్వాంశేన జ్ఞానా న్మోక్షవ్యవహారస్సేత్స్యతి

(తత్ర=) బ్రహ్మమొకటియేయని భావించు పక్షములో, అట్టి (యేకత్వ) జ్ఞానమేర్పడి యందుచే మోక్షము (సేత్స్యతి=) లభించవచ్చును.

నానాత్వాంశేనతు కర్మకాండాశ్రయౌ వైదికో లౌకికశ్చ వ్యవహార స్సేత్స్యతి

బ్రహ్మమనేకమని భావించుపక్షములో కర్మకాండమీాద నాధారపడియున్న వైదిక లౌకిక వ్యవహారము (=ఫలాదులు) లభించవచ్చును.

(4) శ్రుతిలోని మృల్లోహకృష్ణాయ సదృష్టాంతములు భేదాభేదవాదమునకే యుపయోగింపఁగలవు.

ఏవం మృదాది దృష్టాంతా అనురూపా భవిష్యంతీతి

అట్లు బ్రహ్మమేకమనియు, అనేకమనియుఁ (రెండు విధములుగా) జెప్పినప్పుడుగూడ, శ్రుతిలో బ్రహ్మమునకుఁ జూపఁబడిన దృష్టాంతములు- అనఁగా (ఛాం VI-1-3 + 4 లోని) మృత్తు- (ఛాం VI-1-5 లోని) లోహము (=ఛాం VI-1-6 లోని) కృష్ణాయసము (=పైనఁ జూపఁబడిన చొప్పున ఏకత్వ-నానాత్వ భావములకు (అనురూపాః=) అనుగుణములైనవిగానే (=అనుగుణముగా నర్థమిచ్చునవిగానే=) సమర్థింపవచ్చును (సరిపోవునవిగానే యుండును)

సమాధానము [=సిద్ధాంతము] :-

II [బి] భేదాభేద మతఖండనము

(1) శ్రుతి [ఛా VI-1-4] లోని మృత్తికా దృష్టాంతమువల్లనే కారణమొక్కటియే సత్యమనియు, కార్యములైన వికారములన్నియు ననృతములనియు స్పష్టమగుచున్నది.

నైవంస్యాత్ మృత్తికేత్యేవ సత్యమితి ప్రకృతిమాత్రస్య దృష్టాంతే సత్యత్వావధారణాత్

పూర్వపక్షము చెల్లఁదగినదిగాదు [ఛాం VI-1-4 లో] శ్రుతిచూపిన మృత్తికా దృష్టాంతమందు 'మృత్తికేత్యేవ సత్యం=కారణమైన మృత్తొక్కటియే వాస్తవమైనది' యని యుండుటచేత ప్రకృతి [=కారణము=meterial cause] మాత్రమే సత్యమైనదై నట్లు నిశ్చయమగుచున్నది.

వాచారంభణ శబ్దేన వికారజాతస్యా నృతత్వాభిధానాత్

మఱియు నదియులోనే 'వాచారంభణం వికారో నామధేయం= కార్యములన్నియు నోటితోఁబలుకఁబడు పేర్లుమాత్రమే' అని యుండుటచేతఁ [కారణము

నుండి కల్గిన] గార్యములన్నియు అనృతము [అబద్ధము] లేయని నిశ్చయ మగు చున్నది.

(2) జగద్బ్రహ్మముల విషయములో సైతము- కారణమైన బ్రహ్మము సత్యము- కార్యమైన జగత్తు అనృతము.

దార్ష్టాన్తికేఽపి 'ఐత '

[దార్ష్టాన్తికేఽపి] అసలు విషయములో- అనఁగా జగద్బ్రహ్మముల విషయములో శ్రుతి సైతము

'తత్సత్యమ్' ఛాం VI-8-7 'ఐతదాత్మ్య మిదం సర్వం- తత్సత్యమ్'

'ఈ సమస్త జగము ఆత్మవలనఁ గల్గినది- ఆ'ఆత్మ'యగు సత్తే సత్యమైనది.

ఇతిచ పరమకారణస్యై వైకస్య సత్యత్వావ ధారణాత్

అని చెప్పుచుండుటచేత 'మొదటి కారణమైన బ్రహ్మమొక్కటియే సత్యమైనదైనట్లు నిశ్చయమగుచున్నది.

(3) ప్రత్యేక జీవభావమున్సైత మనృతమే- వాస్తవమునకు జీవుఁడును బ్రహ్మమే.

'స ఆత్మా '

ఆ శ్రుతిలోనే

ఇతిచ శారీరస్య బ్రహ్మభావోపదేశాత్ ఛాం VI-8-7 'స ఆత్మా తత్త్వ మసి శ్వేతకేతో'

'ఓ శ్వేతకేతువా! ఆ యాత్మయే నీవగుదువు' అని యుండుటచేత జీవాత్మ యనునదియు బ్రహ్మమేయని యుపదేశింపఁబడినట్లు స్పష్టమగుచున్నది.

(4) స్వతస్సిద్ధముగానే జీవుఁడు బ్రహ్మమగునుగాని ప్రయత్నము వలన నగువాఁడు గాఁడు.

స్వయం ప్రసిద్ధం హ్యేతచ్ఛారీరస్య బ్రహ్మాత్మత్వ ముపదిశ్యతే నయత్నాంతర సాధ్యం

మఱియు నీశ్రుతియే [ఛాం VI-8-7] – [శారీరస్య బ్రహ్మాత్మత్వం=] 'జీవుఁడు బ్రహ్మస్వరూపమే యను విషయము దానికది ప్రసిద్ధమై యున్నదేగాని [యత్నాంతరసాధ్యం=] యేదో యొకప్రయత్నము [క్రియ-కర్మ] చేత సాధ్యపడునది [=లభించునది-కాఁగలది] కాదుఅనియును[ఉపదిశ్యతే=]జాటుచున్నయది.

అతశ్చేదం శాస్త్రీయం బ్రహ్మాత్మత్వ మవ గమ్యమానం స్వాభావికస్య శారీరాత్మత్వస్య బాధకం సంపద్యతే రజ్వాది బుద్ధయ ఇవ సర్పాది బుద్ధీనాం

కాబట్టి [ఇదం బ్రహ్మాత్మత్వం=] జీవుఁడు బ్రహ్మస్వరూపమే యను నీ విషయము [శాస్త్రీయం అవగమ్యమానం=] వేదసమ్మత సిద్ధాంతమని అందు చేతనే సత్యమని యంగీకరింపఁ బడిన తోడ్తో, అది- యనఁగా నాబ్రహ్మాత్మత్వము- రజ్జ్వాది వాస్తవజ్ఞానము [పాముగాదు త్రాడేయని కలుగు తెల్వి] సర్పాది భ్రాంతి భావములకెట్లు [బాధకం సంపద్యతే=] భంగకారియగునో యట్లే [స్వాభా... సంపద్యతే] లౌకిక వ్యవహార వైదిక కర్మాదులయందు [బ్రహ్మమునుండి భిన్న మైనదైనట్లుగా వ్యవహరించుచుండు ప్రత్యేక] జీవభావమునకును భంగకారియే యగునుజుమా !! (లౌకిక వైదికకర్మలయందు వ్యవహరించు జీవుఁడే యుండక పోవుట సంభవించును.)

(5) జీవత్వమనునదియే లేనప్పుడు జీవత్వముమీఁద నాధారపడియుండు లౌకిక వైదికవ్యవహారములును లేనివే- HCCNO. 13617

బాధితేచ శరీరత్మత్వే తదాశ్రయ స్సమస్త స్స్వాభావికోవ్యవహారో బాధితోభవతి యత్ప్రసిద్ధయే నానాత్మాంశోపరో బ్రహ్మణః కల్ప్యేత:

(యత్ప్రసిద్ధయే=) ఏలౌకిక వైదికవ్యవహారములకొఱకు బ్రహ్మమునందు (ఏకత్వాంశమునకు విభిన్న) (వాస్తవమునకు లేని) మఱియొక నానాత్వాంశము (నానాజీవభావముగూడఁ గల్పింపఁబడుచున్నదో, అట్టి (నానా) జీవభావమున కభావము (భంగము) తటస్థించుచో, అనఁగా నానాజీవభావమునశించి యంతయు బ్రహ్మమేయనుభావమే స్థిరమగుచో) అట్టి ప్రత్యేక జీవభావముపై నాధారపడి యున్న (సమస్తస్వాభావికోవ్యవహారః) సర్వలౌకిక వైదిక వ్యవహారములు సైతము లేనివే (అభావములే) యగుచున్నవి- (జీవుఁడు-అనఁగా వ్యవహరించు వాఁడే లేకపోవుచో, వ్యవహారములుమాత్రమెట్లుండును! 2914-551

దర్శయతిచ 'యత్రత్వస్య' 15-00 SHA

ఈవిషయమునే యీక్రిందిశ్రుతి స్పష్టగించుచున్నది. చూడుఁడు

బృ IV-4-14 'యత్రత్వస్య సర్వమాత్మైవా భూత్తత్కేనకం పశ్యేత్'

(అస్య=) బ్రహ్మాత్మత్వ మెఱింగినవానికి (యత్ర=) ఏయవస్థయందు (సర్వం=) సర్వప్రపంచమును (ఆత్మ+ఏవ+అభూత్=) ఆత్మయే-బ్రహ్మమేయై నిల్చునో [తత్=] అప్పుడు [కః= ఏకర్త-ఏజీవుఁడు] [కేన=] ఏయింద్రియాది సాధనముచేత [కం=] ఏవిషయమును [పశ్యేత్=] చూడఁగలఁడు.

ఇత్యాదినా బ్రహ్మాత్మత్వదర్శనం ప్రతిసమస్తస్య క్రియాకారక ఫలలక్షణస్య వ్యవహారస్యా భావం

ఇట్టి శ్రుతులు- బహ్మాత్మత్వ మెఱింగినవానికి క్రియ-సాధనము-ఫలములను లక్షణములతోఁ గూడిన వ్యవహారమే యుండదని యుద్ఘాటించుచున్నయవి-

(6) వ్యవహారాభావము ఒక ప్రత్యేకావస్థయందుమాత్రి ముండునదికాదు. ఎల్లప్పుడును నుండునదియే.

నచాయంవ్యవహారాభావో ఽవస్థావిశేషనిబంధనో ఽభిధీయతఇతి యుక్తం వక్తుం

అట్టిదే [లౌకికవైదిక] వ్యవహారము శూన్యమైయుండుట [లేకపోవుట] యేదోయొక [సమాధి మొదలగు] ప్రత్యేకావస్థకు సంబంధించినదే [అనఁగా అట్టి ప్రత్యేకావస్థలయందు మాత్రమే యుండునది యగునుగాని జీవుఁడెప్పుడును బ్రహ్మమువలె వ్యవహారశూన్యుఁడుగాడు] యని చెప్పుట కవకాశములేదు- ఎందుచేననఁగా-

'తత్త్వమ' సీతి బ్రహ్మాత్మభావస్యా నవస్థావిశేషనిబంధనత్వాత్

ఛాం VI-8-7 అను శ్రుతిలోని 'తత్త్వమసి—ఆబ్రహ్మము నీవగుదువు' అను వాక్యము 'జీవుఁడెల్లప్పుడును బ్రహ్మమేయగు' నని చెప్పుచున్నదిగాని ఒక యవస్థాభేదమందుమాత్రి మట్లగునను నిబంధనమును (restriction) జెప్పుటలేదు.

(7) శ్రుతిలోని (ఛాం VI-16) తస్కరదృష్టాంతముచే, ఏకత్వమే సత్యమనియు వ్యవహారమునుజూపు నానాత్వము మిథ్యాజ్ఞానముచేనైన కల్పితమనియు స్పష్టపడుచున్నది.

తస్కరదృష్టాంతేన చానృతాభిసంధస్య బంధనం సత్యాభిసంధస్య మోక్షం దర్శయన్నేకత్వమేవైకం దర్శయతి మిథ్యాజ్ఞానవిజృంభితం చ నానాత్వం

ఛాందోగ్యశ్రుతి VI-16 ఖండమందుఁ జెప్పఁబడిన తస్కరదృష్టాంతమందు 'అసత్యమునుగూర్చువానికి (ఉన్నయొకటినిగాక మిక్కుటమును జెప్పువానికి- అనఁగా నానాత్వవాదికి) బంధనము (=నరకము) గలుగుననియు, ఒక్కసత్యము మీదనే గట్టిగా నిలఁబడియున్నవానికి (ఏకత్వవాదికి) మోక్షము (=విడుదల) గలుగుననియుఁ జెప్పుటమూలమున ఏకత్వమొకటియే వాస్తవస్థితియని బోధింపఁ బడినది. మిథ్యాజ్ఞానముచేతనే (లేనిదానియందు బుద్ధీంద్రియాదులను బ్రసరింపఁ జేయుటచేతనే అనఁగా సత్యమైన సమ్యగ్జ్ఞానమును వదలుటచేతనే) నానాత్వము విజృంభించుననియు నందే తెలుపఁబడినది. (సమ్యగ్జ్ఞానముచేత నేకత్వము- అనఁగా మోక్షము లభించుననియు, మిథ్యాజ్ఞానముచేత నానాత్వము అనఁగా బంధనము అనఁగా లౌకికవైదిక వ్యవహారము గలుగుననియు భావము.

(8) ఏకత్వ నానాత్వములు రెండును సత్యములేయని చెప్పు భేదాభేద మతమును శ్రుతిలోని (ఛాం VI-16) తస్కరదృష్టాంతము ఖండించుచున్నది.

ఉభయసత్యతాయాంహి కథం వ్యవహారగోచరోపి జంతురనృతాభి సంధ ఇత్యుచ్యతే॥

(భేదాభేదవాదులు పాదించుచొప్పున వృక్షశాఖా దృష్టాంతానుసారము) బ్రహ్మమునందు ఏకత్వము-నానాత్వము రెండును సత్యములేయగునను పక్షములో (పైన తస్కర దృష్టాంతములోఁ జెప్పఁబడిన ప్రకారము) నానాత్వ సంబంధమైన వ్యవహారదృష్టి- అనఁగా భేదదృష్టి గలవాడు (అనృతాభిసంధః=) 'అబద్ధీకుఁడు' అనిదూషింపఁ బడఁదగడు. (అట్టివానిని 'అబద్ధికుఁడు' అని శ్రుతి దూషించినది గావున, నానాత్వము సత్యమైనదికాక పోవలెను- అని భావము)

(9) భేదదృష్టి నానాత్వమును మఱియొకశ్రుతియు (బృ VI- 4-19)దూషించుచున్నది.

> 'మృత్యోస్స మృత్యు ' ఇతిభేదదృష్టి మపవదన్నే తదేవ దర్శయతి బృ VI-4-19
> 'మృత్యోస్స మృత్యు మాప్నోతి య ఇహ నానేవ పశ్యతి'

(యః=) ఎవఁడు, (ఇహ=) ఈ బ్రహ్మమునందు (నానేవ=) నానాత్వమును- భేదమును (పశ్యతి=) చూచునో (సః=) వాడు (మృత్యోః=) బంధనము నుండి (మృత్యుం=) బంధనమును (ఆప్నోతి=) పొందును (అనఁగా ఎడతెగని బంధనము పాలగునని భావము)

ఈ శ్రుతిప్రమాణము సైతము (భేద...వద్య=) భేదదృష్టిని త్రోసివేయుచు (ఏతదేవ=) వాస్తవమగు నొకయేకత్వమునే (దర్శయతి=) బోధించుచున్నది.

(10) భేదా భేదమతము శ్రుతివిరుద్ధము అందు ఏకత్వ నానాత్వములు రెండును సత్యములేగావున మిథ్యాజ్ఞానముచే నానాత్వము గలుగుట- సమ్యజ్ఞానముచే నానాత్వముపోయి మోక్షము చేకూరుట యనునవి సంభవింపవు.

> నచాస్మి న్దర్శనే జ్ఞానాన్మోక్ష ఇత్యుపపద్యతే సమ్యగ్జ్ఞానాపనోద్యస్య కస్యచిన్మిథ్యాజ్ఞానస్య సంసారకారణత్వేనాభ్యుపగమాత్ (సంసార కారణత్వేనా నభ్యుపగమాత్ పాఠాంతరః)

(అస్మిన్‌దర్శనే=) బ్రహ్మమునందు ఏకత్వము-నానాత్వము అనునీ రెండును సత్యములేయని చెప్పు నీభేదాభేదవాద మతమునందు 'జ్ఞానము (సమ్యగ్జ్ఞానము) వలన మోక్షము చేకూరును' అను సిద్ధాంతము (న + ఉపపద్యతే=) సంభవింపదు- ఎందుచేననఁగా- ఆభేదాభేదవాదులు 'మిథ్యాజ్ఞానమే సంసారమును (=వైదిక= నానాత్వమును లౌకికవ్యవహారమున్ను విజృంభింపఁ జేయుచున్నది' యని (అభ్యుపగమాత్ =) ఒప్పుకొనరు. (నానాత్వము సైతము సత్యమనియే చెప్పుదురు) (అట్లొప్పుకొను పక్షములో) త్రాటినిజూచి పామని తలఁచునట్టి (కస్యచిన్మిథ్యా

జ్ఞానస్య ) యేదో యొకరకపు మిథ్యాజ్ఞాన' మనునది పాముగాదు త్రాడేయని తెలిసికొనునట్టి (సమ్యగ్జ్ఞానాపనోద్యస్య=) సమ్యగ్జ్ఞానముచేతఁ దొలగింపఁబడఁ దగియే యుండునుగదా !

ఉభయసత్యతాయాంహి కథమేకత్వ జ్ఞానేన నానాత్వజ్ఞాన మపనుద్యత ఇత్యుచ్యతే

(ఉభయసత్యతాయాంహి) రెండును సత్యములేయై యుండు సందర్భములో 'ఏకత్వ జ్ఞాన' (సమ్యగ్జ్ఞాన) మనునది 'నానాత్వజ్ఞాన (మిథ్యాజ్ఞాన) మనుదానిని ఎట్లు తొలగింపఁగలదు? కాన (వారిమతమందు తొలగింపఁబడుట యసంభవము- అని చెప్పియుంటిమి.

(వారిమతమే యథార్థ మగునన్నచో- పై శ్రుతుల (ఛాం VI-1-4 బృ IV.4 14 — బృ VI_4.9) యర్థమునకు భంగము వాటిల్లును)

III ఏకత్వ (అద్వైత) వాదముపై మఱికొన్ని యాక్షేపణములు వానికి సమాధానములు-

(ఏకత్వవాదముపై నాక్షేపములు

నన్వేకత్వైకాంతా భ్యుపగమే నానాత్వాభావాత్

(ఏకాంత=) ఎల్లప్పుడును నియమముగా (ఏకత్వాభ్యుపగమే-) ఏకత్వమే సత్యమైయుండునని యంగీకరించు పక్షమున నానాత్వమే (విషయాది ప్రపంచ వ్యవహారమే) యుండదుగదా ? అట్లగుచో నీక్రింది దోషములు వాటిల్లకతప్పదు. అవియేమన :-

(1) ఆక్షేపము :- ప్రత్యక్షాది ప్రమాణములకుఁ దావులేదు.

ప్రత్యక్షాదీనిలౌకికాని ప్రమాణాని వ్యాహన్యేరన్ నిర్విషయత్వాత్ స్థాణ్వాదిష్వివపురుషాదిజ్ఞానాని

ప్రత్యక్షాది లౌకికవస్తు యథార్థ గ్రహణమునకు సాధనములైన యింద్రియములు (వ్యాహన్యేరన్=) నిష్ప్రయోజనములైపోవును (=కొట్టబడిపోవును) ఎందు చేతననఁగా (నిర్విషయత్వాత్ =) నానావిధవిషయములున్నఁగదా యింద్రియముల వ్యాపారము జరుగుట ! వివిధవిషయములేలేనప్పుడు యింద్రియముల ప్రయోజనమేమి ? అది యెట్లనఁగా- (స్థాణ్వా... జ్ఞానాని=) (పురుషుఁడేమోయని భ్రమపెట్టు) స్థంభము మొదలగు వివిధవిషయములే లేనిచో (ఏకత్వమే సత్యమగుచో పురుషుఁడని యెంచునట్టి(జ్ఞానాని=)బుద్ధులు నిష్ప్రయోజనములై పోయినట్లెసుమీ!

(2) ఆక్షేపము :- విధిప్రతిషేధ శాస్త్రమునకుఁ దావులేదు

తథావిధి ప్రతిషేధ శాస్త్రమపి భేదాపేక్షత్వాత్ తదభావే వ్యాహన్యేత

విధులను బ్రతిషేధములను బోధించు వేదాదిశాస్త్రములుసైతము (వ్యాహన్యేత=) నిష్ప్రయోజనములే యైపోవును (=కొట్టబడిపోవును) అట్టిశాస్త్రములెప్పుడును (భేదాపేక్షత్వాత్=) వివిధవిషయములమీఁదనే యాధారపడియుండును. (తదభావే=) విధిప్రతిషేధ భిన్నవిషయములే లేక ఏకత్వమే (అంతయునొకటియై యుండుటయే) సత్యమగుచో, శాస్త్రము (విధి=) చేయుమని దేనినిజెప్పును! (ప్రతినిషేధ=) వదులుమని దేనినిజెప్పును!

(3) ఆక్షేపము :- మోక్షశాస్త్రమునకునుఁ దావులేదు.

మోక్షశాస్త్రస్యాపి శిష్యశాసిత్రాది భేదాపేక్షత్వాత్ తదభావేవ్యాఘాతస్స్యాత్

అంతయు నేకమేయని తెలియుట (సమ్యగ్జ్ఞానము) యను మోక్షసిద్ధాంతమునకుఁగూడ (వ్యాఘాతస్స్యాత్) భంగమే వాటిల్లును- అనఁగానదియు నిష్ప్రయోజనమే యైపోవును అట్టి సిద్ధాంతమును దెలుపు శాస్త్రమెప్పుడును (శాసిత్వ=) గురువు శిష్యుఁడు మొదలగు వివిధవిషయములమీఁద నాధారపడియుండును. (తదభావే=) అట్టి గురుశిష్యాది భిన్నవిషయములే లేక ఏకత్వమే సత్యమగుచో, మోక్షశాస్త్ర ప్రవర్తనమునకు (వ్యాఘాతః=) భంగమేగదా!

(ఎ) (2) అసత్యమైన మోక్షశాస్త్రము ప్రతిపాదించు ఆత్మైకత్వ సిద్ధాంతము సైతము అసత్యమేయై యుండును.

కథంచానృతేన మోక్షశాస్త్రేణ ప్రతిపాదిత స్యాత్మైకత్వస్య సత్యత్వ ముపపద్యేతేతి

(భిన్నవిషయముల శాసించు మోక్షశాస్త్రము అబద్ధమేయై పోవునుగదా)- అట్టి (అనృతేన=) యబద్ధమైన (అసత్యమైన) మోక్షశాస్త్రముచేత (ప్రతిపాదితస్య=) సిద్ధాంతీకరింపఁబడు (ఆత్మైకత్వస్య=) (=అంతయు నొకయాత్మ యనునదియే-ఏకత్వ) సిద్ధాంతము (కథం సత్యత్వముపపద్యేత) సత్యమెట్లు కాఁగలదు.

(బి) సమాధానములు

అత్రోచ్యతే

సమాధానము చెప్పఁబడుచున్నది చూడుఁడు

(బి 1) ఎ1)-లోఁ జూపఁబడిన యాక్షేపములు మూటికిని (1-2-3) సమాధానము :—

నైషదోషః

ఏకత్వ మంగీకరించుచో నట్టిదోషమును లేదు

సర్వ వ్యవహారాణా మేవ ప్రాగ్బ్రహ్మాత్మతా విజ్ఞానాత్ సత్యత్వోపపత్తేః

బ్రహ్మాత్మత్వ విజ్ఞానము (తానే-జీవుఁడే-బ్రహ్మమను పూర్ణానుభవము) గలుగు నంతవరకు మాత్రము నానాత్వ సంబంధమైన సర్వవ్యవహారములు సత్యములుగానే తోచవచ్చును.

స్వప్నకాల స్వప్నదృశ్య దృష్టాంతము
స్వప్నవ్యవహార స్యేవ ప్రాగ్బోధాత్

ఎట్లనఁగా- స్వప్నమందుఁదోచు వ్యవహారము లన్నియు మేల్కొనునంత వరకు సత్యములని తోచినట్లు-

సత్యాత్మైకత్వ జ్ఞానము కలుగకుండునంతవరకు సర్వప్రపంచ వ్యవహారము గోచరింపుచునే యుండును.

యావద్ధి నసత్యాత్మైకత్వ ప్రతిపత్తి స్తావత్ప్రమాణ. ప్రమేయ ఫలలక్షణేషు వికా
రేషనత్య తత్వబుద్ధిర్న కస్యచి దుత్పద్యతే

(సత్యాత్మ...ప్రత్తిః=) ఆత్మైకత్వముయొక్క అనఁగా సర్వత్రనొకటే యాత్మయను విషయముయొక్క యథార్థజ్ఞానము (యావత్ + హి-న) ఎంత వరకు లేకుండునో (కలుగకుండునో)-(తావత్=) అంతవరకే (ప్రమాణ ... వికారేషు=) ప్రమాణము (ఇంద్రియాది సాధనము) లనియు, ప్రమేయము (వివిధ విషయము) లనియు, ఫలము (క్రియాఫలము) లనియు వేరువేరుగాఁ దోచుచుండు వికారము లనెడి (నానాత్వ=) సర్వవ్యవహారము లబద్ధములేయను బుద్ధి (కస్యచిత్=) యెవనికిని (న + ఉత్పద్యతే=) గలుగఁబోదు

వికారానేవ 'త్వహం-మమే' త్యవిద్యయా ఆత్మాత్మీయేన భావేన సర్వోజంతుః
ప్రతిపద్యతే స్వాభావికీం బ్రహ్మాత్మతాం హిత్వా

జీవుఁడని చెప్పఁబడు ప్రతిజంతువును అజ్ఞానముచేత (అవిద్యచేత) సమస్తముయొక్క బ్రహ్మమేయను యాథార్థ్యమును (హిత్వా=) విడనాడి (=తెలిసికొనఁజాలక) మనోబుద్ధీంద్రియాది దేహము, భార్యాపుత్ర మిత్రాదులు ధనకనక వస్తు వాహనాదులు- అనెడి వికారములనే 'నేను'-'నావి' యని చెప్పకొనుచు (ఆత్మాత్మీయేన భావేన=) తానుగాను తనవిగాను (ప్రతిపద్యతే=) వ్యవహరించుచున్నాడు (=తలఁచుచున్నాడు)

తస్మాత్ప్రాగ్బ్రహ్మాత్మతా ప్రబోధాదుపపన్నః సర్వోలౌకికో వైదికశ్చ వ్యవహారః

కాబట్టి (ప్రాగ్బ...బోధాత్=) సర్వము బ్రహ్మమేయను యథార్థ జ్ఞానము కలుగకపూర్వము లౌకిక వైదికములైన సర్వవ్యవహారములు (=నానాత్వము) - (ఉపపన్నః=) జీవునిచేత అనుభవింపఁబడుచునే యుండును. (యథార్థములుగానే తోఁచుచుండును)

స్వప్నకాల స్వాప్నదృశ్య దృష్టాంతము

యథా సుప్తస్య ప్రాకృతస్య జనస్య స్వప్నే ఉచ్చావచాన్ భావాన్పశ్యతో నిశ్చితమేవ ప్రత్యక్షాభిమతం విజ్ఞానంభవతి ప్రాక్ప్రబోధాత్ నచప్రత్యక్షాభాసాభిప్రాయ స్తత్కాలేభవతి తద్వత్

అదెట్లనఁగా— (సుప్తస్య ... జనస్య=) నిద్రించుచున్న సామాన్యజనుఁడు (ప్రాక్ప్రబోధాత్=) నిద్రమేల్కొనకపూర్వము స్వప్నములోఁ దానుజూచుచున్న [ఉచ్చావచాన్ భావాన్) గొప్ప కొద్ది వ్యవహారములన్నియును (=సర్వాదృశ్యము లును) (ప్రత్యక్షాభిమతం=) ప్రత్యక్షములుగా జరుగుచున్నట్లున్నవై (నిశ్చితర విజ్ఞానంభవతి=) అవినిశ్చితములనెడి దృఢజ్ఞానమే నానియందుఁ గల్గుచున్నదిగాని (తత్కాలే=) ఆస్వప్నకాలమందు స్వప్నమునుగాంచువానికి (ప్రత్యక్షాభాసాభిప్రాయః=) నిజములుగాకపోయినను నిజములుగాఁ గనుపించుచున్నవను తలంపు నచభవతి=) గలుగదు. (తద్వత్=) అట్లె లౌకికవ్యవహారములున్నైతము–

(బి2) ఎ2 లోఁ జెప్పఁబడిన యాక్షేపమే మరలనిత్తి అధికముగాఁ జెప్పఁ బడుచున్నది– అసత్యమైనదాని ఫలము సత్యముగానేరదు.

కథంచాసత్యేన వేదాంతవాక్యేన సత్యస్య బ్రహ్మాత్మత్వస్య ప్రతిపత్తి రుపపద్యేత?

అసత్యములైన వేదాంతవాక్యములచేత (మోక్షశాస్త్రముచేత) సత్యమైన (బ్రహ్మాత్మత్వస్య) యద్వైతజ్ఞానము (కథంఉపపద్యేత=) ఎట్లు కలుగఁగలదు ? (కలుగుట యసంభవము)

నహిరజ్జుసర్పేణ దష్టోమ్రియతే నాపిమృగతృష్ణి కాంభసావగాహన పానాది ప్రయోజనం క్రియతఇతి

త్రాటిచే భ్రాంతిగొల్పఁబడిన పాముచేత కఱవఁబడినవాఁడు చచ్చుటలేదు. ఎండమావుల నీటియందు స్నానపానాది క్రియలు గావించువానికి (ఒడలు శుభ్రపడుట దాహమారుట మొదలగు) ప్రయోజనములు గలుగుటలేదు.

(బి2) పైయాక్షేపమునకు సమాధానము.

నైషదోషః

ఇది దోషముగాదు (ఈయాక్షేపమునందు సారమేమియును లేదు)

అసత్య స్వప్నఫలములుగా, సత్యములైన సర్పదంశనాది కార్యములు గల్గుచుండుటచేతా–

శంకావిషాద నిమిత్తమరణాది కార్యోపలబ్ధేః

(అసత్యములైన- అనఁగా భ్రాంతిపూర్వకములైన కారణములనుండి సత్యములైన కార్యములు కలుగుచుండుటను జూచుచునేయున్నారము- ఎట్లనఁగా- త్రాటినిద్రొక్కి- పామును ద్రొక్కినానను భ్రాంతివలనఁగల్గు) శంకచేతను- దుఃఖముచేతను మరణము మొదలగు సత్యమైన ఫలములు (కార్యములు) సంభవించుట లేదా! మఱియును-

స్వప్నదర్శనావస్థస్యచ సర్పదంశనోదక స్నానాది కార్యదర్శనాత్

(స్వప్నదర్శనావస్థస్య=) స్వప్నమును గాంచువానికి నాస్వప్నమందు పాము గఱచుటయు, ఉదకమందు స్నానమాడుటయు నీమొదలగు కార్యములు (ఫలములు- effects) గలుగుచుండుట లేదా!

ఎదురు ప్రశ్న :- స్వప్నమందలి సర్పదంశనాది కార్యములు సైతమసత్యములేగదా?

తత్కార్యమప్యనృత మేవేతి చేత్ బ్రూయాత్

(ఎదురు ప్రశ్న అట్టికార్యములు- అనఁగా స్వప్నమందుఁ బాముగఱచుటయు, స్నానపానాదులు జరుపుటయు మొదలగు కార్యములు సైతము అబద్ధములేయని వాదించవచ్చును.

సమాధానము :- సర్పదంశనాది కార్యముల సత్యములని యెంచినను, అట్టి కార్యములు తటస్థించి నవనిశల్గు వ్యక్తి సత్యమేగదా!

'తత్ర బ్రూమః'

(సమాధానము) అందులకు సమాధానమును జెప్పెదము వినుఁడు!

యద్యపి స్వప్నదర్శ నావస్థస్య సర్పదంశ న్నోదక స్నానాది కార్య మనృతం

స్వప్నమును గాంచువానికి నాస్వప్నమందు పాము గఱచుటయు, ఉదకమందు స్నానమాడుటయు నీ మొదలగు కార్యములు అబద్ధములైనఁ గానిండు!

తథాపి తదవ గతిః సత్యమేవ ఫలం ప్రతిబుద్ధస్యాప్య బాధ్య మానత్వాత్

అట్లయినను, పాముగఱచినట్లు, స్నానమాడినట్లు (అవగతిః=) తెలిసికొనుట యనునది (=వ్యక్తియందుండుట యనునది- consoionrners) నిజమైన ఫలమే గదా- (ఈ తెలిసికొనుటయుఁగల లోనివిషయమే నిజముగాదన్నచో) కలగనినిద్ర నుండి మేల్కొనినపిమ్మటఁగూడ (=ప్రతిబుద్ధస్యాపి) పాముగఱచినట్లు స్నానమాడినట్లు గలిగిన వ్యక్తి (=అవగతిః - consciousners) (అబాధ్య మానత్వాత్ =) ఉంటునేయున్నదిగాని లేకపోవుట లేదుగదా!

నహి స్వప్నాదుత్థితః స్వప్నదృష్టం సర్పదంశనోదక స్నానాదికార్యం మిథ్యేతి మన్య మానః తదవగతి మపి మిథ్యేతి మన్యతే కశ్చిత్

స్వప్నమందుఁ బాముగఱచుట జలములందు స్నానమాడుట మొదలగు కార్యము (మిథ్యేతి=) లబద్ధములని (స్వప్నాదుత్థితః=) స్వప్ననిద్రనుండిలేచి (మన్యమానః కశ్చిత్=) యెంచిన వాడెవఁడును (తదవగతిమపి మిథ్యేతి=) అట్లు తెలిసికొనుట యనునదికూడ- గలిగిన వ్యక్తి (consciourners) కూడ నబద్ధమని (నహి మన్యతే=) యెంచుటలేదుగదా !

ప్రసంగవశమున వచ్చిన విషయాంతరము :- చార్వాక దేహాత్మ వాద ఖండనము.

ఏతేన స్వప్న దృశోఽవగత్య బాధనేన దేహమాత్రాత్మ వాదోదూషితోవేది తవ్యః

(ఏతేన వేదితవ్యః=) ఈ తేలిన సారాంశమువలన మఱియొక విషయము సైతము గ్రహింపవలసి యున్నది. అదేమన :- (స్వప్నదృశః=) స్వప్నమును గాంచి (లేచి)నవానికి (అవగత్యబాధనేన=) స్వప్నకార్యానుభవ వ్యక్తి పోకుండుట వలన (దేహమాత్రవాదః=) 'స్థూలదేహ మొకటిదప్ప నాపైన మఱేమియు లేదు' అనిచేయు (చార్వాక మతస్థుల) వాదము (దూషితః=) ఖండింపఁబడినదగుచున్నది. (దేహముకన్నఁ బైన మఱేమియు లేనిచో, దేహప్రవృత్తి శూన్యమైన స్వప్నమందుఁ గలుగు కార్యములును వాని యవగతియు (వ్యక్తియు) వేనివలనఁ గల్గుచున్నవని చార్వాకులు చెప్పఁగలరో ! చెప్పఁగలదేమియు లేనందున వారి దేహమాత్ర వాదమతము దూషితము)

స్వప్నకార్యఫల సత్యత్వమునకు శ్రుతిప్రమాణము

తథాచ శ్రుతిః

ప్రస్తుతాంశమునకు శ్రుతిప్రమాణము సైతము గలదు చూడుఁడు-

'యదాకర్మసు నిదర్శనీ' ఛాం V-2-9 '....యదాకర్మసు కామ్యేషు స్త్రియగ్ స్వప్నేషు పశ్యతి సమృద్ధిం తత్ర జానీయాత్తస్మిన్ స్వప్ననిదర్శనే...........'

'(కర్మసుకామ్యేషు=) ఫలమును గోరిచేయు కర్మములయందు (యదా=) ఎప్పుడైతే- (స్వప్నేషు=) స్వప్నమందు (స్త్రియం=) పుణ్యస్త్రీని (పశ్యతి=) చూచునో (స్వప్ననిదర్శనే=) అప్పుడట్టి స్వప్నఫలముగా (తత్ర సమృద్ధిం=) ఆ చేయు కర్మముయొక్క- యెక్కువ మంచిఫలము (గలుగునని) (జానీయాత్=) తెలిసికొన వలెను.

ఇత్యసత్యేన స్వప్నదర్శనేన సత్యాయాః ఫలసమృద్ధేః ప్రాప్తిం దర్శయతి

ఈశ్రుతి 'అసత్యమైన స్వప్నదృశ్యము వలన సత్యమైన ఫలసమృద్ధి గలుగు చున్నట్టు' తెలుపుచున్నది'

అందులకే 'స్వప్నాధ్యాయ' గ్రంథప్రమాణము

తథా ప్రత్యక్ష దర్శనేషు కేషు చిదరిష్టేషు జాతేషు 'నచిరమివ....విద్యాత్' నచిర మివ జీవష్య తీతి విద్యాత్

అట్లే 'స్వప్నాధ్యాయ' మను గ్రంథమందు (ప్రత్యక్ష ... జాతేషు=) ప్రత్యక్షముగాఁ గొన్ని నష్టకరములగు దుశ్శకునములను జూచువాడు- ఎక్కువ కాలము జీవించడని నిశ్చయించుకొన వలసినది.

ఇత్యుక్త్వా

అనిచెప్పి పిమ్మట

'అథ స్వప్నాః కృష్ణ..హంతి' అథ స్వప్నాః; పురుషకృష్ణం కృష్ణదంతం పశ్యతి స ఏనం హంతి'

'(అథస్వప్నాః=) ఇకముందు స్వప్న విషయము చెప్పఁబడు చున్నది— (కృష్ణం=) నల్లనిరూపము గలిగినట్టియు, (కృష్ణదంతం=) నల్లనిపండ్లుగలిగినట్టియు (పురుషం=) పురుషుని (పశ్యతి=) స్వప్నమందెవఁడు చూచునో, (సః=) ఆ స్వప్న దృష్ట పురుషుఁడు (ఏనం) స్వప్నముగాంచిన వీనిని (హంతి=) చంపుచున్నాఁడు'

ఇత్యాదినా తేనా పత్యేనైవ స్వప్నదర్శనేన సత్యం మరణం సూచ్యత ఇతి దర్శయతి.

ఇట్టి స్వప్నఫల వాక్యములచేత, 'అసత్యములైన స్వప్నదృశ్యములు సత్యమైన మరణమును గలిగించు' చున్నట్టు ప్రదర్శింపఁ బడుచున్నది.

అందులకే యనుభవజ్ఞుల వాక్యములు సైతము ప్రమాణములు.

ప్రసిద్ధంచేదం లోకేకన్వయ వ్యతిరేకకుశలానా మీదృశేన స్వప్నప్రదర్శనేన సాధ్వాగమస్సూచ్యతే ఈదృశేనా సాధ్వాగమఇతి

'(ఈదృశే...నేన=) ఇట్టిట్టి స్వప్నములుగాంచుటవలన (సాధ్వా ... సూచ్యతే=) ఇట్టిట్టి శుభఫలములు గలుగును, (ఈదృశేనాసాధ్వాగమః=) ఇట్టిట్టి స్వప్నముఃలు గాంచుటవలన నిట్టిట్టి యశుభఫలములు గలుగును' అని (లోకేఽన్వయ...లానాం=) లోకమందు స్వప్నములను వానివాని యాగాముల ఫలములను బరీక్షించి కనుఁగొని చెప్పువారి యనుభవమువలనఁగూడఁ దెలియఁబడు ప్రసిద్ధాంశమై యున్నది-

అనృతాత్మకరేఖా దృష్టాంతము.

తథా ఽకారాది సత్యాక్షర ప్రతిపత్తి ర్దృష్టా రేఖానృతాక్షర ప్రతిపత్తేః

(ఈ విషయమందే మఱియొక దృష్టాంతము సైతము చెప్పవచ్చును- అదే మన)— (రేఖానృతా...పత్తేః=) వ్రాయఁబడు నక్షరములయొక్క రేఖాకారముల సత్యములై నవనుట స్పష్టము; కానియట్టి యసత్య రేఖాకారముల గ్రహించుటవలన (అకారాది సత్యా...ప్రతిపత్తిః) సత్యమగు అకారాది ధ్వని జ్ఞానము గల్గు చున్నదిగదా !

తత్త్వమస్యాద్యుపనిష ద్వాక్యములే యంత్య ప్రమాణము

అపిచాంత్య మిదం ప్రమాణమాత్మైకత్వస్య ప్రతిపాదకం నాతః పరం కించిదా కాంక్ష్యమస్తి

మఱియు 'ఆత్మైకత్వ విజ్ఞానము' (అంతయు నొక యాత్మయే యగునను తత్త్వము)ను దెలుపు (=బోధించు) నుపనిషద్వాక్యము (=ప్రమాణము) సందేహ రహితమైన కట్టకడపటిది (అంత్యం) గానే యుండునుగాని, (అతఃపరం=) దానికిఁ బైన (కించిదాకాంక్ష్యం=) మఱియొట్టి ప్రశ్నమును బుట్టింపఁ దగినదిగా (న+అస్తి=) నుండదు. (ఇందులకు నిదర్శనముగా ఛాందోగ్యములోని 'తత్త్వమసి'యని తొమ్మిదిసార్లు బోధించిన భాగములను జూడుఁడు).

యథాహిలోకే 'యజేత' ఇత్యుక్తే కిం కేన కథ మిత్యా కాంక్ష్యతే ...

అది యెట్లంటేని— వేదములోసైత మితర భాగములయందు, 'యజేత= యజ్ఞమును జేయుము' అని చెప్పఁబడినప్పుడు, (కిం=) ఏ యజ్ఞమును జేయుట ? (కేన=) దేనితో యజ్ఞమును జేయుట ? (కథం=) ఏ విధానముతో యజ్ఞమును జేయుట ? (ఇత్యా కాంక్ష్యతే=) అను ప్రశ్నములు పుట్టుట కవకాశమున్నది.

నైవం 'తత్త్వమసి' ఇత్యుక్తే కించి దన్యథా కాంక్ష్యమస్తి

ఉపనిషత్తులో 'తత్త్వమసి=) ఆ బ్రహ్మము నీవగుదువు' అని చెప్పఁబడి నప్పుడు, అందుపై మఱియొక ప్రశ్నము పుట్టుటకవకాశ మెంతమాత్రమును లేదు. (ఆత్మైకత్వమును బోధించు 'అహం బ్రహ్మాస్మి = నేను బ్రహ్మమై యున్నాను' అను మొదలగు నుపనిష ద్వాక్యములుసైత మట్టివేయని యెఱుఁగునది.)

తత్త్వమస్యాద్యుపనిష ద్వాక్యార్థము బ్రహ్మాత్మైకత్వ సాక్షాత్కారమునే గల్గించును.

సర్వాత్మైకత్వ విషయత్వా దవగతేః

ఎందుచేననఁగా :— తత్త్వమసి' – 'అహం బ్రహ్మాస్మి' అను మొదలగు నుపనిషద్వాక్యముల వలనఁగల్గు (అవగతిః=) ననుభవజ్ఞానము 'సర్వాత్మత్వ స్థితి=

సర్వమునుదానే యైయుండుట' గాక మఱింకేమియు స్ఫురింపఁజేయదు (ఇట్టి స్థితి చేకూరినప్పుడు, బ్రహ్మసాక్షాత్కార మొక్కటియే యుండునుగాని ఆకాంక్షింపఁదగిన- అనఁగా ప్రశ్నింపఁదగిన యవకాశమేమియు నుండదు)—

> సతిహ్యన్యస్మి న్నవ శిష్యమాణేఽర్థే ఆకాంక్షా స్యాత్ : నత్వాత్మైకత్వ వ్యతిరేకే ణావ శిష్యమాణోఽన్యోఽర్థోఽస్తియ ఆకాంక్ష్యేత

(అన్యస్మిన్ అవశిష్యమాణే అర్థే సతిహి=) సశేషముగాఁ (=చెప్పఁదగినది మఱికొంత మిగిలియున్నట్టుగా) జెప్పఁబడిన విషయమందన్ననో, మఱికొంత తెలిసికొనఁదగిన ప్రశ్నాభిలాష (=ఆకాంక్ష) యుంటునే యుండును ఇక్కడ నాత్మైకత్వ బోధకవాక్యము లందన్ననో, (ఆత్మైకత్వ వ్యతిరేకేణ) బోధింపఁబడిన నాత్మైకత్వముకన్న (యః ఆకాంక్ష్యేత=) ప్రశ్నపూర్వకముగా నభిలషింపఁదగి (అవశిష్యమాణోఽన్యోఽర్థః=) మిగిలియున్న (=శేషించియున్న) మఱియొక విషయమేమియును (న+అస్తి=) లేదు.

ఉపనిషద్వాక్యార్థము బ్రహ్మాత్మత్వ సాక్షాత్కారమును గల్గించుననుటకు శ్రుతిప్రమాణము.

> నచేయ మవగతి ర్నోత్పద్యత ఇతి శక్యం వక్తుం 'తద్ధాస్య విజజ్ఞౌ' ఇత్యాది శ్రుతిభ్యః

'తత్త్వమసి = బ్రహ్మము నీవగుదువు' అను మొదలగు నుపనిషద్వాక్య బోధనువిన్నపిమ్మట (ఇయం+అవగతిః=) ఈయాత్మైకత్వవిజ్ఞానము (న+ఉత్పద్యతే=) పుట్టనేరదు- (ఇతివక్తుం=) అనిచెప్పుటకు (నచశక్యం=) నవకాశములేదు. ఛాందోగ్యములో 'తత్త్వమసి=బ్రహ్మము నీవగుదువు' అని తొమ్మిదిసార్లు కుమారుఁడైన శ్వేతకేతువునకుఁ తండ్రియైన యుద్దాలకుఁడు బోధించిన కడపట-

> ఛాం VI-16-3 'తద్ధాస్య విజజ్ఞౌ' (తత్+హ+అస్య విజజ్ఞౌ)

'(తత్=) ఆ యాత్మైకత్వ విషయమును (అస్య=) తండ్రివలనఁ గుమారుఁడు (విజజ్ఞౌ+హ=) తెలిసికొన్న వాఁడాయెను అని శ్రుతియే చెప్పుచున్నది.

బ్రహ్మాత్మత్వ సాక్షాత్కారమును బొందుటకు దగిన సాధనములనుసైతము శ్రుతి చెప్పుచున్నది.

> అవగతిసాధనా నాంచ శ్రవణాదీనాం బృ IV-4-5 'ఆత్మావాఅరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యా సితవ్యః

అను మొదలగు వాక్యములచేత శ్రవణాదులును,

> వేదానువచ నాదీనాంచ విధీయమానత్వాత్ ముం II-2-5 'తమేవైకం జానీ థాత్మాన మన్యా వాచో విముంచథ....'

అను మొదలగు వాక్యములచేత వేదాను వచనాదులును- అనఁగా నుపనిష ద్వాక్యపఠనాదులును- ఇవియే

(అవగతి సాధనానాంచ=) ఆత్మైకత్వజ్ఞాను భవమునకు సాధనములుగా (విధీయ మానత్వాత్=) విధింపఁబడియే యున్నవి- [కావున 'తత్త్వమసి' అను మొదలగు కేవల మవగతి (ఏకత్వార్థ) వాక్యములఁ దెలిసికొన్నంత మాత్రిముచేఁ బ్రియోజనము లేదనరాదు]

బ్రహ్మాత్మత్వ సాక్షాత్కారము వ్యర్థమును గాదు. భ్రాంతియును గాదు- అందులకు హేతువులు.

నచేయ మవగతి రనర్థికా భ్రాంతి ర్వేతి శక్యం వక్తుం

మఱియును (అయమవగతిః=) ఈ యాత్మైకత్వాను భావము (అనర్థికా=) నిష్ప్రయోజనమనిగాని (భ్రాంతిర్వా=) కేవల మసత్యముతోఁ గూడిన భ్రాంతి యనిగాని (వక్తుం నశక్య=) చెప్పుటకును వలనుపడదు- ఎందుచేననఁగా :—

అందుచే (ఆత్మైకత్వాను భవముచే)

అవిద్యా నివృత్తి ఫల దర్శనాత్

(1) నానాత్వ దర్శనమనెడిన జ్ఞానముపోవుట యను ఫలము చేకూరుట ప్రత్యక్షముగా గోచరించును.

బాధకజ్ఞానాంతరా భావాచ్చ

ఈ యాత్మైకత్వ జ్ఞానమును బోధించునట్టి- అనఁగా నది యసత్యమని నిశ్చయింపఁ గలట్టి మఱియొక జ్ఞానములేదు.

ఈ రెండు కారణములచే నాత్మైకత్వ జ్ఞానము నిష్ఫలమని యసత్యమని గాని చెప్పఁదగదు

బ్రహ్మాత్మత్వ సాక్షాత్కారము గలుగువరకు ప్రపంచ వ్యవహారము లన్నియు జరుగుచునే యుండును.

ప్రాక్చాత్మైకత్వావగతే రవ్యాహత స్సర్వస్సత్యానృత వ్యవహారో లౌకికో వైది కశ్చేత్య వోచామ

(ఆత్మైకత్వావగతేః ప్రాక్=) ఆత్మైకత్వానుభవముఅనఁగా బ్రహ్మాత్మత్వ సాక్షాత్కారము గలుగునంతవరకు లౌకిక వైదిక సంబంధములై సత్యములుగాను, అసత్యములుగాను సామాన్యముగాఁ దోచుచుండు వ్యవహారములన్నియును (అవ్యా హతః=) ద్రోసివేయఁ బడునవి గావు- అనఁగా జరుగుచుండు నవియే- (ఇత్య

వోచామ=) యని మున్నే చెప్పియున్నాము (ఇచట మరల వివరింప వలసిన పనిలేదు)

పైనఁదెల్పిన యంత్య ప్రమాణమువలన, బ్రహ్మమునందు నానాత్వకల్పన నవకాశము లేదు.

తస్మాదంత్యేన ప్రమాణేన ప్రతిపాదితే ఆత్మైకత్వే సమస్తస్య ప్రాచీనస్య భేద వ్యవహారస్య బాధితత్వా న్నానేకాత్మక బ్రహ్మకల్పనావకాశోఽస్తి

కాబట్టి 'ఆత్మైకత్వము' (అంత్యేన ప్రమాణేన=) కట్టకడపటి నికరమైన ప్రమాణముచేత- అనఁగా వేదవాక్యార్థ జ్ఞాన సహకృత (accompaneedly) బ్రహ్మాత్మైక్య సాక్షాత్కారముచేత (ప్రతిపాదితే=) నిశ్చయింపఁ బడినదగుచుండఁగా, (ప్రాచీనస్య=) అట్టి సాక్షాత్కారమునకుఁ బూర్వము గోచరించు (సమస్తస్య భేదవ్యవహారస్య=) లౌకిక వైదిక సర్వప్రపంచ వ్యవహారము (=నానాత్వము) (బాధితత్వాత్=) భంగపడిపోయి నదియే అనఁగా లేకపోయినదే యగుట వలన (అనేకాత్మక బ్రహ్మకల్పనావకాశః=) బ్రహ్మమునందు నానాత్వకల్పన చేయుట కవకాశము (=బ్రహ్మము నానారూపములుగా గూడనున్నదని వాదించుట కవకాశము) — (న+అస్తి=) లేదు.

నను మృదాది దృష్టాంత ప్రణయనాత్ పరిణామవత్ బ్రహ్మః శాస్త్రస్యాభిమత మితి గమ్యతే

బ్రహ్మమునకు మృత్పిండము (=మట్టిముద్ద) - లోహమణి (=బంగారపు కణిక) - నఖనికృంతనము (=ఇవపకడ్డీ) అను దృష్టాంతములు స్వీకరింపఁబడుటవలన, బ్రహ్మము (పరిణామవత్=) పరిణామము (=మార్పు) గలదియేయని (శాస్త్రస్య=) (ఛాం VI-1-4,5,6) నంగీకారమైనట్లు గనుపించుచున్నది-

పరిణామినోహి మృదాదయోఽర్థాలోకే సమధిగతా ఇతి

(మృదాదయః - అర్థాః) మృత్పిండము మొదలగు వస్తువులు లోకమందు (పరిణామినః=) పరిణామమును (మార్పును) జెందునవిగానే (సమధిగతాః హి=) చూడఁబడు చున్నవిగదా !

నేత్యుచ్యతే

ఈ 'పరిణామవాది' చేయు నాక్షేపము సారవంతముగాదు.

'స వా ఏష మహానజ ఆత్మా' 'స ఏష నేతి నేత్యాత్మా' 'అస్థూలమనణు' బృ VI-4-25
స వా ఏష మహానజ ఆత్మాఽజరోఽమరోఽమృతోఽభయో బ్రహ్మ'

(సః+వై+ఏషః+ఆత్మా=) ఆయీయాత్మ (మహాన్=) అంతటనునిండి యుండు గొప్పది, (అజః=) జన్మవికారము లేనిది, (అజరః=) జీర్ణింపనిది అనఁగా

ఎట్టి పరిణామములేనిది (అమరః=) మరణింపనిది, (అమృతః=) సర్వభావవికార సూన్యము (అభయః=) అవిద్యాకార్య- భయరహితము- గావుననే (బ్రహ్మ=) నిరతిశయమైన మహత్తుగలది.

ఇత్యాదిభ్య స్సర్వవిక్రియా ప్రతిషేధ శ్రుతిభ్యో బృ V-9-26 & VI-4-22 'స ఏషనేతి నేత్యాత్మా'

(సః+ఏషః+ఆత్మా=) ఆ యీ యాత్మ, (న+ఇతి; న+ఇతి) సర్వ వికారములు కానిది-

బ్రహ్మణః కూటస్థత్వావగమాత్ బృ III-8-8 'అస్థూలమనణు'

'(అస్థూలం=) స్థూలముగానిది, (అనణు=) అణువుగానిది.

ఈ మొదలగు శ్రుతులు బ్రహ్మమునకు (సర్వవిక్రియా ప్రతిషేధ=) ఎవ్విధమైన మార్పు (=పరిణామము) లేదని త్రోసివేయుట మూలముగా, అది (బ్రహ్మము) (కూటస్థత్వ=) కూట (=సర్వకాలమొక్క- విధముననుండు దుంగ) స్వభావమైనదిగాఁ దెలుపుచున్నవి-

నహ్యే కస్యబ్రహ్మణః పరిణామ ధర్మవత్త్వం తద్రహిత తత్వం చ శక్యం ప్రతిపత్తుం

ఒక్క- బ్రహ్మమునకే (పరిణామ ధర్మవత్త్వం=) మార్పునుజెందు స్వభావముతో నుండుటయు, (తద్రహితత్వం=) నట్టిదిలేకుండుటయు సంభవించునని (ప్రతిపత్తుం=) విశ్వసించుటకు శక్యము గాదు-

(పూర్వపక్షి)

స్థితిగతివత్ స్యాదితి చేత్

అట్లననేల? ఒక్క-దేహమునకే (స్థితిగతివత్=) కదలుటయు గదలకుండుటయు (భిన్న కాలములయందు) నుండులాగున నేలయుండఁగూడదు? (అట్లె బ్రహ్మమునకు సైతము జగత్సృష్టి కాలమునందుఁ బ్రవృత్తియు (కదలుటయు) ప్రళయ కాలమునందు నిశ్చలత్వము (కదలకుండుటయు) నుండఁగలవనియేల చెప్పఁగూడదు! అని భావము)

(సమాధానము)

న కూటస్థస్యేతి విశేషణాత్

అట్లు చెప్పఁగూడదు. బ్రహ్మమునకు 'కూటస్థుడు (కూటమువలె సర్వకాలములయందుఁ గదలకుండువాడు)' అని విశేషణము చెప్పఁబడి యుండుట వలన నట్లనరాదు.

సహి కూటస్థస్య బ్రహ్మణః స్థితిగతి వదనేక ధర్మాశ్రియత్వం సంభవతి

కూటము (అను సాలివాని) వలె నుండు బ్రహ్మము స్థితియు (=కదలుటయు) గతియుఁ (=కదల కుండుటయు) బోలె భిన్నములైన పెక్కు ధర్మముల (విశేష ణము)కు నాశ్రియ భూతముగానుండుట యెన్నటికిని సంభవింపదు.

కూటస్థంచ బ్రహ్మ సర్వవిక్రియా ప్రతిషేధదిత్యవోచామ

(సర్వ విక్రియా=) ఎట్టి పరిణామము (=ఎట్టి వికారము = ఎట్టి మార్పు) లేకుండుట వలననే బ్రహ్మము కూటస్థమని పిల్వఁబడు చున్నదని యిదివరకే చెప్పి యుంటిమిగదా !

నచ యథా బ్రహ్మణ ఆత్మైకత్వ దర్శనం మోక్షసాధనం ఏవం జగదాకార పరిణా మిత్వ దర్శనమపి స్వతంత్రమేవ కస్మై చిత్ఫలాయాభి ప్రేయతే ప్రమాణభావాత్

బ్రహ్మాత్మైకత్వ దర్శనము- అనఁగా బ్రహ్మ సాక్షాత్కారము (సమస్తము బ్రహ్మమేయని నిశ్చయమగు నవగతి) మోక్ష సాధనమని యెట్లంగీకరింపఁ బడు చున్నదో, అట్లె బ్రహ్మము జగదాకారముగాఁ బరిణమించు చున్నదను (దర్శన మపి) సిద్ధాంతము సైతము (స్వతంత్రమేవ=) దానికదియే (కస్మైచిత్ఫలాయ=) మోక్షమునుగాక పోయినను నేదోయొక ఫలమునీయఁ గలదని (నచ+అభి ప్రేయతే=) యైనను నభిప్రాయ పడఁగూడదు.

ప్రమాణాభావాత్

ఎందుచేనందురేమో ! అట్లని చెప్పదగిన ప్రమాణ మేమియునులేదు. కూటస్థ బ్రహ్మాత్మైకత్వ విజ్ఞానా దేవహి ఫలం దర్శయతి శాస్త్రం; 'సఏష....త్మాత్మా' ఇత్యుపక్రమ్య 'అభయంవై....ప్రాప్తోసి' ఇత్యేవం జాతీయకం బృ V-9-26 'స ఏవ నేతినే త్యాత్మా'

జీవుఁడు (తాను) కూటస్థ బ్రహ్మమేయని (విజ్ఞానము-అవగతి-సాక్షాత్కా రము ద్వారా) తెలిసికొనుటవలన మాత్రమే మోక్షఫలము చేకూరునని శాస్త్రము (బృ III & IV ఖండములను జూడుఁడు) ఘోషించు చున్నయది- ఉదాహరణము లను జూడుఁడు.

బృ VI-2-4 'అభయంవై జనక ప్రాప్తోఽసి'

ఇట్టివే మఱికొన్నియును గలవు.

తత్రైతత్సిద్ధం భవతి : బ్రహ్మ ప్రకరణే సర్వధర్మ విశేషరహిత బ్రహ్మదర్శనా దేవ ఫలసిద్ధౌ సత్యాం, యత్తత్రాఫలం శ్రూయతే బ్రహ్మణో జగదాకార పరిణా మిత్వాది తద్బ్రహ్మదర్శనోపాయ త్వే నైవ వినియుజ్యతే,

(తత్రై)....భవతి=) ఈ విషయమందీ క్రిందఁ దేల్చఁ బడినది నిశ్చితమైన సిద్ధాంతమగుచున్నది- 'బ్రహ్మమునుజెప్పు వేదభాగమునందు (అనఁగా నుపనిష త్తులయందు) సమస్తధర్మవిశేష (=పరిణామిత్వాది) శూన్యమైన- అనఁగా కూటస్థ మైన బ్రహ్మముయొక్క (దర్శనాదేవ=) సాక్షాత్కారముచేత మాత్రమే (ఫఁసి ..సత్యాం=) ఫలము (=మోక్షము) సిద్ధించుననని స్పష్టపడు చుండుటను బట్టియు, (తత్ర=) ఆ యుపనిషత్తుల యందే బ్రహ్మము జగదాకారముగాఁ బరిణ మించు చున్నదని చెప్పు (సృష్ట్యాది) కొన్ని వాక్యములు (యత్ - అఫలం శ్రూయతే=) ఫలము చెప్పఁబడకుండఁ గన్పించు చుండుటను బట్టియు, (తత్=) ఈ ఫలములేని వాక్యముల ప్రయోజనము- అనఁగా బ్రహ్మము జగద్రూపముగాఁ బరిణమించియున్నట్టు విశ్వసించియు పాననాదులను సల్పువారికేఁ గల్గు ప్రయోజ నము (బ్రహ్మ...వినియుజ్యతే=) (కేవల బ్రహ్మసాక్షాత్కారమును మోక్షము గాక) బ్రహ్మసాక్షాత్కారమునకు ఉపాయము (సాధనము) చేకూరుటయే యని చెప్పఁదగి యున్నది- (అట్లని నిశ్చయించుట కేమి యాధార మందురేమో- కర్మకాండ యందిట్టి న్యాయమే చెప్పఁబడియున్నది- అదేమన :—

'ఫలవత్సన్నిధావఫలం తదంగ మితివత్' సతు స్వతంత్రఫలాయ కల్ప్యత ఇతి

(ఫలవత్సన్నిధా=) ఫలముగల (=ఫలము ప్రత్యేకముగాఁ జెప్పఁబడిన) వాక్యములయొక్క సన్నిధానమందు (అఫలం=) ఫలములేని (ఫలముప్రత్యేకముఁగా జెప్పఁబడని) వాక్యములున్నచో, (తదంగ మితివత్=) ఈ ఫలములేని వాక్యములు ఆ ఫలముగల వాక్యములకు నంగములుగా నెంచవలయును గాని, అవి (స్వతంత్ర ఫలాయ=) స్వతంత్రఫల మీయఁగలవని (నతుకల్ప్యతే=) భావింపగూడదు (ఇది జైమిని పూర్వమీమాంస లోని సూత్రము)

నహి పరిణామవత్త్వ విజ్ఞానాత్ పరిణామవత్త్వ మాత్మనః ఫలం స్యాదితి యుక్తం వక్తుం

(ఎవఁడే రూపమును ధ్యానించునో వాడారూపమే యగునను న్యాయ మున్నది గావున)-

(పరిణామ-జ్ఞానాత్=) బ్రహ్మము పరిణామముగలది యని తెలిసికొనుట వలన (ఆత్మనః=) అట్లు తెలిసికొను జీవుఁడును (పరిణామవత్త్వం ఫలంస్యాత్=) పరిణామముగల వాడగుటయె ఫలమగునని (వక్తుం) చెప్పుట (నహియుక్తం=) యుక్తముగాదు. (ఎందుచేతననగా ఇట్టిది యనిత్యఫలము=బ్రహ్మజ్ఞానముచే ననిత్య ఫలమగునని చెప్పినట్లే యగును. అనిత్య ఫలము లైనప్పుడును దుఃఖాదులను గల్గించు నవియె)

కూటస్థ నిత్యత్వా న్మోక్షస్య

(బ్రహ్మ జ్ఞానముచేఁ గల్గుఫలమైన) మోక్షమన్నది (కూటస్థనిత్యత్వాత్ =) కూటస్థ నిత్యముగాని–అనఁగా కూటమువలె సర్వకాల మొకేరీతిన నుండునది (గాని పరిణామ నిత్యముగాదు-అనఁగా నిత్యమై పరిణామమును జెందుచుండునది. గాదు = పరిణామమును జెందునది నిత్యమని చెప్పఁదగదు)

పూర్వపక్షి:–

ననుకూటస్థ బ్రహ్మవాదిన ఏకత్వైకాం తాదీశిత్రీశిత వ్యాభావే ఈశ్వరకారణ ప్రతిజ్ఞా విరోధ ఇతిచేత్

(కూటస్థ బ్రహ్మవాదినః =) బ్రహ్మము కూటమువలె నెల్లకాల మొకే రీతిననే యుండునని వాదించు వాడని (=అద్వైతి) (ఏకత్వైకాంతాత్ =) తన వాదమునకు ఫలముగా ''బ్రహ్మ మెల్లప్పుడొకటిగానే యుండు''నను నియమమును దప్పని సరిగా నంగీకరింప వలసి యుండుటచే (ఈశితృ + ఈశితవ్య + అభావే =) పరిపాలించువాడు (అనగా పశుపతి- సృష్టికర్త- ఈశ్వరుఁడు పరిపాలింపబడ వలసినది. (అనఁగా-జగత్తు-పశువులు–జీవులు) అనుభేదములేదనియె చెప్పవలసివచ్చును- అట్లగుచోఁ దానొప్పకొనియె 'ఈశ్వర కారణ' ప్రతిజ్ఞకు- అనఁగా ఈశ్వరు నుండియె యీ జగత్తు కల్గినది' (బ్రసూ I-1-2 'జన్మాద్యస్యయత్వాయ' సూత్రమును జూడుఁడు) యను సిద్ధాంతమునకు (విరోధః =) భంగమే వాటిల్లునుగదా- ఇందులకేమి చెప్పెదరో!

సమాధానము:—

న, అవిద్యాత్మక నామరూప బీజ వ్యాకరణా పేక్షత్వాత్ సర్వజ్ఞత్వాస్య

ఈ యాక్షేపణ మొక లెక్కలోనిదిగాదు అవిద్యా స్వరూపములై యంత వరకు లోనలీనమైయుండు) సృష్టి బీజము (అంకురము) లైన నామరూపములను (వ్యాకరణాపేక్షత్వాత్ =) వ్యాపింపజేయుట యను పనిని (ముఖ్యముగాఁ)బుచ్చుకొన్నప్పుడు ఆ కూటస్థ బ్రహ్మమే 'సర్వజ్ఞు' డని చెప్పఁబడు చున్నాడు.

(సృష్టి సంబంధమైన ప్రపంచమును దలపెట్టుటకు అవిద్యయె మూలకారణము-ఆసృష్టిని గల్గించు బీజములు నామరూపములు సృష్టికిఁ బూర్వము బీజములు ఏకమై యద్వితీయముగానుండు బ్రహ్మములోనే లీనమైయుండి బ్రహ్మముయొక్క కూటస్థత్వమున కెట్టి భంగమును జేయవు. అవిద్యా కార్యమే సృష్టి సంకల్పము. అవిద్యా స్వరూపములే సృష్టిబీజములైన నామరూపములు- సృష్టి సంకల్పముతో నీబీజములైన నామరూపములు వ్యాపింపఁ జేయఁబడుటయే సృష్టి అవిద్యాస్వరూపములైన నామరూపములకన్న సృష్టి ప్రపంచము వేరుగాలేదు- వాస్తవముస

కుమున్నదాయొక్క కూటస్థ బ్రహ్మమే, సృష్టిమానసులోఁ బెట్టుకొని యా కూటస్థ బ్రహ్మమే సర్వజ్ఞుఁడని చెప్పబడుచున్నాడని భావము)

'తస్మాద్వా ఇత్యాది వాక్యేభ్యో నిత్యశుద్ధ బుద్ధయుక్త స్వరూపాం సర్వజ్ఞాత్ సర్వా శక్తే రీశ్వరాజ్జగదుత్పత్తిస్థితిలయాః

తై II-1 'తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్యం భూతః'

(తస్మా...దాత్మకః=) ఆయీ యాత్మనుండియే ఆకాశము పుట్టినది.

ఇదియు, నిట్టివే మఱికొన్నియు నగు (వేదములోని) సృష్టివాక్యములవలన నిత్య...స్వరూపాత్=) నిత్య శుద్ధబుద్ధ (జ్ఞాన) ముక్త(=మోక్ష) స్వరూపుఁడను స్వరూప లక్షణము గలిగినట్టియు, సర్వజ్ఞత్వము సర్వశక్తిత్వము అను తటస్థ లక్షణములు గల్గినట్టియు ఈశ్వరుని నుండి (కూటస్థ బ్రహ్మమునుండి) యీ జగత్తు యొక్క యుత్పత్తిస్థితిలయములు గల్గుచున్నవి గాని,

నా చేతనాత్ ప్రధానాదన్యస్మాద్వా

అచేతనమైన (సాంఖ్యుల) ప్రధానము నుండిగాని లేక అట్టివేయగు మఱి కొన్ని (అణ్వాది) కారణములవల్లఁగాని కలుగుటలేదు- అని నిశ్చయమగుచున్నది.

ఇత్యేషోఽర్థః ప్రతిజ్ఞాతో 'జన్మాద్యస్య యత ఇతి'

(ఏషః అర్థః=) ఈ విషయమే 'జన్మాద్యస్య యతః=) ఎవనినుండి యీ జగత్తుయొక్క యుత్పత్త్యాదులు కలుగుచున్నవో' (బ్ర సూ I-1-2) అను సూత్రమునందుఁ బ్రతిజ్ఞ (=శపథము) చేయఁబడినది.

సా ప్రతిజ్ఞా తదవస్థైవ

అది (నిజముగా) ప్రతిజ్ఞయే (=శపథమే); అని (ఎట్లు చెప్పినామో యట్లు) యుండనే యున్నది.

న తద్విరుద్ధోఽర్థః పునరిహోచ్యతే

(తద్వి...ర్థః=) అందులకు వ్యతిరేకమైన యర్థము (=భావము) మఱల నిక్కడఁ జెప్పఁబడుటలేదు.

పూర్వపక్షి :-

కథం నోచ్యతే అత్యంతమాత్మన ఏకత్వ మద్వితీయ త్వంచ బ్రువతా?

'ఆత్మ' యనునది 'ఏకము' 'అద్వితీయము' అని వాదించు నీవే (=అద్వైతివే) ఆ 'యాత్మ' నుండి జగత్తుయొక్క యుత్పత్తి స్థితిలయములు బయల్దేరినవి'

అని చెప్పుచుండఁగా, పూర్వము చెప్పినదానికి విరుద్ధార్థము చెప్పుటలేదని పులిమి పుచ్చుట యెట్లు ?

సమాధానము :—

శ్రుణుయథా నోచ్యతే

వినుము విరుద్ధార్థము చెప్పుట లేదనుట యెట్లో !

(నామరూప ప్రపంచమంతయు 'అవిద్య' వలనఁ గల్పింపఁ బడునది గాని వాస్తవమైనదిగాదు. 'అవిద్య (మాయ=భ్రాంతి)' యనునది 'ఆత్మ= (బ్రహ్మము)' లోనిదేగాని ఆత్మమాత్రము గాదు. అట్లయినను, ఆయవిద్యకు నాత్మనుబట్టియె వ్యవహారము గలదుగాని స్వతంత్ర స్థితిలేదు. ఈ యవిద్య జరిగించు (భ్రాంతివ్యవహారము ఆత్మయొక్క కూటస్థత్వమునకు (నిశ్చలత్వమునకు) నిబ్బంది గలుగఁ జేయదు.)

సర్వజ్ఞేశ్వర స్యాత్మ భూతే ఇవా విద్యాకల్పితే నామరూపే తత్త్వాన్యత్వాభ్యా మని ర్వచనీయే సంసార ప్రపంచ బీజభూతే సర్వజ్ఞేశ్వరస్య మాయాశక్తిః ప్రకృతి రితిచ శ్రుతి స్మృత్యోరభిలప్యేతే

(సంసార ... భూతే) ఎడతెగకుండ జరుగుచునేయుండు నీ ప్రపంచము యొక్క యుత్పత్తికి (గారణ భూతములై నట్టియు అవిద్య (=మాయ—అజ్ఞానము—భ్రాంతి) చేఁగల్పింప బడునట్టియు నామరూపములు (సర్వ...ఇవ) సర్వజ్ఞుడైన యీశ్వరుని యొక్క స్వరూపముల వంటివే యనులాగున నుండునేగాని (తత్త్వా... నీయె) అవి (=ఆనామరూపములు) 'తత్త్వ' మా (=కేవల మాత్మ సంబంధములైనవేనా) లేక 'అతత్త్వ' మా (=ఆత్మకంటె కేవలము భిన్నములైనవా) యని చెప్పుటను (=నిర్వచించుటకు) వీలులేక (సర్వజ్ఞే...ప్రకృతిరితిచ=) సర్వజ్ఞుఁడైన యీశ్వరుని యొక్క మాయ యనియు, 'శక్తి' యనియు 'ప్రకృతి (=స్వభావము)' యనియు (శ్రుతిస్మృత్యో=) శ్రుతిస్మృతుల వలనఁ బిల్వఁబడుచున్నవి.

తాభ్యా మన్య స్సర్వజ్ఞఈశ్వరః 'ఆకాశో వై నామ నామరూపయో ర్నిర్వహితా తేయదంత రాతద్బ్రహ్మ ఇతి శ్రుతేః ఛా VIII 14-1 'ఆకాశోహ వై నామరూప యోర్నిర్వహితా తేయదంత రాతద్బ్రహ్మ'

'(ఆకాశః=) ఆకాశమువలె సూక్ష్మమైయుండు నాత్మ (నామ .నిర్వ్రి. తా హవై నామరూపములను జేయువాడనుట ప్రసిద్ధము (తే=) అనామ రూపములు (యదంతరా=) దేనిమధ్య నున్నవో (తత్ )అది (బ్రహ్మ=) బ్రహ్మము (=ఆత్మ)- అను నీశ్రుతివలన సర్వజ్ఞుఁడైన యీశ్వరుఁడు ఆ నామరూపములకంటె

నన్యుఁడని స్పష్టమగుచున్నది ఈ యర్థమునే యీక్రింది శ్రుతులు సైతము చెప్పు చున్నవి చూడుఁడు

'నామ ..వాణీ' 'సర్వాణి. . .యదా స్తే'(ఏకం. . .కరోతి ఛాం VI-3-2 నామరూపే వ్యాకరవాణి

(నామరూపే=) నామ రూపములను (వ్యాకరణవాణీ=) వ్యాపింపఁ జేయు దును'అని సత్పదార్థము పలికెను

ఇత్యాది శ్రుతిభ్యశ్చ తై ఆరణ్యకం III-12-7 'సర్వాణి రూపాణి విచిత్య ధీరః నామానికృత్వా భివదన్ యదాస్తే'

'(యత్ ధీరః=) ఏసర్వజ్ఞుఁడైన యీశ్వరుఁడు (సర్వాణిరూపాణి=) సమస్త కార్యములను జగత్తును (విచిత్య=) విరచించి (నామాని=) వానికి వానికి వేరువేరు పేళ్ళను (కృత్వా=) చేసి (అభివదన్=) ఆ పేర్లను బల్కుచు (ఆస్తేప) ఉండెను

శ్వే VI-12 'ఏకంబీజం బహుధాయః కరోతి'

'(యః=) ఎవఁడు (ఏకం బీజం=) ఒకటియగు పదార్థమునే (బహుధా=) అనేక ప్రకారములుగా (కరోతి=) చేయుచున్నాడో-

ఏవమవిద్యా కృతనామరూపో పాధ్యనురోధీశ్వరో భవతి వ్యోమేవఘటకరకా ద్యుపాద్యనురోధి

కూటస్థ బ్రహ్మమునందే నామరూపములు గల్పింపఁబడుచున్నవనుభావము తెలుపఁబడుచున్నది)

పై శ్రుతులు తెలిపినట్లుగా, (అవిద్యా....రోధి=) అవిద్యచేతఁ (బ్రహ్మము నందు) గల్పింపఁబడిన నామరూపము లనెడి నుపాధుల (దేహముల Limiting adjenmts) తోఁజేరి యున్నప్పుడు (అకూటస్థబ్రహ్మమె) ఈశ్వరుఁడని చెప్పఁ బడు చున్నాడు-ఎట్లనగా (వ్యోమ=) మహాకాశము (ఘట...రోధి=) ఘటము (=కుండ) కరకము (=వడగల్లు) అనునుపాధులతోఁ జేరియున్నప్పుడు (ఘటా కాశము కరకాకాశము అని (ఇవ=) చెప్పఁబడినట్లు-

సచ స్వాత్మభూతానేవ ఘటాకాశస్థానీయా నవిద్యాప్రత్యుపస్థాపిత నామరూపకృత కార్యకరణ సంఘాతానురోధినో జీవాఖ్యానాత్మ నః ప్రతీష్టేవ్యవహారవిషయే

(సచ=) మహాకాశమని చెప్పఁదగిన యా యీశ్వరుఁడే (భిన్న భిన్న) ఘటాకాశములని చెప్పఁదగినట్టియు, (అవిద్యా...రోధినః) అవిద్యచేత లేవఁదీయఁ బడిన నామరూపములచేతఁ గల్పింపఁబడిన (కార్య=) దేహములయొక్క-(కరణ=) బుద్ధి మొదలగు నింద్రియముల యొక్క సంఘాతములను (సమూహముల యందు)

అనురోధినః) అనుసరించి (ప్రవేశించి) యుండునట్టియు (జీవాఖ్యాన్=) జీవులను పేర్లుగల (ఆత్మనః ప్రతి) విజ్ఞానాత్మలను (వ్యవహార విషయే- ఈష్టే) లోకవ్యవహారార్థము పరిపాలించుచున్నాడు (పరిపాలించు చున్నట్లుండును).

తదేవ మవిద్యాత్మకో పాధిపరిచ్ఛేదాపేక్షమేవేశ్వరస్యేశ్వరత్వం సర్వజ్ఞత్వం సర్వశక్తిత్వంచ

(తత్=) కాబట్టి (ఏవం=) ఈ పైనఁజెప్పఁబడిన విధమున బ్రహ్మమునందుఁ గల్పింపఁబడు (అవిద్యాత్మక=) అవిద్యా స్వరూపములగు (ఉపాధి=) నుపాధుల వలనఁజేయఁబడిన (పరిచ్ఛేదాపేక్ష మేవ=) జీవులుగ మొదలగు పేర్లతోనుండు కొద్దికొద్ది విభాగములను బట్టియే (ఈశ్వరస్య=) బ్రహ్మమునది (ఈశ్వరత్వం=) ఈశ్వరుఁడని (సర్వజ్ఞత్వం=) సర్వజ్ఞుడని (సర్వశక్తిత్వంచ=) సర్వశక్తిగలవాడని వ్యవహరింపఁబడుచున్నాడు.. కాని

న పరమార్థతః

అట్టి సర్వజ్ఞత్వాది విశేషములు వాస్తవమునకు బ్రహ్మమునందు లేవు

విద్యయాపాస్త సర్వోపాధి స్వరూపే ఆత్మనీశిత్రీశితవ్య సర్వజ్ఞత్వాది వ్యవహార ఉపపద్యతే

(విద్యయా=) జ్ఞానముచేత బ్రహ్మాత్మత్వజ్ఞానము చేత (అపాస్త...స్వరూపే=) తొలఁగి పోయిన సమస్తోపాధులుగల స్వరూపమే యగు నాత్మయందు - అనఁగా అంత్యప్రమాణమని యుపనిషత్తులచేత చెప్పబడు బ్రహ్మాత్మ విజ్ఞానము చేత సాక్షాత్కారమగు నఖండ బ్రహ్మమందు (ఈశిత్వ+ఈశితవ్య- సర్వజ్ఞత్వాదివ్యవహారః-) పరిపాలించు నీశ్వరుఁడు పరిపాలింపఁబడు జీవులు సర్వజ్ఞత్వాది విశేషములు - అను విభాగ విభేద వ్యవహారము (న+ఉపపద్యతే=) సంభవింపఁజాలదు గదా!

తథాచోక్తం

అట్లు చెప్పు శ్రుతిప్రమాణములను జూడుడు.

'యత్రనాన్య...............సభూమా ఇతి ఛాం VII-24-1 'యత్రనాన్యత్పశ్యతి నాన్యచ్ఛృణోతి నాన్యద్విజానాతి సభూమా

'(యత్ర=) ఏ యవస్థయందు, (అన్యత్ న పశ్యతి=) మఱియొక దానిని జూడఁడో, (అన్యత్ న శృణోతి=) మఱియొక దానిని వినఁడో, (అన్యత్ నవిజానాతి=) మఱియొక దానిని దెలిసికొనఁడో, (సభూమా=) అట్టి యవస్థయే అఖండ బ్రహ్మమని చెప్పఁబడును-

యత్రత్వస్య ........ పశ్యేత ఇత్యాదినా చ; బృ. [V-4-14 యత్రత్వస్య సర్వమాత్మైవాభూత్ తత్కేన కిం పశ్యేత్'

"(యత్ర తు) ఏ యవస్థయందు (అస్య=) ఈ బ్రహ్మాత్మ జ్ఞానముగల విద్వాంసునకు (సర్వం=) సమస్తము (ఆత్మా+ఏవ+అభూత్=) ఆత్మయేయై నిల్చునో, (తత్=) ఆ యవస్థయందు (కేన=) ఏ యింద్రియాది సాధనముచేత (కిం=) ఏ విషయమును (పశ్యేత్=) చూచును !

ఏవం పరమార్థావస్థాయాం సర్వవ్యవహారాభావం వదంతి వేదాంతాః

ఈ విధముగ బరమార్థావస్థలయందు- అనగా సత్యమైన అఖండ బ్రహ్మ సాక్షాత్కారావస్థయందు సర్వలౌకిక వైదిక వ్యవహారములు లేకయే పోవునని (వేదాంతాః=) ఉపనిషత్తులు (వదంతి=) చెప్పుచున్నవి.

తథేశ్వరగీతాస్వపి

ఇట్లే భగవద్గీత సైతము వక్కాణించుచున్నయది- చూడుడు :—

భ. గీ V-14 'నకర్తృత్వం నకర్మాణి లోకస్య సృజతిప్రభుః
నకర్మఫల సంయోగం; స్వభావస్తు ప్రవర్తతే'

తే॥ గీ॥ ఈతను ప్రభుండగు నాత్మ- యీప్సితములు
సేయఁబోడు, చేయుమటంచుఁ జెప్పఁబోడు,
కర్మలను గర్మఫలములఁ గలుపఁబోడు
ప్రకృతిదే సుమ్మి కర్మ ప్రవర్తనమ్ము !
(నారాయణాంధ్ర భగవద్గీత)

భ. గీ. V-15 నాదత్తే కస్యచిత్పాపం నైవ సుకృతం విభుః
అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యంతి జంతవః

తే॥ గీ॥ పరులవేగాదు నిజనిష్ఠ పాపపుణ్య
నికర మేనియు నాత్మకొంకటయె యుండదు ;
స్వకవివేక జ్ఞాన మజ్ఞాన వృతము
గాఁగ, నవివేకి దాఁ గర్తగా భ్రమించు !
(నారాయణాంధ్ర భగవద్గీత)

ఇతి పరమార్థావస్థాయా మీశిత్రీశితవ్యాది వ్యవహారాభావః ప్రదర్శ్యతే

ఇట్లు పరమార్థావస్థలయందు (ఈశితృ=) పరిపాలించు నీశ్వరుడనియు, (ఈశితవ్య=( పరిపాలింపఁబడు జీవాదిజగత్తనియు ననునవి మొదలగు (ఆద్యా) భేద వ్యవహారమే యుండదనిఁ ప్రదర్శింపఁ బడుచున్నది—

వ్యవహారావస్థాయాం తూక్తః శ్రుతావ పీశ్వరాది వ్యవహారః

పరిపాలించు నీశ్వరుఁడని యొకఁడుండుటయు, పరిపాలింపఁబడు జీవాది జగత్తని వేరుగా మఱియొకటుండుటయు నిత్యాది ప్రసంగమంతయు (వాస్తవముగాని) వ్యవహారావస్థకు మాత్రమే సంబంధించి యుండునని శ్రుతియందు సైతము చెప్పఁబడినది. చూడుఁడు.

'ఏష సర్వేశ్వరాది....సంభేదాయ' ఇతి బృ IV-4-22 'ఏష సర్వేశ్వర ఏష భూతాధిపతి ఏష భూతపాల ఏష సేతుర్విధరణ ఏషాం లోకానామ సంభేదాయ

'(ఏషః=) ఈ పరమాత్మ (సర్వేశ్వరః=) సర్వమునకు నియామకుఁడును, (ఏషభూతాధిపతిః=) ఈ పరమాత్మయే బ్రహ్మాది భూతములకుఁ బ్రభువు (ఏష భూతపాలః=) ఈపరమాత్మయే సమస్త భూతములను రక్షించువాఁడును (ఏషాం... దాయ=) ఈ భూతాది లోకములయొక్క కట్టుబాట్లు చెడిపోకుండ నుంచుటకు (ఏషః=) ఈ పరమాత్మయే, (సేతుః=) కట్టవంటివాఁడై (విధరణః=) వర్ణాశ్రమాది వ్యవస్థలను చేయువాఁడునై యున్నాఁడు.

తధేశ్వర గీతా స్వపి

అట్లె భగవద్గీతయుఁ జెప్పుచున్నది చూడుఁడు

భ. గీ. XVIII-61'ఈశ్వర. . .మాయయా' 'ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశ్వర్జున తిష్ఠతి భ్రామయన్ సర్వాభూతాది యంత్రారూఢాని మాయయా'

తే. గీ. మఱియు వినుమర్జునా, తనమాయచేతఁ
గీలుబొమ్మలఁ గథకుండుబోలె భూత
ములఁదదీయ కర్మముల ద్రిప్పుచుఁ దదంత
రముల నిలచియున్నాఁడు నారాయణుఁడు.

(నాయాంధ్ర భగవద్గీత)

సూత్రకారోఽపి పరమార్థాభిప్రాయేణ తదనన్యత్వమిత్యాహ

ఈబ్రహ్మసూత్రములను రచియించిన శ్రీ వ్యాసభగవానుఁడు సైతము (పర...యేణ=)కారణకార్యములనుగూర్చి వాస్తవాభిప్రాయమును వెల్లడించుటకుగాను ఈ బ్రసూ II-1-14 త్రమునందు (తదనన్యత్వం = కారణముకంటెఁ గార్యము భిన్నముగాదు' అని చెప్పియున్నాఁడు.

వ్యవహారాభిప్రాయేణతు 'స్యాల్లోకవ' దితిమహా సముద్రాది స్థానీయతాం బ్రహ్మణః కధయతీ : అప్రత్యాఖ్యాయైవ కార్యప్రపంచం పరిణామప్రక్రియాం చాశ్రయతి 'సగుణోపాసనే షూపయోక్ష్యత' ఇతి

వ్యవహారాభిప్రాయమును దెలుపుటకన్ననో, లోకడి (బ్ర. సూ II-1-3 త్ర మున 'స్యాల్లోకవత్' అని- అనఁగా కారణమైనబ్రహ్మము మహాసముద్రమువంటి దనియుఁ గార్యమైన యాభిన్నరూపజగత్తు వీచీతరంగ బుద్బుదాదులవంటిదనియుఁ జెప్పుటమూలమున (కార్యప్రపంచం=) కార్యమైన జగత్తును (అప్రత్యాఖ్యాయ+ ఏవ=) బొత్తుగాలేదని నిరాకరించకుండఁగనే ('సగుణో... యోక్ష్యతే' ఇతి) సగుణోపాసనములయందు నుపయోగించుననుతలఁపుతో (పరిణామప్రక్రియాంచ=) తరంగబుద్బుదాదులు సముద్రమునుండి కల్గిన పరిణామములెట్లగునో యట్లె కార్యమైన జగత్తు కారణమైన బ్రహ్మమునుండి కల్గిన పరిణామమని చెప్పుపక్కీని (ఆశ్రయతి=) నవలంబించి చెప్పినట్లు స్పష్టపడుచున్నది-

15 సూత్రావతారిక :—

పై సూత్రమునందుఁ జెప్పిన హేతువుగాక కారణముకంటెఁ గార్యము భిన్నముగాదనుటకు మఱియొకహేతువుగూడ నీసూత్రమునందుఁ జెప్పఁబడుచున్నది.

## ౧౫ సూ॥ భా వే చో ప ల బ్ధేః

ప॥ వి :- భావే-చ-ఉపలబ్ధేః- (చ)

ప్రి॥ ప॥ అ :- భావే = ఉండుటవలన; చ = మఱియు భాసించుటవలన (=తెలియఁబడుటవలన); ఉపలబ్ధేః (చ) = ఉండుటవలన & భాసించుటవలన (=తెలియఁబడుటవలన-)

సూ. తా. (భావేచ) కారణముయొక్క సత్త్వము (=ఉనికియు)-భానమును (=భాసించుటయు=తెలియఁబడుటయు) ఈ రెండును, (ఉపలబ్ధేః) కార్యమునందుం డుట వలనను, దెలియఁబడుటవలనను, కారణమే కార్యమగునుగాని రెండునుభిన్నములుగావు- అనఁగా- కారణమునువిడచి కార్యమునకు భిన్నస్థితి ప్రత్యేకములు లేవని భావము. కారణము నూలు, కార్యము వస్త్రము అనుకొనుఁడు- వస్త్రమందు నూలుఉండుటయు, నూలు భాసించుటయు గలవు, నూలును విడచినచో 'వస్త్రమునకు ఉనికియును లేదు, వస్త్రముగాఁ దెలియఁబడుటయును లేదు, కాన నూలే వస్త్రమనిచెప్పుటలో సందేహముండదు- ఇట్లె కారణమైన బ్రహ్మము (=ఆత్మ) కార్యమైన జగత్తులవిషయములో నైతము గ్రహింపుఁడు.

సూత్రపాఠాంతరము

## ౧౫ సూ॥ భా వా చ్చో ప ల బ్ధేః

ప. వి :- భావాత్-చ-ఉపలబ్ధేః.

ప్ర. ప. అ :- భావాత్=ఉనికివలన-చ=గూడ ఉపలబ్ధేః=ప్రత్యక్షముగాఁ దెలియఁబడుట యొక్క

సూ॥ తా॥ (ఉపలబ్ధేః=) కార్యమందు కారణ ప్రత్యక్ష భానముయొక్క (భావాత్+చ) ఉనికివలనఁగూడ కారణముకంటె కార్యము భిన్నముగాదని తెలియఁబడుచున్నది. కార్యకారణముల కనన్యత్వము శ్రుతిచేఁ జెప్పఁబడుటయే గాక ప్రత్యక్షాది ప్రమాణములచేత సైతము తెలియఁబడగలదని భావము తంతు పట (దారము-వస్త్రము) దృష్టాంతముచే నిది స్పష్టపడగలదు. బ్రహ్మ (=ఆత్మ) జగత్తులవిషయములో సైతము కార్యమైన జగత్తునందు కారణమైన బ్రహ్మము (=ఆత్మ) ప్రత్యక్షమగుచునే యుండును ఆత్మలేనిది జగత్తేలేదు. ఆత్మకన్నజగత్తు నకు భిన్నస్థితిభావములు లేవు.

భాష్యము - భాష్యార్థము :-

ఇతశ్చకారణా దనన్యత్వం కార్యస్య;

ఈ (చెప్పఁబోవు) హేతువువలనఁగూడ కారణముకంటె కార్యము (అనన్య త్వం=) భిన్నముగాదు- అనఁగా- కారణమే కార్యమగునుజుమా!

యత్కారణం భావఏవ కారణస్య. కార్యముపలభ్యతే నాభావే.

(యత్కారణం=) ఎందుచేతననఁగా- (భావ...ణస్య=) కారణమున్నప్పుడే (కార్య...భ్యతే=) కార్యము చూడఁబడును, గాని (నాభావే=) కారణములే నప్పుడది (కార్యము) చూడఁబడదు-

తద్యథా, సత్యాం మృది, ఘటఉపలభ్యతే, సత్సుచతంతుషుపటః

అది యెట్లనఁగా- మృత్తు (మన్ను) ఉన్నప్పుడే కుండయు, దారములున్న ప్పుడే వస్త్రమును జూడఁబడి (=పొందఁబడి) నట్లు।

నచనియమేనాన్యభావేన్యస్యోపలబ్ధిర్దృష్టా. నహ్యశ్వోగోరన్యస్సన్ గోర్భావఏవోప లభ్యతే

(అన్యభావే...లబ్ధిః=) ఒకవస్తువున్నప్పుడదియే మఱియొకవస్తువై తోచుట (నచనియమేనదృష్టా=) సామాన్య (=general) నియమమని యెంచఁబడఁదగదు. ఎట్లనఁగా- (నహ్య...లభ్యతే=) అశ్వమున్నప్పుడు గోవుగనుపింపదు, ఎందుచేత ననఁగా, గోవుకంటె నశ్వము భిన్నమైనదిగావుననే.

నచకులాలభావ ఏవ ఘటఉపలభ్యతే' సత్యపి నిమిత్తనైమితి, కభావేన్యత్వాత్

(నచ...లభ్యతే=) మఱియును కుమ్మరివాడున్నప్పుడే కుండ గన్పించుట సంభవింపదు. ఎందుచేతననఁగా- కుమ్మరివాడు కుండకు నిమిత్తకారణ (=కుండను జేసినవాడు) మైయున్నను, కుండ (నిమిత్తకారణమైన) కుమ్మరివానిచేతనైన

(నైమిత్తికము) దయ్యును (అన్యత్వాత్ =) కుమ్మరివానికంటె కుండ భిన్న (అన్య) మైనదయ్యున్నందువలననే- (కుమ్మరివాడున్నప్పుడెల్ల కుండగన్పింపదు)

తార్కిక పూర్వపక్షి :-

నన్వన్యభావేఽప్యన్యస్యోపలబ్ధిర్నియతా దృశ్యతే యథాఽగ్ని భావే ధూమస్యేతి

(రెండువస్తువుల భిన్నములై నందువలననే, ఒకటియున్నప్పుడు మఱియొకటి తోచుటయను నియమములేదు. ఎట్లనఁగా)- భిన్నభిన్న వస్తువుల విషయములో సైతము (నన్వన్య ... దృశ్యతే=) ఒకటియున్నప్పుడే రెండవదిగూడ నుండవలెననునియమము గన్పించుచున్నదిగదా- దృష్టాంతమును జూడుఁడు- (అగ్నియు ధూమమును భిన్నభిన్నపదార్థములే యైయున్నను) అగ్నియున్నప్పుడేగదా ధూమముండుట సంభవించుచున్నది-

సమాధానము :-

నేత్యుచ్యతే

నీవుచేసిన యాక్షేపము సరిగాదు.

ఉద్వాపితేఽప్యగ్నౌ, గోపాలఘుటికాది ధారితస్య ధూమస్య దృశ్యమానత్వాత్

(ఉద్వా ... గ్నౌ) అగ్ని చల్లారినప్పుడుగూడ ధూమముండుట కన్పించుచునే యున్నది. (గోపాలఘుటికాది=) గొల్లవాండ్ల తిత్తి మొదలగు వానిలో [ధారితస్య ధూమస్య=) నిల్పియుంచఁబడిన ధూమము (అగ్నిచల్లారినప్పుడుగూడ) చూడఁబడుచునే యున్నదిగదా (=దృశ్యమానత్వాత్)

పూర్వపక్షి :-

అథధూమం కయాచిద వస్థయా విశింష్యాత్, ఈదృశో ధూమోనా సత్యగ్నౌ భవతీతి

(అథ=) అట్లై కావచ్చునుగాని,(ధూమం ... విశింష్యాత్ =)ఎట్టిధూమమగ్నియున్నప్పుడే యుండుట సంభవించునో, విశేషించి చెప్పినచో నీసమాధానము పనికిరాదు చూడుఁడు- (నిప్పు పొయికంటి దానినుండి యేకపంక్తిగా ధూమము పైకి లేచుచున్న దనుకొనుఁడు-) (ఈదృశోధూమః =) ఇట్టి ధూమము- అనఁగా నిప్పునుండియే సరాసరిగఁ బైకిఁబోవు ధూమము (అసత్యగ్నౌ=) నిప్పు చల్లారినప్పుడు (నభవతీతి) కనుపించదుగదా !

సమాధానము :-

నైవమపి కశ్చిద్దోషః

నీవుచెప్పిన విశేషణములొప్పు కొన్నప్పటికి, అగ్నియున్నప్పుడే ధూమముండుట సంభవించు చున్నదను నీయాక్షేపము పనికిరానిదేయగును. (కారణముకంటె

కార్యము భిన్నముగాదను ప్రస్తుతాంశమున కిట్టిచర్య యనవసరము. ఆరెంటి యొక్క యభేదమును నిశ్చయించుటకు సరియైన యాధారమును జెప్పుచున్నాము వినుఁడు)

తద్భావానురక్తాంహి బుద్ధిం కార్యకారణయో రనన్యత్వే హేతుం వయం వదామః

(కార్యమును జూచినప్పుడు) - (తద్భావానురక్తాం=) కారణ భావమునే యంటియుండెడి అనఁగా- కారణమునువదిలి పోఁజాలని- అనఁగా- ఆ కార్యమున కదియే కారణమని నిశ్చయమగు (బుద్ధిం) బుద్ధియేర్పడుటయే కార్యకారణముల యొక్క యభేదమును దెలిసికొనుటకు (హేతుం=) ముఖ్యాధారమని మేముచెప్పు చున్నాము. (వస్త్రమును జూడఁగానే దీనికారణము దారమేయని నిశ్చయించు బుద్ధి యేర్పడినట్లు)

నచాసావగ్ని ధూమయో ర్విద్యతే

(అసౌ=) కార్యమును జూడఁగానే కారణమందు బుద్ధివదిలి పోకుండుట (అగ్నిధూమయోః) అగ్నిధూమముల విషయములో (నచవిద్యతే=) సంభవించుట లేదు. (అనఁగా ధూమమును జూడఁగానే, ఇది యగ్నిధూమమను బుద్ధి యేర్పడ దని భావము)

'భావాచ్చోపలబ్ధేరితివా సూత్రం

"భావాచ్చోపలబ్ధేః = (ఉపలబ్ధేః =) కారణము ప్రత్యక్షమై (భావాత్ + చ =) ఉండుటవలనఁగూడ అనియును సూత్రమునకుఁ బాఠాంతరము (another reading) గలదు.

నకేవలం శబ్దాదేవ కార్యకారణయోరనన్యత్వం'

(కేవలం=) ఒక్క (శబ్దాదేవ=) శ్రుతిప్రమాణముచేత మాత్రమే (కార్య...న్యత్వం=) కార్యకారణముల కభేదము సిద్ధించుచున్నదని (న=) యెంచ వలదు.

ప్రత్యక్షోపలబ్ధి భావాచ్చ తయోరనన్యత్వమిత్యర్థః

(ప్రత్య...భావాచ్చ=) (కార్యమందుఁ గారణముయొక్క) ప్రత్యక్ష స్ఫురణము ఉండుటవలనఁగూడ (తయోః=) కార్యకారణముల రెంటికిని (అనన్య త్వం=) అభేదము సిద్ధించుచున్నది.

భవతిహి ప్రత్యక్షోపలబ్ధిః కార్యకారణయోరనన్యత్వే

కార్యకారణములు రెండును అభిన్నములైనప్పుడే, కారణముయొక్క ప్రత్యక్షస్ఫురణము కార్యమందుండును సుమా !

తద్యథాతంతుసంస్థానేపటే, తంతువ్యతిరేకేణపటో నామకార్యంనైవోలభ్యతే, కేవలాస్తు తంతవఆతాన వితానవంతః ప్రత్యక్షముపలభ్యంతే;

అది యెట్లంటేని— (తంతుసంస్థానే—) దారములయొక్క కూర్పునందే (పటే—) వస్త్రముండునుగాని (తంతువంతిరేకేణ—) దారములులేకుండఁగ, (పటోనామకార్యం—) వస్త్రమనెడి కార్యము (నైవోపలభ్యతే—) గోచరింపదు గదా! (వస్త్రమనుకార్యమందు) — (ఆతానవితానవంతః—) పడుగుపేకలగానున్న (కేవాలాస్తుతంతవః) కేవలము దారములే ప్రత్యక్షములై కనుపించుచున్నవి-కార్యమైనవస్త్రమందు కారణములైన దారములు ప్రత్యక్షముగా గోచరించుచున్నవని భావము- అట్లే కార్యమైన జగత్తునందు కారణమైన ఆత్మ (బ్రహ్మము) ప్రత్యక్షమగుచుండును- దారములులేనిది వస్త్రమెట్లు గోచరింపదో, అట్లే ఆత్మ-అనఁగా 'తాను' అనునదిలేక జగత్తుసహితము గోచరింపదు కాబట్టి దారములకును వస్త్రమునకును అభేదమెట్లో, ఆత్మ (బ్రహ్మము) కును జగత్తునకును అభేదమట్లే.]

తథాతంతుష్వంశవోంऽశుషుతదవయవాః,

(వస్త్రమునకు దారములెట్లు భాగములో) అట్లే ఒక్కొక్కదారమునందుఁ గొన్ని చీలికలును, ఒక్కొక్క చీలికయందు మఱికొన్ని సూక్ష్మభాగములును బ్రత్యక్షములుగానే యుండును.

అనయా ప్రత్యక్షోపలబ్ధ్యాలోహి- తశుక్ల కృష్ణాని త్రీణి రూపాణి

(అనయా ప్రత్యక్షోపలబ్ధ్యా=) ఇట్టి ప్రత్యక్ష పరీక్షచేతనే లోనికిఁ బోను బోను అగ్నికి (లోహితం=) ఎఱ్ఱనిరంగు, జలమునకుఁ దెల్లనిరంగు (=శుక్లం), పృథివికి నల్లనిరంగు (=కృష్ణం) సూక్ష్మతరభాగమై ప్రత్యక్షమగును. (మఱియును పృధివియొక్క నల్లనిరంగు జలముయొక్క తెల్లనిరంగులోను, జలముయొక్క తెల్లనిరంగు అగ్నియొక్క యెఱ్ఱనిరంగులోను లీనమైయున్నట్లు తోచుటచే, జలము పృధివియను భూతములు రెంటికిని అగ్నియే కారణమైనట్లు స్ఫురింపఁగలదు. (ఈ విషయమంతయు ఛాందోగ్యము షష్ఠప్రపాఠకము చతుర్థఖండములో వివరింపఁబడి యున్నది చూడుఁడు)

తతో వాయుమాత్ర మాకాశమాత్రం చేత్యనుమేయం

(మూర్తములైన) ప్రత్యక్షగోచరములగు పృథివ్యప్తేజస్సులు మూడును తేజో (అగ్నిమాత్ర)మేయని-కనుఁగొనఁజాలినప్పుడు, (అమూర్తములైన) ప్రత్యక్షముగా గోచరింపని వాయువునందే పృథివ్యప్తేజస్సులను, ఆకాశమునందే పృథివ్యప్తేజోవాయువులును లీనమైయున్నవని- అనఁగా ఆకాశమే మిగిలిననాల్గుభూతములకుఁ గారణమని (సులభముగా) నూహింపవచ్చును.

ఏకం ఏవ బ్రహ్మైకమేవ మేవాద్వితీయం

స్వతర్కమతుల్లో యూహింపంగా (అనగా అనుమాన ప్రమాణముచేత) [illegible] (ఏకం=) సాక్షాత్తమము, (అద్వితీయం=) రెండవది లేనిదియు– [illegible] యంతర్బాకులు చేయుటకెట్టి యవకాశము లేనిదియు) [illegible] యుండునదియునైన (బ్రహ్మ+ఏవ) బ్రహ్మమేకారణమై [illegible] పంచభూతాత్మకమైన జగత్తంతటికిని బ్రహ్మమే కారణమైనట్లు [illegible].

తత్ర ప్రత్యక్షప్రమాణానాం నిష్ఠా మహోదామ

కాబట్టి ప్రత్యక్షానుమానాది సర్వప్రమాణములును జగత్కారణము బ్రహ్మ [illegible] మను నిశ్చయమునకుఁ గొంపోయి యచ్చట నిల్చిపోవును– ఆపైనఁ బ్రమా ణము లెవ్వియును బనిచేయవు. (తానే=ఆత్మయే) జగత్తును గల్గించువాడనియు, [illegible]వాడనియు, తనయందు లీనముచేసికొనువాడనియు ననుభవమందు నిశ్చయ మగుచుండఁగా నితర ప్రమాణముల కప్పుడవకాశమే లేదు) మఱియు నితరప్రమా ణములతో నవసరమే లేక– అనిభావము)

16 సూత్రావతారిక :–

పై రెండుసూత్రములలోఁ జెప్పిన హేతువులుగాక కారణముకంటె కార్యము భిన్నముగాదనుటకు వేరొక హేతువుకూడ నీసూత్రమందుఁ జెప్పఁబడుచున్నది.

## ౧౬ సూ॥ సత్త్వాచ్చాపరస్య

ప. వి :– సత్త్వాత్–చ–అపరస్య.

ప్ర. ప. అ :– సత్త్వాత్ = (కారణరూప) స్థితియుంటవలన– చ = కూడ, అపరస్య=తరువాతిదియైన కార్యమునకు.

సూ॥ తా :– (అపరస్య) పిమ్మటి కాలమందుఁబుట్టిన కార్యమునకు (సత్త్వాత్–చ) ముందటి కారణమందుఁ గారణస్వరూపముతోనె యునికియుండుట వలనఁగూడ కార్యకారణములయొక్క యనన్యత్వమును శ్రుతియే (ఛా VI 2-1 మొదలగునవి) ప్రకటించుచున్నది. శ్రుతి ఛా, VI 2-1 'సదేవసోమ్యే దమగ్ర ఆసీత్' = ఈజగత్తు పుట్టకపూర్వము సత్తుగానే యుండెను' ఈశ్రుతిలో– ఇదం (=ఇది) అనుశబ్దము కార్యమైనజగత్తును దెలుపుచున్నది. సత్ + ఏవ (=సత్పదార్థమే) అనుశబ్దములు కారణమైన బ్రహ్మమును దెలుపుచున్నవి. కార్యకారణము లను దెలుపు ఇదం (=ఇది)– సదేవ (సత్పదార్థమే) అను రెండుశబ్దములును 'ఇది పూర్వముసత్తే' అని సమానార్థమును దెలుపుచున్నందున కార్యము(=జగత్తు)పుట్టక

పూర్వము కారణ (సత్-బ్రహ్మము) మందునుండియే యున్నదని శ్రుతి స్పష్ట ముగాఁ దెలుపుచున్నందున కారణకార్యముల కభేదము స్పష్టము.

భాష్యము - భాష్యార్థము -

ఇతశ్చ కారణాత్కార్యస్యా నన్యత్వం యత్కారణం ప్రాగుత్పత్తేః కారణాత్మనైవ కారణే సత్త్వ మపరకాలీనస్య కార్యస్య శ్రూయతే

ఈ (చెప్పఁబోవు) హేతువువలనఁగూడ కారణము (బ్రహ్మము) కంటె కార్యము (=జగత్తు) భిన్నముగాదు. అనఁగా కారణమే- (బ్రహ్మమే) కార్యము- (జగత్తు) అగునుజుమీ ! (యత్కారణం=) ఎందుచేతననఁగా :— (అపరకాలీనస్య కార్యస్య-) పుటినపిమ్మటఁగనుపించు కార్యము (ప్రాగుత్పత్తేః=) పుట్టకపూర్వము కారణాత్మనైవ=) కారణస్వరూపముతోనే (కారణే=) కారణముఁగా (సత్త్వం=) నుండుట (శ్రూయతే=) శ్రుతులయందుఁ గన్పట్టుచున్నయది. ఎట్లనఁగా :-

'సదేవ....ఆసీత్' 'ఆత్మావా....ఆసీత్ ఛాం VI-2-1 'సదేవసోమ్యేద మగ్ర ఆసీత్'

'(సోమ్య!=) ఓ కట్టవాడా ! (ఇదం=) ఈ జగత్తు (అగ్రే=) సృష్టికిఁ బూర్వము (సత్ + ఏవ=) కారణమైన సత్పదార్థముగానే (ఆసీత్=) ఉండెను'

ఐత II-4-1-1 'ఆత్మావా ఇదమేక ఏవాగ్ర ఆసీత్'

'(ఇదం=) ఈ జగత్తు (అగ్రే=) సృష్టికిఁబూర్వము (ఏకః ఏవ=) ఒకటియే యైన (ఆత్మావా) ఆత్మయనునదిగానే (ఆసీత్ =) ఉండెను'

ఇత్యాదావిదం శబ్ద గృహీతస్య కార్యస్య కారణేన సామానాధికరణ్యాత్

(ఇత్యాదౌ=) ఈ మొదలగు శ్రుతులయందు ('ఇదం' శబ్దగృహీతస్య=) 'ఈ' యను పదముచేతఁ నిర్దేశింపఁబడిన (కార్యస్య=) కార్యమైన జగత్తు (కారణేన=) కారణమై 'సత్'- 'ఆత్మ' యను పదముల కర్థమైన బ్రహ్మముతో (సామానాధికరణ్యాత్=) సమానార్థక పర్యాయపద మగుటవలన (కార్యమైన జగత్తు పుట్టకపూర్వము కారణమైన బ్రహ్మముగానే యుండెనని స్పష్టమగుచున్నది.)

యచ్చ యదాత్మనా యత్రన వర్తతే నతత్తత ఉత్పద్యతే యథాసికతాభ్య స్తైలం

(యచ్చ=) ఏదైనను (యదాత్మనా=) దేనిస్వరూపముతో (యత్ర=) దేని యందుఁ బుట్టకపూర్వము (నవర్తతే ) ఉండదో, (తత్=) అది (తతః=) కారణ మైన యా వస్తువునుండి (న+ఉత్పద్యతే=) పుట్టఁజాలదు (=పుట్టదని చెప్పుటకవ కాశము లేదు)- (యథా=) అదెట్లనఁగా, (సిక...స్తైలం=) ఇసుకనుండి చమురు (ఎట్లు పుట్టజాలదో యట్లె)- (తైలము పుట్టకపూర్వము తిలలయందున్న దిగావుననే,

తిలలనుండి తైలము పుట్టుచున్నయది- ఇసుక యందదిలేదు గావుననే, ఇసుకనుండి యా తైలము పుట్టజాలదని భావము)

తస్మాత్ ప్రాగుత్పత్తే రనన్యత్వా దుత్పన్న మప్య నన్యదేవ కారణాత్కార్య మిత్యవ గమ్యతే

కాబట్టి (కారణాత్కార్యము=) కారణముకంటె కార్యము (ప్రాగు ... న్యత్వాత్=) పుట్టకపూర్వము భిన్నముగాని దగుటవలనఁ (ఉత్పన్నమపి=) బుట్టిన పిమ్మట సైతమది (అనన్యదేవ=) భిన్నముగానిదేయని నిశ్చయింపఁ బడుచున్నది.

యథాచ కారణం బ్రహ్మ త్రిషుకాలేషుస త్త్వం నవ్యభిచరతి, ఏవంకార్య మపి జగత్త్రిషు కాలేషుస త్త్వం నవ్యభిచరతి,

కారణమైన బ్రహ్మము మూడుకాలములయందు- అనఁగా ఎల్లప్పుడును (సత్త్వం= ఏకరీతిగానుండుట (=హెచ్చుతగ్గులులేక యొకటేవిధమున నుండుట)- యథానవ్యభిచరతి)= యెట్లుమారదో, అట్లె కార్యమైనజగత్తు సైతము మూడు కాలములయం దొకటేవిధమున నుండుటమారదు.

ఏకంచపునస్సత్త్వం

'ఉండుట' యనునది యెల్లప్పుడొక యుండుటయే- ('ఉన్నది' యెల్లప్పుడొక యున్నదియే యగునుగాని- ఒకప్పుడుండి మఱొకప్పుడులేనిది గానేరదు.)

అతోఽప్యనన్యత్వం కారణాత్కార్యస్య

కాబట్టియే కారణము (బ్రహ్మము) కంటె కార్య (జగత్తు) మెప్పటికిని భిన్నముగాదు.

17 సూత్రావతారిక :-

క్రిందటి సూత్రమందు 'కార్యము పుట్టకపూర్వము కారణస్వరూపముతోఁ గారణమందున్నది' యను సంశము శ్రుత్యాధారముచేత సమర్థింపఁబడినది- కార్యము పుట్టకపూర్వమసలే లేదనెడి యాక్షేపము శ్రుత్యాధారముచేతనే చేయఁ బడఁగా అట్టి యాక్షేపమును ఖండించుట కీ సూత్రమేర్పడినది.

## ౧౭ సూ॥ అసద్వ్యపదేశా, న్నేతిచే; న్నధర్మాంతరేణవాక్యశేషాత్॥

ప॥ వి :- అసద్వ్యపదేశాత్-న-ఇతి-చేత్- (పూర్వపక్షం)
న-ధర్మాంతరేణ-వాక్యశేషాత్- (సమాధానము)

ప) ప. అ :- అసద్వ్యపదేశాత్ = (సృష్టికిఁ బూర్వము కార్యము) అసత్ (= లేదు-శూన్యము)' అని (శ్రుతి) వ్యపదేశాత్ = చెప్పుటవలన, (కార్యమైన జగత్తు పుట్టకపూర్వము) న=లేదు, ఇతి=అని. చేత్ = వాదించుచో, న=ఆవాదము సరికాదు (ఎందుచేతననఁగా) (కార్యమిప్పుడున్న రూపమునఁగాక). ధర్మాంతరేణ= మఱియొకరూపమున సృష్టికిఁ బూర్వమున్నదని, వాక్యశేషాత్ = ఆశ్రుతియొక్క తరువాతిభాగమే చెప్పుచుండుటవలన-

సూ॥ తా॥ పూర్వపక్షము :- ఛాం III-19-1 'అసదేవేదమగ్ర ఆసీత్ = జగత్తు సృష్టికిఁబూర్వము 'అసత్ = లేనిది'గా నున్నది' అను మొదలగు శ్రుతులయందు కార్యమైన యీజగత్తుయొక్క సృష్టికిఁబూర్వమందుండుస్థితిని అసత్ = శూన్యము' అని చెప్పఁబడియుండుటచేత, కార్యమైన యీ జగత్తు పుట్టకపూర్వము బొత్తుగా లేనిదే (శూన్యమే) యవి పూర్వపక్షి యెవ్వరైనను వాదించుచో, (సమాధానము) ఆ పూర్వపక్షము సరిగాదు. ఎందుచేతననఁగా. కార్యమైనజగత్తు ఇప్పుడు (సృష్టికిఁ దరువాత) వేరువేరుగాఁ బిల్వఁబడదగిన నామములు. చూడఁబడఁదగిన రూపములు అను ధర్మములతో విజృంభించియున్నది. సృష్టికిఁబూర్వమన్ననో నామరూపములతో విజృంభించి మాత్రములేదు. ఇంతేభేదము పదార్థము (substance) మాత్రమప్పుడును నిప్పుడును నొకటియే- పూర్వము 'అసత్ = శూన్యము' అని చెప్పుట తప్పు- ఈ విషయము ఆశ్రుతియందే '(శేషమున) తరువాత స్పష్టము చేయఁబడినది- చూడుఁడు

ఛా III-19-1 '...తత్సదాసీత్=ఆ 'అసత్' అనునదియే (పిమ్మట) 'సత్'= జగత్తు 'ఆయెను' ఈ వాక్యశేషముచేత, నిప్పుడున్న 'సత్తే' ధర్మభేదమున నప్పుడు 'అసత్తు'గా నున్నదని నిశ్చయమగుచున్నది- అప్పుడున్న 'అసత్తు'నకు శూన్యమని యర్థముచేయుచో అట్టిశూన్య మిప్పుడు 'సత్తు' అగుట యసంభవము ఒకటే పదార్థము ధర్మభేదములతో నప్పుడు నిప్పుడు నున్నదని భావము- అర్థములో వాక్యారంభమందు సందేహమున కాస్పదమున్నచో, నా సందేహమును వాక్యశేషమే తీర్చునను న్యాయము గలదుగదా-

భాష్యము – భాష్యార్థము

నను క్వచిద సత్త్వమపి ప్రాగుత్పత్తేః కార్యస్య వ్యపదిశతి శ్రుతిః

'కార్యము (జగత్తు) పుట్టకపూర్వము (అసత్త్వమపి వ్యపదిశతి =) లేనిదిగానే శ్రుతి (క్వచిత్ =) కొన్నిచోట్లఁ జెప్పుచున్నది. చూడుఁడు-

'అసదే....ఆసీత్' 'అసద్వా....ఆసీత్' ఛాం III-19-1 'అసదే వేదమగ్ర ఆసీత్'

'(ఇదం=) కార్యమైన యీ జగత్తు (అగ్రే=) పుట్టకపూర్వము (అసత్ + ఏవ=) అసత్తుగానే అనఁగా లేనిదిగానే (ఆసీత్ =) ఉండెను'

ఇతిచ తై II-7 'అసద్వా ఇద మగ్ర ఆసీత్....'

'(ఇదం=) కార్యమైన యీ జగత్తు (అగ్రే=) పుట్టకపూర్వము (అసత్ + వా=) అసత్తుగానే- అనఁగా లేనిదిగానే (ఆసీత్ =) ఉండెను'

తస్మాద సద్వ్యపదేశాన్న ప్రాగుత్పత్తేః కార్యస్య సత్త్వమితి చేత్ నేతిబ్రూమః

కాబట్టి (పుట్టకపూర్వ మీజగత్తును శ్రుతి) (అసద్వ్యపదేశాత్ =) 'అసత్' గాఁ జెప్పుచున్నందున- (ప్రాగుత్పత్తేః) పుట్టకపూర్వము (కార్యస్య=) కార్యమైన యీ జగత్తునకు (నసత్త్వం-ఇతిచేత్) ఉనికిలేదు' అని పూర్వపక్షము చేయఁబడుచో, ఈ పూర్వపక్షము సరిగాదని వక్కాణించు చున్నాము- (=సూత్రము చెప్పుచున్నది)

నహ్యయ మత్యంతా సత్త్వాభిప్రాయేణ ప్రాగుత్పత్తేః కార్యస్యా సద్వ్యపదేశః
కింతర్హి వ్యాకృత నామరూపత్వా ద్ధర్మా దవ్యాకృత నామరూపత్వం ధర్మాంతరం

శ్రుతులలో (అయంప్రాగు—దేశః) 'ఈ జగత్తు పుట్టకపూర్వము అసత్తుగానే యున్నది' అని చెప్పఁబడుట, (అత్యంతా ... ప్రాయేణ) జగత్తు పుట్టకపూర్వము (కుందేటికొమ్మువలె) కేవలము (=బొత్తుగా) లేదని చెప్పఁదలచుట గాదు. (కింతర్హి :) మఱేమన- ఇప్పుడు వ్యాకృతనామరూపము లనెడి విశేషముతో నున్న యీ జగత్తు, అప్పుడు అనఁగా పుట్టకపూర్వము అవ్యాకృత నామరూపము లనెడి విశేషాంతరముతో నున్నది- అనఁగా ఇప్పటిస్థితికిని అప్పటిస్థితికిని వైఖరిలో మాత్రము భేదముగలదని తెలుపు నభిప్రాయముతో ('సత్'-ఇప్పటి వైఖరి = 'అసత్' అప్పటివైఖరి) నట్లు చెప్పఁబడినది.

తేన ధర్మాంతరేణాయ మసద్వ్యపదేశః ప్రాగుత్పత్తే స్సత ఏవ కార్యస్య కారణ రూపేణా నన్యస్య

(అప్పటికంటె నిప్పుడు జగత్తు) — (తేన...దేశః=) ఆ వైఖరిమాత్ర భేదముతో నున్నదని చెప్పుటయందుఁగల భావమేమనఁగా — (సతఏవ కార్యస్య=) కార్యమై సత్తైన స్ఫురించుచున్న యీ జగత్తే (కారణరూపేణ+అనన్యస్య :) ఇందుకు భిన్నముగాని కారణరూపముతో నున్నదని తెలుపుటకేసుమా !

కథమేత దవ గమ్యతే?

శ్రుతికిట్టి భావముగలదని చెప్పుట కాధారమేమి?

వాక్యశేషాత్. యద్ధ్యుపక్రమే సందిగ్ధార్థం వాక్యం తద్వాక్య శేషా న్నిశ్చియతే

ఏ శ్రుతి యారంభమందట్లు సందిగ్ధముగాఁ జెప్పఁబడినదో, ఆ శ్రుతియొక్క తరువాతిభాగమే యీ సందేహమును దీర్చుచున్నది- వాక్యారంభమందుఁ దోచు సందిగ్ధార్థమును వాక్యశేషమే నిశ్చయించుచున్నది చూడుఁడు

ఇహచ 'అసదే... ఆసీత్' ఛాం III-19-1 వాక్యోపక్రమము - 'అసదేవేదమగ్ర ఆసీత్

'ఈ జగత్తు పుట్టకపూర్వము అసత్తుగానే యుండెను'

వాక్యశేషము :- 'తత్సదాసీత్'

'(తత్ =) అది- అనఁగా ఆ అసత్తు- (సత్ =) సత్తు (=జగత్తు) ఆయెను.

ఇత్య సచ్ఛబ్దే నోపక్రమే నిర్దిష్టం యత్తదేవ పునస్తచ్ఛబ్దేన పరామృశ్య సదితి విశినష్టి 'తత్సదాసీత్' ఇతి

పై వాక్యారంభమందు ఏది 'అసత్తు'గాఁ జెప్పఁబడి యుండెనో, అదియే మరల వాక్యశేషమందు 'తత్ =అది' అను శబ్దముతో నెత్తికూపఁబడి (=పరామృశ్య) అదియే 'సత్తు' (=ఉన్నది. అనఁగా కనుపించుచున్న యీ జగత్తు) అను పేరుతో విశేషించి పేర్కొనఁబడెను.

అసతశ్చపూర్వా పరకాలాసంబంధాదాసీచ్ఛబ్దానుపపత్తేశ్చ

'అప్పుడీజగత్తు 'అసత్తు'గా నుండెను- అదియే యిప్పుడు 'సత్తు' ఆయెను. అని చెప్పఁబడియున్న సందర్భములో ఒకటేవస్తువు పూర్వకాలమందున్న వైఖరి- ఇప్పటి కాలమందున్న వైఖరి అని పూర్వాపరకాలములతో సంబంధింపఁజేయఁబడి యుండుటవలనను, అవస్తువే యీవస్తువని నిశ్చయింపకున్నచో 'ఆసీత్ =ఆయెను' అను క్రియకు సార్థకత్వము లేకపోవుటవలనను, (ఈ 'సత్' అను రూపముతోనున్న జగత్తే. ఆ 'అసత్' అను రూపముతోనుండెనని నిశ్చయింపఁబడుచున్నది.) ఇక రెండవ శ్రుతివిషయమును జూడుఁడు.

'అసద్వా-ఆసీత్' ఇత్యత్రాపి 'తదా.... కురుత' తై II. 7 వాక్యోపక్రమము- 'అసద్వాఇదమగ్రఆసీత్'

'ఈజగత్తు పుట్టకపూర్వము 'అసత్' గానే యుండెను'

ఇతివాక్యశేష విశేషణా న్నాత్యంతా సత్త్వం. వాక్యశేషము 'తదాత్మానం స్వయమకురుత

'(తత్ =) ఆ'అసత్తు' గానున్నది (ఆత్మానం =)తననేపదార్థముగాఁగైకొని (స్వయం =) తానే (అకురుత =)ఈజగత్తునుజేసెను' వాక్యారంభమందు 'అసత్తు' అని చెప్పఁబడినదానినే వాక్యశేషమందు 'తత్ =అది' అను సర్వనామముతోఁ బేర్కొని దానికి 'ఆత్మానం=తన్ను' అను విశేషణము చెప్పఁబడియుండుటవలన,

పూర్వము 'అసత్తు' గానున్నట్లు చెప్పఁబడినదేదిగలదో యది (కుండేటికొమ్మువలె) బొత్తుగాలేనిదే (=శూన్యమే) యని వాదించుట కవకాశములేదు.

తస్మాద్ధర్మాంతరేణైవా యమసద్వ్యపదేశః ప్రాగుత్పత్తేః కార్యస్య

కాబట్టి (ప్రాగు...కార్యస్య=) పుట్టకపూర్వము కార్యమైన యీజగత్తునకు (అయం అసద్వ్యపదేశః) 'అసత్తు = సత్తుగానిది' అని యీచెప్పుట (ధర్మాంతరేణ + ఏవ=) పుట్టకపూర్వము ఈజగత్తు మఱియొక వైఖరితోనున్నదని చెప్పినట్లే యగుచున్నది

నామరూప వ్యాకృతంహి వస్తుసచ్ఛబ్దార్హంలోకే ప్రసిద్ధం

నామరూపములతో వ్యాపింపఁజేయఁబడి (ప్రత్యక్షమై) యున్న వస్తువు లోకమందు 'సత్=ఉన్నది' అని పిల్వఁబడుట ప్రసిద్ధమేగదా ! (నామరూపములతోఁ బ్రత్యక్షమై యున్నది 'సత్తు'-దీనికి వ్యతిరేకముగా నామరూపములతో వ్యాకృతముగాక పూర్వమున్న వైఖరి 'అసత్తు' అని చెప్పఁబడినట్లు గ్రహించవలెను)

అతః ప్రాఙ్నామరూప వ్యాకరణా 'దస' దిహాసీదిత్యువ చర్యతే

కాబట్టి నామరూపములతో వ్యాపించుటకుఁ బూర్వమీజగత్తు (=సత్తు) 'అసత్తు=సత్తుగానిది' వోలెనున్నట్లు అలంకారికముగాఁ జెప్పఁబడినదని నిశ్చయించవచ్చును. ('అసత్తు' అనఁగా బొత్తుగాలేనిదేయని యెంచఁదగదు)

18 సూత్రావతారిక -

సృష్టికిఁబూర్వము కార్యమైనజగత్తు ఉండియుండుటయు, కారణమైనబ్రహ్మము కంటె నది భిన్నముగాకపోవుటయునను విషయములు యుక్తులచేతను, ఇతర శ్రుతి ప్రమాణములచేతను సమర్థించుట కీసూత్రమేర్పడినది.

## ౧౮ సూ॥ యుక్తేశ్శబ్దాంతరాచ్చ

ప; వి.- యుక్తేః - శబ్దాంతరాత్-చ :-

ప్ర. ప. అ :- యుక్తేః = యుక్తివలనను, శబ్దాంతరాత్-చ = ఇతరశ్రుతి ప్రమాణములవలననుగూడ.

సూ. తా :- యుక్తులనఁగా నెట్టివనగా :-

పాలు - మన్ను మొదలగు కారణములయందు పెరుగు - కుండ మొదలగు కార్యములు లేవన్నచో, పెరుగు - కుండ మొదలగు కార్యవస్తువులు గావలెనని

కోరువాడు వానివానికిఁ గారణములైన పాలు - మన్ను మొదలగు వస్తువులయొక్క సంపాదనమునకుఁ బ్రయత్నించుట సంభవింపదు కాబట్టి యీ కార్యవస్తువులాయా కారణవస్తువులయందుండితీరవలెను ఇట్టివే యుక్తులు-

ఇతర శ్రుతిప్రమాణము లెట్టివనఁగా :- ఛాం. VI.2-1 'సదేవసోమ్యేదమగ్ర ఆసీత్ (సోమ్య =)ఓయి మంచిపిల్లవాడా ! (ఇదం=) కార్యమైన యీజగత్తు (అగ్రే=) పుట్టకపూర్వము (సత్ + ఏవ=) కారణమైన సత్పదార్థము (బ్రహ్మము) గానే యుండెను.'

కార్యమైన యీజగత్తు పుట్టకపూర్వము కారణమైనబ్రహ్మమేయైయుండెను ఇట్టివే యితర శ్రుతిప్రమాణములు- ఈపై మొదలగు యుక్తులవలనను, ఇతరశ్రుతి ప్రమాణములవలననుగూడ, కా'ర్యమైన జగత్తు పుట్టకపూర్వము కారణమైన బ్రహ్మమందుండియే యున్నదనియు, ఈకార్యమైన జగత్తు ఆకారణమైన బ్రహ్మముకంటె భిన్నము (= అన్యము) గాదనియు నిశ్చయమగుచున్నది.

భాష్యము - భాష్యార్థము

యుక్తేశ్చ ప్రాగుత్పత్తేః కార్యస్యసత్త్వ మనన్యత్వంచ కారణాదవగమ్యతే

పుట్టకపూర్వము కార్యము (జగత్తు) కారణ (బ్రహ్మ) మందుండుటయు, అది కారణము కంటె భిన్నము గాకపోవుటయు (అనన్యత్వంచ) యుక్తుల వలనను, గూడఁ దెలియఁబడుచున్నది.

శబ్దాంతరాచ్చ

ఆరెండు విషయములు ఇతర శ్రుతిప్రమాణముల వలనను గూడఁ దెలియఁబడుచున్నవి

I యుక్తియననెట్టిదనగా:-

యుక్తిసావ ద్వర్ణ్యతే

మొదట (=తావత్) యుక్తియనఁగా నెట్టిదో తెలుపబడు చున్నది. చూడుఁడు.

(౧) కార్య కారణము లనన్యము (లభిన్నము) లనుటయేసబబు ఏలయన

(1) కార్యములను గోరువాడు తన్నియత కారణముల కొఱకే ప్రయత్నించును.

దధిఘటరుచకాద్యర్థిభిః ప్రతినియతాని కారణాని క్షీర మృత్తికా సువర్ణాదీన్యుపాదీయ మానాని లోకే దృశ్యంతే నహిదధ్యర్థిభిః మృత్తికోపాదీయతే న ఘటాద్యర్థిభిః క్షీరం

పెరుగు, కుండ ఆభరణము మొదలగు వస్తువులను గోరువారు ఆవస్తువులకు నియత కారణములైన (అనగా వానిని దప్పని సరిగాఁ బుట్టించెడి) పాలు, మన్ను, బంగారము మొదలగు వస్తువులను సంపాదించు కొనుట లోకమందుఁ జూడఁబడు చున్నది గదా!! పెరుగు గావలెనని కోరువాడు మట్టి ముద్దను సంపాదించు కొనడు అట్లె కుండ మొదలగు వానిని గోరువాడు పాలు కొఱకుఁబ్రయత్నింపడు-

తవ సత్కార్య వాదే నోవ పద్యతే

(అసత్కార్య వాదే=) కార్యము కారణ మందు లేదని వాదించు పక్షము లో. కార్య వస్తువులను గోరువాడు ఆయా నియత కారణ వస్తువుల కొఱకే ప్రయత్నించుట యెన్నటికిని సంభవింపదు

అవిశిష్టేహి ప్రాగుత్పత్తే స్సర్వత్ర సర్వస్యా సత్త్వే

పుట్టక పూర్వము ఎక్కడనైనను నేకార్యమైనను గారణమందు లేకపోవుట యే (అవిశిష్టేహి=) నిర్బంధ నియామకమగుచో

కస్మాత్ క్షీరాదేవ దధ్యుత్పద్యతే, నమృత్తికాయాః

పాల నుండి మాత్రమే యేల పెరుగు పుట్టవలెను ? అ పెరుగుమట్టి నుండి యేలపుట్టఁగూడదు.

మృత్తికాయా ఏవచ ఘట ఉత్పద్యతే న క్షీరాత్

కుండమట్టినుండి మాత్రమే యేల పుట్టవలెను? అది పాల నుండి యేల పుట్ట గూడదు!

(2) నియతకార్యమును బుట్టింపఁగల యొకయతిశయము కారణమందుండును పూర్వపక్షి (అసత్కార్యవాది) :-

అథాఽవిశిష్టేఽపి ప్రాగసత్త్వే

(అథాఽ...సత్త్వే=) పుట్టకపూర్వ మెక్కడనైనను నేకార్యమైనను గారణ మందు లేకపోవుట నిశ్చయమేయును మాయసత్కార్య వాదమును మేము వదులు కొనకట్లుంచి, ఒక సంగతినిమాత్రి మడిగెదము !

'క్షీరఏవదధ్నః కశ్చిదతిశయో నమృత్తికాయాం మృత్తికాయా మేవ ఘటస్య కశ్చి దతిశయో నక్షీర' ఇత్యుచ్యేత

(క్షీరఏవ...దతిశయః=) పెరుగును బుట్టించుటకుఁ బాలయందు మాత్రమే ఒకానొక యతిశయము (=విశేషము) గలదు- ఆయతిశయము (నమృత్తికాయాం) మట్టియందు లేదుగదా ! (మృత్తి...దతిశయః=) కుండను బుట్టించుటకు మట్టి

యందు మాత్రమే ఒకానొక యతిశయము (=విశేషము) గలదు- ఆ యతిశయము (నక్షీరే) పాలయందు లేదుగదా !' (ఇత్యుచ్యేత=) ఇందులకేమి చెప్పెదరో?

సమాధానము (అద్వైతసిద్ధాంతి)

(శి) కారణమందొక యతిశయమున్న ట్లొప్పుకొన్నచో, అసత్కార్య వాదము భంగపడిపోయి సత్కార్యవాదము సిద్ధించినట్లే ?

తర్హి అతిశయవత్త్వాత్ ప్రాగవస్థాయాః అసత్కార్యవాద హానిః సత్కార్యవాదసిద్ధిశ్చ

(తర్హి=) మంచిది- త్రోవకు వచ్చుచున్నావు ! (ప్రాగవస్థాయాః=) కార్యము పుట్టుటకుముందు అనగాఁ గార్యమును బుట్టించుటకు ముందు (అతిశయవత్త్వాత్=) కారణమందొక యతిశయము (=విశేషము)ఉన్నదని నీవొప్పుకొనుట వలన (అస ... హానిః=) నీయసత్కార్యవాదము (పుట్టుటకుముందుఁ గార్యము కారణ మందు లేదు- అనువాదము) నకు భంగము (=ఓటమి) గల్గుటయేగాక (సత్కా... సిద్ధిశ్చ) సత్కార్యవాదము (పుట్టుటకుముందు గార్యము కారణమం దుండియే యున్నదిగాని లేక క్రొత్తగావచ్చినది గాదు- అనువాదము) నకు విజయము తట స్థించుచున్నయది.

శక్తిశ్చ కారణస్య కార్యనియమార్థా కల్ప్యమానా

(శక్తిశ్చ కారణస్య=) కార్యమును బుట్టించు నొకానొక యతిశయము కారణమందుఁ గలదని నీ వొప్పుకొను పక్షములో,— (కార్యనియమార్థా=) కార్య మును నియమించుటయే- అనఁగా దానికనుగుణమైన కార్యమునుమాత్రమే పుట్టిం చుటయే ప్రయోజనముగలదై (కల్ప్యమానా=) కల్పింపఁబడిన యట్టిది- అనఁగా నా యతిశయము- కారణముయొక్క శక్తియేయని చెప్పుటయే సమంజసము— (=చెప్పుటయే సబబుగదా)

నాన్యా వ్యసతీవా- కార్యం నియచ్ఛేత్; [సాశక్తిః యది కారణాత్ అన్యాపి, అసతీవా కార్యం ననియచ్ఛేత్]

(అన్యాఽపి=) అట్టిశక్తి (=అతిశయము) కారణముకంటె భిన్నమైనదైనను, (అసతీవా=) లేక బొత్తుగాలేనిదేమైనను, అది (=అశక్తి) (కార్యం=) కారణము నకు నియామకమైన కార్యమును (ననియచ్ఛేత్=) బుట్టింపనే లేదుగదా ! ఎందు చేత ననఁగా—

అసత్త్వా విశేషా, దన్యత్వా విశేషాచ్చ

(అసత్త్వావిశేషాత్=అసత్త్వస్య అవిశేషాత్) కారణమందట్టి శక్తిలేకపోవు టయు నిర్విశేషమే అనఁగా కొంచెముండి కొంచెము లేకపోవుటగాదు. బొత్తుగా

చెడిపోవుటయో- పూర్తిగా నట్టిశక్తి కారణమందు లేనప్పుడు, ఆకారణమెట్టి కార్యమును బుట్టింపనేలేదు- మరియును.

(అన్యత్వా విశేషాత్ = అన్యత్వస్య అవిశేషాత్) కారణముకంటె నా శక్తి భిన్నమగుటయు విశేషమే- అనఁగా కొంతదానికంటె భిన్నమగుటయు, కొంతదానితో పడిపోవుటయుగాదు. పూర్తిగా కారణమునకంటె భిన్నమైన దగుటయే. కారణమునకంటెఁ బూర్తిగా భిన్నమైన యాశక్తి ఆ కారణమునకు నియామకమైన కార్యమును బుట్టింపనేలేదుగదా !)

కారణమందున్న యతిశయమే కారణస్వరూపమైన శక్తి- శక్తి స్వరూపమే కార్యము.

తస్మాత్కారణస్యాత్మభూతాశక్తిః, శక్తేశ్చాత్మభూతం కార్యం

కాబట్టి కారణస్వరూపమె (=ఆత్మభూతా) శక్తియనియు, శక్తి స్వరూపమే (=ఆత్మభూతా) కార్యమనియుఁ జెప్పవలసియున్నది. (తేలినపర్యవసానమేమనఁగా- కారణమే కార్యము, రెంటికిని అనన్యత్వము- కారణముకంటె కార్యము భిన్నము గాదు- అనఁగా కారణమందే కార్యమున్నది)

(4) అద్వైతమతాను సారము కార్యకారణములకుఁ దాదాత్మ్యమే యంగీకరింపఁ దగియున్నది- అనగా కార్యకారణముల నన్యములు (లభిన్నములు)

అపిచ కార్యకారణయో ర్ద్రవ్య గుణాదీనాం చాశ్వమహిషవద్భేద బుద్ధ్యభావా,
త్తాదాత్మ్య మభ్యుపగంతవ్యం

కార్యకారణముల (అనగా కుండ- మన్ను; వస్త్రము- నూలు అను మొదలగువాని) విషయములోను, ద్రవ్యగుణముల (అనగా పృథివి-గంధము, పుష్పము, రూపము అను మొదలగు) విషయములోను (అత్యంత భిన్నములైన) అశ్వమహిషములవలెనవి భిన్నములైనవిగా బుద్ధికి గోచరింపవు గాన (తాదాత్మ్యం) ఆ కార్యమే కారణము కారణమే కార్యమైనట్లును ఆ ద్రవ్యమే గుణము గుణమే ద్రవ్యమైనట్లును నిశ్చయింపవలెను.

(బి) కార్యకారణములు న్నములని చెప్పి వాని మధ్య సమవాయ సంబంధము కల్పించుట యనర్థకము

(1) కార్యకారణములు సమవాయ సంబంధముచేత నేకీభవింపఁ జేయఁబడి యున్నందున, నట్లొకటిగా గోచరించునే గాని వాస్తవమునకివి రెండును (కార్యకారణములు) భిన్నములే యను తార్కిక పూర్వపక్షి యాక్షేపమునకు సమవాయ సంబంధమనుగతమని సమాధానము

| | | |
|---|---|---|
| కారణము | సంబంధము | కార్యము |
| ద్రవము | పదార్థము | ద్రివ్యపదార్థము |
| మన్ను | సమవాయము | కుండ |

సమవాయ కల్పనామపి సమవాయస్య సమవాయిభి స్సంబంధేఽభ్యుపగమ్యమానే తస్యాన్యోన్యస్య స్సంబంధఃకల్పయితవ్య ఇత్య నవస్థాప్రసంగః।

సమవాయ కల్పనాఽపి= తార్కికుని మతానుసారము సమవాయ సంబంధమును మధ్యఁ గల్పించు విషయములో ననఁగా (సమవాయస్య ... గమ్యమానే=) సమవాయమను సంబంధ మొకటి (Comechon) భిన్నములైన కారణమునుగార్యమును (విచక్షణము చేయఁజాలని విధమున) గల్పివేయుచున్నదని యంగీకరించు పక్షమందు (తస్యా...సంగః) భిన్న పదార్థములను గల్పుటకు మధ్య గల్పించఁబడవలసి వచ్చు సమవాయ సంబంధములకు నంతమే యుండదు శాస్త్రమందిది యొక దోషము ఇట్టిదోషమునకాస్పదమగు సిద్ధాంతము సరియైనది గానేరదు

(అనఁగా :- తర్క శాస్త్రానుసారము రెండు పదార్థములను గల్పుటకు మధ్య సమవాయ మనునొక సంబంధముండ వలెనని చెప్ప బడును వారి శాస్త్రానుసారము 'సమవాయము' సైతమొక పదార్థమే రెండు పదార్థములైన మన్ను కుండయను వానిని గల్పుటకొక సమవాయము అను దానిని వాని మధ్యఁబెట్టుచో ఈ సమవాయము మన్ను అనునదియును ఈ సమవాయము కుండ యనునదియును బదార్థములేగాన నీజంటల రెంటిని గల్పుటకు మఱియొక సమవాయమును తెచ్చి పెట్ట వలసి వచ్చును అట్లు తెచ్చి పెట్టినను మఱల నట్టి యిబ్బందియే వచ్చియిట్లంతము లేకుండఁ బోవలసి వచ్చును దీనిని అనవస్థాదోష మందురు ఇట్టి సిద్ధాంతమసంభవమని యభిప్రాయము

అనభ్యుపగమ్య మానేవా, విచ్ఛేదప్రసంగః

రెంటిని గల్పు సమవాయ సంబంధమును బొత్తిగా నంగీకరింపని పక్షమందు తర్కమతానుసారము (విచ్ఛేదప్రసంగః) కార్యమే భంగపడిపోవును. అనగా (ఘటాది) కార్యమనునదియే యెన్నటికిని నేర్పడదు ఇది యసంభవము. (మృత్తువలన ఘటమేర్పడక మానదుగదా.)

(2) సంయోగసంబంధ కల్పన సైతమసంగతమే.

అథ సమవాయ స్స్వయంసంబంధ రూపత్వా దనపేక్షైవాపరం సంబంధం సంబధ్యేత

(అథ ... రూపత్వాత్ =) కారణకార్యద్రివ్యములను గల్పు సమవాయమనునది యొకరకము సంబంధమే గావున (అనపే... సంబంధం) ఆకారణ కార్య

ములను సంబంధమైన సమవాయమును గల్పు మఱియొక సమవాయమును దెచ్చి పెట్టవలసిన యవసరములేకయే (సంబంధ్యేత=) ఆకారణకార్యములతో నామొదటి సమవాయమే సంబంధింపఁగలదని నైయాయికుఁ డాక్షేపించవచ్చును.

సంయోగోఽపి తర్హి స్వయం సంబంధరూపత్వా దనపేక్ష్యైవా పరం సమవాయం సంబధ్యేత

(తర్హి=) అట్లగుచో సంయోగమునది సైత మొకరకపు సంబంధమే గావున మరియొకరకపు సమవాయసంబంధము నపేక్షింపకయే రెండు ద్రవ్యపదార్థములను గలుపుచుండఁ గలదని యొప్పుకొనవలసి వచ్చును. (ఇట్లొప్పుకొనుచో నైయాయిక సిద్ధాంతమునకు భంగము వాటిల్లును-)

ఎట్లన రెండు ద్రవ్యములు సంయోగముచేఁ గలియుననియు, ఆసంయోగమున నది గుణముగావున ద్రవ్యమునకును గుణమునకును మధ్య సమవాయసంబంధ ముండుననియు నైయాయికులు చెప్పుదురు.

తాదాత్మ్య ప్రతీతేశ్చ ద్రవ్యగుణాదీనాం సమవాయకల్పనానర్థక్యం

ద్రవ్యగుణములు మొదలగునవి అనఁగా పుష్పము దానిరూపము మొదలగునవి (తాదాత్మ్యప్రతీతేః=) ఒకదానికంటె మఱియొకటి భిన్నమైనవిగాక ద్రవ్యమే గుణము గుణమే ద్రవ్యమైనట్లు ప్రతీతి (=ప్రసిద్ధి; ఎఱుక) యుండుటవలన నా ద్రవ్యగుణముల మధ్యనొక సమవాయసంబంధమును గల్పించుటయే నిష్ప్రయోజనము.

(సి) కారణకార్యములకు నైయాయిక సిద్ధాంతానుసారము కల్పింపఁబడు అవయవి- అవయవిసంబంధ మసంగతము.

కథంచ కార్యమవయవి ద్రవ్యం కారణేష్వవయవ ద్రవ్యేషు వర్తమానం వర్తేత ? కిం సమస్తే ష్వవ యవేషు వర్తే? తోత ప్రత్యవయవం?

(కార్య ..వర్తమానం=) అవయవములు (భాగములు-parts) గలిగి కార్య (=effect) మైన ద్రవ్యము (=substance) కారణావయవముల (parts cousis-tmpy the cause) యందన్నిటియందును ఉండునను (=పడునను) నైయాయిక సిద్ధాంతములో (కథంచవర్తేత=) ఎట్లవియుండును (=పడును) ?- అనఁగా :—. (1) (కింసమ ... వర్తేత=) అన్ని కారణావయవముల యందును కార్య ద్రవ్యము ఒక్కసారిగాఁ బడునా ? (2) (ఉతప్రత్య...యవం=) లేక ఆకార్యద్రవ్యము ప్రతి కారణావయవమందును బ్రత్యేకముగాఁ బడునా ?

(1) అన్ని కారణావయవముల యందును కార్యద్రవ్య మొక్కసారిగాఁ బడునని చెప్పుటయుఁ బొసఁగదు.

యదితావత్ సమస్తేషు వర్తేత తతో౽వయవ్య నుపలబ్ధిః ప్రసజ్యేత, సమస్తావయవ సన్నికర్షస్యా శక్యత్వాత్

(1) మొదటిపక్షములో- అనఁగా :- (యది ... వర్తేత=) అన్ని కారణావయవములయందును కార్యద్రవ్య మొక్కసారిగాఁ బడునను పక్షములో, (తతో౽వ ... ప్రసజ్యేత) కార్యావయవి (=అవయవములు గలిగిన కార్యము) గోచరింపక పోవుట (=అనుపలబ్ధిః) సంభవించును (=ప్రసజ్యేత), ఎందుచేననఁగా (సమస్తా ... శక్యత్వాత్ =) కార్యావయవియొక్క యన్నిభాగములు ఒక్కసారిగా నింద్రియములకు గోచరింపవు గావున-

నహి బహుత్వం సమస్తేష్వాశ్రయేషు వర్తమానం వ్యస్తాశ్రయ గ్రహణేన గృహ్యతే

(బహుత్వం=) అన్ని యవయవములయొక్క సమ్మేళనము (సమస్తే ... మానం=) అన్ని యవయవములయందు నున్నదికాఁగా, (వ్యస్తా ... ణేన=) ప్రత్యేక ప్రత్యేకావయవము గ్రహించినప్పుడు (బహుత్వంనగృహ్యతే=) అవయవ సమ్మేళనము గ్రహింపఁబడజాలదు.

కార్యద్రవ్యము ప్రతికారణావయవ మందును బ్రత్యేకముగాఁ బడునని చెప్పుటయుఁ బొసగదు.

అథావయవశః సమస్తేషు వర్తేత తదాప్యారంభ కావయవ వ్యతిరేకేణావయవినో౽వయవాః కల్ప్యేరన్ యైరారంభ కేష్వవయవేష్వవయవశో౽వయవీవర్తేత

(2) (అథా ... వర్తేత=) రెండవపక్షములో అనఁగా :- కార్యద్రవ్యము యొక్క ఒక్కొక్కయవయవము కారణావయవములలో ఒక్కొక్క దానియందుఁ బడునను పక్షములో, (తదాప్యా... కల్ప్యేరన్) రెంటికిని, వేరువేరు అవయవము లేర్పడి, (యైరారం... వర్తేత=) (కార్యద్రవ్యముయొక్క) ఒకయవయవమునకు బదులు చెప్పఁగల (correspondingగా) మఱియొక యవయవము (కారణద్రవ్యమందు) ఉండితీరవలెను.

కోశావయవ వ్యతిరిక్తైర్హ్యవయ వైరసిః కోశం వ్యాప్నోతి

(ఎట్లనఁగా:-) వరలోఁ గత్తిదూరినప్పుడు వరయొక్క యవయవములు వేరుగా, కత్తియొక్క యవయవములు వేరుగానుండునట్లే యుండవలెను.

అనవస్థా చైవం ప్రసజ్యేత, తేషు తేష్వవయవేషు వర్తయితు మన్యేషామవయవానాం కల్పనీయత్వాత్

(తేషు తేష్వ... ...కల్పనీయత్వాత్ =) పోనుపోను పరమాణువుల వరకు అవయవములు ఏర్పడియుండును గావున ఒకదానికి బదులు చెప్పఁగల (corre-

sponding గా) మఱియొకటి కల్పించుచుంబోగా, పరమాణువుల వరకును బోవుట యసంభవమై అనవస్థాదోషము (ఎప్పటికిని అంతులేకపోవుట) సంభవించును.

(3) అవయవములుగల కార్యద్రవ్యము కారణావయవములలో దేనియం దుండునో దానియందే వ్యాపారము- దేనియందుండదో దానికి వ్యాపారము లేదు.

అథ ప్రత్యయవం వర్తేత, తదైకత్ర వ్యాపారేఽన్యత్రా వ్యాపారస్స్యాత్

(1) (అథ ... వర్తేత=) అవయవములుకలదై కార్యమైన ద్రవ్యము కారణము యొక్క ప్రతియవయవమందు నుండునను పక్షములో, (తదైక ... పారే=) ఏ యవయవ మందుండునో ఆయవయవమునకే వ్యాపారముండునుగాని, (అన్య ... స్స్యాత్=) ఏయవయవ మందుండదో ఆయవయవమునకు వ్యావారముండదుగదా!

నహి దేవదత్తః స్రుఘ్నే సన్నిధీయ మానస్త దహరేవ పాటలీపుత్రే సన్నిధీయతే

(కార్యమైన) దేవదత్తుండు స్రుఘ్నపట్టణమందున్నచో, (తత్ + అహః + ఏవ=) ఆ పగటియందే (=అప్పుడే) (నహిపాటలీ ... యతే=) పాటలీపుత్ర పట్టణ మందుండుట తటస్థించదుగదా (ఉన్నచోటనే వ్యాపారము సమకూరునని యభిప్రాయము)

(4) కార్యద్రవ్యమొక్కసారిగా కారణావయ వములయందుండు నన్నచో ఒకకార్యము గాక అనేక కార్యము లేర్పడునని చెప్పవలసివచ్చును.

యుగపదనేకత్ర వృత్తావనేకత్వ ప్రసంగాత్

(2) ఒకకార్యమే (యుగ ... వృత్తౌ=) అనేకావయవములయందు నొక్కసారిగానే యుండునను పక్షములో (అనేకత్వ ప్రసంగాత్=) అట్టి కార్యమొక్కటిగాంగాక అనేక కార్యములై యుండి తీరవలెనని యేర్పడును.

దేవదత్త యజ్ఞదత్తయో రివ స్రుఘ్న పాటలీపుత్ర నివాసినోః

స్రుఘ్నము, పాటలీపుత్రము- అను రెండుపట్టణములలో నేకకాలమందుండు దేవదత్త యజ్ఞదత్తులను వారు భిన్నపురుషులై యుందురు. గాని ఒక్కండేయై యుండండు.

(5) గోత్వమనునది యొక్కసారిగా అన్ని గోవులయందుండు లాగున కార్యద్రవ్య మొక్కసారిగాం బ్రత్యేక ప్రత్యేకముగా కారణావయవముల యందుండం జాలదు.

పూర్వపక్షము :-

గోత్వాదివ త్ప్రత్యేకం పరిసమాప్తే రదోష ఇతిచేత్

(గోత్వాదివత్ =) గోత్వమనుజాతి (=గోస్వభావము- The generic character of cow) యేక కాలమందే అనేక గోవుల యందుండుట లేదా (ప్రత్యేకం పరిసమాప్తేః =) అట్లె యొక్క కార్యమే భిన్నభిన్న కారణావయవముల యందు ఏకకాల మందుండునని చెప్పుటలో (అదోషః ఇతిచేత్ =) దోష మేమియు లేదు- (అన్నచో)

సమాధానము :-

స తథా ప్రతీత్య భావాత్

(న=) ఆక్షేపము సరికాదు. (తథా...అభావాత్ =) అట్లొక్కసారిగా నుండుట యెక్కడను దెలియఁబడుట (=ప్రతీతిః) లేదు.

యది గోత్వాదివ త్ప్రత్యేక పరిసమాప్త్యవయవ్యపి స్యాత్ యథా గోత్వం ప్రతివ్యక్తి ప్రత్యక్షం గృహ్యతే

(గోత్వాదివత్ + యథాగోత్వం...గృహ్యతే) గోత్వమనునది ప్రత్యేక వ్యక్తులైన ప్రతి గోవునందును నున్నట్లే, (యదిప్రత్యేక....స్యాత్ =) అనేకావయవ ములుగల కార్యద్రవ్యము సైతము భిన్నభిన్న కారణావయవముల యందుఁగూడ నుండునను పక్షములో

ఏవమవయ వ్యపి ప్రత్యవయవం ప్రత్యక్షం గృహ్యేత న చైవం నియతం గృహ్యతే

(ఏవం=) గోత్వమువలెనే, (అవయవీ + అపి =) అనేకావయవములుగల ద్రవ్యముసైతము (ప్రత్యవయవం =) కారణావయవములైన ప్రతియొక్కొక్కదాని యందును ఉండఁగలదని గ్రహింపవచ్చును గాని అట్టి నియమము కనుపించుటలేదు (అనఁగా గోత్వము ప్రతివ్యక్తియందు ప్రత్యక్షమైనట్లు ద్రవ్యపదార్థము ప్రతి యవ యవమందు ఉన్నట్టు ఎక్కడనులేదు. ఈ విషయ మీక్రిందఁ జెప్పఁబోవు దృష్టాం తము వలన స్పష్టమగును జూడుఁడు)

ప్రత్యేకపరి సమాప్తౌ చావయవినః కార్యేణాధికారాత్ తస్యచైకత్వా చ్ఛృంగేణాపి స్తనకార్యం కుర్యాత్। ఉరసాచపృష్ఠ కార్యం

(ప్రత్యేకపరిసమాప్తౌచ =) ప్రతి యవయవ మందును ద్రవ్య ధర్మముండు నను పక్షములో (అవయవినః కార్యేణాధికారాత్ =) ప్రతి యవయవము కార్యము గానేర్పడి యొక ప్రయోజన మీయవలెను గదా! (గోత్వము గోవు యొక్క ప్రతి యవయవ మందును నుండునన్నచో) (శృంగే ··· కార్యం= ) ఆవు యొక్క కొమ్ము వలనఁ బాలును ఱొమ్ము వలన బేడయు గలుగ వలసి యుండును.

నచైవం దశ్యతే

( నచైవం దృశ్యతే= ) అట్టి వైపరీత్య మెక్కడను గను పించుటలేదు !!!

(డి) కార్యాభావమునుండి కార్యము పుట్టినదనిచెప్పు నైయాయిక సిద్ధాంత మసంగతము.

(1) కార్యోత్పత్తికిముందు కార్యాభావమే యున్నచో, కార్యము అకర్తృకము నిరాత్మకము (నైయాయిక సిద్ధాంతము ప్రకారము కార్యము పుట్టక పూర్వము కార్యాభావముండుననియు, ఆ కార్యాభావము కారణావయవములందుఁ బడునప్పుడు కార్యము గోచరించుననియుఁ జెప్పఁబడును)

ప్రాగుత్పత్తేశ్చ కార్యస్యా సత్త్వే ఉత్పత్తి రకర్తృకా నిరాత్మికా చ స్యాత్

(ప్రాగుత్పత్తేః=) పుట్టకపూర్వము (కార్యాస్యా సత్త్వేచ) కార్యము లేనిదే యైయుండు పక్షమున, (ఉత్పత్తిః=) ఆ కార్యముయొక్క పుట్టుక (అకర్తృకా=) కర్త (=కార్యమును గల్పించునది) లేనిదియు, (నిరాత్మికాచ=) స్వరూపము లేనిదియు, (స్యాత్=) నగును.

(2) కార్యోత్పత్తి యనగా క్రియ- కర్తలేని క్రియయుండదు.

ఉత్పత్తిశ్చ నామక్రియా; సాసకర్తృకైవ భవితు మర్హతి గత్యాదివత్

(ఉత్ప...క్రియా=) పుట్టుకయనఁగా నొకక్రియ (=పని) (సా=) క్రియ యనఁగా (గత్యాదివత్=) గమనాదులవలె (సక ర్తృ...మర్హతి=) ఒక కర్త (=దానిని జేయునది) గలదియై యుండవలెను (చేయువాడు లేనిది ఏ పనియుఁ గాదుగదా)

క్రియాచనామ స్యాచ కర్తృకా చేతి విప్రతి షిధ్యేత

(క్రియా...స్యాత్=) క్రియయగునుగాని, (అకర్తృకాచ+ఇతి=) దానికిఁ గర్తలేదు- అనిచెప్పుచో (విప్రతిషిధ్యేత=) ఆ రెండు వాక్యములన్యోన్య విరుద్ధములై పోవును (గాక మఱేమి!)

(3) కార్యములైన ఘటకపాలాదులకు మృత్పిండాదులే కర్తలని చెప్పుచో ఆ మృత్పిండాదులు ఘటోత్పత్తికిముందే యుండి తీరవలెనుగాని, ఘటకపాలాదులు పుట్టునప్పుడు పుట్టునవిగావు.

ఘటస్యచోత్పత్తి రుచ్యమానాన ఘట కర్తృకా కింతర్హ్యన్య కర్తృకేతి కల్ప్యాస్యాత్

(ఘటస్య...మానా=) ఘటము పుట్టినదని చెప్పి, (నఘటకర్తృకా=) ఘటోత్పత్తి ఘటము కర్తగాదు- అనిచెప్పుచో, (కింత...స్యాత్=) ఆఘటోత్పత్తి మఱియొక కర్తయున్నాడని చెప్పితీరవలెను.

తథా కపాలాదీ నామ ప్యుత్పత్తి రుచ్యమానాఽన్య కర్తృకైవ కల్ప్యేత

అట్లె (కపాలా...రుచ్యమానా=) (ఘట కపాలాదులు పుట్టినవని చెప్పిన ప్పుడు సైతము (అన్య...కల్ప్యేత=) ఆ కపాలాదులకుఁ గపాలాదులేగాక మఱి యొక కర్తయుండవలెనుగదా (=కల్పింపఁ బడవలెను గదా).

తథాసతి, 'ఘట ఉత్పద్యత' ఇత్యుక్తే కులాలాదీని కారణాన్యుత్పద్యంత ఇత్యుక్త స్స్యాత్

(తథాసతి=) అట్లగుపక్షమున 'ఘట' మనుకార్యము మృత్తు- కుమ్మరివాడు మొదలగు కారణములమీఁదనే యాధారపడి యున్నందున (అనఁగా నా కార్యము ఈ కారణములలోనే యుండియున్నందున) (ఘటఉత్ప...ఇత్యుక్తే=) క్రొత్తగా ఘటము పుట్టినదని చెప్పినప్పుడు, (కులా...స్యాత్=) దానికిఁ గారణములైన కులాలుఁడు (=కుమ్మరివాడు) మొదలగునవికూడఁ క్రొత్తగాఁ బుట్టినవని చెప్పినట్లె యగును.

నచలోకే ఘటోత్పత్తి రిత్యుక్తే కులాలాదీనా ముత్పద్యమానతా ప్రతీయతే ఉత్ప న్నతాऽ ప్రతీతేః

అట్లగుచో (లోకే=) లోకమందు, (ఘటో...త్యుక్తే=) కుండ పుట్టినదని చెప్పఁబడినప్పుడు (కులాలా...ప్రతీయతే=) కుమ్మరివాడు మొదలగుదాని కరణ ములు సైతము (ఆకుండతోనే పుట్టినట్లు భావించఁబడవలసి యున్నది కాని లోక ములో (ఉత్పన్నతాऽప్రతీతేః=) కుమ్మరివాడు మొదలగు కారణములు సైతము కుండతోనే బుట్టినట్లు ఎంచఁబడుట లేదు.

(4) కార్యముయొక్క కారణమందున్న సత్తాతో కార్యాభావము గలిసి నప్పుడు కార్యోత్పత్తి యగుననుట సరిగాదు. అభావము భావముతోఁ గలియు ననుట యసంభవము.

పూర్వపక్షము :—

అథ స్వకారణ సత్తాసంబంధ ఏవోత్పత్తి రాత్మ లాభశ్చ కార్యస్యేతిచేత్

(అథ...త్పత్తిః=) కార్యము యొక్క కారణమందొక సత్తా (=శక్తి) యున్నది, ఆ సత్తాతోఁ గార్యాభావము చేరినప్పుడు కార్యముపుట్టి (ఆత్మలాభ శ్చ...చేత్=) స్వరూపముగలది యగునని నైయాయిక పూర్వపక్షి వాదించ వచ్చును-

సమాధానము :—

కథమ లబ్ధాత్మ కం సత్సం బధ్యేతేతి వక్తవ్యం

(అలబ్ధాత్మకం=) స్వరూపము బొత్తుగాలేనిది (కథం సత్సంబధ్యేత=) మఱి యొకదాని (=సత్)తో నెట్లు కలియఁగలదని చెప్పుదురు?

సతోర్హి ద్వయో స్సంబంధ స్సంభవతి నసదసతో రసతోర్వా

(సతో ... సంభవతి=) ఉన్న రెండు వస్తువులు కలియుట సంభవించునుగాని, (నసదసతోః=) ఉన్నదొకటి లేనిదొకటిగాని (అసతోర్వా=) లేక రెండును లేనివిగాని (న) కలియుటయెన్నఁడును సంభవింపదు.

(ప్ర) కార్యమునకు ముందు కార్యాభావముండెనని కార్యాభావమున కొక హద్దేర్పఱచుట హాస్యాస్పదము.

అభావస్యచ నిరుపాఖ్యత్వా త్ప్రాగుత్పత్తే రితిమర్యాదాకరణ మనుపపన్నం;

(అభావ...ఖ్యత్వాత్=) అభావ (లేని) పదార్థమిట్టిదని పేరుపెట్టుటకు వీలులేనిదగుటవలన, (ప్రాగుత్ప ... కరణం=) 'ఉత్పత్తికిఁబూర్వ'మని యొకహద్దు (సంజ్ఞ) ఏర్పఱచుట (అనుపపన్నం=) సరిగాదు (=పుట్టకపూర్వము ఇట్టిదని చెప్పఁ బడజాలని యొక యభావము ఉన్నదనుట విరుద్ధము)

సతాంహి లోకేక్షేత్ర గృహాదీనాం మర్యాదాదృష్టా నాభావస్య

లోకమందు (సతాంహి=) సత్తాతోనున్నట్టి (క్షేత్ర...దీనాం=) క్షేత్రము గృహము మొదలగు పదార్థములకు (మర్యాదాదృష్టా) హద్దేర్పఱచుటచూడఁ బడుచున్నదిగాని (న+అభావస్య=) లేనట్టిపదార్థమునకు హద్దేర్పఱచుటయెందును జూడఁబడదు.

కార్యాభావము వంధ్యాపుత్రునివంటిది- వంధ్యాపుత్రుడుముందు పుట్టనున్న దనుటయెంత యసంభవమో కార్యాభావము కార్యముగాబుట్టుననుటయు నంతటి యసంభవమే.

నహివంధ్యాపుత్రోరాజా బభూవ ప్రాక్పూర్ణవర్మణోఽభిషేకా దిత్యేవం జాతీయ కేన మర్యాదాకరణేన నిరుపాఖ్యో వంధ్యాపుత్రోరాజా బభూవ భవతి భవిష్యతీతి వావిశేష్యతే

వంధ్యాపుత్రుఁడు (=గొడ్రాలికొడుకు) పూర్ణవర్మ పట్టాభిషేకమునకుముందు రాజాయెను. అనునిట్టి వాక్యార్థములందుఁ జూపట్టు రాజ్యకాలనిర్ణయముచేత ఇది వరకులేని ఇప్పుడులేని ముందుండఁబోని వంధ్యాపుత్రుఁడు ఒకప్పుడు రాజుగా నున్నాడని చెప్పుట హాస్యాస్పదముగా నుండునేగాని (నహివిశేష్యతే-) విశేష మేమియుఁ గనుపింపదు.

యదిచవంధ్యాపుత్రః కారకవ్యాపారాదూర్ధ్వమభవిష్యత్ తత ఇదమపి ఉపాపత్స్యత కార్యాభావోఽపి కారకవ్యాపారాదూర్ధ్వం భవిష్యతీతి

(కారక ... దూర్ధ్వం=) కార్యప్రయత్నానంతరము వంధ్యాపుత్రుఁడు పుట్టునన్నాఁడని చెప్పుట సరిపోవుచో, (కారక ... భవిష్యతీతి=) కార్యప్రయత్నానంతరము కార్యాభావము (కార్యముయొక్క లేకపోవుట) పుట్టునని చెప్పునట్టి (ఇదమపి ఉపాపత్స్యతే=) భావముగూడ సరియేపోవును. (ఇట్టిది కేవలమసంభవమని భావము)

వయంమన్యామోవంధ్యాపుత్రస్య కార్యభావస్యచా భావస్యచా భావత్వా విశేషాత్

వంధ్యాపుత్రుఁడును (=గొడ్రాలికొడుకును) కార్యాభావమును (కార్యముయొక్క అభావము) అనునీరెండు అభావములును సమానములేయని (వయంమన్యామః=) మేము తలఁచుచున్నాము. (మాదృష్టిలో నవిరెండును నొకటే)

యథావంధ్యా పుత్రఃకారక వ్యాపారాదూర్ధ్వం నభవిష్యతి ఏవంకార్యాభావోఽపి కారక వ్యాపారాదూర్ధ్వం న భవిష్యతీతి

(కారక....దూర్ధ్వం=) ప్రయత్నానంతరము వంధ్యాపుత్రుఁడు పుట్టఁబోవువాఁడెట్లు కాఁజాలఁడో, (కారక...దూర్ధ్వం=) ప్రయత్నానంతరము కార్యాభావముసైతమట్లే పుట్టఁగలది గాఁజాలదు.

(7) కార్యాభావమునుండి కార్యము పుట్టఁజాలనిచో కార్యము పుట్టుటకు ముందుఁజేయఁబడు కార్యప్రయత్నము వ్యర్థమేయను నాక్షేపము సరిగాదు.

పూర్వపక్షము :—

నన్వేవంసతికారక వ్యాపారోఽనర్థకః ప్రసజ్యేత

(ఏవంసతి—) అట్లగుచో, (కారకవ్యాపారః=) కార్యముపుట్టుటకుముందుఁజేయఁబడు కార్యప్రయత్నము (నను అనర్థకః ప్రసజ్యేత;=) నిష్ప్రయోజకమై పోవలసినదియేగదా ?

యథైవహి ప్రాక్ సిద్ధత్వా త్కారణస్య స్వరూపసిద్ధయే నకశ్చిద్వ్యాప్రియతే

(యథైవహి ... వ్యాప్రియతే=) ముందే సిద్ధమైయున్న కారణస్వరూపము కొఱకుఁ బ్రయత్నమె యుండఁజాలదో (ఏవం...కశ్చిద్వ్యాప్రియేత) అట్లే కారణముకంటె వేరుగానట్టియు ముందేసిద్ధమైయున్నట్టియు కార్యస్వరూపము కొఱకును (నకశ్చిద్వ్యాప్రియతే=) ఎవఁడును బ్రయత్నముచేయకయేపోవును

ఏవం- ప్రాక్సిద్ధత్వా త్తదనన్యత్వాచ్చ- కార్యస్వరూప సిద్ధయేపి నకశ్చిద్వ్యాప్రియేత వ్యాప్రియేతచ:

(వ్యాప్రియేతచ=) అట్లుగాక కార్యముకొఱకుఁ బ్రయత్నమును జేయుచునేయున్నారుగదా.)

అతఃకారకవ్యాపారార్థవత్వాయ మన్యామహే ప్రాగుత్పత్తేరభావః కార్యస్యేతిచేత్

కారక... వర్త్యాయ=) కారకవ్యాపారమునకు అనఁగా కార్య ప్రయత్నమునకు సాఫల్యమును జూపించుటకే (ప్రాగుత్పత్తే రభావః కార్యస్య=) కార్యోత్పత్తికిముందు కార్యము లేదు (=కార్యాభావః) (మన్యామహే ఇతి చేత్=) అని మేము చెప్పుచున్నాము- అని పూర్వపక్షము చేయు దోష వాదమునకు

(8) పుట్టుటకుముందు కార్యము కారణాకారముతో నున్నది. కార్య ప్రయత్నము వలన నా కారణాకారమే కార్యం=కార్యముగా మారును గావున కార్య ప్రయత్నము వ్యర్థముగాదు.

సమాధానము :—

నైష దోషః; యతః కార్యాకారేణ కారణం వ్యవస్థాపయతః కారకవ్యాపార స్యార్థ వత్త్వ ముపపద్యతే

(నైషదోషః=) మా వాదమందు- అనఁగా కార్యముపుట్టుటకుఁ బూర్వము కారణమందుండియే యున్నదని చెప్పు మావాదమునందు నీవారోపించు దోషము- అనఁగా కారకవ్యాపారముతోఁ (=కార్యప్రయత్నముతో) బ్రయోజనముండదు గదా- అని నీవుచెప్పుదోషము వచ్చుటకవకాశము లేదు. (యతః=) ఎందుచేత ననఁగా, (కారణం=) కారణమును (కార్యాకారేణ వ్యవస్థాపయతః=) కార్యాకారముగాఁ జూపించు నిమిత్తమే (కారక-వర్త్వ-ఉపపద్యతే) కారక వ్యాపారము అనఁగా కార్యప్రయత్నము ప్రయోజనముగలది యగుచున్నది.

కార్యా కారోఽపి కారణస్యాత్మ భూతఏవ

(కార్యా...ఏవ=) కార్యాకారమనఁగా కారణస్వరూపమే.

అనాత్మ భూతస్యా నారభ్యత్వాదిత్య భాణి

(అనాత్మ...భ్యత్వాత్=) అదివరకు స్వరూపమే లేనిది (పొందఁబడుటకు) ప్రయత్నింపఁబడఁ జాలనందున (ఇతి+అభాణి=) కార్యాకారము కారణస్వరూపమేయని మాచేఁ జెప్పఁబడినది. (ప్రయత్నముచేత తిలలనుండి తైలము దీయ వచ్చునుగాని యిసుకనుండి తీయఁబడఁజాలదుగదా!)

(9) ఆకార భేదములతో వస్తుభేదముగలుగదు

నచ విశేష దర్శనమాత్రేణ వస్త్వన్యత్వం భవతి

(కార్యమైన) ఒకవస్తువు (కారణముకంటె) మఱియొక యాకారముతోఁగనుపించు మాత్రముచేత (వస్త్వన్యత్వం=) అది- అనఁగా ఆ కార్యవస్తువు (కారణముకంటె) అన్యమైనది (నభవతి=) గానేరదు- (తైలము తిలలకంటె మఱియొక యాకారముతోఁ గనుపించినను, తిలలకంటె భిన్నముగానేరదు గదా!)

(10) ఆకారభేదములతో వస్తుభేదము రాదనుటకు దృష్టాంతములు

నహి దేవదత్త స్సంకుచితహస్త పాదః ప్రసారిత హస్త పాదశ్చ విశేషేణ దృశ్య మానోఽపి వస్త్వన్యత్వం గచ్ఛతి

(దేవ ... పాదః =) కాలుసేతులు ముడుచుకొన్నప్పుడుండు దేవదత్తుఁడు (ప్రసారిత...మానోఽపి) కాలుసేతులు చాపినవాఁడగుట మూలమున (=చాపిన తరువాత) కొంతవిశేషముతోఁ గనుపించుచున్నను (వస్త్వన్యత్వం నహిగచ్ఛతి=) మఱియొక మనుష్యుఁడు కాజాలఁడుగదా-

స ఏవేతి ప్రత్యభిజ్ఞానాత్

ఎందుచేతననఁగా- (ఆకాలుసేతులు ముడుచుకున్న) వాఁడే (కాలు సేతులు చాపినయీ) వీఁడు- అని (ప్రత్యభిజ్ఞానాత్ =) తెలియఁబడుచునే యుండుటవలన సుమి (యట్లు చెప్పినారము)

తథా ప్రతిదిన మనేకసంస్థా నానామపి పిత్రాదీనాం నవస్త్వన్యత్వం భవతి మమ పితా మమమాతా మమభ్రాతా మమపుత్ర ఇతి ప్రత్యభిజ్ఞానాత్

అట్లె ప్రతిదినము అనేకములగు నవస్థలను- రూపములను- ఆకారములను బొందుచున్న మనతండ్రి-తల్లి-తమ్ముఁడు-కొడుకు మొదలగువారు ఆయా యవస్థాదులను బొందుటకు పూర్వమువలెనే పిమ్మటను నాతండ్రి-నాతల్లి-నాతమ్ముఁడు-నాకొడుఁకు అనియే (ప్రత్యభిజ్ఞానాత్ =) తెలియఁబడుచున్నారుగాని (నవస్త్వన్యత్వంభవతి =) వేరు మనుష్యులుగాఁ దలపఁబడుటలేదుగదా !

(11) మామూలువాడుకలో నున్న జన్మమరణావస్థలు సైతము ఆకార భేదములేగాని వస్తుభేదమును గల్గించునవిగావు.

పూర్వపక్షము :-

జన్మోచ్ఛేదానంతరితత్వాత్తత్రయుక్తం నాన్యత్రేతిచేత్

(కాలుసేతులు ముడుచుకొన్నప్పుడు చాచినప్పుడు ఉన్న) తండ్రి- తల్లి- తమ్ముఁడు- కొడుకు మొదలగువారు అప్పుడు నిప్పుడు (జన్మోచ్ఛేదానంతరితత్వాత్ =) జన్మభేదములేక యొకజన్మములోనివారే యగుటవలన (తత్రయుక్తం=) వారేవీరు- అని చెప్పుట సబబే- (నాన్యత్ర + ఇతిచేత్ =) మట్టి-కుండ మొదలగువాని విషయములో అట్లు కాఁజాలదు- అనఁగా 'అదే యిది'యని గుర్తుపట్టఁబడఁజాలక మట్టి మారిపోయి కుండయగుచున్నందున అదేయిది యని చెప్పఁగలుగు 'ప్రత్యభిజ్ఞ' లేదు- అని పూర్వపక్షి వాదించుచో.

సమాధానము :—

(న=) అట్లు కాదని చెప్పుచున్నాము. ఎందుచేననఁగా

క్షీరాదీనామపి దధ్యాద్యాకారసంస్థానస్య ప్రత్యక్షత్వాత్

పాలు మొదలగు కారణవస్తువులు సైతము పెరుగు మొదలగు కార్యాకారములను ధరించుచున్నట్లు ప్రత్యక్షముగాఁ గనుపించుచున్న విషయమేగదా!

అదృశ్యమానానామపి వటధానాదీనాం సమానజాతీయావయవాంతరోపచితానాం

అంకురాదిభావేన దర్శనగోచరతాపత్తౌ జన్మసంజ్ఞా

(అదృశ్యమానానాం=) అతిసూక్ష్మములై స్ఫుటముగాఁ గనుపించని (వటధానాదీనామపి=) మఱ్ఱివిత్తనములోని యవయవములే (సమాన...చితానాం=) అందులకు భిన్నస్వభావముగాని వేరురూపములుగల యవయవములుగాఁ బెరిగి పెద్దవై (అంకురాదిభావేన=) మొక్క మొదలగు నాకారములను బూని (దర్శనగోచరతాపత్తౌ=) దృష్టిగోచరమగునప్పుడు (జన్మసంజ్ఞా=) (మొదటివిత్తనపు సంగతిని మఱచి) మొక్క పుట్టినదనియు,

తేషామేవావయవానామపచయవశాదదర్శనాపత్తావుచ్ఛేదసంజ్ఞా

(తేషా...వానాం=) ఆ మొదటివిత్తనముయొక్క యవయవములే (అపచయవశాత్=) (మొక్కరూపమును బొందినపిమ్మట) చెడిపోవుటవలన (అదర్శనాపత్తౌ) కనుపడకుండఁ బోయినప్పుడు (ఉచ్ఛేదసంజ్ఞా=) ఆ మొక్క చచ్చినదనియుఁ జెప్పఁబోవుట సంభవింపవచ్చును.

(12) అసత్తు (లేనిదాని) నుండి సత్యము (ఉండుట) గలుగదు- జగత్తునుండి అసత్యము గలుగదు సత్యమున కవస్థాభేదములుండవచ్చునుగాని, సత్యమెన్నటికిని అసత్యముగా నుండదు.

తత్రైవం దృగ్జన్మోచ్ఛేదాంతరితత్వేన చేదసతస్సత్త్వాపత్తిః సతశ్చాసత్త్వాపత్తిః

[తత్ర=] ఈసందర్భములో [ఈదృగ్జన్మో చ్ఛేదాంతరితత్వేన=] మొదటి యసలు కారణమును లోపలికిఁ ద్రొక్కివేయు [అనఁగా దానిని గనుపడకుండ లోనికి నడఁచివైచు] యీపైనఁ దెలుపఁబడిన పుట్టుక- చావులను [కొండగుర్తులను] మాత్రము మనస్సున నిల్పుటచేత [అసతః సత్త్వాపత్తిః=] లేనిదానికి నునికియు [జన్మమును] [సతశ్చ అసత్త్వాపత్తిః=] ఉన్నదానికి నాశనమును [=చచ్చుటయు] [చేత్=] ఆరోపించిన పక్షమున

తదావత గర్భవాసిన ఉత్తానశాయినశ్చ భేదప్రసంగః

[తథాసతి=] అట్లై [గర్భవాసినః=] పుట్టకపూర్వము గర్భములోనున్న పిల్లవాడు [ఉత్తానశాయినః=] పుట్టినతరువాత మంచముమీదఁ బండఁబెట్టఁబడిన పిల్లవాడు వేరువేరు అని చెప్పవలసి యుండును.

తథాబాల్య యౌవనస్థావిరేష్వపి భేదప్రసంగః పిత్రాదివ్యహారలోప ప్రసంగశ్చ

[తథా=] మఱియునట్లే బాల్యయౌవన [స్థావిర=] వృద్ధత్వావస్థలు మారినప్పుడు తన తండ్రి కుమారుడు మొదలగువారుగూడ నాయాయవస్థలకు ముందటివారు కారని చెప్పవలసివచ్చును.

[13] ఈపై హేతువులు బౌద్ధు లక్షణ భంగవాదమును గూడ భంగపరచుచున్నవి.

ఏతేనక్షణ భంగవాదః ప్రతివదితవ్యః

ఈపైనఁ దెలుపఁబడిన హేతువులచేతనే క్షణభంగురత్వమును జెందని యునికిలేదని వాదించు బౌద్ధులవాదము [ప్రతివదితవ్యః=] ఖండింపఁబడఁదగియున్నది. [మఱియు నీబౌద్ధులక్షణ భంగవాదము ఈయధ్యాయము రెండవపాదమందుఁ బుష్కలముగాఁ బరిశీలింపఁబడును జూడుఁడు]

[14] కార్యప్రయత్నమునకు కార్యమే విషయమగునుగాని గార్యాభావము విషయము గానేరదు.

యస్యతుపునః ప్రాగుత్పత్తే రసత్కార్యం తస్యనిర్విషయః కారకవ్యాపారస్స్యాత్

[ప్రాగుత్పత్తే రసత్కార్యం=] పుట్టకపూర్వము కార్యములేదు [=అభావము]- అని [యస్యతుపునః=) ఎవఁడు వాదించునో [తస్య=] వానిపక్షములోనే (మతములోనే) [కారకవ్యాపారః నిర్విషయః=] కార్యప్రయత్నమంతయు విషయము[=object ప్రయోజనము) లేనిదే [స్యాత్=] యగును.

అభావస్య విషయత్వానుపపత్తేః

ఎందుచేనఁనగా, అభావమెప్పుడును ఒకపనికి విషయ-(object) మగుట సంభవింపదు- ఎట్లనఁగా

ఆకాశహనన ప్రయోజన ఖడ్గాద్యనేకాయుధ ప్రయుక్తివత్

[శూన్యమైన] ఆకాశమును గొట్టవలయుననెడి కోరికతో కత్తి [గొడ్డలి-గడ్డపార] మొదలగు నాయుధములను ఆకాశముపైకిఁ బ్రయోగించినట్లయగును.

(15) ఘటకార్య ప్రయత్నమునకు కపాలాది నిమిత్తకారణములు సైతము విషయము కాజాలదు ఇవియే విషయములగుచో, కార్యప్రయత్న ఫలము కపాలాదులే గావలయును గాని ఘటముగానేరదు.

పూర్వపక్షము :—

సమవాయి కారణవిషయః కారక వ్యాపారస్స్యా దితి చేత్

(సమవాయికారణవిషయః =) సమవాయి కారణముయొక్క విషయములే (అనఁగా-కపాలాదులే-అనఁగా-వేదాంతిచేఁజెప్పఁబడు నిమిత్తకారణములే) (కారక వ్యాపారః =) కార్యప్రయత్నమునకు విషయములు- (స్యాత్ + ఇతి + చేత్ =) అగునని చెప్పుచో- (ie కార్యప్రయత్నమునకు విషయము (object) కపాలాదులేయని యేల చెప్పఁగూడదు?

సమాధానము :—

న,

(న = అట్లు కానేరదు,

అన్యవిషయేణ కారకవ్యాపారేణాన్య నిష్పత్తే రతిప్రసంగాత్

(అన్యవిషయేణ =) కపాలాదులే విషయముగాఁగల అనఁగా కపాలాదుల మీఁదనే పనిచేయు (కారకవ్యాపారేణ =) కార్యప్రయత్నముచేత- (ఆకపాలాదులే పుట్టింపఁబడ వలెనుగాని) — (అన్యనిష్పత్తేః =) ఆ కపాలాదులకంటె భిన్నమైనవి- అనఁగా ఘటాదులు పుట్టుచుండుటవలన (అతిప్రసంగాత్ =) 'కపాలాదులే కార్య ప్రయత్నమునకు విషయము (= సమవాయి కారణవిషయః కారకవ్యాపారః)' అని చెప్పువాదమునకు 'అతిప్రసంగ' దోషము వాటిల్లును.

(16) కపాదులయందుండు నతిశయమే కార్యమన్నచో, సత్కార్యవాదమే సిద్ధించును. అసత్కార్యవాదము భంగపడిపోవును.

పూర్వపక్షము :—

సమవాయి కారణస్యైవాత్మాతిశయః కార్యమితిచేత్

(కార్యం =) (ఘటాది) కార్యమనఁగా, (సమవాయికారణస్య =) సమవాయి కారణమైన కపాలాదియందుండు (ఆత్మాతిశయః =) ఒకానొకయతిశయమే (= విశేషమే) (ఇతిచేత్ =) యనియేల చెప్పఁగూడదు?

సమాధానము :—

తర్హి సత్కార్యతా పత్తిః

(తర్హి =) నీవు వాదించు 'అసత్కార్య వాదము పోయి (సత్కార్యతా పత్తిః =) మా 'సత్కార్యవాదమే' నీకు సిద్ధించును- అనఁగా కార్యము (పుట్టక పూర్వము) కారణమందున్నదని నీవొప్పుకొన్నట్లే యగును.

(17) కాబట్టి కార్యకారణముల కొకపేరుభేదమేగాని వస్తుభేదమెంతయును లేదు.

తస్మాత్ క్షీరాదీన్యేవ ద్రవ్యాణి దధ్యాది భావేనావతిష్ఠమానాని కార్యాఖ్యాంలభంత ఇతి నకారణా దన్యత్కార్యం వర్షశతేనాపి శక్యం కల్పయితుం

కాబట్టి పాలు మొదలగు పదార్థములు (దధ్యాదిభావేన=) పెరుగు మొదలగు నాకారములతో (అవతిష్ఠమానాని=) నుండుటయే, (కార్యాఖ్యాంలభంతే+ఇతి) కార్యమనెడి పేరుతో వ్యవహరింపఁ బడుచున్నది గాని వాస్తవమునకు (కారణాదన్యత్కార్యం=) కారణముకంటె కార్యముభిన్నమైనదని (కల్పయితుం=) కల్పించుట (వర్షశతేనాపి=) నూర్ల సంవత్సరములు ప్రయత్నించినను (నశక్యం=) సాధ్యముగాని పనియగునుజుమా !

[18] కారణమైన బ్రహ్మమునకును కార్యమైన జగత్తునకును అట్టిపేరుభేదమొకటియేగాని వస్తుభేద మెంతమాత్రమును లేదు.

తథాచ మూల కారణమేవాంత్యా త్కార్యా త్తేన తేనకార్యాకారేణ నటవత్ సర్వవ్యవహారాస్పదత్వం ప్రతిపద్యతే

(తథాచ=) కాబట్టి (నటవత్=) ఒక మనుష్యుఁడే యనేక వేషములను ధరించునట్లు (అంత్యాత్కార్యాత్=) వర్తమానమునకు జగత్తుగా గోచరించు (కడపటి) నన్ని కార్యములకు (మూలకారణమేవ=) మూల (=మొదటి) కారణమగు బ్రహ్మమొకటియే (తేనతేనకార్యాకారేణ=) జగత్తులోని యాయాకార్యములను బూనుటచేత (సర్వవ్యవహారాస్పదత్వం=) (వేరువేరుగాగనుపించు) నన్ని వ్యవహారములు జరుగుచుండుట (ప్రతిపద్యతే=) కలుగుచున్నది.

ఏవంయుక్తేః కార్యస్య ప్రాగుత్పత్తేః స్సత్వ. మనన్యత్వం చ కారణా దవగమ్యతే

(ఏవంయుక్తేః=) పైనఁ జూపఁబడిన యుక్తులవలన (కార్యస్య ... సత్వం=) పుట్టకపూర్వము కార్యముండి యుండుటయు, (అనన్యత్వంచ కారణాత్=) ఆ కార్యము కారణముకంటె వేరు (=అనన్యం) గాకపోవుటయు (అవగమ్యతే=) నిశ్చయము లగుచున్నవి.

శబ్దాంతరాచ్చ తదవగమ్యతే; పూర్వసూత్రే అసద్వ్యపదేశిన శ్శబ్దస్యో దాహృతత్వాత్ తతోఽన్య స్సద్వ్యపదేశీ శబ్ద శ్శబ్దాంతరం

(ఏతత్=) ఈ పైనఁదెలిపిన నిశ్చయము (శబ్దాంతరాత్+చ=) (యుక్తుల వల్లనేగాక) ఇతర శ్రుతిప్రమాణము వలనను దెలియఁబడుచున్నది. పూర్వసూత్రమందు (బ్ర.సూ. II-1-17) పై నిశ్చయమును స్థాపించుటకే) 'అసత్'ను దెలుపు శ్రుతి (ఛాం. III-19-1) యుదాహరింపఁబడి యున్నందున, (ఆవిషయమందే)

'సత్'ను జెప్పునట్టి శ్రుతిసైతము (ఛాం. VI-2-1) నున్నందున దీనినే (శబ్దాంతరం=) మఱియొక శ్రుతియని సూత్రము పేర్కొనుచున్నది.

ఆ మఱియొకశ్రుతి యేదన:—

శబ్దాంతరం 'సదేవ....ద్వితీయమ్' ఇత్యాది ఛాం. VI-2-1 'సదేవసోమ్యేదమగ్ర ఆసీదేకమేవా ద్వితీయమ్....'

(సోమ్య!) ఓఅబ్బాయీ! (ఇదం=) ఈజగత్తు (అగ్రే=) పుట్టకపూర్వము (సత్+ఏవ) సత్ అను పదార్థముగానే (ఆసీత్) ఉండెను అని (ఏకం+ఏవ=) ఒకటిమాత్రముగాను, (అద్వితీయమ్) రెండవదిలేకుండఁగను (ఆసీత్=) ఉండెను.

అను మొదలగునది.

'తద్ధైక....ఆసీత్'

పైననుదాహరించిన శ్రుతియే తరువాతి వాక్యములో

ఇతిచా సత్వతముపక్షిప్య కథమసతస్స జ్జాయేతే త్యాక్షిప్య 'సత్త్వేవ-ఆసీత్' ఇత్యవధారయతి ఛాం. VI-2-1 'తద్ధైక ఆహురసదేవేదమగ్రఆసీత్'

(తత్+హ=) ఆవిషయములోనే (ఏకే=) కొందరు (ఇదం=) ఈజగత్తు (అగ్రే=) సృష్టికిఁబూర్వము (అసత్+ఏవ=) అసత్తుగానే అనఁగా అభావముగానే (ఆసీత్=) ఉండెనని (ఆహుః=) చెప్పుచున్నారు.

అని చెప్పుటమూలమున సృష్టికిఁబూర్వమే జగత్తు అభావముగానే యున్నదని కొందరు (వైనాశికులు) వాదించువిషయమును (ఉపక్షిప్య=) బ్రస్తావించి

ఛాం. VI-2-2 '....కథమ సతస్సజ్జాయేత....'

(అసతః=) అభావమునుండి (సత్=) భావము (ఉన్నది) (కథాత్=) ఎట్లు (జాయేత=) పుట్టఁగలదు. అని య్యాశ్రుతియే యాపై వాక్యముల (ఆక్షిప్య=) నాక్షేపించి వెంటనే (స్పష్టార్థముతో) తానే

ఛాం. VI-2-2 'సత్త్వేవసోమ్యేదమగ్రఆసీత్....'

(సోమ్య=ఓపిల్లవాడా! (ఇదం=) ఈజగత్తే (అగ్రే=) సృష్టికిఁబూర్వము (సత్+తు+ఏవ=) భావపదార్థముగానే (ఆసీత్=) ఉండెను. యీరీతిగా (అవధారయతి=) నిశ్చయించుచున్నది,

తత్రేదంశబ్ద వాచ్యస్య కార్యస్య ప్రాగుత్పత్తే స్సచ్ఛబ్ద వాచ్యేనకారణేన సామానాధికరణ్యస్య శ్రూయమాణత్వాత్ సత్త్వానన్యత్వే ప్రసిద్ధ్యతః

(తత్ర=) ఈకడపటి వాక్యములో శ్రుతి ('ఇదం' శబ్ద... కార్యస్య=) 'ఇది' యను శబ్దముచేతఁ దెలుపఁబడిన కార్యమైన యీజగత్తు (ప్రాగుత్పత్తేః) పుట్టక పూర్వము (సచ్ఛబ్ద... కారణేన=) 'సత్' అను శబ్దముచేతఁ దెలుపఁబడిన కారణమైన బ్రహ్మమేయని నిశ్చయించుట మూలమున (సామానాధి... మాణత్వాత్ =) ఆరెండును అనఁగా కారణమైన బ్రహ్మము కార్యమైనజగత్తు అనునవి సమానాధికరణములేయని- అనఁగా సమానమైన (ఒకటియేయైన) స్వరూపము (అధికరణము) గలవియేయని తెలుపుచుండుటవలన (సత్త్వానన్యత్వే=సత్త్వ+అనన్యత్వ) కార్యము (పుట్టకపూర్వము కారణరూపముగానే) ఉండుటయు (=సత్త్వం), కార్యము (కారణముకంటె) భిన్నముగాకపోవుటయు (=అనన్యత్వం) (ప్రసిద్ధ్యతః=) సుప్రసిద్ధములగుచున్నవి (=స్పష్టపడుచున్నవి)

యదితుప్రాగుత్పత్తేరసత్కార్యంస్యా త్పశ్చాచ్చోత్పద్యమానం కారణే సమవేయాత్ తదన్యత్కారణాత్స్యాత్;

(నైయాయికులవాదానుసారముగా) కార్యము పుట్టకపూర్వము (అసత్ =) లేనిదియు (=అభావము), (ప్రశ్చాత్ =) పిమ్మట (ఉత్పద్యమానం) బుట్టినదగుచు (కారణే=) కారణమందు (సమవేయాత్ =) సమవాయసంబంధముచేత నావరించిపోయినదియు (యదితుస్యాత్ =) నగుచో, (తత్ =) ఆకార్యము (కారణాత్ + అన్యత్) కారణముకంటె భిన్నమైన మఱియొకవస్తువు (స్యాత్ =) అయిపోవును.

తత్ర 'యేనాశ్రుతం శ్రుతంభవతి'

(తత్ర=) అట్లు కారణముకంటెఁ గార్యము భిన్నమైనవస్తువేయైయున్నచో

ఇయంప్రతిజ్ఞా పీడ్యేత: ఛాం. VI-1-3 'యేనాశ్రుతం శ్రుతంభవత్య మతంమతం

(యేన=) దేనిని దెలిసికొనుటచేత. (అశ్రుతం=) వినఁబడనిది (శ్రుతం=) వినఁబడినదియు, (అమతం=) తెలిసికొనఁబడనిది (మతం=) తెలిసికొనఁబడినదియు (భవతి=) నగుచున్నది. అని పై సృష్టివాక్యముల (ఛా. VI-2-1) యారంభమందు (ఇయంప్రతిజ్ఞా) శ్రుతిచేసిన యాప్రతిజ్ఞ (వాగ్దానము-assertion) (పీడ్యేత=) భంగపడిపోవును. 'ఒక్క కారణమును గుఱ్ఱించినచో, దానిచేతనైన కార్యములన్నియు గుఱ్ఱింపఁబడినవేయగుచున్నవి. అనియే యీశ్రుతిచేసినప్రతిజ్ఞ- కారణవస్తువు- కార్యవస్తువు రెండును ఒకటియేయైనప్పుడుగదా ఒకటి తెలిసికొనబడినచో రెండవది తెలిసికొనబడుట సంభవించును- రెండును భిన్నపదార్థములేయని శ్రుతియొక్క యభిప్రాయమగుచో, శ్రుతి మొదలుచేసిన యాప్రతిజ్ఞ నిరర్థకమేయగును- అట్లైనట్టికిని గాదనిభావము)

సత్త్వానన్యత్వావగతే స్త్వియంప్రతిజ్ఞా+సమర్థ్యతే

(సత్త్వా ... గతేస్తు=) కారణరూపమునఁ గార్యముండుటయే యుండుటయు (=సత్త్వం) కారణముకంటెఁ గార్యము భిన్నముగాకపోవుటయు (=అనన్యత్వం) అనునీ రెండువిషయములు గ్రహింపఁబడినప్పుడే (=అవగతేః+తు) (ఇయంప్రతిజ్ఞా=) శ్రుతియారంభమందుఁ జేసిన (ఛాం. VI-1-3 లోని) యీప్రతిజ్ఞ (సమర్థ్యతే=) సార్థకమైనదగుచున్నది. (=యదార్థమని సమర్థింపఁబడఁగలదు)

19. సూత్రావతారిక :—

కార్యము కారణమేయగుచో, కారణముకంటె కార్యము పెద్దదిగాను భిన్నమైనదిగాను గనుపించుటయేల ? యను మొదలగు సందేహములను దీర్చి కార్యకారణానన్యత్వమును రూఢిపఱచుటకీ మఱియొక సూత్రము చెప్పబడుచున్నది.

## ౧౯ సూ॥ పటవత్

ప్ర. ప. అ :- పటవత్ = (ముడువఁబడియుండు వస్త్రమే పరఁచఁబడిన) వస్త్రముగులాగున

సూ॥ తా :- వస్త్రముముడిచి ముద్దచేయబఁడి యున్నప్పుడు కొద్దిదిగాను వస్త్రముకంటె భిన్నమైనదిగాను గనుపించవచ్చును. అదియే పరచఁబడినప్పుడు పెద్దదైనట్లును వస్త్రమైనట్లును గనుపించును. ఈ యాకార భేదముచేత ముడవఁబడియున్న వస్త్రమువేరు పరచఁబడియున్న వస్త్రమువేరు అనిచెప్పుటకు సాధ్యపడదు. అట్లె జగద్బ్రహ్మముల విషయమని గ్రహించవలెను.

భాష్యము భాష్యార్థము

యథాచ సంవేష్టితః పటోఽవ్యక్తం గృహ్యతే 'కిమయం పటః కింవాన్యద్రవ్యమితి స ఏవ ప్రసారితో యత్సంవేష్టితం ద్రవ్యం సపటఏవేతి ప్రసారణేనాభివ్యక్తో గృహ్యతే

(సంవేష్టితః పటః=) ముడువఁబడియున్న వస్త్రము ( కిమయం ... ద్రవ్య' మితి) 'ఇది వస్త్రమా లేక మఱియొక వస్తువా' అని (యథాఽవ్యక్తం=) యేప్రకారముగాఁ దెలియఁబడకుండునో, (యత్సం ... ద్రవ్యం=) ఏది ముడువఁబడియున్న వస్తువో (సఏవ-రితః) అదియే పరఁచబడినదికాఁగా, (ప్రసారణేన=) ఆ పరచఁబడియుండుటచేత (సపటఏవేతి=) అది వస్త్రమేయని (యథా...అభివ్యక్తోగృహ్యతే=) యే ప్రకారముగాఁ దెలియఁబడినదియగునో

యథాచ సంవేష్టనసమయే పట ఇతి గృహ్యమాణోఽపి న విశిష్టాయామవిస్తారో గృహ్యతే

(సంవేష్టనసమయే=) ముడువబడియున్న సమయమందు (పట...మానోఽపి=) వస్త్రమని గ్రహింపఁ బడుచున్నను (విశిష్టాయామ విస్తారః=) దానికున్న

పొడవు (=ఆయామము) వెడల్పు (విస్తారము) (యథానగృహ్యతే ) ఏ ప్రకార ముగాఁ దెలిసికొనఁ బడఁజాలదో

సఏవ ప్రసారణసమయే విశిష్టాయామవిస్తారో గృహ్యతే న సంవేష్టితరూపా దనోఽన్యః యం పట ఇతి

(సఏవ=) ఆవస్త్రమే (ప్రసారణసమయే=) పరచఁబడియున్నప్పుడు (విశిష్టా... స్తారః=) ఇంతపొడవు వెడల్పుగలది యనియు (అయంపటః=) ఇది వస్త్రము, (సంవేష్టిత ... రూపాత్=) ముడువఁబడియున్నప్పటి రూపముకంటె (నఅన్యః=) అన్యముగాదనియు (యథాగృహ్యతే=) ఏ ప్రకారముగాఁ దెలిసికొనఁబడునో.

ఏవం తంత్వాది కారణావస్థం పటాది కార్య మస్పష్టం సత్తురీవేమ కువిందాది కారక వ్యాపారాభి వ్యక్తం స్పష్టం గృహ్యతే

(ఏవం=) అట్లె (కార్యం=) కార్యరూపముదాల్చిన వస్త్రము, (తంత్వాది ... వస్త్రం=) నూలుమొదలగు నాకారముతోనున్నప్పుడు, (అస్పష్టంసత్=) ఇదివస్త్ర మని స్పష్టముగాఁదెలిసికొనఁబడఁ జాలనిదియగుచు, (వేమ ... వ్యక్తం=) (కొమ్ము- నాడి) గొట్టము (=తురీ)–మగ్గము (=వేమ) సాలెవాడు (=కువింద) అను మొదలగు వారి కార్యప్రయత్న (=కారకవ్యాపార)ములచేత (స్పష్టంఅభివ్యక్తం=) స్పష్ట మైన వస్త్రాకారము దాల్చినదిగా (గృహ్యతే) గ్రహింపఁబడుచున్నది.

అత స్సంవేష్టిత ప్రసారిత పటన్యాయేనైవా నన్యత్కారణాత్కార్య మిత్యర్థః

కాబట్టి (సంవే...న్యాయేనైవ=) ముద్దగా ముడవఁబడియుండి పిమ్మట పొడు పుగాఁబఱచఁబడిన వస్త్రములాగుననే కార్యమైన యీజగత్తు కారణమైనబ్రహ్మము కంటె (అనన్యత్=) భిన్నముగాదని (ఇత్యర్థః=) గ్రహింపవలెను.

20- సూత్రావతారిక :—

కార్యము కారణముకంటె వేఱైనదికానిచో, కార్యమందుఁ గన్పించు కార్యప్రయత్న ప్రయోజనములన్నియుఁ గారణమందేలయుండవని కలుగు మొద లగు సందేహములనుదీర్చి కార్యమే కారణమని నిశ్చయించుట కీసూత్రమేర్పడినది.

## ౨౦ సూ॥ యథాచ ప్రాణాదిః

ప॥ వి :- యథా–చ–ప్రాణాదిః

ప్ర. ప. అ :- ప్రాణాదిః=ప్రాణాపానవ్యానోదాన సమానములను పేర్లుగల వాయువు, యథాచ=ఎట్లో.

సూ తా॥ ప్రాణాపాన వ్యానోదాన సమానములనెడి భిన్నరూపములతోఁ బరగు ముఖ్యప్రాణవాయువుచేత ప్రాణములను నిల్పియుంచుటమాత్రముగాక శరీ

రావయవములు ముడుచుకొనుట, చాచుట మొదలగు విరుద్ధకార్యములు చేయఁబడుచున్నను, నావాయువొకటియేయని చెప్పవలసియుండును. అట్లె కార్యమైన యీజగత్తుసైతము కారణమైన బ్రహ్మముకంటె విరుద్ధకార్యములను బుట్టించుచున్నదైనను, బ్రహ్మముకంటె వేఱుగానిదేయైయున్నది.

భాష్యము - భాష్యార్థము.

యథాచలోకే ప్రాణాపానాదిషు ప్రాణభేదేషు ప్రాణాయామేన నిరుద్ధేషు కారణమాత్రరూపేణ వర్తమానేషు జీవనమాత్రం కార్యం నిర్వర్త్యతే నాకుంచన ప్రసారణాదికంకార్యాంతరం:

(లోకే=) లోకమందు (యథాచ=) ఏప్రకారముగా (ప్రాణభేదేషు=)ప్రాణ (=వాయు) ములోని యంతర్భాగములైనట్టియు (ప్రాణా... ద్ధేషు=) ప్రాణాయామముచేత అనఁగా ప్రాణములన్నిటిని ఒక్కటిగా బిగఁబట్టుటచేతనైన (కారణమాత్రరూపేణ=) కారణమాత్ర (=వాయుమాత్ర) స్వరూపములో నున్నట్టియు (ప్రాణాపానాదిషు=) ప్రాణాపానాదివాయు పంచకముచేత (జీవ... ర్త్యతే) దేహమును జీవముతోనుంచు పనిమాత్రము (నిర్వర్త్యతే=) నెరవేర్పఁబడుచు (కాలు చేతులు మొదలగు నవయవములచేనగు ముడుచుట చాచుట మొదలగు నితరకార్యములు (=ఆకుంచ...ర్యాంతరం)- (న నిర్వర్త్యతే=) నిర్వర్తింపఁబడుటలేదో,

తేష్వేవ ప్రాణభేదేషు పునః ప్రవృత్తేషు జీవనాదధికమాకుంచన ప్రసారణాదికమపి కార్యాంతరం నిర్వర్త్యతే

ప్రాణవాయువులోని యంతర్భేదములైన యీ ప్రాణాపానాది వాయువులే విడివిడిగా తమతమ వ్యాపారములను జేయుచున్నప్పుడు, జీవనమాత్ర కార్యమేగాక, హెచ్చుగా నవయవములు ముడుచుట చాచుట మొదలగు నితర కార్యములు సైతమెట్లు జరుపఁబడుచున్నవో,

నచ ప్రాణభేదానాం ప్రభేదవతః ప్రాణాదనన్యత్వం సమీరణ స్వభావ విశేషాత్

(ప్రాణభేదానాం=) ప్రాణాపానాది పంచవాయువులును (ప్రభేదవతః=) ప్రాణవాయువులోఁ జేరిన యంతర్భాగములేయై (సమీరణ... విశేషాత్=) వాయు స్వభావముకన్న మఱియొక విశేషమేమియు లేనివై (ప్రాణాదనన్యత్వం=) ప్రాణవాయువుకంటె భిన్నము లెట్లుగావో,

ఏవం కార్యస్య కారణాదనన్యత్వం

అట్లె కార్యమెప్పుడును కారణముకంటె భిన్నము గానేరదు.

అతశ్చ కృత్స్నస్య జగతో బ్రహ్మకార్యత్వాత్ తదనన్యత్వాచ్చ సిద్ధైషా శ్రౌతీ ప్రతిజ్ఞా 'యేనా విజ్ఞాతమితి'

ఈ హేతువులవలన (కృత్స్నస్యజగతః=) సమస్తమైన జగత్తు (బ్రహ్మ కార్యత్వాత్ =) ఉపాదాన (material) కారణమైన బ్రహ్మమునుండి యేర్పడిన దగుటవలనను, (తద...త్వాచ్చ) అది అనఁగా నీజగత్తు ఆ బ్రహ్మమునకంటె భిన్నమైనది గాకపోవుటవలనను,

సిద్ధైషా శ్రౌతీ ప్రతిజ్ఞా 'యేనా... విజ్ఞాత మితి' ఛా VI-1-3 'యేనాశ్రుతం శ్రుతం భవత్య మతం మత మవిజ్ఞాతం విజాతమితి'

ఏ యొక్క కారణము నెఱిఁగినచో, వినఁబడని ఎఱుఁగఁబడని తెలిసికొనఁ బడని కార్యమెంతయు వినఁబడినది, ఎఱుగఁబడినది, తెలిసికొనఁ బడినది యగు చున్నదో, అని(స్పష్టార్థముతో) వేదమందుఁ జేయఁబడిన (=శ్రౌతీ) యీ ప్రతిజ్ఞ (సిద్ధా=)స్థాపనీయమును (=నిర్ధారణమును) జెందుచున్నయది.

# 7. ఇతర వ్యపదేశాధికరణము

సూ 21-22-&23

అధికరణావతారిక :-

బ్రహ్మమే జగత్కారణమను వాదము పైనచ్చిన మఱియొకవిధపుటాక్షేప మును బరిహరించి యీ యుపనిషత్సిద్ధాంతమును నిల్పుటకై యీ యధికరణమేర్ప డినది. జీవుఁడనఁగా బ్రహ్మమేయనియు, నట్టిబ్రహ్మమే జగత్కారణమనియుఁ బూర్వాధికరణమందు నిశ్చయింపఁబడినది. జీవబ్రహ్మముల కైక్యమే వాస్తవ మగుచో, సృష్టిలోఁ గన్పించుకొన్ని (తనకు మేలును జేసికొనకపోవుట- కీడును జేసికొనుట మొదలగు) యసందర్భముల కాస్పదముండఁబోదు- అనునట్టి సందే హము లిందు నివారింపఁ బడుచున్నవి.

21 సూత్రావతారిక :- పై నధికరణావతారికలోఁ దెలుపఁబడిన యాక్షే పమే యీ సూత్రమందుఁ జెప్పఁబడినది. ఇది కేవల పూర్వపక్షసూత్రము...

## ౨౧. సూ॥ ఇతర వ్యపదేశాద్ధితాకరణాది దోషప్రసక్తిః

ప॥ వి :- ఇతర వ్యపదేశాత్-హితాకరణాది దోషప్రసక్తిః

ప్ర॥ ప॥ అ :- ఇతరవ్యపదేశాత్-ఇతర=మఱియొకటిగా- అనఁగా బ్రహ్మ మునే జీవుఁడనియు, జీవునినే బ్రహ్మమనియు, వ్యపదేశాత్ = చెప్పుటవలన- హితాక...ప్రసక్తిః - హిత=మేలును అకరణ=చేసికొనకపోవుట, ఆది=మొదలగు, దోష=దోషములయొక్క, ప్రసక్తిః = ప్రాప్తించుట యేర్పడును.

సూ. తా :- బ్రహ్మమే జగత్కారణమగుచో, ఛాం VI-8-7 'స ఆత్మా. తత్త్వమసి ఇత్యాదులగు నుపనిషద్వాక్యములచేత బ్రహ్మమే జీవుఁడగునని చెప్పఁ

బడుచుండుటనుబట్టి తానుగావించు సృష్టిలో తనకు మేలును జేసికొనకపోవుట, తనకు గీడును జేసికొనుటయనెడి దోషములు సంభవించుచున్నవి- (ఇట్టి దోషములుండుట వలన, బ్రహ్మమే జగత్కారణమను వాదము సరికాదు- అని పూర్వపక్షము.

భాష్యము భాష్యార్థము

అన్యథాపునశ్చేతన కారణవాద ఆక్షిప్యతే

మఱల మఱియొక విధముగా చేతనమైన బ్రహ్మమే జగత్కారణమగు ననువాద మాక్షేపింపఁ బడుచున్నది.

చేతనాద్ధి జగత్ప్రక్రియాయా మాశ్రీయమాణాయాం హితాకరణాదయోదోషాః ప్రసజ్యంతే

(జగత్ప్రక్రియాయాం=) ఈ జగత్సృష్టి (చేతనాత్ + హి) చేతనపదార్థము వలననే (జ్ఞానమయుఁడైన బ్రహ్మముచేతనే)- (ఆశ్రీయమాణాయాం=) చేయఁబడు చున్నదని యంగీకరించు పక్షములో, (హితా... దోషాః=) మేలును జేసికొనక పోవుట మొదలగు దోషములు (=లోపములు) (ప్రసజ్యంతే=) ప్రాప్తించుచున్నవి.

కుతః?

ఎట్లందు రేమో

ఇతర వ్యపదేశాత్

జీవుఁడే బ్రహ్మమనియు, బ్రహ్మమే జీవుఁడనియుఁ జెప్పుటవలన- అనఁగా.

ఇతరస్య శారీరస్య బ్రహ్మాత్మత్వం వ్యపదిశతి శ్రుతిః

(బ్రహ్మమునకన్న) ఇతరుఁడైన శారీరుఁడు (=జీవుఁడు) - (బ్రహ్మాత్మత్వం=) బ్రహ్మస్వరూపమే యగునని యాక్రింది శ్రుతి చెప్పుచున్నది.

'సఆత్మా....కేతో' ఇతి ప్రబోధనాత్ ఛాం VI-8-7 'సఆత్మా తత్త్వమసి శ్వేతకేతో!'

'(శ్వేతకేతో!=) ఓ శ్వేతకేతువా ! (సఃఆత్మా=) అదియే (జగత్కారణమైన బ్రహ్మమే) ఆత్మమైయున్నది- (తత్ + త్వం + అసి=) అదియే నీవుఅయి యున్నావు' అను నీ ప్రబోధము శ్రుతిలోఁగన్పించుచుండుటవలన-

యద్వా ఇతరస్య చ బ్రహ్మణ శ్శారీరాత్మ త్వం వ్యపదిశతి

(యద్వా=) మఱియును (ఇతరస్య చ బ్రహ్మణః=) (జీవునికన్న) ఇతరుఁడైన బ్రహ్మము (శారీరాత్మత్వం=) జీవస్వరూపమే యగుననియు (వ్యపదిశతి) శ్రుతి చెప్పుచున్నది చూడుఁడు-

'తత్సృ....విశత్' తై II-6-2 'తత్సృష్ట్వా తదేవాను ప్రావిశత్'

'(తత్ =) ఆ బ్రహ్మము (సృష్ట్వా=) జగత్తును సృష్టించి (తత్ + ఏవ=) ఆ బ్రహ్మమే (అనుప్రావిశత్ =) ఆ సృష్టిలోఁ బ్రవేశించెను'

ఇతి స్రష్టురేవా వికృతస్య బ్రహ్మణః కార్యానుప్రవేశేన శారీరాత్మత్వ ప్రదర్శనాత్ 'అనేన....కరవాణి'

అని శ్రుతి చెప్పుచున్నందున, (స్రష్టు...బ్రహ్మణః) వికారరహితుఁడై సృష్టిగావించిన యా బ్రహ్మమే (కార్యా... వేశేన=) తనచేఁ జేయఁబడిన యా జగత్తులోఁ బ్రవేశించుట మూలమున (శారీ...ర్శనాత్ =) జీవభావమును జెందినట్లు కనుపించుచున్నది- మఱియును

ఇతిచ పరాదేవతా జీవమాత్మ శబ్దేన వ్యపదిశంతీ నబ్రహ్మణో భిన్నశ్శారీర ఇతి దర్శయతి ఛాం VI-3-2 'అనేన జీవేనాత్మనానుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి

'(అనేనజీవేన + ఆత్మనా=) ఈ జీవస్వరూపముచే (అనుప్రవిశ్య=) సృష్టిలోఁ బ్రవేశించి (నామరూపే=) సృష్టించిన వివిధజగత్తును నామరూపములతో (వ్యాకరవాణి =) వ్యాపింపఁజేయుదును' ఈ శ్రుతిసైతము (పరాదేవతా ) కేవల సత్వ పదార్థమైన యా బ్రహ్మము (జీవం=) జీవుఁడనఁగా (ఆత్మశబ్దేన=) 'తానే' యను మాటచేత (వ్యపదిశంతీ=) నిర్దేశము చేయుచు (=చూపించుచు), (శారీరః =) జీవుఁడు (బ్రహ్మణః నభిన్నః =) బ్రహ్మముకంటె భిన్నుఁడుగాడు' అని (దర్శయతి=) స్పష్టపఱచుచున్నయది.

తస్మాద్య ద్బ్రహ్మణః స్రష్టృత్వం తచ్ఛారీరస్యైవే

కాబట్టి బ్రహ్మము సృష్టించువాఁడని చెప్పినప్పుడు, జీవుఁడు సృష్టించువాడని చెప్పినట్లే యగునుగదా !

త్యతః స్వతంత్రః కర్తాసన్ హితమేవాత్మనః సౌమనస్య కరం కుర్యాత్

(ఇత్యతః =) ఇట్టి సందర్భములో, స్వతంత్రుఁడును సృష్టికర్తయునగుచున్న జీవుఁడు (ఆత్మనః సౌమనస్యకరం=) తనకేదిలాభమో అనఁగా తనకెట్టిది సుఖము కలుగజేయునో (తమేవ=) అట్టిదానినే (కుర్యాత్ =) చేసికొనునుగాని

నాహితం జన్మమరణ జరారోగానేకార్థజాలం

(జన్మ...జాలం=) పుట్టుచావులు, వృద్ధత్వము రోగములు మొదలగు ననేక విధములైన యరిష్ట పరంపరలతోఁగూడిన (అహితం=) కీడును (న =) జేసికొననోపఁడు.

నహి కశ్చిదపరతంత్రో బంధనాగారమాత్మనః కృత్వాను ప్రవిశతి

(కశ్చిత్ + అపరతంత్రః=) స్వతంత్రుఁడైన వాడెవఁడైనను (ఆత్మనః =)

తిరకు (బంధనాగారమ్=) కారాగృహమును (కృత్వా=) నిర్మించుకొని (నహి+అనుప్రవిశతి=) యందులోఁ బ్రవేశింపఁ నోపఁడుగదా !

నచ స్వయ మత్యంత నిర్మలస్సన్నత్యంత మలినం దేహమాత్మత్వేనోపేయా

ఎవఁడైనను దనకుఁదా నత్యంతము నిర్మలుఁడై యుండి, అత్యంతము మలినమైయుండు దేహమును (ఆత్మత్వేన=) (=జగత్తును) దన స్వరూపముగా (న+ఉపేయాత్=) భావింపఁబోఁడు !

కృతమపి కథంచిద్యద్దుఃఖకరం తదిచ్ఛయా జహ్యాత్

దుఃఖములను గల్గించునట్టి మలినదేహాదులను సృష్టించెనుబో ! (స్వతంత్రుఁడుగావున) అట్టివానిని (ఇచ్ఛయా=) బుద్ధిపూర్వకముగా (జహ్యాత్=) (అట్టి దుఃఖ కారణములను) వదిలిపెట్టియే యుండును.

సుఖకరంచో పాదదీత స్మరేచ్చ 'మయేదం జగద్బింబం విచిత్రం విరచిత' మితి

(సుఖకరంచ=) సుఖములను గలుగఁజేయుదానినే (ఉపాదీత=) స్వీకరించి యుండును. మఱియును 'నాచేతనిట్టి విచిత్రమైన (జగద్బింబం=) జగదాకారము సృష్టింపఁబడినది' యని (స్మరేత్=) స్మరింపవలసియుండును (జ్ఞప్తియందుంచుకొనియుండును) ఏలయన-

సర్వోహి లోకః స్పష్టం కార్యం కృత్వా స్మరతి మయేదం కృతమితి

ఈ లోకమందెవఁడైనను నొక ఘనకార్యమును నిర్మించియుండి (మయా... కృతం=) యీ యద్భుతకార్యమునాచేఁ గావింపఁబడినదని (స్మరతి=) స్మరించుచుండుటను జూచుచున్నాము (గాని యెఱుఁగకుండుటను గనఁబోము.)

యథాచ మాయావీ స్వయం ప్రసారితాం మాయా మిచ్ఛయాఽనాయాసే నైవోప సంహరతి ఏవం శారీరోఽపీమాం సృష్టి ముపసంహరేత్

ఇంద్రజాలకుఁడుతనచేఁ (ప్రసారితాం=) విస్తరింపఁజేయఁబడిన (మాయాం=) మాయా కార్యములను (గారడిపనులను) (ఇచ్ఛయా=) తానుగోరినప్పుడు (అనాయాసేన=) ఎట్టి ప్రయాసము పడకుండనే (యథా ఉపసంహరతి=) ఎట్లు లేకుండఁ జేయఁగలఁడో (=మాపుచేయఁగలఁడో) అట్లె జీవుఁడుసైతము తనచేఁ జేయఁబడిన యీ సృష్టిని (ఉపసంహరేత్=) మాన్ప (=మాపుచేయ) శక్తివంతుఁడై యుండవలెను.

స్వకీయ మపి తావచ్ఛరీరం శారీరో 'నశక్నోత్య నాయాసేనోప సంహర్తుం

కాని యీ జీవుఁడు తనయొక్క శరీరమునుసైత మనాయాసమున నుపసంహరించుకొనుటకు (=వదిలించుకొనుటకు) సమర్థుఁడుగాడుగదా !

ఏవం హిత క్రియాద్య దర్శనా, దన్యాయ్యా చేతనాత్ జగత్ప్రక్రియేతి మన్యతే

ఈ విధమున (హిత ... దర్శనాత్ =) తనమేలును దాను జేసికొనఁ గల్గుట మొదలైనవి (సృష్టికర్తయైన) జీవునియందుఁ గన్పింపనప్పుడు, (చేతనాజ్జగత్ప్రక్రియా=) చేతన పదార్థమునుండి (= తెలివిగల వస్తువునుండి) ఈ జగత్తు పుట్టిన దనుట (అన్యాయ్యా + ఇతి) న్యాయముగాదని (మన్యతే=) తలంపఁ బడుచున్నది.

22 సూత్రావతారిక :-

పై సూత్రములోఁ జేయఁబడిన పూర్వపక్షమీ సూత్రముచేతను దగువాతి 23 సూత్రముచేతను బరిహరింపఁబడుచున్నది.

## ౨౨ సూ॥ అధికంతుభేదనిర్దేశాత్

ప॥ వి :- అధికం-తు- భేదనిర్దేశాత్

ప్ర॥ ప॥ అ :- అధికం = అధికుఁడు (జీవునికంటె నీశ్వరుఁడు) తం = పూర్వపక్షము సరిగాదు. భేదనిర్దేశాత్; భేద=జీవేశ్వరులకుఁ గలభేదమును, నిర్దేశాత్ =(శ్రుతి) నిర్దేశించియుండుటవలన-

సూ తా :- సర్వజ్ఞ సర్వశక్తిత్వాదులతోఁ గూడియున్నట్టియు, అపహత పాప్మత్వాది గుణములు గలిగియున్నట్టియు బ్రహ్మము జీవునికంటె నధికుఁడే- బృ IV-4-5 'ఆత్మావాఽరేద్రష్టవ్యశ్శ్రోతవ్యోమన్తవ్యః'

ఈ మొదలగు శ్రుతులచేత వ్యవహారదశలో జీవేశ్వరులకుఁగలభేదము నిర్దేశింపఁబడియేయున్నది జగత్సృష్టిగావించిన దాయధికుఁడైనబ్రహ్మమే-ఆబ్రహ్మము వాస్తవమునకు జీవునికంటె భిన్నముగాదు. జీవుఁడు బ్రహ్మము భిన్నులుగారనుటలో దోషమేమియును లేదు- (తు=) జీవబ్రహ్మములకు భేదములేదని చెప్పెడు విషయమన్ననో, జీవునియొక్క నిరుపాధికస్వరూపమునుగూర్చి చెప్పుసందర్భములో మాత్రమైయున్నందున దోషమేమియునురాదు.

భాష్యము  భాష్యార్థము

తుశబ్దః పక్షం వ్యావర్తయతి

సూత్రములోని 'తు' అనుశబ్దము పూర్వసూత్రమునఁ జేయఁబడిన (పక్షం=) పూర్వపక్షమును (వ్యావర్తయతి=) ద్రోసివేయుచున్నది.

యత్సర్వజ్ఞం సర్వశక్తిబ్రహ్మ నిత్యశుద్ధబుద్ధముక్త స్వభావం శారీరాదధిక మన్య త్తద్వయం జగత స్స్రష్టబ్రూమః

సర్వజ్ఞము, సర్వశక్తియు, నిత్యశుద్ధ బుద్ధాముక్త స్వభావమునైన బ్రహ్మమేదియోయది (శారీ...మన్యత్=) జీవునికంటె నధికమైన మరియొకటి: (తద్వయం=( దానినే మేము జగత్సృష్టి కర్తయని (బ్రూమః=) చెప్పినారము.

నతస్మిన్ హితా కరణాదయో దోషాః ప్రసజ్యంతే

(తస్మిన్=) ఆబ్రహ్మమునందు (హితా—షాం) తనకు మేలును జేసికొనకపోవుటయను మొదలగు దోషములు (న ప్రసజ్యంతే=) సంభవింపఁజాలవు.

న హితస్య హితం కించిత్కర్తవ్యమస్తి అహితంవా పరిహర్తవ్యం నిత్యముక్తత్వాత్

(తస్య=) ఆబ్రహ్మము (నిత్యముక్తత్వాత్=) నిత్యముక్త స్వరూపమైనదియే యగుటవలన దానికి (హితం కర్తవ్యం=) చేసికొనఁబడవలసిన మేలుగాని (అహితంవా పరిహార్తవ్యం=) తొలగించుకొనఁబడవలసిన కీడుగాని (కించిత్=) యెంత మాత్రమును (నహి+అస్తి=) లేదు-

నచతస్యజ్ఞాన ప్రతిబంధశ్శక్తి ప్రతిబంధోవా క్వచిదప్యస్త సర్వజ్ఞత్వాత్సర్వశక్తిత్వాచ్చ

(తస్య=) ఆబ్రహ్మమునకు (జ్ఞాన ... వా=) జ్ఞానప్రతిబంధము (అడ్డగించునది) గాని శక్తిప్రతిబంధముగాని (క్వచిదపి=) యెక్కడనులేదు- ఎందుచేత నఁగా ఆబ్రహ్మము (సర్వజ్ఞ...త్వాచ్చ=) సర్వజ్ఞము- సర్వశక్తియే యైయున్నది (దాని స్వరూపమే సర్వజ్ఞము- సర్వశక్తి)

శారీరస్త్వనేవం విధః:

(శారీరః+తు=) జీవుఁడన్ననో, (అనేవంవిధః=) ఇట్టివాడుగాడు

తస్మిన్ ప్రసజ్యంతే హితా కరణాదయోదోషా నతుతంవయం జగత్స్రష్టారంబ్రూమః

(తస్మిన్=) ఈజీవునియందుఁ దనకు మేలును జేసికొనకపోవుట మొదలగు దోషములు (ప్రసజ్యంతే=) ప్రసక్తింపవచ్చును- (తం=) ఈజీవునినే (జగత్స్రష్టారం) జగత్సృష్టికర్తయని (వయంనతు బ్రూమః=) మేమెప్పుడును జెప్పియుండలేదు.

కుత ఏతత్? భేదనిర్దేశాత్

ఇట్లుచెప్పుట యెట్లందురేమో! (శ్రుతులలో) చేయఁబడిన భేదనిర్దేశము వల్లనే యట్లు చెప్పుచున్నారము (జీవబ్రహ్మములకుఁ గొలభేదమును శ్రుతులేచెప్పు చున్నవని భావము)

'ఆత్మా....తవ్యః' 'సోఽన్వే....తవ్యః' 'సతా .. భవతి' 'శారీర....రూఢః' బృ IV-4-5
'ఆత్మావా అరేద్రష్టవ్యశ్శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః'

(అరే=) ఓమైత్రేయీ! (ఆత్మావా=) ఆత్మయే బ్రహ్మమే (ద్రష్టవ్యః=)

చూడఁబడవలసినవాడు, (శ్రోతవ్యః=)వినఁబడవలసినవాడు (నిదిధ్యాసితవ్యః=) నిశ్చలత్వమున ధ్యానింపఁబడవలసినవాడునై యున్నది-

ఛాం. VIII॥7-1 'సోఽన్వేష్టవ్యః సవిజ్ఞాసితవ్యః'

(సః=) అతఁడే (=బ్రహ్మమే) (అన్వేష్టవ్యః=) వెదకఁబడవలసినవాడును (సః=) వాడే (విజిజ్ఞాసితవ్యః=)విశేషముగాఁ దెలిసికొనవలెనని కోరఁబడఁదగినవాడు.

ఛాం. VI-8-1 'సతాసోమ్యతదాసంపన్నో భవతి'

(సోమ్య!=) ఓ శ్వేతకేతువా! (తదా=) అప్పుడు గాఢనిద్రయందుజీవుఁడు (సతా=) సత్పదార్థమైన బ్రహ్మముతో (సంపన్నః+భవతి=) నేకభావమును జెందినవాడగుచున్నాడు.

బృ. VI-3-35 'శారీర ఆత్మా ప్రాజ్ఞేనాత్మనా న్వారూఢః'

(శారీరః-ఆత్మా=) ఉపాధిగలజీవుఁడు (ప్రాజ్ఞేఆత్మనా=) స్వయంప్రకాశుఁడగు బ్రహ్మముచేత-పరమాత్మచేత (అన్వారూఢః=) అధిష్ఠింపఁబడినవాడు.

ఇత్యేవం జాతీయకః కర్తృకర్మాదిభేద నిర్దేశో జీవాధికం బ్రహ్మదర్శయతి

ఈపై శ్రుతులలో కర్త-కర్మ మొదలగు మొదలగు పదములలోఁ జేయఁబడిన భేదనిర్దేశము వంటివి. జీవునికంటె నధికుఁడుగా బ్రహ్మమును జూపుచున్నయవి- (పైశ్రుతులలో ద్రష్టవ్యత్వాది క్రియలకు జీవుని కర్తగాను, బ్రహ్మమును గర్మగాను భేదనిర్దేశము చేయఁబడియున్నదని భావము)

పూర్వపక్షి

నన్వభేదనిర్దేశోఽపిదర్శితః 'తత్వమసి' ఇత్యేవం జాతీయకః ఛాం. VI- 'తత్త్వమసి-

'ఆబ్రహ్మమే నీవగుచున్నావు'

అను మొదలగు శ్రుతులవంటివి జీవబ్రహ్మములకు అభేదనిర్దేశమును జూపుచున్నవిగదా!

కథం భేదాభేదౌ విరుద్ధౌ సంభవేయాతాం?

(విరుద్ధౌభేదాభేదౌ) జీవబ్రహ్మములకుఁ జెప్పెడి భేదము- ఆజీవబ్రహ్మములకే చెప్పెడి నభేదము- విరుద్ధములుగా నీరెండువిషయములు (కథం సంభవేయాతాం=) ఒక్కసారిగా నెట్లు సంభవింపఁగలవు? (ఇది దోషముగాదా!)

సమాధానము

నైషదోషః; మహాకాశ ఘటాకాశ న్యాయేనోభయ సంభవస్య తత్రతత్ర ప్రతిష్ఠాపితత్వాత్

ఇదియొక దోషముగాదు; ఆకాశమంతయు నొకటియేయైనను, మహాకాశమనియు, (=ఉపాధి - లేనిది) ఘటాకాశమనియు (కుండయను నుపాధిగలది) వేరువేరుగాఁ బిల్చినట్లే, భేదాభేదములు రెండును (వ్యవహారములో) సంభవములే యగుచుండునని యక్కడక్కడఁ జూపుచునే వచ్చినాముగదా (ప్రతిష్ఠాపితత్వాత్ =వ్యవస్థ చేయఁబడుచున్నందున)

అపిచయదా తత్త్వమసీత్యేవం జాతీయకేనా భేదనిర్దేశేనాభేదః ప్రతిబోధితో భవతి అపగతం భవతి తదాజీవస్య సంసారిత్వం బ్రహ్మణశ్చ స్రష్టృత్వం

జీవబ్రహ్మముల కభేదమును బోధించు ఛాం. VI.8 'తత్త్వమసి=ఆబ్రహ్మమే నీవగుదువు' అను నీ శ్రుతివంటి ప్రమాణవాక్యము లెప్పుడు మనలో జీవబ్రహ్మైక్యమును (=అభేదః =బ్రహ్మసాక్షాత్కారము) మేల్కొల్పునో (ప్రతిబోధితః) అప్పుడు జీవుఁడు (హితాకరణాది దోషములకును, జననమరణాదులకును లోఁబడిన) సంసారియు, బ్రహ్మము సృష్టికర్తయు నగుననుకొనుట (అపగతం భవతి=) పేరులేకుండఁబోవును)

సమస్తస్య మిథ్యాజ్ఞాన విజృంభితస్య భేదవ్యవహారస్య సమ్యగ్జ్ఞానేన బాధితత్వాత్ తత్రకుతఏవసృష్టిః కుతోవా హితాకరణాదయోదోషాః?

మిథ్యాజ్ఞానము చేతఁ (విజృంభితస్య=) వెచ్చరిల్ల కొట్టఁబడిన సమస్త భేద వ్యవహారము (అనఁగా నేను వేరు- బ్రహ్మము వేరు అనుకొనుట నేను జన్మమరణాదులకు లోబడిన జీవుఁడను బ్రహ్మమీజగత్తును బుట్టించు పరమాత్మయనుకొనుట మొదలైనవి) బ్రహ్మ సాక్షాత్కారమను సమ్యగ్జ్ఞానముచేత (=బ్రహ్మాత్మైక్యావగతిచేత) (బాధితత్వాత్ =) భంగము చేయఁబడినప్పుడు (=పారఁదోలఁబడినప్పుడు) (బ్రహ్మమునకు సంబంధించినదనుకొను) సృష్టి (యెందుండి నీకు గోచరించును! (జీవునకు సంబంధించిన వనుకొను) హితాకరణాది దోషము లెందుండి నీకు గోచరించును!

అవిద్యా ప్రత్యుపస్థాపిత నామరూప కృతకార్యకరణ సంఘాతో పాధ్యవివేకకృతాహి భ్రాంతిః హితాకరణాది లక్షణస్సంసారో నతుపరమార్థతోఽస్తీత్య సకృదవోచామ;

(పైనఁ దెలిపిన సమ్యగ్జ్ఞానమునకు వ్యతిరేకమైన మిథ్యాజ్ఞానమనెడి) అవిద్యాస్థితి-అనఁగా అజ్ఞానస్థితిచేత (అదివరకు మాయమై పోయినవానిఁబోలె నడఁగియున్న) నామరూపములు (ప్రత్యుపస్థాపితాన్ =) లేవదీయఁబడును- అనఁగా విజృంభింపఁజేయబడును. ఈనామరూపములతో (కార్యకరణసంఘాతః=) దేహేంద్రియములు భార్యాపుత్ర మిత్రాదులు గృహక్షేత్రాదులు కల్పింపఁబడును (=కృతాః) ఈ దేహేంద్రియాది సంఘాతమే (ఆత్మపై -అనగా తనపై)యుపాధిగా

(=ఆచ్ఛాదనముగా- అనఁగా ఆకాశముపై ఘటమువలె) నేర్పడును, ఈయుపాధి =ఆచ్ఛాదనము-దేహము అవివేకమును (=విచక్షణము చేయ లేక పోవుటను) గల్గించును- (అనఁగా నీయుపాధి వేరు- ఈయుపాధిచేఁ గప్పివేయఁబడి యున్న ఆత్మ (=నేను-అనునది) వేరు- అని వివేకము చేయలేనిస్థితిసంభవించును)- ఈయవివేకముచేతనే భ్రాంతి గల్గును (అనఁగా-ఉపాధినిజూచి తానేయనుకొనుట, ఉపాధికిఁగల్గు జన్మమరణ రోగాద్యవస్థలు తనకే సంభవించినవనుకొనుట. ఈ మొదలగునవి- ఇవి వాస్తవమైన త్రాటిని గుర్తింపలేక వాస్తవముగాని పామే యనుకొనుట భయాదివికారములను బెందుట యెట్టివో యట్టివే)- ఈభ్రాంతియే సంసారము (జగత్తు-). (హితాకరణాదిలక్షణః=) ఈసంసారములోనే మేలుపనులు చేయకపోవుట కీడుపనులను జేయుట మొదలగు దోషములు తటస్థించుచున్నట్లుం డును ఈభ్రాంతియననొప్పుసంసారము (పరమార్థతః=) వాస్తవమునకు (నతు+అస్తి+ఇతి) లేనిదియేయని (అసకృత్=) పలుసార్లు (అవోచామ=) ప్రసంగించి యుంటిమి (ఆత్మపై మిథ్యాజ్ఞానముచేత నధ్యారోపము చేయఁబడియున్న జగత్తు భ్రాంతియున్నంతవరకే యుండును. భ్రాంతి సమ్యగ్జ్ఞానముచే నశింపగానే జగత్తు సైతము లేనిదేయగును)

జన్మమరణచ్ఛేదన భేదనాద్యభిమానవదేవ.

ఉపాధికిఁ గల్గుచుండు జన్మము (=పుట్టుక)- మరణము(=చావు)- ఉచ్ఛేదనభేదనాదులు (=దెబ్బలు గాయములు మొదలగునవి)- వీనియెడఁ బొందుచుండు నభిమానము (మిథ్యాభిమానము) వంటిదే (అభిమానవత్ + ఏవ) సైనఁదెలిపిన భ్రాంతియనిచెప్ప నొప్పును (అనఁగా- ఉపాధికి నాయూయవస్థలు గల్గుచున్నప్పుడు, నేను పుట్టితిని- నేను జచ్చితిని- నేను దెబ్బను దింటిని- నేను రోగపడితిని- నేను ఘనకార్యములను జేసితితిని- అని యాయాయవస్థలు తనకే- అనఁగా ఆత్మకేగల్గు చున్నట్లు పొందు నభిమానమువంటిదే భ్రాంతి- వాస్తవమున కొకటిగానే యుండు నాత్మను వివేకము చేయలేకపోవుటయే యీభ్రాంతికిఁ గారణము)

అబాధితేతు భేదవ్యవహారే 'సోఽన్వేష్ట-.....తవ్యః'

అవిద్య (=మిథ్యాజ్ఞానము) వలనఁగల్గిన భేదవ్యవహారము (=భ్రాంతిరూపమైన జగత్తు) (సమ్యగ్జ్ఞానముచేత) బాధింపఁబడకుండ నున్నంతవరకు- అనఁగా నిల్చియున్నంతవరకు

ఇత్యేవం జాతీయకేన భేదనిర్దేశేనా వగమ్యమానం బ్రహ్మణోఽధికత్వం; హితాకరణాది దోష ప్రసక్తిం నిరుణద్ధి ఛాం.VIII-7-1 'సోఽన్వేష్టవ్యస్స విజిజ్ఞాసితవ్యః'

అది (=ఆత్మబ్రహ్మము) వెదకఁబడవలసినది) (అది మిక్కిలి తెలిసికొనఁ బడవలసినది) అను నిట్టి శ్రుతులలో నుండు భేదనిర్దేశము (బ్రహ్మము వేరు- జీవుఁడు

చేసు అని చేయఁబడిన ప్రకటనము) చేత (బ్రహ్మణోఽధికత్వం=) జీవునియందు కన్న బ్రహ్మమునందాధిక్యము (అవగమ్యమానం=) న్నట్లు తెలియఁబడుచునే యుండును:-

(హితా......ప్రసక్తిం=) అట్టియధికుఁడైన బ్రహ్మమునందు మేలును జేసికొనకపోవుట కీడును జేసికొనుట మొదలగు దోషములున్నవనెడి ప్రసంగమున కవకాశమే లేదు (=నిరుణద్ధి)-

23 సూత్రావతారిక :-

21 సూత్రములోఁ జేయఁబడిన పూర్వపక్షమును ఈసూత్రముగూడ ఖండించుచున్నది-

## 23 సూ॥ అశ్మాదివచ్చ తదనుపపత్తిః

ప॥ వి :- అశ్మాదివత్-చ-తదనుపపత్తిః

ప్ర॥ ప॥ అ :- అశ్మాదివత్=రాయి (వృక్షము) మొదలగువానివలె; చ= మఱియును; తదనుపపత్తిః; తత్=దానిని-అనఁగా పూర్వపక్షమునకు అనుపపత్తిః= అవకాశములేదు,

సూ॥ భా :- వజ్రములు-వైఢూర్యములు-లోష్ఠములు మొదలగు రాతిలోని భేదములును. చందనములు కింపాకములు మొదలగు వృక్షములలోని భేదములను, ఒక్క పృథివీసంబంధములేయైనను ఎక్కువకాంతియు విలువయుగలరాళ్ళనికొన్ని-తక్కువజాతిగల రాళ్ళనికొన్ని-ఎక్కువ వాసనగల చెట్లనికొన్ని-నిర్గంధములగు చెట్లని కొన్ని ఇట్టిభేదములతో నెట్లుండునో అట్లే బ్రహ్మమొక్కటియే యైనను, జీవుఁడనియు నీశ్వరుఁడనియు భేదముతో నుండవచ్చును, రాళ్ళలోను చెట్లలోను శక్తిభేదములున్నట్లే జగత్సృష్టిని జేయగలుట యీశ్వరునియందును. చేయలేక పోవుట జీవునియందును గనుపించవచ్చును. వాని వాని పూర్వకర్మ సంస్కారముల చేతనట్టి భేదములు గలుగవచ్చును. ఇట్టిసందర్భములో అఖండము-ఏకరస మునైన బ్రహ్మమునందు జీవేశ్వర భేదమెట్లు కలిగినదనియు వానివాని క్రియాశక్తి భేదము లెట్లు గల్గిన వనియుఁగల్పింపఁబడు దోషములకు నవకాశము (ఉపపత్తి) లేదు.

భాష్యము భాష్యార్థము :-

యథాచలోకే పృథివీత్వ సామాన్యాన్వితా నామప్యశ్మనాం కేచిన్మహార్హామణ యోవజ్రవైడూర్యాదయో ఽన్యేమధ్యమ వీర్యాః సూర్యకాంతా దయోఽన్యే ప్రహీణాశ్శ్వ వాయసప్రక్షేపణార్హాః పాషాణాః ఇత్యనేకవిధం వైచిత్ర్యం దృశ్యతే

అశ్మనాం :- రాయియను జాతిలో జేరిన వన్నియు సామాన్యముగా పృథివికి సంబంధించినవే యైయున్నను అనగా నొక్క భూమిలోనుండి ఆ రాళ్ళలో (కేచిత్ =)గొన్ని వజ్రవైడూర్యములు మొదలగు పేర్లతో మిక్కిలి శ్రేష్ఠములైన మణులుగాను, (అన్యే=మఱికొన్ని సూర్యకాంతములు మొదలగు పేర్లతో (మధ్యమవీర్యాః=బలాః) కాంతి, యెత్తుసరి మొదలగు వానిలో మధ్యరకములో జేరినవిగాను, (అన్యే=) వేరుకొన్ని శ్వవాయస ప్రక్షేపణార్హాః=కుక్కలు కాకుల మీద విసిరి వేయఁబడఁదగినట్టుగా (ప్రహీణాః=) మిక్కిలి తేలికవి తక్కువవిగాను ఇట్లనేక విధములైన విచిత్రస్వరూపములతో నెట్లు గన్పించుచున్నవో.

యథాచైకపృథివీవ్యపాశ్ర యాణామపి బీజానాం బహువిధం పత్రపుష్పఫల గంధరసాది వైచిత్ర్యం చందన కింపాక చంపకాదిషూపలభ్యతే

మఱియు 'బీజ' మనుజాతిలోఁ జేరినవన్నియునొక్క పృథివికి సంబంధించినవేయై యొకచోటనే పాతిపెట్టబడిన వయ్యును, వాని వానిలోనుండి కొన్నిబహువిధ పత్రములు. గొన్ని బహువిధ పుష్పములు, మఱికొన్ని బహువిధగంధ రసాదులు అను వివిధ ధర్మములుగల చందన (=మంచిగంధపు చెట్లు)· కింపాక (=తాటి చంపక (=సంపెగచెట్లు)ములు మొదలగు వివిధజాతి వృక్షములెట్లు పుట్టుచున్నవో,

యథాచైకస్యా ప్యన్నరసస్య లోహితాదీని కేశలోదీమానిచ విచిత్రాణి కార్యాణిభవంతి

(పృథివీసంబంధమైన) ఒక్కయన్నరసమునుండియే విచిత్రాణి=వివిధములైన (లోహితాదీని=)రక్తము నరములు మొదలగునవి (కేశలోమాదీని=)రోమములు వెంట్రుకలు మొదలగునవి యెట్లు పుట్టుచున్నవో

ఏవమేకస్యాపి బ్రహ్మణో జీవప్రాజ్ఞ పృథక్త్వం కార్యవైచిత్ర్యంచోపపద్యత ఇతి

అట్లె ఒక్కబ్రహ్మమునందే జీవుఁడనియుఁ బ్రాజ్ఞుఁడనియు=ఈశ్వరుడనియు అను భేదములు గనుపట్ట వచ్చును అట్లె ఒక్క బ్రహ్మము నుండియే వివిధకార్యములు=వికారములు పుట్టుచున్నట్లును గనుపించ వచ్చును.

అతస్తదను పపత్తిః పరపరికల్పితదోషాను పపత్తి రిత్యర్థః

ఈ కారణముచేతఁ బూర్వపక్షి సూత్రమందుఁ జూప బడిన దోషమున కవకాశములేదు అనగా (పర...త్యర్థః=)పరులైన పూర్వపక్షులచేత నీయద్వైత మతమునందుఁ గల్పించఁబడినదోషముల కవకాశములేదని యర్థము. అనగా ఒక్కటియేయైయుండు బ్రహ్మమే యీ వివిధజగత్తునకుఁ గారణమను విషయము నిరాక్షేపణీయమని భావము

శ్రుతేశ్చ ప్రామాణ్యాద్వి కారస్యచ వాచారంభణ మాత్రత్వాత్

(ఒక కారణమునుండియే కల్గిన) వివిధములగు వికారములన్నియును వాచారంభణ మాత్రములే; అనఁగా నోటితోఁ బలుకబడునవి మాత్రమేగాని వాస్తవమునకు లేనివే యను శ్రుతిప్రమాణముచేతను (ఛా. VI.)

స్వప్నదృశ్య భావవైచిత్ర్య వచ్చేత్యభ్యుచ్చయః

(నిద్రించునొక్క పురుషునియందేతోఁచు) స్వప్నదృశ్యములైన వివిధభావములవలెను గూడ (నొక్కచేతన బ్రహ్మమునుండి యే వివిధనామరూప జగత్తు పుట్టినదను వాదము సమంజసమైయున్నది)

ఇత్యభ్యుచ్చయః=సూత్రములోని చ=(మఱియును) అనుశబ్దస్వారస్యముచే పైనజూపిన శ్రుతిప్రమాణ హేతువు స్వప్నదృష్టాంత హేతువు సూత్రవిషయమున కధికతర=అభ్యుచ్చయ హేతువులని యెఱుంగునది.

## ఉపసంహార దర్శనాధి కరణము

8. అధికరణావ తారిక.

చేతన బ్రహ్మము జగత్కారణము కాఁజాలదని చేయఁబడు మఱియొక పూర్వపక్షమునకు సమాధాన మీయఁబడు చున్నది. వాస్తవమునకు జీవబ్రహ్మములొకటియే యైనను వ్యవహారములో జీవునకుపాధి (శరీర) సంబధమున్నందున ఉపాధినిబట్టివచ్చి జీవునియందుఁ గన్పించు హితాకరణాది దోషములు బ్రహ్మమునందుండఁ బోవనియు, భ్రాంతిగతమైన ఉపాధిసంబంధము సమ్యగ్జ్ఞానముచే దొలఁగింపఁ బడినచో జీవబ్రహ్మైక్యము స్పష్టమగుననియు, జీవునియందున్నయీ, యుపాధికల్పోపము (దోషము) నాధారము చేసికొని బ్రహ్మము జగత్కారణముగా నేరదని చేయఁబడిన యాక్షేపము చెల్లదనియు బూర్వాధికరణమునందుఁబరిష్కరింపఁబడెను అట్టిదియేమఱికొన్ని దోషములాధారముచేసికొని బహ్మజగత్కారణ వాదమునుగూర్చి చేయబడు పూర్వపక్షమీయధికరణమందు నివారింపఁబడుచున్నది.

## ౨౪ సూ॥ ఉపసంహార దర్శనాన్నేతిచేన్న క్షీరవద్ధి

ప॥ వి॥ :- ఉపసంహారదర్శనాత్-న-ఇతి-చేత్-న-క్షీరవత్-హి

ప్ర. ప. అ. :-ఉపసంహార దర్శనాత్: ఉపసంహార=లోకమందుఁ గార్యము కొఱకు) సాధన సంపాదనము, దర్శనాత్=చూడఁబడు చుండుటవలన, న=(ఏకమే యగు బ్రహ్మమునకు సాధన మేమియు లేనందున జగత్తును సృష్టించుటయను పని) కానేరదు. ఇతి=అని, చేత్=(ఆక్షేపముచేయు) నెడల న=అట్టి యాక్షేపము చెల్లదు. హి=ఎట్లనఁగా క్షీరవత్=పాలవలె (పాలుపెరుగైనట్లే బ్రహ్మము) జగత్తగుచున్నదిగాని సాధనాంతరముచే బ్రహ్మ మీ జగత్తును జేయుటలేదు.

సూ॥ భా॥ :-లోకమందుఁ (గుండలు మొదలగు వానిని జేయు (జీవులగు) కుమ్మరివాండ్రు) మృత్తు మొదలగు బాహ్యసాధనములతో నట్టివనులను జేయఁగల్గు చుండుట కన్పట్టు చున్నది. ఏ సాధనములేని యొక్కఁడేయగు బ్రహ్మమీ జగత్కార్యమును జేయజాలఁడని చెప్పఁదగదు. పాలయందుండు స్వభావసిద్ధమైన శక్తిచేతఁ బెరుగుగా మారినట్లే బ్రహ్మమందుండు విచిత్రశక్తి యోగమువలన నట్టిబాహ్యసాధనాపేక్ష లేకయే బ్రహ్మమీ జగత్తుగాఁ బరిణమించు చున్నదని చెప్పఁదగియున్నది.

భాష్యము భాష్యార్థము

చేతనం బ్రహ్మైక మద్వితీయం జగతః కారణ మితి యదుక్తం తన్నోపపద్యతే
కస్మాత్?

రెండవది లేకుండ నొకటిగానుండు చేతనమైన బ్రహ్మము జగత్తును జేసినదని చెప్పెడి విషయమేది గలదో యది (న + ఉపపద్యతే=) సరిగాదు (=సబబైనదిగాదు.)

ఉపసంహార దర్శనాత్

అట్లు చెప్పుట యెందుచే నందు రేమో [ఏ పనికైనను] సాధన సంపాదనము గన్పించుచుండుట వలన [వివరించి చెప్పెదము చూడుఁడు).

ఇహహి లోకే కులాలాదయో ఘటపటాదీనాం కర్తారో మృద్దండ చక్రసూత్రా
ద్యనేక కారకోప సంహారేణ సంగృహీత సాధనాస్సంతః

ఈ లోకమందుఁ గుండలు మొదలగు వానిని జేయు కుమ్మరివాండ్రు మృత్తు దండము చక్రము మొదలగు (కారక=) సాధనములను వస్త్రములను నేయు సాలెవాండ్రు నూలు నీళ్లు మొదలగు సాధనములను ఇట్లే యేయే పనివాండ్రు ఉపసంహార=ఆయాకార్య సాధనములను సంగృహీ-తసాధనాః సమకూర్చు కొన్నవారై,

తత్తత్కార్యం కుర్వాణా దృశ్యంతే

ఆ యాకార్యములను జేయుచుండుటను జూచుచున్నారము

బ్రహ్మచా సహాయంతవాభిప్రేతం

మీ యభిప్రాయ మీ జగత్తును జేయు బ్రహ్మమొక్కఁడేయై యెవ్విధమగు సాధన సహాయము లేనివాడనియే గదా!

తస్యసాధనాంతరాను పసంగ్రహేసతి కథం స్రష్టృత్వ ముపపద్యేత

ఏ విధమైన సాధనములను సమకూర్చు కొనకుండ నొక్కఁడేయైయుండు బ్రహ్మ మీ జగత్సృష్టిని జేయుచున్నాఁడని చెప్పుట యెట్లు పొసఁగును (అట్టిది యసంభవమని భావము) కాబట్టి బ్రహ్మము జగత్తును జేయగలవాడు కాదు. (సమాధానము)

తస్మాన్న బ్రహ్మ జగత్కారణ మితిచేత్ నైషదోషః

బ్రహ్మవిషయములో సాధనములు లేకపోవుట యనునది యొకదోషము (=లోపము) లోనిదిగాదు.

యతఃక్షీర వద్ద్రవ్యస్వభావ విశేషాదుప పద్యతే।

యతః ఎందుచేతననఁగా పాలవంటి ద్రవ్యములందుండు స్వభావవిశేషము చేత ఇతరసాధనాపేక్ష లేకయే ఆ ద్రవ్యములనుండి కార్యము లుత్పన్నములగుట (ఉపపద్యతే=సంభవించుచునే యుండును.

యథాహి లోకేక్షీరం జలంవా స్వయమేవ దధిహిమ కరకాది భావేన పరిణమతే అనపేక్ష్య బాహ్యసాధనం।

ఎట్లంటేని. లోకమందు బాలుగాని నీళ్ళుగాని యితర బాహ్యసాధన మపేక్షింపక స్వయముగానే (పాలు) పెరుగుగాను, (నీళ్లు) మంచుగడ్డగానో వడగండ్లుగానో పరిణమించుట (మారుచుండుట) కనుపించుచునేయున్నది,

తథేహాపిభవిష్యతి .

అట్లే బ్రహ్మవిషయములో గూడ బాహ్య సాధనాపేక్ష లేకయే జగత్తుగాఁ బరిణమించుట సంభవించఁగలదు,

పూర్వపక్షము:-

నను క్షీరాద్యపి దధ్యాది భావేనపరిణమమాన మపేక్షత ఏవబాహ్యం సాధనమౌష్ణ్యాధికం కథముచ్యతే క్షీరవద్ధితి

పెరుగుగాఁ బరిణమించు(=మారు) పాలును మంచుగడ్డగా బరిణమించు నీరును ఈ మొదలగునవి తమకంటె బాహ్యములుగా (వెలుపల)నుండు ఔష్ణ్యమును(=వేడిమిని)గాని శైత్యమును (చల్లదనమును)గాని యపేక్షించుచునేయున్న విగదా(అనగా మఱియొక సాధనములేనిది పాలు పెరుగుఁగాదోడుకొనదు. నీరు మంచుగడ్డగమారదు).

ఇట్టి సందర్భములో పాలుమొదలగు వానిని బ్రహ్మమును బోల్చుటయెట్లు?
సమాధానము :-

నైషదోషః స్వయమపి హిక్షీరం యాంచ యావతీంచ పరిణామ మాత్రామనుభవతి తావత్యేవత్వార్యతే(—త్వార్యతే=శైఘ్ర్యం కార్యతే క్షీరందధి భావమౌష్ణ్యాదినా) త్వోష్ణ్యాదినాదధిభావాయ)

ఇదియొక దోషముగాదు,

పాలుస్వయముగానే (=ఇతర సాధన సహాయము లేకయే) (యాంచ+యావతీంచ=) ఎట్టిదో యెంతదో పరిణామమును (=మార్పును) బొందుచునే యుండును-

కాని (=అయితే) యా పాలు పెరుగగు పరిణామము ఔష్ణ్యము (=వేడి) మొదలగు బాహ్యసాధనములచేతఁ (త్వార్యతే=) దొందరింపఁబడు చున్నయది-(అనఁగా పాలుతోడు మొదలగునవి లేకయే నెమ్మదిగానైనను పెరుగుగా మారుచునే యుండును తోడు మొదలగు బాహ్యసాధనములచేత మఱింత తొందరగా మాత్రము పెరుగుగా మారుచుండును)

యదిచ స్వయం దధి భావశీలతానస్యా న్నైవోష్ణ్యాది నాపి బలాద్దధి భావమాపద్యేత

పాలకు స్వయముగా (=సహజముగా) పెరుగుగాఁ బరిణమించు స్వభావ (=శక్తి)యే లేనిచో, వేడి మొదలగు బాహ్యసాధనములా పాలనుండి బలాత్కారముగాఁ బెరుగును బుట్టింపఁజాలవు.

నహివాయు రాకాశోవౌష్ణ్యాది నాబలాద్దధి భావ మాపద్యతే సాధన సామగ్ర్యా చ తస్య పూర్ణతా సంపాద్యతే

వాయువునుండిగాని యాకాశమునుండిగాని వేడిమి మొదలగు బాహ్యసాధనములను బ్రయోగించి బలాత్కారముగానైనను బెరుగు పుట్టింపఁ బడదుగదా!

ఒకవస్తువు నందుస్వభావముగానున్న శక్తియే బాహ్యసాధన సామగ్రిచేత సంపూర్ణత్వమును(=పుష్కలత్వమును) బొందుట సంభవింపవచ్చును.

పరిపూర్ణశక్తికంతు బ్రహ్మన తస్యాన్యేన కేనచిత్పూర్ణతా సంపాద యితవ్యా

బ్రహ్మమన్ననో పరిపూర్ణశక్తిగలది ఇకదానికిఁ బరిపూర్ణత్వమును జెందించు మఱియొకసాధన మేదియు నక్కరయుండదు.

శ్రుతిశ్చాత్ర భవతి నతస్య ... బలక్రియాచ" ఇతిశ్వే VI 8 (నతస్య కార్యం కరణంచ విద్యతే। నతత్సమ శ్చాభ్యధికశ్చ దృశ్యతే। పరాస్యశక్తిర్వి విధైవ శ్రూయతేస్వాభావికీ జ్ఞానబలక్రియాచ॥

ఈ విషయమునందు శ్రుతి ప్రమాణములు గలవు చూడుఁడు.

'(తస్య=) ఆ బ్రహ్మమునకు (కార్యం కారణం)= కార్యముగాని బ్రహ్మము నుండి కాగల కార్యముగాని) సాధనముగాని ఉండుటయన్నది (నవిద్యతే=) లేదు (తత్సమః=) ఆ బ్రహ్మముతో సమానమైనదిగా (అభ్యధికశ్చ=) ఆ బ్రహ్మముకంటె అధికమైనది (నదృశ్యతే=) కనుపింపదు. ఆ బ్రహ్మముయొక్క (పరాశక్తిః=) యత్యద్భుతశక్తి (స్వాభావికీ=) స్వభావమైనది జ్ఞాన ... యాచ=) జ్ఞానశక్తియనియు శక్తియనది వివిధైవశ్రూయతే=) ననేకవిధములుగా వినబడుచున్నది-

తస్మాదేకస్యాపి బ్రహ్మణో విచిత్రశక్తియోగాత్ క్షీరాదివద్విచిత్రః పరిణామ ఉపపద్యతే।

కాబట్టి బ్రహ్మమన్నది, రెండవది యేమియును లేక) యొకటేయైయున్నను వివిధ(=విచిత్ర)ములగు శక్తులు గల్గియున్నదైనందున, పాలు మొదలగు వాని వలెఁ విచిత్ర=వివిధ పరిణామములను బొందుచుండఁ గలదని గ్రహించునది.

25 సూత్రావతారిక :- పాలయందున్న శక్తిచేత పాలు పెరుగుగా మారినట్లు బాహ్య సాధనాపేక్ష లేకయే బ్రహ్మమందున్న శక్తిచేత బ్రహ్మము జగత్తుగా నేలమారఁగూడదని పూర్వసూత్రముచేతఁ జెప్పఁబడినది. బ్రహ్మము చేతనముగాఁ జెప్పఁబడుచున్నందున, అచేతనమైన పాలదృష్టాంతము సరిపోదనియు, లోకమునందుఁ జేతనులైన కుమ్మరివాండ్రు మొదలగువారు మన్ను-చక్రము మొదలగు బాహ్యసహాయములు లేనిది కుండలు మొదలగువానిని జేయఁగల్గుట లేదనియు వచ్చిన సందేహమును నివారించుటకీ సూత్రము రచియింపఁబడినది.

## ౨౫ సూ॥ దేవాది వదపి లోకే

ప. వి :- దేవాదివత్-అపి-లోకే

ప్ర. ప. అ :- దేవాదివత్; దేవ=దేవతలు, ఆది=మొదలగు ఋషిపితృవర్గముల, వత్=వలె. అపి=కూడ లోకే=ప్రపంచమందు

సూ. తా :- (లోకే=) మంత్రార్థవాదాది శాస్త్రములందును, వృద్ధవ్యవహారమందును (దేవాదివదపి=) దేవతలు మునులు యోగులు సిద్ధులు మొదలగు వారు ఎట్టి బాహ్యసాధనముల నపేక్షింపకయే తమ యోగ ప్రభావముచేత నానా విధములైన గృహక్షేత్రములను, శరీరములను బట్టణాదులను నిర్మించుచుండుట చూడఁబడినట్లు నిత్యసిద్ధుఁడైన పరమేశ్వరుఁడుసైతము బాహ్యసాధనాపేక్షలేకయే తన మహిమచేత వివిధ విచిత్రమగు నీజగత్తును సృష్టింపఁగల్గు ననుటలో దోషమేమియును లేదు.

భాష్యము భాష్యార్థము

స్యాదే తత్ ఉపపద్యతే క్షీరాదీనా మచేతనానామ నపేక్ష్యాపి బాహ్యం సాధనం దధ్యాది భావః దృష్టత్వాత్

(దృష్టత్వాత్=) ప్రత్యక్షముగాఁ గన్పించుచున్న హేతువుచేత అచేతన పదార్థములైన పాలు మొదలగునవి బాహ్యసాధనముల నపేక్షింపకయే పెరుగు మొదలగు పదార్థములుగా మారుచుండుట (ఉపపద్యతే=) సంభవింప వచ్చును. (స్యాత్ + ఏత్) ఇది వాస్తవమే- కాని

చేతనాః పునః కులాలాదయః సాధన సామగ్రీ మపేక్ష్యైవ తస్మై తస్మై కార్యాయ ప్రవర్తమానా దృశ్యంతే

(చేతనాఃపునః కులాలాదయః=) చేతనులైన కుమ్మరివాండ్రు మొదలగు వారి విషయములో మాత్రము సాధనసామగ్రియొక్క సహాయముతోడనే, వారు వారుచేయు నాయా (కుండలు మొదలగు) కార్యములను బుట్టించు నిమిత్తము ప్రయత్నించు చుండుట చూడఁబడుచున్నది.

కథం బ్రహ్మ చేతనం స దసహాయం ప్రవర్తేతేతి

(కుమ్మరివాండ్రవలె) చేతనమేయైన బ్రహ్మముమాత్రము (అసహాయం) ఏ విధమైన సహాయములేకయే (జగత్తును నిర్మాణముచేయు కార్యములో) (కథం ప్రవర్తేత + ఇతి=) ఎట్లు ప్రవర్తింపఁ గలదని చేయు పూర్వపక్షమునకు-

దేవాదివదితి బ్రూమః యథాలోకే దవాః పితరః ఋషయ ఇత్యేవ మాదయో మహా ప్రభావా శ్చేతనా అపిసంతోఽ నపేక్ష్యైవకించిద్బాహ్యం సాధన మైశ్వర్య విశేష యోగా దభిధ్యాన మాత్రేణస్వత ఏవబహూని నానాసంస్థానాని శరీరాణి ప్రాసాదాని రథాదీనిచ నిర్మాణా ఉపలభ్యంతే మంత్రార్థ వాదేతిహాస పురాణ ప్రామాణ్యాత్

'దేవతలు మొదలగువారివలెనే' యనిసమాధానముసు జెప్పినారము లోకమందు మహా ప్రభావవంతులైన దేవతలు పితరులు ఋషులు ఈ మొదలగువారు చేతనులేయైనను ఏ మాత్రపు బాహ్యసాధన మపేక్షింపకయే వారి వారికుండు (ఐశ్వర్య విశేషయోగాత్=)మహిమాతిశయ హేతువువలన (అభిధ్యాన మాత్రేణ=) తలపెట్టి నంత మాత్రముచేత (స్వతఏవ) దమకుఁదామే నానావిధములైన (సంస్థానాని=) గృహక్షేత్రములను శరీరములను (ప్రాసాదాని=) సౌధములను రథములు మొదలనువాని (బహూని=)నెన్నింటినోకల్పించుచుండుట (మంత్రా... ణ్యాత్=)మంత్రముల యందును, అర్థవాదముల (కథల) యందును ఇతిహాసముల యందును బురాణముల యందును (యథా ఉపలభ్యంతే) గన్పించుట యెట్లో.

తంతునాభస్య స్వత ఏవతం తూన్ సృజతి

(తంతునాభః=)సాలెపురుగు స్వయముగానే (బాహ్యసాధనములు లేకయే) దారముల నెట్లు దీయుచున్నదో.

బలా కాచాంతరే ణైవ శుక్రం గర్భంధత్తే

(బలాకా=)బెగ్గురు పక్షి (అంత...శుక్రం) దాని కదియే (పుంగదాని సంబంధమైన) శుక్రసహాయము లేకయే యెట్లు గర్భమును ధరించుచున్నదో,

పద్మినీచా నపేక్ష్య కించిత్ప్రస్థాన సాధనం సరోఽన్తరాత్ సరోన్తరం ప్రతిష్ఠతే

మఱియు (పద్మినీ=) దామరగడ్డి యనునది (ప్రస్థానసాధనం=) దానిని గొంపోవు సాధనమె (కించిత్+అనపేక్ష్య=) నెట్టిదానినైనను గోరకయే ఒకకొల నులోనుండి మఱియొక కొలనులోనికెట్లు (ప్రతిష్ఠతే=) పోగల్గుచున్నదో,

ఏవం చేతన మపి బ్రహ్మానపేక్ష్యైవ బాహ్యం సాధనం స్వత ఏవ జగత్ స్రక్ష్యతి

అట్లె బ్రహ్మమనునది చేతనపదార్థమే యైనను బాహ్యసాధన మెట్టిదానిని గోరకయే స్వయముగానే (తనకుఁదానే) జగత్తును (ప్రక్ష్యతి=) సృష్టింపఁగలదు.

నయది బ్రూయాద్య ఏతే దేవాదయో బ్రహ్మణో దృష్టాంతా ఉపాత్తా. స్తేదార్ష్టాంతి కేన బ్రహ్మణా సమాన స్వభావా న భవంతి

(సయదిబ్రూయాత్ యః=) ఎవడైననొకఁ డిట్లాక్షేపము సేయవచ్చును—ఎట్లనఁగా :-

ఈ దేవతలు మునులు పితరులు మొదలగువారిని బ్రహ్మమునకు దృష్టాంతములనుగాఁ జెప్పియున్నారుగదా! (తే=) ఆ దేవతలు మొదలగువారు (దార్ష్టాంతికేనబ్రహ్మణా) దేనితోఁబోల్చి చెప్పఁబడినారో యట్టి బ్రహ్మముతో సమాన స్వభావముగలవారు (నభవంతి=) కారుసుమా! (పైఁజూపిన దృష్టాంతముల ప్రస్తుతము లసంగతములు- ఎట్లన)

శరీరమేవ హ్యచేతనం దేవాదీనాం శరీరాంతర విభూత్యుత్పాదనే ఉపాదానం నతు చేతన ఆత్మా:

(1) దేవతలు మొదలగువారియొక్క యచేతనములైన శరీరములుపాదాన కారణములుగా నేర్పడి యితర శరీరములను గృహక్షేత్రాదులను బుట్టించుచున్నవి గాని వారియొక్క కేవల చేతనమైన యాత్మగాదు-

తంతునాభస్యచ క్షుద్రతరజంతుభక్షణా ల్లాలా కఠినతామాపద్య మానాతంతుర్భవతి

(2) చిన్నచిన్న పురుగులను దినుటవలన సాలెపురుగుయొక్క (యచేతనమైన) (లాలా=) చొంగ (కఠినతామాపద్య=) గట్టిపడి యదియే దారమగుచున్నది.

బలాకాచ స్తనయిత్ను రవశ్రవణా ద్గర్భం ధత్తే

(౩) బలాకాచ=) బెగ్గురుపక్షి (స్తనయిత్నుః=) ఉరుముయొక్క (రవశ్రవణాత్=) వినుటవలన (అనఁగా-) గర్భమును (ధత్తే=) ధరించుచున్నది.

పద్మినీచచేతనప్రయుక్తా సతీ అచేతనే నైవ శరీరేణ సరోఽన్తరాత్ సరోఽన్తరముపసర్పతివల్లీవ వృక్షం

(4) (పద్మినీ=) తామరగడ్డి (వల్లీవవృక్షం=)అల్లుపెట్టబడినతీగవృక్షముపైకిఁ బ్రాకినట్లుగాఁ జేతనుఁడైన యెవఁడోయొక పురుషునిచేత (ప్రయుక్తా=) అల్లుపెట్టఁబడినదియగుచు నచేతనమైన తనశరీరముచేతనే ఒకకొలనునుండి మఱియొక కొలనులోనికి (ఉపసర్పతి=) ప్రాకుచున్నదిగాని

నతు స్వయమేవా చేతనా సరోఽన్తరోప సర్పణీ వ్యాప్రియతే

అచేతనమైన యీ తామరగడ్డి (స్వయమేవ=) తనకుఁదానే మఱియొక కొలనులోనికిఁ బోవుఁపనిని (వ్యాప్రియతే=) నిర్వహించుటలేదు.

తస్మాన్నైతే బ్రహ్మణో దృష్టాంతా ఇతి

కాబట్టి యీ దృష్టాంతములు బ్రహ్మమునకు సరిపోవు.

సమాధానము :-

తం ప్రతిబ్రూయాన్నాయం దోషః కులాలాది దృష్టాంత వైలక్షణ్య మాత్రస్య వివక్షితత్వా దితి

అట్లాక్షేపము చేసినవానికిట్లు సమాధానము చెప్పఁబడునుగాక ! ఇదియొక దోషముకాదు; (కులా...వివక్షితత్వాదితి=) బాహ్యసాధనాపేక్షలేకకుండలుమొదలైనవి చేయఁజాలని కుమ్మరిమొదలగు పనివాండ్రు దృష్టాంతమునకు బ్రహ్మము విలక్షణము (=భేదము) గా నుండునని చూపుటమాత్రమే దృంష్టాతమువలన మేముద్దేశించినది-

యథాపి కులాదీనాం దేవాదీనాంచ సమానచేతనత్వే, కులాలాదయః కార్యారంభే బాహ్యం సాధన మపేక్షంతే, న దేవాదయః

కుమ్మరి మొదలగు పనివాండ్రును, దేవతలు మొదలగు మహానుభావులును జేతనులగుదురను విషయములో సమానులేయైయున్నను, కుమ్మరి మొదలగు పనివాండ్రు కార్యారంభమందు (=కుండలు మొదలగువానినిఁ జేయఁబూనునపుడు) బాహ్యసాధనముల (=మట్టి చక్రము నీళ్ళు మొదలగువానిని) నపేక్షించినను, (మహానుభావులైన) దేవతలు మొదలగువారు సంకల్పమాత్రముచే గృహక్షేత్రాది శరీరములఁ గల్పించునపుడు బాహ్యసాధనములెట్లపేక్షింపరో,

తథా బ్రహ్మ చేతనమపి న బాహ్యం సాధన మపేక్షిష్యత ఇత్యేతావత్ వయం దేవా ద్యుదాహరణేన వివక్షామః

అట్లే చేతనమైన బ్రహ్మముసైతము (జగత్తునునిర్మించు విషయమందు) బాహ్యసాధన మపేక్షింపదని జూపుటమాత్రమే దేవతలు మొదలగువారి దృష్టాంతము వలన మేము వివక్ష (=ప్రత్యేకించి చూపుట) చేసినదిగాని మఱియొకటిగాదు

యస్మాద్యథైకస్య సామర్థ్యం దృష్టం తథా సర్వేషా మేవ భవితు మర్హతీతి నాస్త్యే కాంత ఇత్యభిప్రాయః

కాబట్టి యొకరికొకసామర్థ్యమున్నప్పు డట్టిసామర్థ్యమెల్ల వారికిఁగూడనుండ వలయునను (నాస్తి+ఏకాంతః=) నియమమెంతమాత్రమును లేదని చెప్పుటయే (=అట్లే బాహ్యసాధనములులేక యొకరేపనిని జేయఁజాలనప్పుడందరట్లే చేయఁజాల రందురను నియమములేదని చెప్పుటయే) మా యభిప్రాయము.

## కృత్స్నప్రసక్త్యధికరణము

అధికరణావతారిక :-

బ్రహ్మజగత్కారణవాదమునుస్థిరపఱచుటకే యీయధికరణముసైతమేర్పడినది- బాహ్యసాధనాపేక్ష లేకయే పాలు పెరుగుగాఁబోలె, దేవతాదులు కల్పిత సంస్థానములుగాఁబోలె బ్రహ్మమీజగత్తుగాఁ బరిణమించినదని పూర్వాధికరణమందుఁ దెలుపఁబడినది. ఇదియే సిద్ధాంతమనుకొన్నచో, బ్రహ్మమునకుఁబరిణామమొప్పుకొన్నట్లే యగును. ఇది యుపనిషత్సిద్ధాంతమునకు విరోధము. బ్రహ్మము జగత్తుగాఁ బరిణమించినదన్నచో, బ్రహ్మమురూపుమాసినట్లె యగును. అనఁగా జగదాకారముగాఁ బరిణమించిన బ్రహ్మముదక్క, అసలు బ్రహ్మమన్నది లేకయే పోవలెను. ఈ పరిణామవాదము వాస్తవముగాదనియు, వాస్తవమైనది వివర్తవాదమేయనియుఁదెలుపుటకీ యధికరణమేర్పడినది- వివర్తవాదమనఁగా బ్రహ్మమున్నది యున్నట్లుగానేయుండి, దానియందుండు మాయాశక్తివలన, బ్రహ్మ మీజగత్తుగా గోచరించుచున్నదని చెప్పుటయే-

### ౨౬ సూ॥ కృత్స్నప్రసక్తి ర్నిరవయవత్వ శబ్దకోపోవా

ప॥ వి :- కృత్స్నప్రసక్తిః - నిరవయవత్వశబ్దకోపః - వా

అ॥ క్ర :- కృత్స్నప్రసక్తిః - వా - నిరవ... కోపః

ప్ర॥ ప॥అ :- (1) కృత్స్నప్రసక్తిః ; కృత్స్న=యావత్తును- అనఁగా యావద్బ్రహ్మమును (జగత్తుగాఁ బరిణమించినదని, ప్రసక్తిః= సంభవించును. (=ప్రసక్తించును=ఏర్పడును)

(2) వా = లేక; నిరవయవత్వశబ్దకోపః; నిరవయవత్వ = (బ్రహ్మము) నిరవయవము. అనగా నవయవములు లేనిది యని బోధించు, శబ్ద = శ్రుతికి, కోపః = బాధ (-విరోధము) గలుగును.

సూత్రభావము :- (1) (కృత్స్నప్రసక్తిః) బ్రహ్మమునుండియే జగత్తు వర్పడినదని యంగీకరించు పక్షమున బ్రహ్మము నిరవయవముగావున- అనఁగా భాగములు లేనిదిగావున, బ్రహ్మమంతయు జగత్తుగాఁ బరిణమించిన (=మారిన) దని చెప్పవలసివచ్చును. అట్లుచెప్పుచో, జగత్తుకన్న మిక్కిలిగా బ్రహ్మమికనుండఁజాలనందున (ఎ) జగత్తుకంటె మిక్కిలిగా బ్రహ్మమున్నది (ఛా. III-12-6) (బి) బ్రహ్మమును గనుఁగొనవలసినది (బృ. IV-4 5 ల) యని బోధించు శ్రుతులు నిరర్థకములై పోవును.

(2) (నిరయవత్వశబ్దకోప) అట్లుగాక బ్రహ్మముయొక్క కొంతభాగమే జగత్తుగాఁ బరిణమించినదని చెప్పవలసివచ్చును. అట్లుచెప్పుచో బ్రహ్మమునిరయవము- అనఁగా భాగములు లేనిదియని బోధించు శ్రుతులకు (శ్వే VI 9 ల) విరోధము గల్గును. లోగడి యధికరణములోఁ దెల్పినచొప్పునఁ బరిణామమొప్పుకొని యెట్లు చెప్పినను సంకటమే, కావున బ్రహ్మజగత్కారణ వాదము సరికాదు— అని పూర్వపక్షము-

భాష్యము భాష్యార్థము

చేతన మేక మద్వితీయం బ్రహ్మక్షీరాదివ ద్దేవాదివచ్చా నపేక్ష్య బాహ్యం సాధనం స్వయం పరిణమమానం జగతః కారణమితి స్థితం

చేతనము, ఏకము, అద్వితీయమునగు బ్రహ్మము పాలు పెరుగైనట్లుగాను, దేవతాదులనుండి సంస్థానములైనట్లుగాను ఎట్టి బాహ్యసాధన మపేక్షింపకయే (స్వయం=, తనకుఁదానే జగత్తుగాఁ బరిణమించినదై జగత్తునకుఁ గారణమగుచున్నదని (పూర్వాధికరణమందు) స్థిరపడినది.

శాస్త్రార్థ పరిశుద్ధయే తు పునరాక్షిపతి

అదియే క్రమసిద్ధాంత మనుకొన్నచో శాస్త్రార్థమునకు (=ఉపనిషదర్థమునకు) ముప్పువాటిల్లును (పరిశుద్ధయే=) అట్లు కలుగకుండుట కెట్లుసమర్థింతురని మఱల (పూర్వపక్షి) నిట్లాక్షేపించుచున్నాడు.

కృత్స్న ప్రసక్తిః కృత్స్నస్య బ్రహ్మణః కార్యరూపేణ పరిణామః ప్రాప్నోతి నిరవయవత్వాత్

(కృత్స్న=) సమస్తము మారవలసివచ్చును- అనఁగా బ్రహ్మము (నిరవయవత్వాత్=) అవయవములు (=యద్విధమైన భాగములు) లేనిది గావున, (కృత్స్నస్యబ్రహ్మణః=) ఆ సమస్తబ్రహ్మము (పరిణామః ప్రాప్నోతి=) జగదాకారమును జెందవలసివచ్చును.

యది బ్రహ్మ పృథివ్యాదివత్ సావయవ మభవిష్యత్ తతోఽస్యైకదేశః పర్యణంస్యత్ ఏకదేశశ్చా వాస్థాస్యత

బ్రహ్మము పృథివిమొదలగు మహాభూతములవలె నవయవములతోఁ గూడినది యగుచో, అప్పుడు, దానియొక్క (ఏకదేశః=) యొకభాగము (పర్యణంస్యత=) జగత్తుగాఁ బరిణమించుటయు (ఏకదేశశ్చ=) మఱియొకభాగము (అవాస్థాస్యత్=) ఉన్నదియున్నట్టుగా నిల్చియుండుటయుఁ సంభవింపవచ్చును.

నిరవయవంతు బ్రహ్మశ్రుతిభ్యోఽవగమ్యతే

కాని బ్రహ్మము (నిరవయవం=) ఎట్టిభాగములు లేనిదియని శ్రుతులవలనఁ (అవగమ్యతే=) దెలియఁబడుచున్నది. చూడుఁడు.

'నిష్కళం... నిరంజనం' (1) శ్వే VI-19 'నిష్కళం నిష్క్రియం శాంతం నిరవద్యం నిరంజనం'

'(నిష్కళం=) అవయవములు లేనిదియు, (నిష్క్రియం=) క్రియలు లేనిదియు, (శాంతం=) రాగద్వేషాది రహితమును, (నిరవద్యం=) దోషశూన్యమును (నిరంజనం=) అంటులేనిదియు (నగును)

'దివ్యోహ్య....హ్యజః' (2) ము౦ II-1-2 దివ్యోహ్య మూర్తః పురుషస్య బాహ్యాభ్యంతరో హ్యజః'

'(దివ్యః = స్వయం ప్రకాశుఁడును (అమూర్తః) ఆకారములేనివాడును, (పురుషః -) పరిపూర్ణుఁడును, (సః-) అతఁడు (బాహ్యాభ్యంతరః=) వెలుపల లోపల నంతటనున్నవాడును (అజః=) పుట్టుకలేనివాడును

'ఇదం....ఘనఏవ' (3) బృ IV-4-12 'ఇదం మహద్భూత మనంత మపారం విజ్ఞానఘనఏవ'

'(ఇదం=) ఈ బ్రహ్మము (మహద్భూతం=) సర్వభూతములకంటె బెద్దదియు, (అనంతం=) అంతములేనిదియు, (అపారం=) హద్దులేనిదియు (విజ్ఞానఘనః+ఏవ=) చైతన్యముయొక్క ముద్దయే

'సఏష....మనణు' (4) బృ VI-9-26 'సఏషనేతి నేత్యాత్మాఽస్థూల మనణు'

'(సఃఏషఃఆత్మా=) ఆయీయాత్మ (నేతి-నేతి)=ఇదిగాదు. ఇదిగాదు.

(గోచరమగు నేపదార్థమునుగాదు). '(అస్థూలం=) స్థూలముగానిది, (అనణు=) అణువుగానిది.

ఇత్యాద్యాభ్య స్సర్వవిశేష ప్రతిషేధినీభ్యః

బ్రహ్మమునందు (సర్వ...నీభ్యః=) వివిధమైన విశేషములు (=భేదములు-భాగములు మొదలగునవి) లేవని యీాపై మొదలగు శ్రుతులు చాటుచున్నయవి.

తతశ్చైకదేశపరిణామా సంభవాత్ కృత్స్న పరిణామ ప్రసక్తౌ సత్యాం మూలోచ్ఛేదః ప్రసజ్యేత

(తతః=) అందువలన బ్రహ్మముయొక్క కొంతభాగము మాత్రమే జగత్తుగాఁ బరిణమించుచున్నదని చెప్పుట యసంభవ మగుటవలన (కృత్స్న...సత్యాం=) సమస్తబ్రహ్మము జగత్తుగాఁ బరిణమించుచున్నదనియే చెప్పవలసి వచ్చును. అట్లగుచో (మూలో...జ్యేత=) జగత్తుగాఁ బరిణమించిన బ్రహ్మము దక్క, మూలమైనబ్రహ్మము కొంతబాత్తుగా మిగిలిలేకపోవుటయే సంభవించును.

ద్రష్టవ్యత్వోపదేశానర్థక్యం చాపద్యేత అయత్న దృష్టత్వాత్ కార్యస్య తద్వ్యతిరిక్తస్యచ బ్రహ్మణోఽభావాత్

(బ్రహ్మము సంపూర్ణముగా జగత్తుగాఁ బరిణమించినదను పక్షములో) (కార్యస్య=) బ్రహ్మకార్యమైన- అనఁగా బ్రహ్మమునుండి పుట్టినదను నీజగత్తు (అయత్నదృష్టత్వాత్=) అప్రయత్నముగానే (ఏవిధమగు బోధయు, నుపదేశాదులును, వానినిబట్టిచేయు ప్రయత్నములును లేకయే) ప్రత్యక్షమగుచున్నది గావునను, (తద్వ్య...ఽభావాత్=) ఈ ప్రత్యక్షమగుచుండు జగద్బ్రహ్మముకన్న మిన్నగా (=వేఱుగా-వ్యతిరేకముగా) బ్రహ్మమెంతయును నెట్టిదియును లేకయేపోవుచున్నది గావునను, (ద్రష్టవ్య...పద్యేత) 'ద్రష్టవ్యః శ్రోతవ్యః = 'బ్రహ్మమును గనుగొనవలసినది బ్రహ్మమునుగూర్చి వినవలసినది' ఎక్కడనో మఱియున్నదివోలె బ్రహ్మమునుగూర్చి యుపదేశమొనర్చు నీమొదలగు శ్రుతులు నిష్ప్రయోజనములై పోవలసివచ్చును.

అజత్వాది శబ్దవ్యాకోపశ్చ

మఱియును (ఈజగత్తు పరిపూర్ణ బ్రహ్మముయొక్క కార్యమే- అనఁగా దానినుండియే పుట్టినదియగుచో బ్ర '...అజః' '(అజః=) బ్రహ్మము పుట్టుక గలదిగాదు. అనునీమొదలగుశ్రుతులకు (వ్యాకోపః=) భంగమునై తముతటస్థించును

అథైతద్దోషపరిజిహీర్షయా సావయవమేవ బ్రహ్మాభ్యుపగమ్యేత

(అథ=) కాబట్టి బ్రహ్మవిషయములో నిట్టిదోషములను లేకుండఁ జేయవల

యనను తలంచే ముఖ్యమగుచో, బ్రహ్మము (సావయవమేవ=) భాగములుగల దనియే యొప్పుకొనవలసి వచ్చును.

తథాపియే నిరవయవత్వస్య ప్రతిపాదకా శ్శబ్దా ఉదాహృతాస్తే ప్రకుప్యేయుః

[తథాపి=] అట్లొప్పుకొను పక్షములో నైతము [నిరవయవత్వస్య=] బ్రహ్మమవయవములు లేనిదియని [ప్రతిపాదకాః=] బోధించునట్టియు, [ఉదాహృతాః=] ఉదాహరింపఁబడునట్టియు [యే-తే] నేయే శ్రుతులుగలవో యాయా [అనఁగా పైనఁ జూపఁబడిన] శ్రుతులన్నియును [ప్రకుప్యేయుః=] గోపగించుకొనునవియే. అనఁగా బాధను జెందునవియే యగును.

సావయవత్వే చానిత్యత్వ ప్రసంగ ఇతి

(సావయవత్వేచ=) అంతేగాక బ్రహ్మమవయవములు గలదియని యంగీకరించుచో మీఁదుమిక్కిలి (అనిత్యత్వప్రసంగః=) బ్రహ్మమనిత్యమైనదియని పర్యవసించును (=తేలును) (ఇతి=) కాబట్టి

సర్వథాఽయం పక్షోన ఘటయితుం శక్యత ఇత్యాక్షిపతి

[అయంపక్షః=] ఈ జగత్తు సమస్తబ్రహ్మమునుండి పుట్టినదనిగాని లేక కొంత బ్రహ్మమునుండి పుట్టినదనిగాని చేయువాదమును [ఘటయితుంనశక్యతే=] సమర్థించుటకు సాధ్యపడదు అని పూర్వపక్షి యాక్షేపించుచున్నాడు.

27 సూత్రావతారిక :— లోగడి సూత్రములోఁ జేయఁబడిన యాక్షేపములు- అనఁగా పూర్వాధికరణములోఁ జూపఁబడిన పరిణామవాదమే బ్రహ్మజగత్కారణ వాదులయొక్క నిశ్చయసిద్ధాంతమని తలఁచి దానిపైఁ జేయఁబడిన (1) కృత్స్నప్రసక్తి (2) నిరవయవత్వశబ్దకోపము అనునాక్షేపములీ సూత్రముచే నిరాకరింపఁబడు చున్నది.

## ౨౮ సూ॥ శ్రుతేస్తు శబ్దమూలత్వాత్

ప॥ వి:- శ్రుతేః-తు; శబ్దమూలత్వాత్

అన్వయక్రమము :- తు, శ్రుతేః, శబ్దమూలత్వాత్

ప్ర ప. అ.- తు=పూర్వపక్షము సరిగాదు. శ్రుతేః=శ్రుతిప్రమాణముండుటవలన, శబ్దమూలత్వాత్=(బ్రహ్మమును దెలిసికొనుటకు.) శబ్ద=వేదమే, మూలత్వాత్=మూలము (=ఆధారము=ప్రమాణము) అగుటవలన-

సూత్రభావము :—

(శ్రుతేస్తు) ఛాం III-12-6 'తావదస్యమహిమా, తతోజ్యాయాగ్ంశ్చ పురుషః...' ఈ మొదలగు శ్రుతులవలన జగత్తునకంటె వ్యతిరేకముగా బ్రహ్మ

మున్నట్లు తెలియఁబడు చున్నందునఁ బూర్వపక్షు లారోపించు 'కృత్స్నప్రసక్తి' దోషము బ్రహ్మమునకులేదు. ఇందుచే బ్రహ్మము సావయవమని చెప్పుటకును వలనుపడదు. శ్వే VI-19 'నిష్కళం నిష్క్రియంశాంతం' ఈ మొదలగుశ్రుతులే బ్రహ్మము సావయవముగాదని స్థిరపఱచుచున్నవి.

(శబ్దమూలత్వాత్) బ్రహ్మముయొక్క కొంతభాగము జగత్తుగాఁ బరిణమించుట- బ్రహ్మమునిరవయవమగుట, యనుపరస్పర విరుద్ధాంశములు బ్రహ్మవిషయములోఁ జెప్పఁదగదు. బ్రహ్మమెట్టిదియో జగత్తెట్టిదియో తెలిసికొనుటకు శ్రుతులే ప్రమాణము- శ్రుతులు చెప్పుచున్నట్లు గ్రహించుచో, నెట్టివిరోధమును (నిరవయత్వశబ్దకోపము మొదలగునది) రాదు- ఛాం VI-1-4 'వాచారంభణం వికారో నామధేయం' అను నీశ్రుతివలన నామరూపమయమైన యీజగత్తు మిథ్యయనియే తెలియఁబడుచున్నది. ఇట్టి మిథ్యయగు జగత్తు నాస్తవమగు బ్రహ్మపదార్థము యొక్క పరిణామమగుట యసంభవము గాన జగత్తు బ్రహ్మముయొక్క వివర్తముగాని యనువర్తముగాదు. అనఁగా బ్రహ్మమున్నది యున్నట్లుగానేయుండి దానికేవిధమైన చెఱుపులేకయే జగత్తును బ్రహ్మము బుట్టించుచున్నదని శ్రుతులు చెప్పుచున్నవి- బ్రహ్మము జగత్తునకు వివర్తోపాదానముగాఁ గారణమగుచో, దానికి, కృత్స్నప్రసక్త్యాది దోషములుగలుగుట కవకాశము లేదు-

భాష్యము భాష్యార్థము

తు శబ్దేనాక్షేపం పరిహరతి

ఈ సూత్రములోని 'తు' శబ్దముచేత లోగడి సూత్రములోని సాంఖ్యుని యాక్షేపమును (సూత్రకారుఁడు బరిహరించుచున్నాడు.

నన్వస్మత్పక్షే కశ్చిదపి దోషోऽస్తి

(అస్మత్పక్షే=) మా పక్షమునందు (=సూత్రకారుని పక్షమందు- ఉపనిషత్సిద్ధాంతమందు) ఎట్టిదోషమును (న+అస్తి+ఖలు) నుండఁబోదుసుమా (=లేదు సుమా)

న తావత్కృత్స్న ప్రసక్తి రస్తి

(తావత్=) బ్రహ్మమునుండి జగత్తు పుట్టుచున్నదన్నను, (కృత్స్నప్రసక్తిః=) బ్రహ్మము సమస్తమును జగత్తుగా మారుచున్నదనెడి దోషము (న+అస్తి=) లేదు (=రాదు)

కుతః?

అట్లు దోషమెందుచే లేదందురేమో?

శ్రుతేః

శ్రుతియే యట్లు చెప్పుచున్నందువలన

యథైవహి బ్రహ్మణో జగదుత్పత్తిః శ్రూయతే ఏవం వికార వ్యతిరేకేణాపి బ్రహ్మ
ణోఽవస్థానం శ్రూయతే ప్రకృతి వికారయో ర్భేదేన వ్యపదేశాత్

బ్రహ్మమునుండి జగత్తుపుట్టినట్లు శ్రుతియందెట్లు (శ్రూయతే=) కనుపట్టుచున్నదో, (ఏవం=) అట్లె (ప్రకృతి వికారయోః=) ప్రకృతియు (=అనగా కారణమైన బ్రహ్మమును) వికారమును (=అనఁగా కార్యమైన జగత్తును) భిన్నములు (=వేరువేరుగా) గా (వ్యపదేశాత్=) నుపదేశింపఁబడుటచే (వికారవ్యతిరేకేణాపి=) వికారమైన జగత్తుకంటె భిన్నముగాఁగూడ (బ్రహ్మణః+అవస్థానం=) బ్రహ్మము యొక్క యునికి (శ్రూయతే=) శ్రుతియందు కనుపట్టుచునే యున్నది.

అది యెట్లంటేని :-

"సేయం....కరవాణీతి" ఛాం VI-3-2 "సేయందేవ తైక్షత హంతా హమిమా
స్తిస్రో దేవతా" "తావానస్య....మృతం దివి" అనేన జీవేనాత్మ నానుప్రవిశ్య
నామరూపే వ్యాకరవాణీతి

"(సా+ఇయం+దేవతా=) ఆయాదేవత అనఁగా పరదేవత (ఆత్మ-బ్రహ్మము) (ఐక్షత=) సంకల్పించెను, (హంత=) ఇప్పుడు (అహం=) నేను, (ఇమాః+తిస్రః+దేవతాః=) ఈ మూడు దేవతలలోను అనఁగా పృథివ్యాపస్తెజస్సులనెడి సృష్టింపఁబడిన భూతములలో (అనేన+జీవేన+ఆత్మనా=) ఈ జీవస్వరూపముతోఁ (అనుప్రవిశ్య ) ప్రవేశించి (నామరూపే=) సృష్టికినాధారములైన నామరూపములను (వ్యాకరవాణి=) జేసెదను'.

ఛాం III-12-6 'తావానస్య మహిమా తతోజ్యాయాగ్ శ్చ 'పురుషః' పాదోఽస్య
విశ్వాభూతాని త్రిపాదస్యామృతం దివి'

'(అస్య=) ఈ గాయత్రీ రూపమైన బ్రహ్మముయొక్క (మహిమా=) (తావాన్=) ఈ ప్రపంచమంతటిది, (తతః=) అంతకంటె అనఁగా నీజగత్తుకంటె (పురుషః=) సంపూర్ణ బ్రహ్మరూపము (జ్యాయాన్+చ=) గొప్పది- (అస్య=) ఈ బ్రహ్మముయొక్క (పాదః=) నాల్గింట నొకభాగమే (విశ్వాభూతములు=) సమస్త భూతరూపజగత్తు- (అస్య=) ఈ బ్రహ్మముయొక్క (త్రిపాత్=) శేషించిన మూడుభాగములు (అమృతం=) మోక్షస్వరూపమై (దివి=) సూర్యమండలమందు (ధ్యానార్థమైయున్నది)

ఇతి చైవం జాతీయకాత్

ఇవి, యిట్టివే మఱికొన్ని శ్రుతులు చెప్పుచుండుటవలన [బ్రహ్మముకంటె జగత్తు వేరైనట్లు శ్రుతులలోఁ గన్పించుచుండుటవలన దోషము లేదని చెప్పినారము]

అట్లె

తథా హృదయా యతనత్వ వచనాత్

అని హృదయాయతనత్వ వచనము వలనను అనగా బ్రహ్మముహృదయమే నివాసముగాఁ గలవాడని చెప్పు శ్రుతియుండుట వలనను మఱియు

సత్సంపత్తి వచనాచ్చ

సత్పదార్థముతో [=బ్రహ్మముతో] సంపత్తి=] జీవుఁడేకీభవించుటను జెప్పు [వచనాత్ =] శ్రుతియుండుట వలననుగూడ బ్రహ్మము వేరనియు జగత్తు వేరనియు నిశ్చయమగుచున్నది.

యదిచ కృత్స్నం బ్రహ్మకార్యభావే నోపయుక్తం స్యాత్

[కృత్స్నంబ్రహ్మ=] బ్రహ్మము సమస్తమును [కార్యభావేన=] జగత్తుగా [ఉపయుక్తం=] నుపయోగపడినదే [యదిస్యాత్ =] యైనచో-

'సతా....భవతి' ఛాం VI-8-1 'సతాసోమ్య । తదాసంపన్నో భవతి'

'[సోమ్య=] ఓ పిల్లవాడా ! [తదా=] అప్పుడు- అనఁగా సుషుప్తికాలమందు [సతా=] సత్పదార్థముతో జీవుఁడు [సంపన్నః+భవతి] కలిసిపోయినవాడగుచున్నాడు.

ఇతి సుషుప్తి గతం విశేషణ మనుపపన్నంస్యాత్

ఈ శ్రుతియందుఁగల [తదా=] 'సుషుప్తికాలమందు' అను విశేషణము [అనుపపన్నంస్యాత్ =] తగినదిగా నుండనోపదు [=తగనిదిగా నుండును] ఎందుచేతనఁగా :—

వికృతేన బ్రహ్మణా నిత్య సంపన్నత్వా

[సమస్తబ్రహ్మము జగత్తుగానే మారియున్నచో] [వికృతేన=] వికారమైన జగత్తుతో బ్రహ్మమునిత్యమును గలిసియే యున్నాడనియును

దవికృతస్య బ్రహ్మణోఽభావాత్ తంధేంద్రియ గోచరత్వా ప్రతిషేధాత్ బ్రహ్మణో వికారస్య చేంద్రియ గోచరత్వా పత్తేః

(అవికృతస్య=) జగత్తుగామారని బ్రహ్మమెంతయును (అభావాత్ =)

లేదనియు, భావింపవలసి యుండుటచేతను, (తథా=) మఱియును (ఇంద్రియగోచ–బ్రహ్మణః=) బ్రహ్మమింద్రియములకు గోచరించునది గాదని ప్రతిషేధింపఁబడియుండుటచేతను, మఱియు (వికారస్య=) బ్రహ్మమునుండిపుట్టిన జగత్తు (ఇంద్రియ... పత్తేః) ఇంద్రియములకు గోచరించునది యగుటచేతను (జగత్తుకంటె బ్రహ్మము వేరని తలంపఁబడవలసి యుండుటనుబట్టి) పై శ్రుతిలో ('తదాసంపన్నో భవతి=') సుషుప్తికాలమందు జీవుఁడు బ్రహ్మముతో నేకమగుచున్నాఁడని చెప్పుట సమంజసమే గదా !

తస్మాదస్త్య వికృతం బ్రహ్మ

కాబట్టి (అవికృతం=) జగత్తుగామారని బ్రహ్మము (అస్తి=) ఉన్నదనియే నిశ్చయ మగుచున్నది.

నచ నిరవయవత్వ శబ్ద(వ్యా)కో పోఽస్తి

మఱియు బ్రహ్మమున కవయవములు (=భాగములు) లేవనిచెప్పు (శబ్ద=) శ్రుతికి (కోపః=) భంగమన్నదియును (నచ+అస్తి=) లేదుసుమా !

శ్రూయమాణత్వా దేవ నిరవయవత్వస్యా భ్యుపగంతవ్యమ్

ఎందుచేననఁగా (నిరవయవత్వస్య=) బ్రహ్మము నిరవయవమని (శ్రూయమాణత్వాత్+ఏవ=) శ్రుతులు చాటుచుండుట వలననేగదా (అభ్యుపగంతవ్యమ్=) బ్రహ్మము నిరవయమని యంగీకరింపఁబడ వలసియున్నది.

శబ్దశ్చో భయ మపి బ్రహ్మణః ప్రతిపాదయత్య కృత్స్నప్రసక్తిం నిరవయవత్వంచ

(బ్రహ్మణః=) బ్రహ్మమన్నది (అకృత్స్నప్రసక్తిం=) సమస్తము జగత్తుగాఁ బరిణమించుట పొసఁగదనియు. (నిరవయవత్వంచ=) అవయవములులేనిదనియు (ఉభయమపి=) ఈ రెండు విషయములను సైతము (శబ్దః) శ్రుతి (ప్రతిపాదయతి=) చాటుచునేయున్నది.

లౌకికానామపి మణిమంత్రౌషధి ప్రభృతీనాం దేశకాలనిమిత్త వైచిత్ర్యవశాచ్ఛక్తయో విరుద్ధానేక కార్యవిషయా దృశ్యంతే

లౌకికములైన=(లోకములోఁగనుపించు) మణులు, మంత్రములు, ఓషధులు మొదలగు వానియందు సైతము దేశకాలనిమిత్త (వైచిత్ర్యవశాత్=) భేదములనుబట్టి (విరు... షయా) ఒకదానికొకటి సంబంధములేని విరుద్ధకార్యములనేకములను బుట్టించు శక్తులను జూచుచున్నారముగదా.

తా అపితావన్నోపదేశ మంతరేణ కేవలేన తర్కేణావ గంతుం శక్యంతే అస్య వస్తున ఏతావత్య ఏతత్సహాయా ఏతద్విషయా ఏతత్ప్రయో జనాశ్చ శక్తయ ఇతి

(అస్యవస్తునః ఈ యొక్కొక్క వస్తువు (మణి మంత్రౌషధులు) నందుంచు (తాఅపిశక్తయః=) నాయాశక్తులు సైతము 1 (ఏతావత్యః=) ఇంతపరిణామము గలవనియు 2. (ఏతత్సహాయాః=) ఈసహాయముగలవనియు 3. (ఏతద్విషయాః=) ఈ విషయములకు సంబంధించినవనియు (4) (ఏతత్ప్రయోజనాశ్చ=) ఈప్రయోజనము గలవనియు (తావత్ + ఉపదేశమంతరేణ) తెలిసినవారివలనఁ గాని గ్రంథములవలనఁగాని యెట్టియుపదేశము లేకుండఁగనే (కేవలేన తర్కేణ) కేవలయుక్తి సాధనములచేత (అవగంతుం=) గ్రహించుటకు (న + శక్యంతే=) సాధ్యపడవు గదా.

కిముతా చింత్య ప్రభావస్య బ్రహ్మణో రూపం వినాశబ్దేన ననిరూప్యేత

ఇట్టి సందర్భములో (అచింత్య ప్రభవస్య బ్రహ్మణః) నూహించుటకైనను సాధ్యముగాని బ్రహ్మముయొక్క (రూపం=] శక్తిస్వరూపము (వినాశబ్దేన=] శ్రుతి చెప్పుటచేతగాక (ననిరూప్యతే=) తెలిసికొనబడఁజాలదని (కిముత] వేఱఁ జెప్పవలయునా!

తథాహుః పౌరాణికాః

ఇట్లు పౌరాణికులు అనఁగా సంప్రదాయవేత్తలు (ఆహుః) చెప్పుచున్నారు చూడుఁడు.

అచింత్యా ఖలు .... లక్షణమ్ ఇతి (పురాణం) అచింత్యా ఖలు యేభావా, నతాం
స్తర్కేణ యోజయేత్ ప్రకృతిభ్యః పరంయచ్చ తదచింత్యస్య లక్షణమ్.

ఊహించుటకు సాధ్యపడని యేభావములు (=పదార్థములు) గలవో వానిని యుక్తులచేతఁ దెలిసికొనవలెనని ప్రయత్నించవలదు ((ప్రకృతిభ్యః=) సామాన్య లౌకికవిషయములకంటె (పరం=) పైగా (యత్ - చ) నేదిగలదో (తత్=) అట్టిదియే [అచింత్యస్య లక్షణం) ఊహించుటకు సాధ్యపడనిది. (యని యెఱుంగునది)

తస్మాచ్ఛబ్దమూల ఏవాతీంద్రియార్థ యాథాత్మ్యా ధిగమః

కాబట్టి యింద్రియముల కందని (అర్థ=) విషయముయొక్క (యాథాత్మ్యం =) వాస్తవస్థితిని (అధిగమం) గుర్తింపగల్గుట (శబ్దమూలః + ఏవ) శ్రుతిసహాయముచేతనేగాని మఱియొకవిధముఁ గాదుసుమీ!

పూర్వపక్షము :-

ననుశబ్దేనాపి నశక్యతే విరుద్ధోర్థః ప్రత్యాయయితుం

(విరుద్ధః + అర్థః=) ఒకవస్తువునం దున్నదని చెప్పు పరస్పర విరుద్ధవిషయ

ములను (ప్రత్యాయయితుం=) గ్రహింపఁజేయుటకు (శబ్దేన + అపి=) వేదముచే గూడ (ననుశక్యతే=) సాధ్యపడునందురా?

నిరవయవంచ బ్రహ్మపరిణమతే నచకృత్స్నమితి.

(అట్టివిరుద్ధవిషయ మెట్టిదనఁగా) అవయవములులేని బ్రహ్మము పరిణమించునట (=జగత్తుగా మారునట) ! (నచకృత్స్నం=) సమస్త బ్రహ్మము పరిణమించదట! (ఇంతకన్న విరుద్ధమేమున్నది.)

యదినిరవయం బ్రహ్మస్యాన్నైవ పరిణమేత

బ్రహ్మము నిరవయవమే యగుచో. (నైవ పరిణమేత=)అసలు పరిణమింపకయే పోవలెను. (పరిణమించునని చెప్పచో)

కృత్స్నమేవవా పరిణమేత

(కృత్స్న ... మేత=) పూర్తిగాఁ బరిణమించియే తీరవలెను !

అథ కేన చిద్రూపేణ పరిణమేత

(అథ=) అట్లుగాక (కేన ... మేత=) బ్రహ్మమేదియో యొకరూపమున (జగత్తుగా) మారుచున్నది.

కేన చిద్రూపేణావతిష్ఠేత రూపభేద కల్పనాత్ సావయవమేవ ప్రసజ్యేత

(కేనచి. . .తిష్ఠేత=) మఱింకేదియో యొకరూపమున మారకుండ నిల్చియుంటున్నది- అని బ్రహ్మమునకు రూపభేదము కల్పించు పక్షమున దానికి (ఆ బ్రహ్మమునకు) (సావయవమేవ=) 'అవయవములు గలది' యను దోషమే (ప్రసజ్యేత=) సంభవించి తీరును.

(సావయవ మెప్పుడగునో, అనిత్యమప్పుడే యగును.- సిద్ధాంతమంతయుఁ దారుమారై పోవును)

క్రియా విషయేహి

వేదముబోధించు క్రియావిషయము లైన

'అతిరాత్రే ...గృహ్ణాతి' శ్రుతి :- 'అతిరాత్రే షోడశినం గృహ్ణాతి

'అతిరాత్రమను పేరుగల క్రతువునందు షోడశియను పాత్రమును (ఒకానొకఁడు) స్వీకరించవలెను.

'నాతిరాత్రే షోడశినం గృహ్ణాతి'

'అతిరాత్రమను పేరుగల క్రతువునందు షోడశియను పాత్రమును (ఒకానొకఁడు) (నగృహ్ణాతి=) స్వీకరింపఁగూడదు.

ఇత్యేవం జాతీయకాయాం విరోధ ప్రతీతావపి వికల్పాశ్రయణం విరోధ పరిహార కారణం భవతి పురుషతంత్రత్వా దనుష్ఠానస్య

ఇట్టి విధివాక్యములయందుఁ (విరోధప్రతీతౌ + అపి) బరస్పరవిరుద్ధ క్రియా బోధ గోచరించుచున్నను, (పురుష... ష్ఠానస్య =) అనుష్ఠాన (=చేయుట) మన్నది పురుషుని చిత్తానుసారముండునది గావున (వికల్పాశ్రయణం=) బోధింపఁబడినక్రియ చేయుటయో లేక చేయకపోవుటయో యనఁగా రెంటిలోనొకదానిని నవలంబించుటయే (విరోధపరిహారకారణం=) విధివాక్యముల యందుండు విరోధమును బరిహరింపఁ గలిగియుండును- (పరస్పర విరుద్ధవిధుల రెంటినినొకసారిగాఁ జేయుట యసంభవముగాన, ఒకదాని నవలంబించినచో శాస్త్రవిధినెరవేర్చినట్లె యగుననిభావము)

ఇహతు వికల్పాశ్రయేణాపి న విరోధపరిహార స్సంభవతి అపురుష తంత్రత్వాద్వస్తునః

(ఇహతు=) ఇక్కడన్ననో అనఁగా 'నిరవయవ బ్రహ్మము జగత్తుగాఁ బరిణమించుచున్నది' 'బ్రహ్మముసమస్తముగాఁబరిణమింపదు' అని బ్రహ్మమెట్టిదో తెలిసికొనవలసిన సందర్భములోఁ జెప్పఁబడు నీరెండు విరుద్ధాంశములయందు— (అపురుష తంత్రత్వాద్వస్తునః=) బ్రహ్మవస్తువు పురుషుఁడొక క్రియనుజేయుట చేతనో లేక చేయకపోవుటచేతనో యేర్పడునది గాకపోవుటవలన- అనఁగా బ్రహ్మము సిద్ధవస్తువై యున్నందువలన- (వికల్పాశ్రయేణాపి=) పై రెండు విరుద్ధాంశములలో నొకదానిని స్వీకరించుట మాత్రముచేత (విరోధపరిహారః నసంభవతి=) బ్రహ్మబోధకాంశముల యందుండు నావిరోధము పరిహరింపఁ బడఁబోదు (జగత్కారణ బ్రహ్మము వాస్తవమున కెట్టిదియో తెలియఁబడఁబోదు)

తస్మాద్దుర్ఘటమేత దితి

కాబట్టి బ్రహ్మబోధవిషయములో శ్రుతులయందుండు నీపరస్పర విరోధము దుర్ఘటమైనదేసుమ ! (తొలగించుటకు సాధ్యముగానిదే)

సమాధానము :-

నైషదోషః అవిద్యాకల్పిత రూపభేదాభ్యుపగమాత్

ఆ పరస్పర విరోధము దుర్ఘట మెంతమాత్రమును కాదు బ్రహ్మమునకున్నదని చెప్పఁబడిన యీ జగద్రూపభేదము అవిద్య (=అజ్ఞానము)చేతఁ గల్పింపఁబడినదియని యంగీకరించుటవలన (ఆ పరస్పరవిరోధము పరిహారమును జెందును)

నహ్య విద్యాకల్పితేన రూపభేదేన సావయవం వస్తు సంపద్యతే

అవిద్య (=అజ్ఞానము—సమ్యగ్జ్ఞానమునకు భిన్నమైనయవస్థ) చేతఁ బ్రహ్మమునకుఁ గల్పింపఁబడిన యీ జగద్రూప భేదముచేత నాబ్రహ్మము (సావయవం=)

'అవయవములు గలది' (నహిసంపద్యతే=) గానేరదు (=అవయవములు గలదియని చెప్పుటకు వలనుపడదు)

నహి తిమిరోపహతనయనే నానేక ఇవ చంద్రమాదృశ్యమానోఽనేక ఏవ భవతి

(తిమిరోపహతనయనేన=) తిమిర (=ఒకవిధమైన కంటిజబ్బు) మను రోగము వలనఁ గను చేత్రదృష్టి తప్పినవానిచేతఁ జంద్రుడనేక చంద్రులుగాఁ జూడఁబడినంత మాత్రముచేత నొక్కఁడుగానే యున్న చంద్రుఁడు వాస్తవమున కనేక చంద్రులు (నహిభవతి=) గానేరదుగదా!

అవిద్యా కల్పితేవచ నామరూపలక్షణేన రూపభేదేన వ్యాకృతావ్యాకృతాత్మకేన

ఆ జగద్రూపభేద మెట్టిదనఁగా — (అవిద్యా=) సమ్యగ్జ్ఞానము (=బ్రహ్మావగతి=బ్రహ్మసాక్షాత్కారము=బ్రహ్మైకత్వజ్ఞానము) లేని (=నుండిజారిన) యవస్థచేతఁ (కల్పిత=) దెచ్చిపెట్టఁ బడినదియు, నామరూప లక్షణమైనదియు (=నామరూపములే యైనదియు), వ్యాకృతావ్యాకృత స్వరూప మైనదియు

తత్త్వాన్యత్వాభ్యా మనిర్వచనీయేన బ్రహ్మపరిణామాది సర్వవ్యవహారాస్పదత్వం ప్రతిపద్యతే

(తత్త్వా...నీయేన=) ఇదితత్త్వమా (=వాస్తవమైన బ్రహ్మమేనాలేక) మఱియన్యమా (=మఱియొకటియా) యని నిర్వచించుటకు (=విప్పిచెప్పుటకు) సాధ్యముగానిదియు నైయున్నయది- బ్రహ్మమున కిట్టి జగద్రూప భేదమునుగల్పించుట చేతనే (బ్రహ్మ...ప్రతిపద్యతే=) బ్రహ్మము జగత్తుగాఁ బరిణమించుచున్నది, బ్రహ్మమీజగత్తును సృష్టించుచున్నది బ్రహ్మమే యీ జగత్తు అను మొదలగు లౌకిక వైదిక సర్వవ్యవహారములు గల్గుచున్నయవి.

పారమార్థికేనచ రూపేణ సర్వవ్యవహారాతీత మపరిణత మవతిష్ఠతే

(అ విద్యావస్థచేతఁ గల్పింపఁబడిన యీజగద్రూపము లేనప్పుడు- అనఁగా బ్రహ్మసాక్షాత్కారావస్థలో) బ్రహ్మమన్నది లౌకిక వైదిక వ్యవహారములసొక్కు లేనిదియు, జగత్తుగాఁ బరిణమించనిదియునై- (పారమా...రూపేణ) తనయొక్క వాస్తవ స్వరూపము చేత(నే) (అవతిష్ఠతే=) నిల్చియుంటున్నది.

వాచారంభణ మాత్రత్వా చ్చావిద్యా కల్పితస్య నామరూపభేదస్యన నిరవయవత్వం

(ద్రష్టవ్యం: శ్రుతి ఛాం VI-I- 'వాచారంభణం వికారో నామధేయం....'

(అవిద్యాకల్పితస్య=) అవిద్యచేత బ్రహ్మమునందుఁ గల్పింపఁబడిన జగత్తను నీనామరూపభేదము (వాస్తవమునకులేక) అను శ్రుత్యనుసారముగా నోట నుచ్చరింపఁబడునది మాత్రమేయై యున్నందున, (బ్రహ్మణః నిరవయవత్వం=)

(బ్రహ్మము నిరవయము- అనఁగా బ్రహ్మము అవయవములేనిది పరిణామాదులను జెందునది కాదు'- అని తెల్పు శ్రుత్యర్థము (నకుప్యతి =) ఎట్టికోపమును (= బాధను భంగమును) జెందదు

మఱియును,

నచేయం పరిణామశ్రుతిః పరిణామ ప్రతిపాదనార్థా తత్ప్రతిపత్తౌ ఫలానవగమాత్

బ్రహ్మమునకుఁ (పరిణామశ్రుతిః + ఇయం) బరిణామమునుదెల్పుననునీశ్రుతి (న + పరిణామప్రతిపాదనార్థా =) పరిణామమునుదెల్పుట ప్రయోజనముగాఁ గలది గాదు ఎందుచేతననఁగా, (తత్ప్రతిపత్తౌ =) బ్రహ్మము పరిణామము (మార్పును జెందునది) ను జెందునదియని మాత్రము తెలిసికొన్నందున (ఫలానవగమాత్ =) ఫలమేమియు వచ్చునట్లు కనుపింపదు. (ఫలమేమియును దెలుపకుండ నేశ్రుతియైనను నొకవిషయమును జెప్పుచున్నట్లు కనుపించుచో, ఆవిషయమునే తెల్పుట శ్రుతి యొక్క ముఖ్యాభిప్రాయము కాదనియు ముఖ్యాభిప్రాయము మఱియొకటి యుండు ననియు నెఱుంగునది)

సర్వవ్యవహార హీన బ్రహ్మాత్మ భావ ప్రతిపాదనార్థాత్వేషా తత్ప్రతిపత్తౌ ఫలావగమాత్

(ఏషా =) బ్రహ్మమునకుఁ బరిణామమును దెల్పుసను నీశ్రుతి లౌకిక వైదిక సర్వవ్యవహార శూన్యమైయుండు (బ్రహ్మాత్మభావ=) జీవబ్రహ్మైక్య భావమును (ప్రతిపాదనార్థా + తు) దెల్పుటమాత్రమే ప్రయోజనముగాఁ గలదిసుమా! అట్లని చెప్పుట యెట్లందురేమో ! (తత్ప్రతిపత్తౌ =) ఆజీవబ్రహ్మైక్య భావానుభవము వలన ఫలము ప్రత్యక్షముచేయఁబడు చున్నది చూడుఁడు !

'స ఏషనేతినే త్యాత్మా' ఇత్యుపక్రమ్య బృ v-9-26 'స ఏషనేతినే త్యాత్మా'

'(సః + ఏషః + ఆత్మా =) ఆయీయాత్మ (= బ్రహ్మము) (న + ఇతి; న + ఇతి) ఇదిగాదిదిగాదు (అనఁగా :- చూపెట్టఁదగిన చింతింపఁదగిన యే వస్తువును ఏ భావమును గాదుసుమా)

అని శ్రుతి యారంభించి తుదకు

'అభయం వై జనక ప్రాప్తోసి' ఇతి- బృ VI-2-4 'అభయం వై జనక ః ప్రాప్తోసి'

'(జనక! =) ఓ జనకుఁడా ! (అభయం =) భయరహితమైనవస్తువును- అనఁగా జీవన్ముక్తి యనుబ్రహ్మమును (ప్రాప్తః + అసి =) పొందినవాఁడ వగుచున్నావు- అనఁగా బ్రహ్మైక్యభావానుభవముగల వాఁడవగుచున్నావు- అనఁగా బ్రహ్మమే నీవైయున్నావు (ఈ తుట్టతుది వాక్యమువలన. శ్రుతిభావము బ్రహ్మైక్య ఫలమునుఁ జూపెట్టుచేయని స్పష్టమగుచున్నది-

తస్మాదస్మత్పక్షేన కశ్చిదపి దోషప్రసంగోఽస్తి

కాబట్టి మాయుపనిషన్మత (=అద్వైతమత)మందే శ్రుతియందును బ్రహ్మము పరిణామము చెందునది యను మొదలగు నెట్టిదోషమును జూపుటకు సాధ్యముగాదు.

28 సూత్రావతారిక :-

లోగడి సూత్రమందు శ్రుతియొక్క భావము పరిణామవాదము గాదనియు, వివర్తవాదమే యనియు అనఁగా, బ్రహ్మమునందీజగత్తు మాయామాత్రముగాఁ గల్పింపఁబడినదనియుఁ, దద్విధముగా (వివర్తముగా) బ్రహ్మమీజగత్తునకుపాదానమై యున్నను, బ్రహ్మమీ జగత్తుగాఁ బరిణమించినదని చెప్పఁదగిన యెట్టిదోషమును రాదనియు, అనఁగా- బ్రహ్మమున్నదున్నట్టుగానేయుండి యీ మాయామాత్ర జగత్తునకుఁ గారణమగుచున్నది యని శ్రుతిప్రమాణానుసారముగాఁ జెప్పఁబడినది. ఈ విషయమే స్వప్నసాక్షి దృష్టాంతముతో నీసూత్రమందు బలపరచఁబడుచున్నది.

## ౨౮ సూ॥ ఆత్మని చైవం విచిత్రాశ్చహి

ప॥ వి :- ఆత్మని-చ-ఏవం-విచిత్రాః-చ-హి

ప్ర॥ ప॥ అ :- ఆత్మని=(స్వప్నమునుగాంచు) జీవునియందును చ=(దేవతాదులయందు)ను; ఏవం ఈవిధముగానే- ఇట్టివే- విచిత్రాః=విచిత్రములు (వస్తువు మారకుండ నావస్తువులోనుండియేవచ్చువిశేషములు); చ=(పరమాత్మయందు); గూడ హి=అల్లికదా.

సూ॥ భా :- (ఆత్మనిచ) ఒక్కటేయైయుండు జీవాత్మయందు స్వప్నకాలములోను దేవతాదులయందును అనేకాకారమైన సృష్టివినఁబడుచునే యున్నదిగదా అప్పుడా జీవాత్మకుగాని దేవతాదులకుఁగాని కృత్స్నప్రసక్త్యాది దోషములు సంభవించుట లేదనుట ప్రత్యక్షవిషయమే- (ఏవం-చ) ఇవ్విధముగానేమహామాయతోఁ గూడియున్న పరమాత్మయందును (విచిత్రాః) వివిధములైన పదార్థములేల పుట్టఁగూడదు? కాబట్టి కృత్స్నప్రసక్త్యాది దోషములు బ్రహ్మమునకును గలుగవు ఇందులకు శ్రుతిప్రమాణము సైతముగలదు.

భాష్యము భాష్యార్థము

అపిచ నైవాత్ర వివదితవ్యం; కథమేకస్మిన్ బ్రహ్మణి స్వరూపానుపమర్దేనైవానేకాకారా సృష్టిస్స్యాదితి

(అపిచ-) మఱియును (అత్ర=) ఈవిషయము (ఇట్టిదిసంభవమగునా-కాదా యనువిషయము) (నవివదితవ్యం ) వివాదాస్పదమైనదిగాదు. (సందేహింపఁదగినది

గాదు) ఆ విషయమేమనఁగా :- (ఏకస్మిన్ బ్రహ్మణి=) ఒక్కటిగానుండు బ్రహ్మమునుండి (స్వరూపా-ద్దేన+ఏవ=) దానిస్వరూపమున్నదున్నట్లుగానుండియే (అనేకాకారసృష్టిః=వివిధవిచిత్ర) రూపములతోఁ గూడిన యీజగత్సృష్టి (కథంస్యాత్ -) యెట్లు కాఁగలదు! (ఇతి=) అనునదియేసుమా

యతః ఆత్మన్యేకస్మిన్ స్వప్నదృశి స్వరూపానుపమర్దేనైవా నేకాకారా సృష్టిః పఠ్యతే

(యతః=) ఈ విషయము నిర్వివాదమెందు చేతననఁగా- (స్వప్నదృశి=) స్వప్నమునుగాంచునట్టి (ఏకస్మిన్ ఆత్మని=) యొక్క జీవాత్మనుండియే (స్వరూ... నైవ=) దాని స్వరూపము చెడకుండఁగనే- అనఁగా అది యున్నదున్నట్లుగా నుండియే (అనేకాకారాసృష్టిః=) వివిధాకారములగు స్వప్నదృశ్యములు పుట్టుచు న్నట్లు

'న తత్ర....పథస్సృజతే' బృ VI-3-10 'నతత్ర రథానరథయోగా నపంథానో భవంత్యథ రథాన్ రథయోగాన్ పథస్సృజతే'

'(తత్ర=) స్వప్నమునందు (వాస్తవమునకు) (రథాః=) రథములు (న=) లేవు (న-రథయోగాః=) గుఱ్ఱములు లేవు. (పంథానః=) మార్గములు (నభవంతి=) లేవు- (అథ=) అట్లయినను (రథాన్-రథయోగాన్-పథః=) రథములను గుఱ్ఱములను మార్గములను (ఆత్మా=జీవాత్మ) సృజతే=సృష్టించుచున్నది (పఠ్యతే=) పఠింపఁబడుచున్నది-

ఇత్యాదినా

ఈ మొదలగు వాక్యములచేత

లోకేపి దేవాదిషు మాయావ్యాదిషుచ స్వరూపానుమర్దే నైవ విచిత్రా హస్త్యశ్వాది సృష్టయో దృశ్యంతే

(లోకేపి=) స్వప్నములోఁగాక లోకములోఁగూడ (దేవాదిషు=) దేవతలు మహానుభావులు మొదలగువారి నుండియును, (మాయావి+ఆదిషు) ఇంద్రజాలకులు, గారడివాండ్లు మొదలగువారినుండియు, (స్వరూపా... నైవ=) వారిస్వరూపము చెడకుండఁగనే (విచిత్రాః=) వివిధములగు (హస్త్య...ష్టయః=) నేనుఁగులు, గుఱ్ఱములు మొదలగు నెన్నియో వస్తువులు పుట్టుచున్నట్లు (దృశ్యంతే=) కనుపట్టుచున్నవిగదా!

తథైకస్మిన్నపి బ్రహ్మణి స్వరూపానుపమర్దే నైవానేకాకారాసృష్టి ర్భవిష్యతీతి

(తథా=) అట్లె యొక్కఁడేయగు బ్రహ్మమునుండియును (స్వరూ...నైవ) దాని స్వరూపము చెడకుండఁగనే (అనేకాకారాసృష్టిః=) వివిధ రూపములతోఁ గూడిన జగత్సృష్టి (భవిష్యతీతి=) కాఁగలదు-

29 సూత్రావతారిక :-

బ్రహ్మజగత్కారణ విషయములో 26వ సూత్రమందు సాంఖ్యాదిపూర్వ పక్షులుచూపిన (కృత్స్నప్రసక్త్యాది) దోషములను 27-28 సూత్రములందుఁ బరిహ రించుటయేగాక, అట్టిదోషములుఅనఁగా కృత్స్నప్రసక్తి-నిరవయవత్వదోషము అను నవి సాంఖ్యమతములయందేయున్నవని యీ29సూత్రముచే సూత్రకారుఁడుచూపు చున్నాడు.

## ౨౯ సూ॥ స్వ ప క్ష దో షా చ్చ

ప॥ వి :- స్వపక్షదోషాత్-చ

ప్ర॥ ప :- స్వపక్షదోషాత్; స్వపక్ష = తమ వాదములయందు- అనగా సాంఖ్యనైయాయిక సిద్ధాంతములయందే, దోషాత్ = ఆయా దోషములుండుట వలన, చ=సైతము (పైరెండు సూత్రములలోఁ జూపఁబడిన వివర్తవాదమే నిర్దుష్టమైనది)

సూత్రభావము :— (స్వపక్షే) - 26 సూత్రములో సాంఖ్యాది మతస్థులు బ్రహ్మజగత్కారణవాద విషయమై మోపిన కృత్స్నప్రసక్తి - నిరవయవత్వ శబ్దదోషములను దోషములు వారివారి మతానుసారముగా జగత్కారణములై నిరవయవములైన ప్రధానమందును-పరమాణువులయందును జూపెట్టఁబడఁదగిన (దోషాత్) దోషములేయై యుండుటవలన, వారివారి యాక్షేపములు చెల్లకపోఁగా బ్రహ్మజగత్కారణవాదమే స్థిరపడుచున్నయది.

భాష్యము భాష్యార్థము

పరేషామప్యేష సమానస్స్వపక్ష దోషః

(పరేషామపి=) సాంఖ్యాదులగు నితర మతస్థులకుఁగూడ (ఏషః=) కృత్స్న ప్రసక్తి (=సమస్తబ్రహ్మము జగత్తుగాఁ బరిణమించిపోవుట మొదలగునట్టి యీ (స్వపక్షదోషః ) స్వపక్షమందుండు దోషము (సమానః=) సమానముగానే యున్నది.

ప్రధానవాదినోఽపి నిరవయవమపరిచ్ఛిన్నం శబ్దాదిహీనం ప్రధానం సావయవస్య పరిచ్ఛిన్నస్య శబ్దాదిమతః కార్యస్య కారణమితి స్వపక్షః తత్రాపికృత్స్న ప్రసక్తి ర్నిరవయవత్వాత్ప్రధానస్య ప్రాప్నోతి నిరవయవత్వాభ్యుపగమకోపోవా

(ప్రధానవాదినోఽపి=) ప్రధానవాదులగు సాంఖ్యులకు సైతము 'అవయవ ములు లేనిదియు పరిచ్ఛిన్నముగానిదియు (=సంపూర్ణమైనది), శబ్దాదిగుణములు లేని

దియు నగు ప్రధానమనునది అవయవములు గల్గినట్టియు, పరిచ్ఛిన్న మైనట్టియు (పరిమితమైనట్టియు) శబ్దాదిగుణములు గల్గినట్టియు (కార్యస్య=) జగత్తును (కారణం=) బుట్టించిన కారణమని (స్వపక్షః=) వారిమతము— (తత్రాపి=) ఆ సాంఖ్యుల మతమందుఁగూడ (నిరవయత్వాత్ప్రధానస్య=) ప్రధాన మనునది యవయవములులేనిది యనియే చెప్పఁబడు చున్నందున, (కృత్స్నప్రసక్తిః=) సమస్తప్రధానము జగత్తుగాఁ బరిణమించుటయు- లేక (అట్లుగాక యది యవయవము లు గలదియని చెప్పుపక్షమున) (నిరవయ...కోపః + వా=) ప్రధానము నిరవయవమనెడి వారిసిద్ధాంతము భంగమునుబొందుటయో (కలుగకమానదు)

ఎదురుప్రశ్న :-

ననునైవ తైర్నిరవయవం ప్రధాన మభ్యుపగమ్యతే సత్త్వరజస్తమాంసిహి త్రయో గుణాః తేషాం సామ్యావస్థా ప్రధానం తైరేవచావయవైస్తత్సావయవ మితి

అయ్యా ! (మీరు పొరపడుచున్నారు) – (తైః=) ఆ సాంఖ్యులచేతఁ దమ ప్రధానము నిరవయవమని (నైవ + అభ్యుపగమ్యతే=) యంగీకరింపఁబడుటయేలేదు వారి మతానుసారము సత్త్వము-రజము-తమస్సు అనెడి మూడుగుణములు గలవు. ఈమూడు గుణములయొక్క సామ్యావస్థయే (అనఁగానామూడు గుణములొకదాని నొకటి మించకుండ సమానస్థితిలో నుండుటయే) వారిచే బ్రధానమని చెప్పఁబడును కాబట్టి యాప్రధానమున కామూడుగుణములే యవయవము (భాగము) లని చెప్పఁదగును అందుచే వారి మతానుసారము ప్రధానము సావయవమే (=అవయవములు గలదియే) యగుచున్నది సుమా !

సమాధానము :-

నైవం జాతీయకేన సావయవత్వేన ప్రకృతోదోషః పరిహర్తుం పార్యతే

(ఏవంజాతీయకేన=) పైనఁజెప్పినవిధమున- అనఁగా ప్రధానమున కామూడు గుణములే యవయవములగుటచేఁ (సావయవత్వేన=) బ్రధానము సావయవ (=అవయవములు గలది) మగుచున్నదియని చెప్పినంత మాత్రముచేత (ప్రకృతోదోషః=) 'నిరవయవ ప్రధానమునుండి సావయవ ప్రపంచ మేర్పడుచున్నది యను దోషము (పరిహర్తుం=) లేకుండఁబోవుటకుఁ (నపార్యతే=) గుదరదు. (అనఁగా ప్రధానము సావయవమని యెంతవిఱిచి సమర్థింపఁ బ్రియత్నించినను, రానున్న దోషము రాక మానదు)

యతః సత్త్వ రజస్తమ సామప్యే కైకస్య సమానం నిరవయవత్వమేకైక మేవ చేతరద్వయాను గృహీతం సజాతీయస్య ప్రపంచస్యోపాదాన మితి సమానత్వాత్ స్వపక్ష దోష ప్రసంగస్య

(యతః=) ఎందుచేతననఁగా :- (కారణములైన) సత్త్వము - రజము - తమస్సు అను నీమూఁడు గుణములందే యొక్కటియైనను నిరవయవమని యంగీకరించుట- (కారణబ్రహ్మము నిరవయవమని యంగీకరించినట్లు) బ్రహ్మజగత్కారణ వాదులతో (సమానం) నొక సమానము- నిరవయవమైన యీ యొక్కొక్కటియే- అనఁగా సత్త్వము-రజము-తమస్సు అనుగుణము లొక్కొక్కటియే తాను బ్రధానముగా నుండి (ఇతరద్వయానుగృహీతస్య=) మిగిలిన రెండుగుణములయొక్క సహాయమును మాత్రము పొందినదై (సజాతీయస్య ప్రపంచస్య=) తనవంటిప్రపంచమును- అనఁగా సత్త్వము సావయవమగు సాత్త్వికపదార్థమును రజము సావయవమగు రాజసపదార్థమును, తమస్సు సావయవమగు తామసపదార్థము (ఉపాదానమితి=) బుట్టించుచున్నదని యంగీకరించుట (అనిరవయవ బ్రహ్మమే వివిధ సావయవ జగత్తునకుఁ గారణమని యంగీకరించినట్లు) బ్రహ్మజగత్కారణ వాదులతో (సమానత్వాత్=) మఱియొకసమానము - దోషములని చెప్పఁబడు నీ రెండంశములు (స్వపక్షదోషప్రసంగస్య=) సాంఖ్యులపక్షమందును దోషముగానేయున్నవని తేలుచున్నది గదా !

పూర్వపక్షి :-

తర్కా ప్రతిష్ఠానాత్ సావయవత్వమేవ

పైనఁ దెలిపిన విధమున [జగత్తును బుట్టించుచున్న యీ ప్రధానము నిరవయవమని కేవలయుక్తి యాధారముచేతఁ దేల్చఁబడినందున] [తర్కాప్రతిష్ఠానాత్ =] యుక్తియెప్పుడును నిలుకడగలది గాకపోవుటచేఁ బ్రధానము [నిరవయవము గానేరదు] వాస్తవమునకు [సావయవత్వమేవ=] సావయవమే-

సిద్ధాంతి-

ఇతి చేత్

అని చెప్పుదురేమో !

ఏవమప్య నిత్యత్వాది దోషప్రసంగః

[ఏవమపి=] అట్లుగుపక్షమున నైతము [అనిత్య-ప్రసంగః=] ప్రధానము [సావయవము-అందుచే] అనిత్యమైనది- 'అను మొదలగు దోషములు మీసాంఖ్యసిద్ధాంతమున కాపాదింపక మానవు [అవయవముగలది యెల్లను అనిత్యమనియే చెప్పఁబడును]

అథశక్తయ ఏవ కార్యవైచిత్ర్య సూచితా అవయవా ఇత్యభిప్రాయః

(నిరవయవములైన గుణములయొక్క కూడికచేఁ బ్రధానము సావయవమగునని చెప్పఁబడఁజాలకున్నను) ప్రధానమునుండి పుట్టుచున్న (కార్యవైచిత్ర్య=)

వివిధరూపజగత్తుచే (సూచితాః=) సూచింపఁబడు (శక్తయఏవ=) ప్రధానమందుండు శక్తులే ప్రధానమున కవయవము లగునని (ఏలచెప్పగూడదని) (ఇత్యభిప్రాయః=) నీయభిప్రాయమేమో !

తాశ్చ బ్రహ్మవాదినోఽప్యవిశిష్టాః

(తాశ్చ-) ఆశక్తులుబ్రహ్మకారణవాది విషయములోనైనను (అవిశిష్టాః=) భేదము లేకుండఁగనే యున్నవి. అనగా :- సావయవత్వదోషమును దప్పించుకొనుటకై ప్రధానమునుండి కేవలముగా జగత్తుపుట్టుటలేదు. ప్రధానమందుండు శక్తులచేతఁ బుట్టుచున్నదని చెప్పుచో కేవల బ్రహ్మమే యుపాదానముగా జగత్తగుటలేదు. బ్రహ్మమందుండు మాయాశక్తిచేత జగత్తేర్పడుచున్నది, యని చెప్పు బ్రహ్మకారణవాదులయందు సాంఖ్యులు పట్టఁగల దోషమేమి ! యనియభిప్రాయము.)

తథాఽణువాది నోప్యణురణ్వంతరేణ సంయుజ్యమానో

అణువాదులైన నైయాయికులు చెప్పుచున్నది యేమనగా :- నిరవయవములైన పరమాణువులలో (అణురణ్వంతరేణ=) ఒకయణువు మఱియొక యణువుతో (సంయుజ్యమానః=) గలిసినది కాఁగా నీజగత్తేర్పడుచున్నది,(యనిగదా యందురు)

నిరవయవత్వాత్ కార్త్స్న్యేన సంయుజ్యేత

(నిరవయవత్వాత్=) ఒక్కొక్క యణువు నిరవయవమే యగుటచేత, అది యట్టిదేయగు రెండవ యణువుయొక్క (1) కార్త్స్న్యేన సంయుజ్యేత=) పూర్తితోఁ గలియుచున్న దన్నచో

తతః ప్రథిమానుపపత్తే రణుమాత్రత్వ ప్రసంగః

(ప్రథిమానుపపత్తేః=) పెద్దదియగున్నదని చెప్పుటకు వీలులేనందున (అణు ... ప్రసంగః=) అణువు అణువుగానే యున్నదని చెప్పవలసి వచ్చును. (అనగా నిరవయవములగు రెండణువులుగలిసినను మొదటియణు వెంతగానుండునో రెండును గలిసినదిగూడ నంతగానే యుండునుగాని పరిమాణము హెచ్చదని భావము) అణువుల కలయిక వలనఁ పరిమాణబాహుళ్య మేర్పడకున్నచో పెద్దదగు జగత్తేర్పడుట కవకాశమే లేదని సూచింపఁ బడినది.

అథైకదేశేన సంయుజ్యేత

(2) అట్లుగాక ఒకయణువు మఱియొక యణువుయొక్క కొంతభాగముతోనే కలియుచున్నదన్నచో, (అణువులు సావయవములని యొప్పుకొన్నట్లగుటచే)

తథాపి నిరవయవత్వాభ్యుపగమ కోప

అణువు నిరవయవమని చెప్పు నైయాయిక సిద్ధాంతసూత్రమునకే (కోపః=) భంగము వాటిల్లును.

ఇతి స్వపక్షేఽపి సమానఏష దోషః

(ఏషఃదోషః=) బ్రహ్మముయొక్క యొకభాగమే జగత్తుగాఁ బరిణమించు నన్నచో బ్రహ్మము నిరవయవమనెడి సిద్ధాంతమునకు భంగమువాటిల్లునని పూర్వపక్షి చెప్పుదోషము (స్వపక్షేఽపి) తనపక్షమందును (సమానః=) సమానమేయగును (పూర్వపక్షి బ్రహ్మవాదిపై మోపిన దోషము తనపైన సైతము కూలుచున్నదని భావము)

సమానత్వాచ్చనాన్యత రస్మిన్నేవ పక్షే ఉపక్షేప్తవ్యో భవతి

బ్రహ్మవాదిమతముపై పూర్వపక్షి మోపిన దోషము తనమతము నందును సమానమే యగుటవలన, అనఁగా రెండుపక్షములలోఁ బ్రతియొక పక్షమందునుఆ దోషము సమానముగానే యున్నందువలన, (ఉపక్షేప్తవ్యో నభవతి=) పూర్వపక్షి (తనలోపమెఱుగఁక) యెదిరివానిపై దోషములను గుణించుట సరియైన పనిగాదు.

పరిహృతస్తు బ్రహ్మవాదినా స్వపక్షే దోషః

(బ్రహ్మవాదిపైనున్న దోషమే పరునిపైసైతము గలదన్నచో బ్రహ్మవాదికేమి ప్రయోజనమని యందురేమో. అట్లనుట కవకాశము లేదు=) (స్వపక్షే దోషః=) తనవాదముపై పూర్వపక్షి మోపినదోషము (బ్రహ్మవాదినా) బ్రహ్మవాదిచేత ముందే (పరిహృతస్తు=) పరిహరింపఁబడియే యున్నది. (బ్రహ్మమునకు జగత్తుగాఁ బరిణామమే లేదనియు అనఁగా జగత్తు బ్రహ్మముయొక్క యథార్థము గాక వివర్తమనియు అనఁగా బ్రహ్మమెంత మాత్రమును గదలకుండఁగనే (చెదర కుండఁగనే- చెఱుపును జెందకుండఁగనే దానిలోనుండు మాయాశక్తియే) యుపాదాన కారణమగు చుండుటచే నీజగత్తేర్పడు చున్నదనియు నిదివరకే బ్రహ్మవాది 27–28 సూత్రములలో సమాధానమును జెప్పియున్నాఁడని భావము.

# సర్వోపేతాధికరణము

అధికరణావతారిక :-

బ్రహ్మజగత్కారణ వాదమునుగూర్చి మఱియొక విధముగా వచ్చినయాక్షేపమును నిరాకరించుట కీయధికరణము సైతమేర్పడినది. స్వప్నాది దృష్టాంతములచే మాయాశక్తి సహితమగు బ్రహ్మమే జగత్కారణమని పూర్వాధికరణమందు నిశ్చయింపఁ బడినది. బ్రహ్మమశరీరి గావున, బ్రహ్మమందీ విచిత్ర జగద్రచనా శక్తియగు మాయయెట్లుండఁ గలదనివచ్చిన పూర్వపక్షము ఈ యధికరణముచే

నిరసింపఁబడు చున్నయది- శరీరములేని పదార్థమెట్టి దానికిని (ఎట్టిశక్తికిని) నాశ్రియము కాఁజాల'దను న్యాయముపై నీపూర్వపక్ష మాధారపడియున్నది.

30 సూత్రావతారిక :- విచిత్రకార్యశక్తి గలిగియున్నను బ్రహ్మ మొక్కటియేయని చెప్పఁదగునని శ్రుతిప్రమాణముతో నీసూత్రము సమర్థించుచున్నది.

## 30 సూ॥ సర్వోపేతాచ తద్దర్శనాత్

ప. వి :- సర్వోపేతా-చ-తద్దర్శనాత్

ప్ర. ప. అ :- సర్వోపేతా; - (సృష్టిని గావించిన బ్రహ్మమను పరదేవత) సర్వ=సమస్తములైన శక్తులచేత, ఉపేతా = కూడుకొని యున్నదియే; తద్దర్శనాత్-చ; తత్ =బ్రహ్మమట్టి శక్తిగలదని, దర్శనాత్-చ=శ్రుతి చెప్పుచుండుట వలనఁగూడ.

సూ॥ భావము :- (సర్వోపేతా) పరమాత్మ (బ్రహ్మము) యైన పరదేవత యశరీరియైనను సర్వశక్తులతోఁ గూడుకొనియున్నదియే-

(తద్దర్శనాత్-చ) అట్లుచెప్పుట యెట్లందురేమో- ఛా III-14-1 'సర్వకర్మా సర్వకామః సర్వగంధః సర్వరసః...' ఈ మొదలగు శ్రుతులే సృష్టికర్తయు, పరదేవతయునగు బ్రహ్మమట్టిదని చాటుచున్నయవి.

భాష్యము భాష్యార్థము

ఏకస్యాపి బ్రహ్మణో విచిత్రశక్తి యోగాదుపపద్యతే విచిత్రోవికార ప్రపంచ ఇత్యుక్తం

బ్రహ్మ మొక్కటియే యైనను, (విచిత్ర=) వివిధములైన శక్తులుగలదియైనందువలన, ఆ బ్రహ్మమునుండి (విచిత్రః=) వివిధ రూపములైన యీ వికార ప్రపంచము పుట్టినదని చెప్పఁబడినదిగదా!

తత్పునః కథ మవగమ్యతే విచిత్రశక్తి యుక్తం పరంబ్రహ్మేతి

ఆ పరబ్రహ్మమట్టి వివిధశక్తులు గలదియను నావిషయమెట్లు తెలిసికొనఁదగియున్నది?

తదుచ్యతే

ఎట్లో చెప్పఁబడుచున్నది. చూడుఁడు

సర్వోపేతాచ తద్దర్శనాత్

'సర్వోపేతాచ తద్దర్శనాత్' అని సూత్రము చెప్పుచున్నది.

సర్వశక్తి యుక్తాచ పరాదేవతేత్యేవ గంతవ్యం

సృష్టి గావించినదని (ఛాం VI-3-2 'సేయం దేవతా...' శ్రుతియందుఁ జెప్పఁబడిన (పరాదేవతా=) పరదేవత సర్వశక్తులతోఁ గూడినదని (అవగంతవ్యం=) గ్రహింపఁబడవలసి యున్నది.

కుతః?

అట్లు గ్రహింపఁగల్గుట యెట్లన-

తద్దర్శనాత్

ఆ విషయమునుగూడ శ్రుతియే చెప్పుచున్నది.

తథాహి దర్శయతి శ్రుతిః సర్వశక్తి యోగం పరస్యా దేవతాయాః

(పరస్యాదేవతాయాః =) ఆ పరదేవతకు (=సృష్టికర్తయైన బ్రహ్మమునకు) (సర్వ... యోగం=) సర్వశక్తులుండుట శ్రుతులే చూపుచున్న విధిగో చూడుఁడు.

'సర్వకర్మా నాదరః' ఛాం III-14-2 '....సర్వకర్మా సర్వకామ స్సర్వగంధ స్సర్వ రస స్సర్వమిద మభ్యాత్తోఽవాక్యనాదరః'

'(సర్వకర్మా=) సర్వకర్మములు గలవాడు అనఁగా జగత్కర్త- (సర్వకామః=) సర్వకామములు గలవాడు అనఁగా ఆప్తకాముఁడు (సర్వగంధః=) సర్వగంధములు గలవాడు (సర్వరసః=) సర్వరసములు గలవాడు (అవాకీ=) రాగాదింద్రియములు లేనివాడు (అనాదరః=) దేనియందును ఇచ్ఛలేనివాడు అట్టివాడు (ఇదంసర్వః) ఈ సర్వజగత్తును (అభ్యాత్తః=) వ్యాపించియున్నవాడు-

'సత్యకామ స్సత్యసంకల్పః' ఛాం VIII-7-1 '.. సత్యకామ స్సత్యసంకల్పః....'

'(సత్యకామః=) వ్యర్థములుగాని కోర్కెలుగలవాడు (సత్యసంకల్పః=) వ్యర్థములుగాని తలంపులు గలవాడు'

'యస్సర్వ....విత్' ముం I-1-9 'యస్సర్వజ్ఞ స్సర్వవిత్....'

'(యః=) ఎవఁడు, (సర్వజ్ఞః=) సర్వజ్ఞుఁడో, (సర్వవిత్=) సర్వవేత్తయో

'ఏతస్య....తిష్ఠతో' బృ V-8-9 'ఏతస్యవా అక్షరస్య ప్రశాసనే గార్గి సూర్యాచంద్రమసౌ విధృతౌ తిష్ఠతః'

'(గార్గి=) ఓ గార్గీ- (ఏత ..రస్య=) ఈ యక్షరుఁడైన పరమేశ్వరుని యొక్క (ప్రశాసనే=) తీవ్రమైన యాజ్ఞయందు (సూర్యా...మసౌ=) సూర్యచంద్రులు (విధృతౌ=) సర్వవ్యాపార నిపుణులై (తిష్ఠతః=) నిల్చుచున్నారు.

ఇత్యేవం జాతీయకాః

ఇట్టివే మఱికొన్ని శ్రుతులును జూపఁదగియున్నవి.

31 సూ॥ తాత్పర్యము :— బ్రహ్మము సర్వశక్తులు గలదనియు, నందుచే బ్రహ్మముయొక్క యేకత్వమునకు హానిలేదనియుఁ బూర్వసూత్రమందుఁ జెప్పఁబడినది. సర్వశక్తులు గలిగియున్నను, బ్రహ్మమింద్రియములు గలది గాక పోవుటచే నాశక్తులను బయల్పఱపఁదగిన సాధనములు లేనందున జగన్నిర్మాణ సామర్థ్యము బ్రహ్మమునకు లేదని వచ్చిన యాక్షేపమీ సూత్రమందుఁ బరిహరింపఁబడుచున్నది

## ౩౧ సూ॥ వికరణత్వాన్నేతి చేత్తదుక్తం

ప. వి :- వికరణత్వాత్-న-ఇతి చేత్-తత్-ఉక్తం

ప్ర. ప. అ :- వికరణత్వాత్ =(బ్రహ్మము) ఇంద్రియములు గలది గాక పోవుటవలన, న=అట్లుకాదు (బ్రహ్మము జగత్తును చేయలేదు) ఇతి చేత్ = అని యాక్షేపించుచో (బ్రహ్మమందట్టి దోషము చెప్పుచో) తత్ = ఆదోషపరిహారము, (ఉక్తం=) ఇదివరకే చేయఁబడినది.

సూ భా:- (వికరణత్వాత్) 'బృ. V-8-8 'అచక్షుష్క మశ్రోతం' ఇత్యాది శ్రుతులు బ్రహ్మము దేహేంద్రియములు గలదిగానట్లు తెల్పుచుండుట వలన, (న) బ్రహ్మము సర్వశక్తులతోఁ గూడినదైనను జగత్కారణ మగుటకు సమర్థమైనది కాదు- (ఇతి చేత్) అని యాక్షేపించుచో, (తదుక్తం=) (బ్ర సూ II-1-27) 'శ్రుతేస్తు శబ్దమూలత్వాత్' అను మొదలగు సూత్రములచేనట్టి దోషమిదివరకే పరిహరింపఁ బడియున్నది. సామాన్యముగా నొకనికి దేహేంద్రియ సాధనములు లేనిది యేపనియుఁ జేయగల్గు సామర్థ్యముండనేరదు. అను నియమము సర్వత్ర నుపయోగింపఁదని యెఱుంగునది.

భాష్యము భాష్యార్థము

స్యాదేతత్

బ్రహ్మమును పరదేవత సర్వశక్తులు గలిగి యున్నదనుండనిమ్ము!

వికరణాం పరాం దేవతాం శాస్త్రి శాస్త్రం 'అచక్షు....మనః' ఇత్యేవం జాతీయకా

బృ V-8-8 "అచక్షుష్క మ శ్రోత్ర, మవా, గమనః"

కాని (శాస్త్రం=) వేదమే యా పరదేవతను 'కన్నులులేనిది, చెవులులేనిది వాక్కులేనిది, మనస్సులేనిది' ఈ మొదలగు శ్రుతులచేత (వికరణాం=) ఇంద్రియములు లేనిదానినిగాఁ (శాస్తి=) చెప్పుచున్నదిగదా!

కథం సా సర్వశక్తి యుక్తాపి సతీ కార్యాయ ప్రభవేత్

(సా=) ఆ పరదేవత సర్వశక్తులు కలిగియున్నదే యైనను (ఇంద్రియసాధన

ములు లేనిదే) (కార్యాయ=) సృష్టికార్యము చేయుటకొఱకు (కథంప్రభవేత్ =) సమర్థమైనది యెట్లు కాఁగలదు?

దేవాదయోహి చేతనా స్సర్వశక్తి యుక్తా అపిసంతః ఆధ్యాత్మికకరణ సంపన్నా ఏవ

దేవతలు మొదలగువారన్ననో, చేతనులు సర్వశక్తులు గలవారైయుండుట యేగాక (ఆధ్యాత్మిక=) దేహసంబంధమైన (కరణ=) యింద్రియములు (సంపన్నా ఏవ=) గలవారగుట చేతనేగదా-

తస్మై తస్మై కార్యాయ ప్రభవంతో విజ్ఞాయంతే

ఆయా (మహా) కార్యములను జేయుటకొఱకు (ప్రభవంతః) సమర్థులైనట్లు (విజ్ఞాయంతే=) తెలియఁబడుచున్నారు (=వినుచున్నారము)

కథంచ "నేతినేతి" ఇతి ప్రతిషిద్ధ సర్వవిశేషాయా దేవతాయాః సర్వశక్తియోగః స్సంభవేద్ధితిచేత్ బృ III-9-26 "నేతినేతి"

ఆ వేదమే యీ పరదేవతను గూర్చి 'ఇదిగాదు ఇదిగాదు' అని చెప్పుచు (ప్రతిషిద్ధసర్వవిశేషాయాః) యావద్విధములైన విశేషములు లేనిదిగా దానిని వర్ణించినది, అట్టిసందర్భములో (దేవతాయాః=) నా పరదేవతకు (సర్వ...గః=) సర్వశక్తులుమాత్రము గలిగియుండుట (కథంచ సంభవేత్ =) యెట్లు సంభవింప గలదు?- అని పూర్వపక్షి యాక్షేపించుచో

యదత్రవక్తవ్యం తత్పురస్తా దేవోక్తం

ఈ యాక్షేపమున కిక్కడ (యత్ వక్తవ్యం) నెట్టి సమాధానము చెప్పవలసి యున్నదో (తత్ =) యీ సమాధానము (పురస్తాత్ + ఏవ=) నింతకు మున్నే (ఉక్తం=) చెప్పఁబడియున్నది.

శ్రుత్యవగాహ్యమే వేద మతిగంభీరం బ్రహ్మన తర్కావ గాహ్యం

(ఇదం+అతిగం...బ్రహ్మ=) మిక్కిలి గంభీరమైన యీ బ్రహ్మము (నతర్కా...హ్యాం=) తర్కము (=యుక్తులచేత)చే గ్రహింపఁబడఁ గలదిగాక (శ్రుత్య-మేవ=) కేవల శ్రుతిమాత్రముచేతఁ దెలిసికొనఁ బడవలసినదే—

నచయథైకస్య సామర్థ్యం దృష్టం తథాఽన్యస్యాపి సామర్థ్యేన భవితవ్యమితి నియమోఽస్తీతి

(నచయథై ...స్తీతి=) ఒకనికొక సామర్థ్యమెట్లున్నదో యట్లే యట్టిసామర్థ్యము మఱియొకనికిని నుండితీరవలయునను నియమములేదు.

ప్రతిషిద్ధ సర్వవిశేష స్యాపి బ్రహ్మణ స్సర్వశక్తి యోగస్సంభవతీ త్యేతదప్య విద్యాకల్పిత రూపభేదోపన్యాసేనోక్త మేవ

బ్రహ్మమునకెల్ల విశేషములు (శ్రుతిచే) తొలఁగింపఁబడియున్నను, సర్వశక్తి సంపన్నత్వము సంభవమేయని (శ్రుతిప్రమాణముచేతనే) నిరూపించుచు, ఈ విషయమంతయు 'బ్రహ్మముయొక్క అవిద్య (=అజ్ఞానము) చేఁ గల్పితమాత్రము' అను నుపన్యాసద్వారమున (బ్ర సూ II-1-25, II-1-27, II-1-11, II-1-28 మొదలగు వానియందు) నిదివరకుఁ (ఉక్తమేవ=) జెప్పఁబడియే యున్నది.

తథాచ శాస్త్రం

శ్రుతిప్రమాణములు సైతమట్లే యున్నవి చూడుఁడు-

'అపాణి....కర్ణః' శ్వే III-19 'అపాణిపాదో జవనో గ్రహీతా పశ్యత్యచక్షుః స శృణోత్య కర్ణః'

'[సః=] ఆ పరబ్రహ్మము [అపాణిపాదః=] చేతులు కాళ్ళు లేనిదేగాని [జవనః=] వేగముగాఁ బరుగెత్తునదియు, [గ్రహీతా=] పట్టుకొనునదియు, [అచక్షుః=] కన్నులులేనిదై [పశ్యతి=] చూడఁగలదియు, [అకర్ణః=] చెవులు లేనిదై [శ్రుణోతి=] వినఁగలదియునై యున్నది.

ఇత్యకరణస్యాపి బ్రహ్మణ స్సర్వసామర్థ్యయోగం దర్శయతి 'పరాస్య శక్తి ర్వివిధైవ శ్రూయతే'

'[అస్య=] ఈబ్రహ్మముయొక్క [పరాశక్తిః ] గొప్పదైనశక్తి [వివిధా+ఏవ=] అనేక విధములైనదిగా [శ్రూయతే=] వినఁబడుచున్నది [శ్రుతులు చెప్పుచున్నవి]

ఈ మొదలగు శ్రుతులు [అకార...బ్రహ్మణః=] దేహేంద్రియ శూన్యమైన దేయని చెప్పఁబడు బ్రహ్మమునందు సర్వసామర్థ్య సంపన్నత్వమునుఁ జూపుచున్నయవి.

## ప్రయోజనవత్త్వాధికరణము

అధికరణావతారిక :-

మఱియొక పూర్వపక్షము నధిక్షేపించి బ్రహ్మజగత్కారణవాదము స్థిర పరుపఁ బడుచున్నది, పరమాత్మ (=బ్రహ్మము) యాప్తకాముఁ డగుటచే జగత్సృష్టి చేయవలసిన ప్రయోజనము గనుపింపమిచే బ్రహ్మము జగత్కారణమనఁ జెల్లదు. అనివచ్చిన యాక్షేప మీయధికరణమందు ఖండింపఁబడుచున్నయది.

## 32 సూ॥ న ప్రయోజనవత్వాత్

ప॥ వి॥ న-ప్రయోజనత్వాత్

ప్ర॥ప॥అ॥ న=బ్రహ్మము జగత్కారణమైయుండదు; ప్రయోజనవత్వాత్ = పనులెప్పుడుఁ బ్రయోజనముతోఁ గూడినవియే యగుటవలన

సూ॥ భావము :- (న) పరమాత్మ యీజగత్తును సృష్టించినట్లు చెప్పఁదగదు ఎందుచే నందురేమో (ప్రయోజనవత్వాత్ =) లోకమందుఁ బ్రయోజనములేని పని యేదియుఁ జేయబడదుగదా! నిత్యతృప్తుఁడు సత్యకాముఁడు నైన పరమాత్మ యేప్రయోజన మపేక్షించి యీజగత్సృష్టిని జేయును? ఇది యసంభవము గానఁ బరమాత్మ జగత్కర్త కానేరడు. అని పూర్వపక్షము.

భాష్యము - భాష్యార్థము

అన్యథా పునశ్చేతన కర్తృకత్వం జగత ఆక్షిపతి

(అన్యథా పునః =) మఱియొకవిధముగాఁగూడ (చేత...జగతః=)జగత్తు చేతనమైన బ్రహ్మముచేతఁ జేయబడినది గాదని- (ఆక్షిపతి=) ఆక్షేపింపఁబడు చున్నది.

నఖలు చేతనః పరమాత్మేదం జగద్బింబం విరచయితు మర్హతి.

చేతనుఁడైన పరమాత్మ (ఇదం జగద్బింబం =) యీజగదాకారసృష్టిని విరచించుటకు (న+అర్హతి+ఖలు=) అర్హుఁడు గాడుసుమా! (విరచించినాడని చెప్పుట సహేతుకము గాదుగదా)

కుతః

ఎందువల్లనందురేమో

ప్రయోజనవత్త్వాత్ ప్రవృత్తీనాం

(ప్రవృత్తీనాం=) వ్యాపారములెప్పుడు (ప్రయోజనత్వాత్ =) ప్రయోజనము గలవిగానే యుండుటవలన

చేతనోహి లోకే బుద్ధిపూర్వకారీ పురుషః ప్రవర్తమానో న మందోపక్రమామపి తావత్ప్రవృత్తి మాత్మప్రయోజనా నుపయోగినీ మారభమాణో దృష్టః

లోకమందు నొక వ్యాపారమందు బుద్ధిపూర్వకముగాఁ బ్రవేశించిన చేతనుఁడైన (=తెలివిగల) పురుషుఁడు (మందో...అపి=) ఆవ్యాపారప్రయత్న మెంత కొద్దిపాటిదయ్యును (ప్రవృత్తిం=) ఆప్రయత్నము తనకు లాభకారిగా నుండనిది యేయీప్రయత్నములో బ్రవేశించుట (నదృష్టః=) చూడఁబడదు.

కిముత గురుతరసంరంభాం

పెద్ద ప్రయత్నము ( గురుతరసంరంభాం) చేయవలసివచ్చు విషయములో నికఁ జెప్పవలసిన దేమున్నది !

భవతిచ లోకప్రసిద్ధ్యనువాదినీ శ్రుతిః

ఈలోకప్రసిద్ధ విషయమునే యనువదించు శ్రుతిసైతముగలదు చూడుఁడు!

'నవా....భవతీతి' బృ IV-4-5 'నవాఅరేః సర్వస్య కామాయ సర్వం ప్రియం భవతి ఆత్మనస్తు కామాయ సర్వం ప్రియం భవతి'

'(అరే!==) ఓ మైత్రేయీ ! (సర్వస్య==) సర్వ వస్తువులమీఁద నుండు (కామాయ=) ప్రీతికొఱకు (సర్వం=) ఆయా సర్వవస్తువులు (నవాప్రియంభవతి=) తనకు ప్రీతి గలిగించుచుండుట లేదుసుమా! (ఆత్మనస్తు=) తనయొక్క (కామాయ=) ప్రయోజనము కొఱకే (సర్వం=) ఆయా సర్వవస్తువులు (ప్రియంభవతి==) తనకుఁ బ్రియములగు చున్నవి.'

గురుతరసంరంభా చేయం ప్రవృత్తిః యదుచ్చావచ ప్రపంచం జగద్బింబం విరచయితవ్యం

(ఉచ్చావచ ప్రపంచం=) ఘనము నీచములతోఁ గూడిన ప్రపంచమను (జగద్బింబం=) జగదాకారమును (విరచయితవ్యం==) నిర్మాణము చేయవలసి యున్న విషయములోని (ఇయంప్రవృత్తిః=) యీ ప్రయత్నము (గురుతరసంరంభా చ==) మిక్కిలి గొప్పదని వేఱచెప్పవలయునా!

యదీయ మపి ప్రవృత్తి శ్చేతనస్య పరమాత్మనః ఆత్మప్రయోజనోపయోగినీ పరికల్ప్యేత

(జగత్సృష్టి విషయములో) చేయవలసియున్న (ఇయమపి ప్రవృత్తిః==) ఈ గొప్పప్రయత్న మన్ననో (పరమాత్మనః==) పరమాత్మయొక్క (ఆత్మప్ర.... గినీ=) స్వలాభమున కుపయోగించునదియే యని (యదిపరికల్ప్యేత=) చెప్పఁబూనుదురేమో) అట్లనుచో-

నిత్యతృప్తత్వం పరమాత్మనః శ్రూయమాణం బాధ్యేత ప్రయోజనా భావేన ప్రవృత్త్య భావోపి స్యాత్

పరమాత్మకు నిత్యపరితృప్తత్వమును (=ఆప్తకామత్వమును == కావలసిన వన్నియును సంపూర్ణముగానుండి యికయెట్టి యపేక్ష లేకుండుటను) (శ్రూయమాణం=) నారోపించు శ్రుతిప్రమాణములు (బాధ్యేత==) భంగపడి పోవలసినవే గదా ! లేక జగత్సృష్టి ప్రయత్నవిషయములోఁ బరమాత్మకు నెట్టి స్వలాభప్రసంగము లేదందురా; అట్లన్నచోఁ బైనఁదెలిపిన విధమున (ప్రవృ...స్యాత్) అట్టి ప్రయత్నములోఁ బ్రవేశమే బొత్తుగా లేకపోవలసి వచ్చును!

అథచేతనోఽపిసన్ ఉన్మత్తో బుద్ధ్యపరాధా దంతరేణైవాత్మ ప్రయోజనం ప్రవర్త మానో దృష్టః తథా పరమాత్మాపి ప్రవర్తిష్యత ఇత్యుచ్యేత

(పైఁజెప్పిన రెండుపక్షములుగాక=) అట్లుగాక లోకములో (చేతనోఽపి సన్) తెలివిగలవాఁడై యున్నను నొకఁడు (ఉన్మత్తః=) మనోవైకల్యము గలవాఁడై (బుద్ధ్యపరాధాత్=) బుద్ధివశము తప్పియున్న యవస్థలో (అంతరే... యోజనం=) స్వలాభాపేక్ష యేమియును లేకుండఁగనే (ప్రవర్తమానోదృష్టః=) పనులు చేయు చున్నట్లు చూడఁబడుచున్నాఁడు గదా, (తథా=) అట్లై పరమాత్మ సైతము (ప్రవర్తిష్యతే=) ఏల ప్రయత్నించుఁ గూడదు (ఇత్యుచ్యేత=) అనియందురా !

తథాసతి సర్వజ్ఞతం పరమాత్మన శ్రూయమాణం బాధ్యేత

(తథాసతి=) అట్లనుపక్షమున పరమాత్మకు (శ్రూయమాణం=) శ్రుతు లారోపించు (సర్వజ్ఞత్వం=) సర్వజ్ఞత్వము (బాధ్యేత=) లేకపోవలసినదే గదా !

తస్మా దశ్లిష్టాచేతనా త్సృష్టి రితి

(తస్మాత్=) కాబట్టి (చేతనాత్సృష్టిః=) తెలివిగల వ్యక్తివలన నీ జగ త్సృష్టి జరిగినదని చెప్పుట (అశ్లిష్టా—) అసమంజస మనకతప్పదు— (ఇతి=) అని పూర్వపక్షము-

33 సూత్రావతారిక :— క్రిందటి సూత్రములోని పూర్వపక్ష మీ సూత్ర మందుఁ బరిహరింపఁ బడుచున్నయది-

## 33 సూ॥ లోకవత్తు లీలాకైవల్యమ్

ప. వి :- లోకవత్—తు—లీలాకైవల్యమ్

అన్వ క్ర :- తు—లోకవత్—లీలాకైవల్యమ్

ప్ర. ప. అ :- తు=పూర్వపక్షము సరిగాదు లోకవత్=లోకములోసామా న్యముగాఁ గనుపించు విధమున లీలాకైవల్యమ్ = (పరమాత్మకీ జగత్సృష్టి) కేవల లీలా వినోదమే-

సూ॥ భావము :- (లోకవత్) లోకములో రాజులు ప్రయోజనాంతర మేమియు లేకున్నను వేటలు మొదలగు వినోదములయందుఁ బాల్గొనుటయెట్లు కేవ లము లీలామాత్రమో యట్లే (లీలాకైవల్యమ్) బ్రహ్మమునకుసైత మీ జగన్ని ర్మాణము స్వభావముగాఁ గల్గిన కేవల లీలామాత్రమే. (తు) ప్రయోజనాపేక్ష యందేమియునులేదు. అది స్వభావమేయని యోచించుకొన వలసియున్నది.

భాష్యము - భాష్యార్థము

తుశబ్దేనాక్షేపం పరిహరతి

ఈసూత్రములోని 'తు' అనుపదముచేత లోఁగడిసూత్రములోఁ బూర్వపక్షిచేఁ జేయఁబడిన యాక్షేపము పరిహరింపఁ బడుచున్నది.

యథా లోకే కస్యచిదాప్తైషణ స్యరాజ్ఞో రాజా మాత్యస్యవా వ్యతిరిక్తం కించిత్
ప్రయోజన మనభిసంధాయ కేవలం లీలారూపాః ప్రవృత్తయః క్రీడావిహారేషు భవంతి

లోకమందు (ఆప్త+ఏషస్య=పరిపూర్ణముగాఁ బొందబడిన మనోరథములుగల=) నాప్తకాముఁడగు (రాజ్ఞో...స్యవా=) రాజుగాని రాజుయొక్క మంత్రిగాని (వ్యతిరిక్తం=) వినోదము (=లీల) కంటెవ్యతిరేకమైన (కించిత్ప్రయోజనం=) యేపాటి కొద్దిదైన ప్రయోజనము నైనను (అనభిసంధాయ=) మనసునందుఁ గూర్చకయే (క్రీడావిహారేషు=) యాటపాటలయందు (కేవలంలీలారూపాః=) కేవల వినోదార్థము మాత్రము (ప్రవృత్తయః యథాభవంతి) ప్రవేశించి యెట్లు వ్యవహరించుచున్నారో

యథాచోచ్ఛ్వాస ప్రశ్వాసాదయోऽనభిసంధాయ బాహ్యం కించిత్ప్రయోజనాంతరం
స్వభావాదేవ సంభవంతి

(జీవునియొక్క) ఉచ్ఛ్వాస నిశ్వాసములు (=వెలుపలికి లోపలికిఁ బోవుచు వచ్చుచుండు నిట్టూర్పులు) (కించిత్ బాహ్యం ప్రయోజనం=) తాముచేయుపని మాత్రమేగాక యేయితర ప్రయోజనము లేశమైనను (అ భిసంధాయ=) అపేక్షింపకయే (స్వభావాదేవ ) స్వభావసిద్ధముగా (యథాసంభవంతి=) నెట్లు ప్రవర్తించుచున్నవో

ఏవమీశ్వరస్యా వ్యనపేక్ష్యం కించిత్ప్రయోజనాంతరం స్వభావాదేవ కేవలం లీలా
రూపా ప్రవృత్తి ర్భవిష్యతి

(ఏవం=) అట్లె (ఈశ్వరస్యాపి) ఈశ్వరుఁడునుగూడ (అన...తరం) నెవ్విధమైన బాహ్యప్రయోజనమును (అనపేక్ష్య=) నపేక్షింపకయే [స్వభావాదేవ=) స్వభావసిద్ధముగా (=మాయా కర్మానుసారముగా) (కేవలం...రూపాః] కేవల వినోదమాత్రమే యనిపించు (ప్రవృత్తి ర్భవిష్యతి) జగత్సృష్టివ్యాపారమును జేయుచున్నాఁడు (ఆయనకీపని యూపిరియొక్క రాకపోకలవలె స్వభావముగానే కల్గుచున్నది గాని కోరి యొకలాభమునకై వచ్చిపడునది గాదు.)

నహీశ్వరస్య ప్రయోజనాంతరం నిరూప్యమాణం న్యాయతః శ్రుతితో వా సంభవతి

(న్యాయతః=) యుక్తివలనఁగాని (శ్రుతితః) శ్రుతిప్రమాణమువలనఁగాని (ఈశ్వరస్య=] ఈశ్వరున కీజగత్సృష్టికార్యమందు నెట్టి ప్రయోజనమైనను ఉన్నదని (నహి నిరూప్యమాణం=] నిరూపింప సాధ్యముగాదు.

నచ స్వభావః పర్యనుయోక్తుం శక్యతే

(అట్టి యుక్తిశ్రుతుల చేతనే సృష్టివ్యాపారమునం దీశ్వరునకుఁ గలయా) (స్వభావః=) స్వభావము (పర్యనుయోక్తుం) తీసివేయఁబడుటకు (=లేదని-కాదని చెప్పుటకు సాధ్యముగాదు.

యద్యప్యస్మాకమియం జగద్బింబ విరచనా గురుతరసంరంభేవాభాతి

(యద్యపి=) ఆలోచించి చూడఁగా (ఇయంజగద్బింబవిరచనా=) ఈజగదాకార నిర్మాణము (అస్మాకం=) మనవంటివారికి (గురుతరసంరంభా+ఇవ) మహాప్రయత్న కార్యమువలెఁ (ఆభాతి=) జూపట్టనచ్చును.

తథాపి పరమేశ్వరస్య లీలైవ కేవలేయ మపరిమిత శక్తిత్వాత్

(తథాపి=) గాని (పరమేశ్వరస్య=) పరమేశ్వరుఁడన్ననో (అపరిమితశక్తిత్వాత్=) యింతయని చెప్పుట కలవిగాని శక్తిగలవాడగుటచే నాతనికి (ఇయం=) నీజగత్సృష్టి (కేవలాలీలాఏవ=) అప్రయాసముగా స్వభావముగాఁ గలుగుచుండు కేవల (లీలా=) వినోదమాత్రమే సుమి !

యదినామలోకే లీలాస్వపి కించిత్సూక్ష్మం ప్రయోజన ముత్ప్రేక్ష్యేత

లోకమందు (లీలాస్వపి=) రాజులు మొదలగువారియొక్క వినోదపుటాటపాటలయందేనియు (కించి...జనమ్) నెట్టిదేనిఁగొంచెము పాటిదైననుఁ బ్రయోజనమున్నట్టు (యదినామ ఉత్ప్రేక్ష్యేత=) లూహకు సాధ్యమైనఁ గావచ్చును.

తథాపి నైవాత్ర కించిత్ప్రయోజన ముత్ప్రేక్షితుం శక్యతే ఆప్తకామ శ్రుతేః

(తథాపి=) కాని (అత్ర=) బ్రహ్మమీ జగత్తును సృష్టించుచున్న విషయములో మాత్రము (కించిత్ప్రయోజనం=) ఏ కొద్దిపాటి ప్రయోజన మున్నట్లు (ఉత్ప్రేక్షితుం=) ఊహించుటకు (నైవశక్యతే=) సాధ్యముగాదు (ఆప్తకామ శ్రుతేః=) ఈవిషయ మీక్రింది యాప్తకామ శ్రుతిచే నిస్సందేహముగఁ జెప్పుచున్నది.

నాప్య ప్రవృత్తి రున్మత్త ప్రవృత్తిర్వా సృష్టి శ్రుతే స్సర్వజ్ఞ శ్రుతేశ్చ

మఱియును బరమాత్మయే వ్యాపారము చేయువాడు గాడనిగాని, ఆయన చేయు వ్యాపారము (ఉన్మత్త=) అలోచనలేని పిచ్చివైఖరితో నుండునని గాని చెప్పుట కవకాశము లేదు. ఆయన సృష్టిచేయుచున్నాడని శ్రుతిస్పష్టముగాఁ జెప్పుచుండుటవలనను, మఱియు నాయన సర్వజ్ఞుఁడనికూడ మఱింత స్పష్టముగా శ్రుతి

చెప్పుచుండుట వలనను అట్టియనాలోచిత ప్రసంగములను జేయఁదగదు (సృష్టిశ్రుతి సర్వజ్ఞశ్రుతి)

నచేయం పరమార్థవిషయా సృష్టి శ్రుతిః

పరమాత్మ జగత్సృష్టిని జేయుచున్నాడని శ్రుతిచెప్పు విషయ మేదిగలదో యదిపరమార్థ (కేవలయథార్థ) విషయముగాదని (యదివరకుఁ జెప్పుచువచ్చితిము)

అవిద్యాకల్పిత నామరూప వ్యవహారగోచరత్వాత్ బ్రహ్మాత్మభావ ప్రతిపాదన పరత్వాచ్చేత్యే తదపి నైవ విస్మర్తవ్యం

ఆ సృష్టిశ్రుతి అవిద్య [=అజ్ఞానము=సమ్యగ్జ్ఞానము లేకపోవుట] చేతఁ గల్పింపఁబడిన నామరూపముల యొక్క వ్యవహారమునకు మాత్రమే గోచరించు [అనఁగా వాస్తవముగాని] జగత్తునుగూర్చి చెప్పునట్లు పైకిఁ గనుపడు నదియు, వాస్తవమునకు 'సర్వము బ్రహ్మమే' అనఁగా సర్వమునకు బ్రహ్మమే యాత్మ [=స్వరూపము] అను విషయమును బోధించుటయందే తాత్పర్యముగలదియునను నీ ముఖ్యాంశ మెప్పటికిని మఱువవలసినది గాదు

## అవైషమ్య నైర్ఘృణ్యాధికరణము

అధికరణావతారిక :- బ్రహ్మజగత్కారణవాద బలపరీక్షకై శ్రుతులనుబట్టి గాని, యుక్తులనుబట్టిగాని, యితర మతసిద్ధాంతములను బట్టిగాని యెన్నెన్ని పూర్వపక్షము లెట్లెట్లు చేయఁదగియున్నవో యన్నియు ననేక విధానాంతరములచేతఁ జేసి చూపించి ఖండించి యీ బ్రహ్మజగత్కారణ వాదము గట్టిచేయఁబడుచున్నయది. సర్వసముఁడు దయామయుఁడునైన పరమాత్మయే వాస్తవమునకీజగత్కర్తయైనచో జీవులలో దేవమనుష్యతిర్యగాది భేదములు సుఖతాపత్రయభేదములుండుట కవకాశము లేదుగావున, బ్రహ్మము జగత్సృష్టికర్తయనఁ జెల్లదని వచ్చిన యాక్షేపమీ యధికరణమందు విమర్శించి పరిష్కరింపఁ బడఁబోవుచున్నయది.

### ౩౪ సూ॥ వైషమ్యనైర్ఘృణ్యే న సాపేక్షత్వా త్తథాహి దర్శయతి

ప. వి :- వైషమ్యనైర్ఘృణ్యే–న–సాపేక్షత్వాత్–తథా–హి–దర్శయతి

ప్ర. ప. అ :- వైష...ణ్యే=వైషమ్యము (=పక్షపాతము), నైర్ఘృణ్యము (=నిర్ఘృణభావము=కాఠిన్యము) న=(పరమాత్మకు) లేవు; సాపేక్షత్వాత్=అపేక్ష(జీవులయొక్క ధర్మాధర్మముల యపేక్ష=హేతువు) ఉండుట వలన; తథా=అట్లే, హి=కదా; దర్శయతి=శ్రుతియును జూపుచున్నయది–

సూత్రభావము :- (వైషమ్యనైర్ఘృణ్యే–న) సుఖదుఃఖాది మిశ్రమమైన యీ జగత్తును సృజించుచు, మఱియొకప్పుడు నాశనము చేయుచున్న బ్రహ్మమునకు వైషమ్యము (=విషమత్వము) నైర్ఘృణ్యము (=నిర్దయత్వము) అనునవి లేవు—

(సాపేక్షత్వాత్=) ఎందుచేననఁగా, మంచిపనులను జెడ్డపనులను జేయు మనుష్యులపై వారివారి పనులనుబట్టియే రాజునకు నిగ్రహానుగ్రహము లెట్లుండునో యట్లే జీవులయొక్క పూర్వపుణ్యాపుణ్య కర్మములనుబట్టియే బ్రహ్మమునకు విషమత్వము- నిర్దయత్వము సృష్టిలోఁజూపట్టుచుండునుగాని బ్రహ్మమునకవి నైజములు గావు. (తథాహి దర్శయతి) కౌ III-9 'ఏష హ్యేవ సాధుకర్మ కారయతి తంయమేభ్యో... ...' అను మొదలగు శ్రుతులు సైతమట్లే చెప్పుచున్నయవి.

భాష్యము - భాష్యార్థము

అధికరణావతారిక :-

పునశ్చ జగజ్జన్మాది హేతుత్వ మీశ్వరస్యాక్షిప్యతే స్థూణానిఖననన్యాయేన ప్రతిజ్ఞాతస్యార్థస్య దృఢీకరణాయ

(ప్రతిజ్ఞా...ణాయ) బ్రహ్మమే జగత్కారణమని ప్రతిజ్ఞాతమైన (=శపథముగాఁ జాటఁబడిన) విషయమును గట్టిచేయుటకై (స్థూణానిఖననన్యాయేన=) మేకు (=స్థూణము) మొదలగువానిని (ఖనన=) భూమిలో గట్టిగా బిగియఁజూచుటకుఁగాను నడుమ నడుమఁ బట్టి కదిలించి చూచుచుండు (న్యాయేన=) విధమున (పునశ్చ=) మఱియొకవిధముగా (జగ...రస్య=) ఈశ్వరుఁడీ జగ జ్జన్మస్థితిలయములకు హేతువగునను విషయము (ఆక్షిప్యతే=) ఆక్షేపింపఁబడుచున్నది.

1. బ్రహ్మ జగత్కారణ విషయములో ఈశ్వరుని యందు వైషమ్య (=పక్షపాత) నైర్ఘృణ్య (కాఠిన్య) దోషము లారోపించిన సృష్టియందుఁ జూపట్టు వైషమ్యము (పక్షపాతము) పూర్వపక్షము

నేశ్వరో జగతః కారణ ముపపద్యతే

జగత్తున కీశ్వరుఁడు కారణమని చెప్పదగదు.

కుతః

ఎందుచే ననఁగా

వైషమ్య నైర్ఘృణ్య ప్రసంగాత్

ఈశ్వరునకుఁ (వైషమ్యం=) బక్షపాతము (నైర్ఘృణ్యం=) నిర్దయత్వము చెప్పవలసివచ్చును.

కాంశ్చిదత్యంత సుఖభాజః కరోతి దేవాదీన్

(అయీశ్వరుఁడు సృష్టిలో) దేవతాదులనెడి కొందరిని మిక్కిలి సుఖభాక్కులనుగాఁ జేయుచున్నాడు.

కాంశ్చి దత్యంత దుఃఖభాజః కరోతి పశ్వాదీన్

పశ్వాదులఁ గొన్నింటిని మిక్కిలి దుఃఖభాక్కులనుగాఁ జేయుచున్నాడు.

కాంశ్చ న్మధ్యమ భాజో మనుష్యాదీన్

మఱికొందరగు మనుష్యులను మిక్కిలి సుఖమునకు మిక్కిలి దుఃఖమునకు మధ్యస్థులనుగాఁ జేయుచున్నారు. అనగా మనుష్యులను సుఖదుఃఖ మిశ్రములనుగాఁ జేయుచున్నాడని భావము.

ఇత్యేవం విషమాం సృష్టిం నిర్మిమాణస్యేశ్వరస్య పృథగ్జనస్యేవ రాగద్వేషోపపత్తేః

ఇట్లు సృష్టినిర్మాణ కార్యమందు భేదబుద్ధిని (=పక్షపాతమును) వహించి యున్నట్లు స్పష్టపడుచున్న యీశ్వరుఁడు (పృథగ్జనస్యేవ=) సామాన్య ప్రాకృత జనుఁడువోలె రాగద్వేషములు గలవాఁడనియే చెప్పుట యుక్తముగాదు- మఱియు

శ్రుతిస్మృత్యవధారిత స్వచ్ఛత్వా దీశ్వర స్వభావవిలోపః ప్రసజ్యేత

శ్రుతిస్మృతు లీశ్వరునకు (స్వచ్ఛత్వ=) మనోనైర్మల్యాదుల నారోపించుచున్న సందర్భములో, ఈవిషమసృష్టికార్య మా పరమేశ్వరుని స్వభావ విశుద్ధత్వమునకు (విలోపః=) హానిదెచ్చుచున్నదే యగుచున్నది.

(బి) సృష్టియందుఁ జూపట్టు నైర్ఘృణ్యము (కాఠిన్యము)

తథా ఖల జనైరపి జుగుప్సితం నిర్ఘృణత్వ మతిక్రూరత్వం దుఃఖయోగ విధానాత్ సర్వప్రజోప సంహరణాచ్చ ప్రసజ్యేత

(జీవులను బుట్టించుటలోనేగాక పిమ్మటను) వారికి (దుఃఖయోగవిధానాత్ =) జీవితములో దుఃఖాది తాపత్రయములను గలుగఁ జేయుచుండుటవలనను, (సర్వప్రజోప సంహరణాచ్చ=) తుదకుఁ బ్రజలనందరిని మరణాదులద్వారా నాశనము చేయుచుండుటవలనను [ఖల ... జుగుప్సితం) దుర్మార్గులుసైత మసహ్యించుకొని దూషించునంతటి (నిర్ఘృణత్వం=) కాఠిన్యము అతిక్రౌర్య మాపరమేశ్వరుని కారోపింపవలసివచ్చును.

(సి) వైషమ్య నైర్ఘృణ్య కారణమువలన ఈశ్వరుఁడు జగత్కారణము గానేరడు

తస్మా ద్వైషమ్య నైర్ఘృణ్యప్రసంగా న్నీశ్వరం కారణమిత్యేవం బ్రూమః

కాబట్టి యీశ్వరునకు నైర్ఘృణ్య వైషమ్యములు (కాఠిన్యపక్షపాతములు) చెప్పవలసివచ్చును గావున ఈశ్వరుఁ డీజగత్తునకుఁ గారణముగాదని నొక్కివక్కాణించుచున్నాము.

2. ఎ) సృష్టిలో గన్పట్టు వైషమ్య నైర్ఘృణ్యములు జీవులయొక్క పూర్వ సుకృత దుష్కృతములయపేక్షచేఁ గల్గుచున్నవిగాని ఈశ్వరుని యపరాధముగాదు

వైషమ్య నైర్ఘృణ్యే నేశ్వరస్య ప్రసజ్యేతే

అట్టి వైషమ్య నైర్ఘృణ్యము లీశ్వరున కెంతమాత్రి మంటఁజాలవు.

కస్మాత్

ఎందుచే నందురా

సాపేక్షిత్వాత్

ఈశ్వరుఁ డట్లు స్వతంత్రించి (తనయిష్టానుసారముగా) చేయుటలేదు.

యదిహి నిరపేక్షః కేవల ఈశ్వరో విషమాం సృష్టిం నిర్మిమీతే స్యాతామేతౌ దోషౌ వైషమ్యం నైర్ఘృణ్యంచ

హెచ్చుతగ్గులతోఁ గూడిన యీ విషమ (=భేద) సృష్టినీశ్వరుఁడు (నిరపేక్షః=) తగినంత బాహ్యకారణము లేకుండఁ గేవలముగాఁ దనయిచ్ఛవచ్చినట్లు చేయుచున్నాడన్నచో ఆయనపై నీవైషమ్యనైర్ఘృణ్యము లనెడిదోషముల నారోపించవచ్చును. నిజమే

నతు నిరపేక్షస్య నిర్మాతృత్వమస్తి సాపేక్షో హీశ్వరో విషమాం సృష్టిం నిర్మిమీతే

కాని తగినంత బాహ్యహేతువు లేకుండ (నిర్మాతృత్వము) నీజగన్నిర్మాణ కార్యక్రమము జరుపఁబడుటలేదు. ఈశ్వరుఁడీవిషమ (అసమాన...భేద) సృష్టిని సాపేక్షుఁడై (తగిన కారణములతోఁ బ్రేరేపింపఁబడినవాఁడై) యే చేయుచున్నాడు.

కి మపేక్షత ఇతిచేత్

ఏ బాహ్యహేతువులమీఁద నాధారపడి యిట్టి విషమసృష్టిని జేయుచున్నాఁడందురా !

ధర్మాధర్మా వపేక్షత ఇతి వదామః

జీవులయొక్క ధర్మాధర్మముల మీఁదనే (=పుణ్యాపుణ్యముల మీఁదనే) యాధారపడి చేయుచున్నాడని (ఘంటాపథముగా) చెప్పుచున్నారము.

అతః సృజ్యమానప్రాణి ధర్మాధర్మాపేక్షా విషమాసృష్టి రితినాయ మీశ్వరస్యాపరాధః

కాబట్టి సృష్టింపఁబడుచున్న ప్రాణులయొక్క విషమ (=భేద-అసమాన) స్థితికిఁ గారణము ఆయా ప్రాణులయొక్క ధర్మాధర్మ కర్మములే (మంచి చెడ్డ పనులే) కారణము లగును గాని అందులు నీశ్వరునియొక్క యపరాధ మెంత మాత్రమును లేదు.

(బి) 1. వ్రీహియవాది సృష్టికిఁ బర్జన్యుఁడు సాధారణ కారణము

ఈశ్వరస్తు పర్జన్యవద్ద్రష్టవ్యః

ఈశ్వరుఁడనఁగా, పర్జన్యుఁడు (=మేఘుఁడు) వంటివాఁడని యెంచవలసి యున్నది.

యథాహి పర్జన్యో వ్రీహి యవాది సృష్టౌ సాధారణం కారణం భవతి

(యథాహి=) ఈ యర్థమునే వివరించి చెప్పెదము వినుఁడు! వ్రీహి (=వడ్లు) యవలు (=ధాన్యవిశేషము) మొదలగు వివిధ ధాన్యములు మొలచి పెరుగుటకు మేఘుఁడు సాధారణ (=సామాన్య=భేదములేని) కారణమగుచున్నాడు.

(బి) 2. వ్రీహియవాది భేదమునకుఁ దత్తద్బీజ సామర్థ్యము అసాధారణ కారణము.

వ్రీహియవాది వైషమ్యేతు తత్తద్బీజగతాన్యే వాసాధారణాని సామర్థ్యాని కారణాని భవంతి

వడ్లని-యవలని యీ మొదలగు (వైషమ్యే-తు) భేదములెట్లు సంభవించె నందురా! ఆ భేదములాయా మొక్కలయొక్క బీజముల (=విత్తనముల) యం దుండు వివిధ సామర్థ్యము లనెడి (=శక్తులనెడి)యసాధారణ (=విశేషములైన) కారణముల వలనఁ గల్గుచున్నవి-

(బి) 3. సృష్టిలోని జీవజన్మాదుల కల్కి యీశ్వరుఁడు సాధారణ కారణము

ఏవ మీశ్వరోదేవ మనుష్యాది సృష్టౌ సాధారణం కారణం భవతి

ఇట్లే దేవతలని-మనుష్యులని-తిర్యక్కులని వివిధ భేదములతోఁ బ్రాణులు పుట్టుట కీశ్వరుఁడు సాధారణ (=సామాన్య) కారణ మగుచున్నాడు

(బి) 4 జీవగతజన్మ సుఖదుఃఖాది వైషమ్యములకు వారివారి సుకృత దుష్కృత కర్మములే యసాధారణ కారణము

దేవ మనుష్యాది వైషమ్యేతు తత్తజ్జీవ గతాన్యేవా సాధారణాని కర్మాణి కారణాని భవంతి

ప్రాణులలోఁ గొందరు దేవతలుగాను, కొందరు మనుష్యులుగాను, కొందరు తిర్యక్కులుగాను బుట్టుటకు వారివారి జన్మలకుఁబూర్వము వారివారికుండు (పుణ్యా పుణ్య) కర్మములే యసాధారణ (=విశేష) కారణము లగుచున్నవి.

బి) జీవుల కర్మములనుబట్టియె వారివారికి జన్మాదిభేదము లీశ్వరునిచేఁ గల్పింపఁబడు చున్నవి గాని యీశ్వరుఁడు స్వతంత్రుఁడు గాడు.

ఏవమీశ్వర స్సాపేక్షత్వా న్నవైషమ్య నైర్ఘృణ్యాభ్యాం దుష్యతి

ఇట్లే (సాపేక్షత్వాత్ =) యీ సృజింపబడుచున్న ప్రాణులయొక్క ధర్మాధర్మ కర్మములే వారివారి (సుఖకష్ట) జన్మములకు హేతువులగుచుండుట వలన, సృష్టిమాత్ర వ్యాపారముచే నీశ్వరునకు వైషమ్యనైర్ఘృణ్యము లనెడి (పక్షపాతము కాఠిన్యము అను) దోషము లాపాదింపవు.

(సి) సృష్టియందీశ్వరుఁడు సాపేక్షుఁడే (=అస్వతంత్రుఁడే) యనుటకు శ్రుతి స్మృతి ప్రమాణములు

కథం పునరవ గమ్యతే సాపేక్ష ఈశ్వరో నీచమధ్యమోత్తమం సంసారం నిర్మిమీత ఇతి

అట్లగుచో, (సాపేక్షః=) ప్రాణులయొక్క ధర్మాధర్మ కర్మముల నపేక్షించియే- అనఁగా వారివారి పుణ్యాపుణ్య కర్మానుసారముగానే, (సంసారః=) ఎడ తెగకుండ వచ్చుచుండు నీజగద్రూప సంసారమును- కొంత నీచముగాను- కొంత మధ్యమముగాను- కొంత యుత్తమముగాను నీశ్వరుఁడు (నిర్మిమీతే=) సృజించుచున్నాడని (కథంపునరవగమ్యతే=) యెట్లు తెలియఁబడగలదో చెప్పుఁడన్నచో,

తథాహి దర్శయతి శ్రుతిః

ఆ యర్థమునే యీక్రింది శ్రుతులు బోధించుచున్నవి చూడుఁడు !

'ఏషహ్యేవ ...నినీషత' ఇతి కౌ III-8 'ఏషహ్యేవ సాధుకర్మకారయతి తంయమేభ్యో లోకేభ్య ఉన్నినీషతే ఏష ఉఏవా సాధుకర్మకారయతి తంయమధోనినీషత' ఇతి

'(ఏషః+హి+ఏవ=) ఈ యీశ్వరుఁడే (యం=) ఏ ప్రాణిని (ఏభ్యః లోకేభ్యః=) ఈ నీచలోకముల కంటె (ఉన్నినీషతే=) పైనుత్తమ లోకములఁ బొందింపఁ గోరుచున్నాడో, (తం=) అతనిని (సాధుకర్మ=) మంచిపనులను (కారయతి=) చేయించుచున్నాడు- (యం=) ఎవనిని (అధః=) నీచలోకములను (నినీషతే=) బొందింపఁ గోరుచున్నాడో, (తం-) వానిని (అసాధుకర్మ=) చెడ్డపనులను (కారయతి=) చేయించుచున్నాడో- (అనఁగా మంచిపనులవలన మంచి జన్మములు చెడ్డపనులవలనఁ జెడ్డజన్మములు గలుగునని భావము.)

'పుణ్యో....పాపేన' ఇతిచ బృ V-2-13 'పుణ్యోవై పుణ్యేన కర్మణా భవతి పాపః పాపేన'

'(పుణ్యేనకర్మణా=) పుణ్యకర్మముచేత (పుణ్యఃవై=) పుణ్యుడును (పాపేన=) పాపకర్మముచేత (పాపః=) పాపుఁడును (భవతి=) అగుచున్నాడు

స్మృతిరపి ప్రాణి కర్మవిశేషాపేక్ష మీశ్వరస్యాను గృహీతృత్వం నిగ్రహీతృత్వంచ దర్శయతి

(శ్రుతులేగాక) స్మృతిసైతము ప్రాణులయొక్క కర్మవిశేషములను నపేక్షించియే- అనఁగా సత్కర్మములమీద నాధారపడియే) యీశ్వరునికిఁ బ్రాణులమీద ననుగ్రహముగాని నిగ్రహముగాని కల్గుచున్నవని చెప్పుచున్నది చూడుఁడు

'యేయథ....భజామ్యహం భ. గీ. IV-11 'యే యథామాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహమ్'

తే॥ గీ॥ ఫలరతులు ముముక్షువులు జ్ఞానులు విధులు చెలఁగి నన్నెవ్వరెట్టుల-ర్చింతురనఘ ! తెలిసినవారికట్లేఁ బ్రిసాదింతుఁగాన...        (నాయాంధ్రభగవద్గీత)

ఇత్యేవం జా ్యకాః

ఇట్టివే మఱికొన్ని ప్రమాణములును గలవు.

సూత్రావతారిక :- ప్రాణులయొక్క ధర్మాధర్మ కర్మములనుబట్టి వారికి జన్మభేదములును సుఖదుఃఖ భేదములును గల్గుచున్నవి గాని వానిచే నీశ్వరునకుఁ బక్షపాత కాఠిన్యము లారోపింపఁదగదని పైసూత్రమందు నిశ్చయింపఁ బడినది మొదటి సృష్టికిఁ బూర్వము ప్రాణిభేదముగాని తద్వారా వచ్చిన కర్మభేదముగాని లేకపోవుటచే సృష్టియందీ జన్మాదిభేదములు ప్రాణులకెట్లు వచ్చియుండఁ గలవని వచ్చినశంక యీసూత్రముచే నివారింపఁబడుచున్నది.

## ౩౫ సూ॥ న కర్మావిభాగాదితిచే న్నానాదిత్వాత్

ప॥వి॥ న- కర్మ- అవిభాగాత్ - ఇతిచేత్ - న- అనాదిత్వాత్

ప్ర॥ ప॥ అ॥ అవిభాగాత్ = విభాగము లేకపోవుటవలన. కర్మ = ప్రాణుల యొక్క ధర్మాధర్మ కర్మము, న = జన్మాదిభేదములకుఁ గారణముకాదు, ఇతిచేత్ = అనియాక్షేపించుచో, న = (ఆయాక్షేపము) సరిగాదు, అనాదిత్వాత్ = జగత్తు (=సంసారము) అనాదిగా వచ్చుచుండుటవలన

సూత్రభావము :- (అవిభాగాత్-కర్మ-న-ఇతిచేత్) ఛా VI 2-1 'సదేవ సోమ్యేద మగ్రఆసీత్ ' ఈ మొదలగు శ్రుతులచేత సృష్టికిముందు విభాగము లేకపోవుటవలనఁ గర్మమన్నదియే యుండదు. అందుచే మొదట సృష్టిచేయఁబూనునపుడు జీవుల ధర్మాధర్మ కర్మముల నపేక్షించి సృష్టిచేయుట కవకాశము లేనందున సృష్టిలోఁ గన్పించు వైషమ్యములకు బ్రహ్మముయొక్క పక్షపాత కాఠిన్యములే హేతువులనక తప్పదని యాక్షేపించుచో (న-అనాదిత్వాత్) నట్టియాక్షేపము చెల్లదు. ఎందుచే ననఁగా సంసారమను నీజగత్తు ఒకప్పుడైననుఁ గ్రొత్తగాఁ గల్పింపఁబడినదిగాదు అనాదిగా వచ్చుచున్నదియే. పూర్వసృష్టియందుఁ బ్రాణులు చేయుకర్మములనుబట్టియే యుత్తరసృష్టిఁ జేయఁబడుచున్నట్టు లెంచఁదగియున్నది.

భాష్యము - భాష్యార్థము

సదేవ .... ద్వితీయమ్ ఛాం VI 2-1 సదేవ సోమ్యేద మగ్రఆసీ దేకమేవా ద్వితీయమ్

(సోమ్య!) ఓమంచిబాలుఁడా! (ఇదం=) ఈజగత్తు (అగ్రే=) సృష్టికిఁబూర్వము (సత్ + ఏవ) సత్పదార్థముగానేయుండెను, అసత్పదార్థము [అద్వితీయమ్=] రెండవదిలేని [ఏకం + ఏవ] ఒక్కటిగానే యుండెను.

ఇతి ప్రాక్సృష్టే రవిభాగావధారణా న్నాస్తి కర్మయదపేక్ష్య విషమా సృష్టిస్స్యాత్

ఈశ్రుతినిబట్టి సృష్టికిఁబూర్వము [అవిభా ... రణాత్ =] ప్రాణివిభాగము లేనట్లు నిశ్చయమగుచున్నందున దేని నపేక్షించి ఈ [విషమాసృష్టిః=] భేదసృష్టి చేయఁబడినదో యట్టి (కర్మ=] ధర్మాధర్మకర్మమే [నాస్తి=] లేదని చెప్పవలసి యుండును.

సృష్ట్యుత్తర కాలం హి శరీరాది విభాగాపేక్షం కర్మ

సృష్టికిఁ బిమ్మటి కాలమందే గదా ప్రాణి శరీరాది విభాగములనుబట్టి కర్మ మన్నది [వివిధములుగాఁ] జేయఁబడుచుండును.

కర్మాపేక్షశ్చ శరీరాది విభాగః

[కర్మాపేక్షశ్చ=) ధర్మాధర్మ కర్మవిభాగము నపేక్షించియే గదా (శరీరాది విభాగః=) జీవులయొక్క శరీరాది విభాగములు గలుగుచుండును.

ఇతీత రాశ్రయత్వం ప్రసజ్యేత

(ఇతి=) ఇట్లగుచో (ఇతరేతరాశ్రయత్వం) కర్మము నాశ్రయించి శరీరాది విభాగము శరీరాదివిభాగము నాశ్రయించి కర్మము ప్రసక్తించుచున్నట్లు తేలినది. (ఇదియొక దోషములోఁ జేరినదియగునుగాన యేది ముందో యేది తరువాతనో చెప్పుట కవకాశము లేదు)

అతో విభాగా దూర్ధ్వం కర్మాపేక్ష ఈశ్వరః ప్రవర్తతాం నామ

ఇందుచే, ఈశ్వరుఁడీ వివిధ జగత్సృష్టికిఁ బూనుకొన్నాఁడనఁగా అంతకు ముందుండు ప్రాణి కర్మభేదములమీఁద నాధారపడియే సృష్టియందుఁ బ్రవర్తించినాఁడని చెప్పినట్లగును.

ప్రాక్తువిభాగా ద్వైచిత్ర్య నిమిత్తస్య కర్మణోఽభావా త్తుల్యైవాద్యాసృష్టిః ప్రాప్నోతీతి చేత్

(ప్రాక్ + తు + విభాగాత్ =) ఈ భిన్నరూప జగత్తును సృష్టింపకపూర్వము (వైచిత్ర్య=) వివిధభేదములకు హేతువైన కర్మభేదమే లేనందున, (ఆద్యాసృష్టిః=) మొదటి సృష్టి (తుల్యా + ఏవ + ప్రాప్నోతి=) యెట్టిభేదములు లేకుండ నొక్కటిగానే (మొదటి సృష్టిలోని జీవులందరొక తీరువారుగానే) యున్నదనవలసి వచ్చును (ఇట్లనుచో, దీనినిబట్టియే తరువాతి సృష్టియు, దానినిబట్టియే తరువాతి సృష్టియుఁ జేయఁబడినవని చెప్పవలసి వచ్చుననియు, నట్లు చెప్పుచో భిన్నజగత్సృష్టి కవకాశమే లేదని ప్రాప్తించుననియు భావము)

సమాధానము :—

నైష దోషః అనాదిత్వాత్సంసారస్య. భవేదేష దోషో యద్యాదిమానయం సంసారస్స్యాత్

సంసారమను నీజగత్తు మొదలన్నది లేకుండ (అనాదిగా) వచ్చుచున్నదగుటచే, పూర్వపక్షి చూపిన దోషమున కవకాశములేదు (అయంసంసారః ) సంసారమను నీజగత్తు (యది + ఆదిమాన్-స్యాత్ =) అరంభము గలదియే యగుచో, (ఏషః + దోషః =) పూర్వపక్షి చూపిన దోషము వచ్చునన్నమాట వాస్తవమే

అనాదౌతు సంసారే బీజాంకుర వద్దేతు హేతు మద్భావేన కర్మణస్సర్గవైషమ్యస్యచ ప్రవృత్తిర్న విరుధ్యతే

(బీజాంకుర...ద్భావేన=) విత్తునకుఁ జెట్టు కారణమూ, చెట్టునకు విత్తు కారణమూ- అనఁగా విత్తు మొదలా చెట్టు మొదలాయని చెప్పుట సంభవింపనట్లుగానే (అనాదౌతుసంసారే=) (వివిధ) జగత్తు- (భిన్న) కర్మము వీనిలోనేది ముందో చెప్పుట కవకాశములేక సంసారమనునీజగత్తు మొదలులేనిదై (అనఁగా అనాదిగా) వచ్చుచుండుటచేత (కర్మణః=) భిన్నకర్మము, (స్వర్గవైషమ్యస్యచ=)విషమ(భేద) సృష్టి- యీ రెండును నొకదానివెంట నొకటి (అనాదిగా) వచ్చుచున్నవనుట విరుద్ధము గానేరదు.

కథం పునరేత దవగమ్యతే అనాదిరేష సంసార ఇతి

(ఏషఃసంసారః=) సంసారమను నీజగత్తు (అనాదిః + ఇతి) అనాదిగావచ్చుచున్నదను (ఏతత్ =) నీవిషయము (కథంపునః + అవగమ్యతే=) తెలిసికొనఁబడుట యెట్లో ?

అత ఉత్తరం పఠతి

ప్రత్యుత్తరము రాఁబోవు సూత్రమే చెప్పుచున్నది- చూడుఁడు.

సూత్రావతారిక :- సంసారమను నీజగత్తు అనాదిగా వచ్చుచున్నదియే యని యీసూత్రముచే ఋజువు చేయఁబడుచున్నది.

## ౩౬ సూ॥ ఉపపద్యతే చాప్యుపలభ్యతేచ

ప॥వి॥ ఉపపద్యతే- చ- అపి- ఉపలభ్యతే- చ

ప్రి॥ప॥అ॥ ఉపపద్యతే + చ = (సంసారమను నీజగత్తు అనాదిగా వచ్చుచున్న దనుట) ఉపపన్న మగుచున్నది (=న్యాయమే యగుచున్నది) = యుక్తియుక్తమే యగుచున్నది. అపి - మఱియును ఉపలభ్యతే + చ = (ఈవిషయము) ప్రమాణసిద్ధము సైతే మగుచున్నది.

సూ॥ భా॥ (ఉపపద్యతే-చ) సంసారమను నీజగత్తు అనాదిగా వచ్చుచున్నదియే- అట్లుగాక యీజగత్తున కాదియున్నదని యంగీకరించుచో, అకృతకర్మఫలలాభమును, కృతకర్మఫల వినాశనమును ప్రాప్తింపఁజేయఁగల్గియుండును. అనఁగా

ఉపలభ్యతే-చ) సంసారమను నీజగత్తు అనాదిగా వచ్చుచున్నదనుటకుఁ బ్రమాణములు గలవు చూడుడు

ఋగ్వేదసంహిత X 190 'సూర్యాచంద్రమసౌధాతా యథాపూర్వ మకల్పయత్

భ.గీ. XV - 3 నరూపమస్యే హతథోపలభ్యతే నాంతోనచాదిర్నచ సంప్రతిష్ఠా

భ.గీ. XIII-19 ప్రకృతిం పురుషంచైవ విద్ధ్యనాదీ ఉభావపి

భాష్యము - భాష్యార్థము

ఉపపద్యతే చ సంసారస్యా నాదిత్వం

సంసారమను నీజగత్తు అనాదిగా వచ్చుచున్న దనుట (ఉపపద్యతే=)యుక్తి యుక్తముగానే యున్నది.

ఆదిమత్త్వేహి సంసారస్య అకస్మా దుద్భూతే ర్ముక్తానామపి పునస్సంసారోద్భూతి ప్రసంగోకృతాభ్యాగమ కృతవిప్రణాశ ప్రసంగశ్చ

(ఆదిమత్త్వే హి) అట్లుగాక సంసారమను నీజగత్తు పూర్వము లేక యొకప్పు డారంభించునదియే యన్నచో అది యకస్మాత్తుగా (ఉద్భూతేః=) బుట్టినదని చెప్పవలసియుండును. అట్లె యగుచో నంతకుముందు ముక్తులైపోయియున్న జీవులు సైతము (ఉద్భూతిప్రసంగః=) పుట్టుట సంభవింపవచ్చును) కారణము లేకుండ నకస్మాత్తుగాఁ బుట్టుచో: ముక్తులైనవారుమాత్రి మేల పుట్టఁగూడదు ) మఱియు 1) అకృతాభ్యాగమము (=అదివరకుఁ జేయఁబడని కర్మముయొక్క ఫలములభిం చుట 2) కృతవిప్రణాశము (=అదివరకుఁ జేయఁబడిన కర్మముయొక్క ఫలము లేకుండఁ బోవుట యను నీరెండుదోషములు సంభవించును ఎందుచే ననఁగా

సుఖదుఃఖాది వైషమ్యస్య నిర్నిమిత్తత్వాత్

జగత్తు ఎట్లు వచ్చినదైనను వివిధరూపములుగా నున్నదగుట నిర్వివాదమే గావున అకస్మాత్తుగా వచ్చినదన్న పక్షములో) జగత్తులోగోచరించు సుఖదుఃఖాది (వైషమ్యస్య=) భేదముల కానిమిత్త (=కారణము) మేమియుఁ లేదని చెప్పవలసి వచ్చుట దోషముగాక మఱేమి!

నచేశ్వరో వైషమ్యహేతు రిత్యుక్తం

ఈ సుఖదుఃఖాది భేదముల కీశ్వరుఁడు హేతువు కాఁజాలఁడు- అతఁడు మేఘునివంటి సర్వసమానుఁడేయని (ఉక్తం=) యిదివరకే చెప్పఁబడినదిగదా!

నచా విద్యా కేవలా వైషమ్యకారణం ఏకరూపత్వాత్

ఈ సుఖదుఃఖాది భేదములకవిద్య (=మూలావిద్య) యనునది కేవలముగాఁ గారణమగునందుమా, యది (ఏకరూపత్వాత్=) రూపభేదములేని దైనందున

(అనఁగా ఒకటేయైనందున) భేదమునకుఁ గారణముగాఁజాలదు (అనఁగా జీవులకంద రికుండు నవిద్యయే భేద జగత్సృష్టికిఁ గారణమన్నచో, అవిద్య యొకే రకముగా యున్నందున సృష్టిలో జీవులును నొకరకమువారుగా నుండవలసి యుండును. అట్లు లేనందున, భేదసృష్టికి నవిద్య యొకటియే కారణము కాఁజాలదు)

రాగాది క్లేశవాసనాక్షిప్త కర్మాపేక్షత్వ విద్యా వైషమ్యకరీ స్యాత్

(రాగాది ... పేక్షాతు) రాగద్వేష మోహాములనెడి క్లేశములయొక్క (=సుఖదుఃఖములయొక్క) వాసనలచేత (ఆక్షిప్తాని=) లేవఁదీయఁబడినట్టియు (పురి కొల్పఁబడినట్టియు) ధర్మాధర్మ మిశ్రమరూపములైనట్టియు వివిధకర్మములయొక్క (అపేక్షాతు=) సంపర్కము (=సహవాసము) గలిగియున్న యవిద్య(=అజ్ఞానము భ్రాంతి) యన్నదియే (వైషమ్యకరీ=) జగత్తులోని జీవులయొక్క జన్మ సుఖ దుఃఖాది భేదములకుఁగారణము(స్యాత్=) అగుచున్నది అనఁగా సృష్టికిఁబూర్వము వాసనా (=సంస్కార) రూపమున నిలచియున్న సుకృత దుష్కృత కర్మములతో కలిసిన యవిద్యయే యీభేదసృష్టికిఁ గారణమని చెప్పఁ దగును.

నచ కర్మాంతరేణ శరీరం సంభవతి

మఱియు, గర్మములేనిదియే శరీరము సంభవింపదు. శరీరము లేనిదియే కర్మము సంభవింపదు

నచశరీర మంతరేణ కర్మసంభవ తీతీతరేతరాశ్రయదోషప్రసంగః

ముందు వెనుకలలో నొకదానితో మఱియొకటికి విడిపోని లంకెయున్నందున ఏది మొదటిదియా యని నిశ్చయించుట యసంభవము. ఇదియొకటి పెద్దకష్టము (దోషము) లోనిదియే

అనాది హేతుత్వేతు బీజాంకురన్యాయేనోపపత్తే ర్నకశ్చి ద్దోషో భవతి

ఆకష్టమును దప్పించుకొనుటకు సంసారమను నీజగత్తు (అనాదిహేతుత్వేతు =) (మొదలులేక) అనాదిగా వచ్చుచునే యున్నదని చెప్పినచో (బీజాకారన్యా యేన) చెట్టునుండి విత్తు విత్తునుండి చెట్టు వచ్చినదని చెప్పినట్టుగా కర్మమునుండి జగత్తు-జగత్తునుండి కర్మము పుట్టుచున్నదని (ఉపపత్తేః) చెప్పుట యుక్తియుక్తమై (నకశ్చి ..భవతి) యెట్టిదోషమున కాస్పదము కాఁజాలదు.

ఉపలభ్యతే చ సంసారస్యానాదిత్వం శ్రుతిస్మృత్యోః

సంసారమను నీజత్తు అనాదిగా వచ్చుచున్నదని శ్రుతిస్మృతి ప్రమాణము వలనఁగూడఁ (ఉపలభ్యతే చ=) దెలియఁబడుచున్నయది, (=సిద్ధమగుచున్నది)

ముందీ శ్రుతిని జూడుడు

శ్రుతౌ తావత్ అనేన జీవేనాత్మనా ఛాం. VI-3-2 సేయం దేవతైక్షత హన్తాహమి మా స్తిస్రో దేవతా అనేన జీవేనాత్మనానుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణీతి

ఆయీ దేవత (ఈవిధమున) సంకల్పించెను. ఇప్పునేనీ (పృథ్వ్యప్తేజస్సులను) మూడు దేవతలయందుఁ (అనేన+జీవేన+ఆత్మనా=) ఈ జీవస్వరూపముతోఁ (ప్రవిశ్య=) ప్రవేశించి నామరూపములను విస్తరింపఁ జేయుదును.

ఇతి సర్గప్రముఖే శారీరమాత్మానం జీవశబ్దేన ప్రాణధారణే నాభిలపన్ననాది స్సంసార ఇతి దర్శయతి

ఇది (సర్గప్రముఖే) సృష్టికిముందుఁ బరమాత్మచేతఁ జెప్పఁబడిన వాక్యము అట్టి యీ శ్రుతివాక్యమందు 'జీవ' శబ్ద ముపయోగింపఁబడినది. జీవుఁడనగా (ప్రాణధారణ నిమిత్తేన) ప్రాణములను శరీరమందుఁ నిల్పియుంచుకొనుట కాధార (=నిమిత్త=హేతు) మైనవాడు. జగత్తు వ్యవహారములో నున్నప్పుడే యీ 'జీవ' శబ్దము అర్థముగలది యగును. జగత్తు వ్యవహారమునకు రాకముందు నీజీవుడే 'ఆత్మ' గానుండియున్న వాడు (శారీర మాత్మానం=) సృష్టిలో శరీరమును ధరించిన యాత్మయే జీవుఁడగును(అనేన జీవేన ఆత్మనా=) 'ఈజీవుఁడై యున్న యాత్మచేత' అనిచెప్పుట మూలమున సృష్టిచేయఁబోవుటకు ముందే 'ఆత్మ' జీవుఁడను పేరుచేత (అభిలపన్) పరామర్శింపఁ బడినది (=జ్ఞప్తికిఁ దేఁబడినది) అనఁగా-ఈచేయఁబోవు సృష్టికిముందే 'ఆత్మ' శరీరమును ధరించి ప్రాణములను నిల్పియుంచఁగల 'జీవుడు' గానుండి యున్నాడను భావమగుచున్నది. సృష్టివ్యవహారములోఁ గాని 'జీవ' శబ్దము సార్థకము గానేరదుగావున ఈచేయఁబోవు సృష్టికిముందును సృష్టియున్నట్లే స్పష్టపడుచున్నందున (అనాది స్సంసారఇతి=) సంసారమను నీజగత్తు అనాదిగా వచ్చుచున్నదనియే (దర్శయతి=) పై శ్రుతివలన నిశ్చయమగుచున్నది.

ఆదిమత్త్వే తు ప్రాగధారిత ప్రాణస్సన్ కథంప్రాణ ధారణ నిమిత్తేన జీవశబ్దేన స్సర్గప్రముఖేఽభిలప్యేత ।

(ఆదిమత్త్వే తు=) అట్లుకాక సంసారమును నీజగత్తు ఈసృష్టియందు లేక యిప్పటికిప్పుడే (ఆదిమత్త్వ) ప్రారంభమైనది యగుచో సృష్టి ప్రాణముల ధరించు చున్నదియె యందుము. (ప్రాక్+అధారిత ప్రాణః) ఈ సృష్టిప్రారంభమునకు ముందుఁ బ్రాణములున్నవే యుండవు; ప్రాణములను ధరించుటన్నదియే యుండదు ప్రాణములను (ధరించి) నిల్పఁబెట్టుటకు హేతువుకాఁగల జీవుఁడను పేరేయుండదు. ఇట్టిసందర్భములో (సర్గప్రముఖే=) సృష్టిప్రారంభమునకుముందు (కథం జీవ శబ్దేన అభిలప్యేత=) ఆత్మ జీవుడను పేరుతో నెట్లు పిల్వఁబడఁగలదు !

నచ ధారయిష్య తీత్యతోఽభిలప్యేత

(ధారయిష్యతి) ముందుఁబుట్టనున్న ప్రాణములను ధరించి జీవుఁడను పేరు పొందఁగలఁడు- (ఇత్యతః-) అను భావముతో (నచ అభిలప్యేత) నిప్పుడే జీవుఁడని పిల్వఁబడినదనుట సమంజసము గాదు-

అనాగతాద్ధి సంబంధా దతీతస్సంబంధో బలీయాన్ భవతి అభినిష్పన్నత్వాత్

(అభినిష్పన్నత్వాత్ =) ఆత్మ యిదివరకే- అనఁగా ఈ సృష్టికిముందే జీవుఁడుగాఁ బుట్టియున్న దగుటవలన, ఈ సృష్టి ప్రారంభమందు ఆత్మను జీవుఁడుగాఁ బిల్చుట (అనాగతాత్-హి సంబంధాత్) ముందురాఁబోవు జీవసంబంధముచేత జీవుఁడని పిల్వఁబడినట్లు చెప్పుటకంటె (అతీతస్సంబంధః =) పూర్వమేయున్న జీవ సంబంధముచేత జీవుఁడని పిల్వఁబడినదని చెప్పుటే (బలీయాన్ =) యెక్కువ సబబగుచున్నది- (బలవత్తరమై యున్నది) మఱియును

'సూర్యాచంద్ర....కల్పయత్' ఋ-సం X-190 'సూర్యాచంద్ర మసౌధాతా యథా పూర్వమ కల్పయత్'

'(సూర్యాచంద్రమసౌ =) ఈసూర్యచంద్రులను (యథాపూర్వం-) పూర్వకల్పమందున్నట్లుగానే (అకల్పయత్ =) సృష్టించెను.

ఇతిచ మంత్రవర్ణః పూర్వకల్ప సద్భావం దర్శయతి

ఈ వేదమంత్రము సైతము (పూర్వకల్పసద్భావం =) ఈ సృష్టికిముందుఁ బూర్వసృష్టి యున్నట్లే (దర్శయతి =) చూపుచున్నయది.

స్మృతావప్యనాదిత్వం సంసారస్యో పలభ్యతే

స్మృతియందు సైతము సంసారమను నీజగత్తు అనాదిగా వచ్చుచున్నట్లె (ఉపలభ్యతే =) తెలియఁబడుచున్నది చూడుఁడు.

'నరూప....సంప్రతిష్ఠాం' ఇతి భ. గీ XV-3 'నరూపమస్యేహ తథోపలభ్యతే నాంతో నచాదిర్నచ సంప్రతిష్ఠా'

తే॥ గీ॥ 'దాని (సంసార వృక్షముయొక్క) రూపు, మాద్యంత మధ్యములు గావఁబడవు.

భ. గీ. XIII-19 'ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి

తే॥ గీ॥ ప్రకృతియైన క్షేత్రంబు క్షేత్రజ్ఞుఁడైన పురుషుఁడిద్దర కాదియెప్పుడును లేదు. (నాయాంధ్ర భగవద్గీత)

పురాణేచాతీతానామ నాగతానాంచ కల్పానాం నపరిమాణ మస్తీతి స్థాపితం

(పురాణేచ =) పురాణములయందు సైతము (అతీతానాం =) వెనుక గడచి పోయినట్టియు (అనాగతానాంచ =) ముందు రాఁబోవునట్టియు (కల్పానాం =) సృష్టులయొక్క (పరిమాణం =) సంఖ్య (న+అస్తి+ఇతి) యింతయని లేదని (స్థాపితః =) స్థాపింపఁబడి యున్నది.

# సర్వధర్మోపపత్త్యధికరణము

అధికరణావతారిక :- దానిపై రాదగిన సర్వపూర్వపక్షములను బరిహరించి బ్రహ్మజగత్కారణవాదమును నిల్వబెట్టుటయే యీపాదముయొక్క ముఖ్యోద్దేశ్యము. రాబోవు పాదము పరమత ఖండనమునే ముఖ్యముగాఁ జేయబోవుచున్నయది- అట్లు చేయఁబోవుటకు ముందీ ప్రథమపాదాంతిమాధికరణమందు స్వపక్ష నిర్దుష్టత్వ ముపసంహరింపఁ బడుచున్నది. బ్రహ్మజగత్కారణవాదముపై వచ్చిన మఱియొక యాక్షేపము- అనఁగా నిర్గుణమైన బ్రహ్మము సగుణమైన జగత్తునకెట్లు కారణము కాఁగలదు- అనునీయాక్షేప మొకేసూత్రముగా ఈ కడపటి యధికరణమందు నివారింపఁబడుచున్నది చూడుఁడు.

## 38 సూ॥ సర్వధర్మోపపత్తేశ్చ

ప॥వి॥ సర్వధర్మోపపత్తేః - చ

ప్ర॥ ప॥ అ॥ సర్వ...పత్తేః+చ; జగత్కారణ మగుటకుఁ గావలసిన, సర్వ=సమస్తములైన, ధర్మ=ధర్మములు, ఉపపత్తేః+చ=(బ్రహ్మమునందు ఉన్నవియే యగుచుండుట వలననుగూడ (ఉపనిషత్తులు బోధించు బ్రహ్మజగత్కారణవాదము సక్రమమే యగుచున్నది.)

సూత్రభావము :- (సర్వధర్మోపపత్తేః=చ) సర్వజ్ఞుఁడు, సర్వశక్తులుగలవాఁడు, మహామాయతో గూడియున్నవాఁడు పరబ్రహ్మము జగత్కారణ మగుటకు నవసరములగు కారణధర్మములన్నియు నాయనయం దున్నవని చెప్పుటలో నెట్టియసందర్భమేనియు లేనందున బ్రహ్మజగత్కారణవాదమును బోధించునుపనిషత్సిద్ధాంతము శంకింపఁదగినది కాదు. జగత్తు బ్రహ్మముయొక్క వివర్తమని యిదివరకే సిద్ధాంతము చేయబడి యున్నది. బ్రహ్మము మహామాయతోఁ గూడుకొని యున్నవాడని యిప్పుడు మఱలఁ జెప్పుటచేత బ్రహ్మము నిర్గుణమయ్యు బ్రహ్మము నుండి వివర్తముగా నీజగత్తు పుట్టినదనుటకెట్టి యాక్షేపమును లేదు. అనగా బ్రహ్మమీజగత్తునకభిన్న నిమిత్తోపాదాన కారణమగుచున్నదని భావము. అనగా బ్రహ్మమున్నట్లెయుండి బ్రహ్మమెంతయును జెడకుండగను మారకుండగనే తననుండియే ఈజగత్తును బుట్టించుటకు సమర్థ మగుచున్నది. అట్టి మహామాయాశక్తి బ్రహ్మమునకుమాత్రమే గలదు.

భాష్యము భాష్యార్థము

చేతనం బ్రహ్మజగతః కారణం ప్రకృతిశ్చేత్యస్మి న్నవధారితే వేదార్థే. పరైరు పక్షిప్తాన్ విలక్షణత్వాదీన్ దోషాన్ పర్యహార్షీదాచార్యః

(జగ...,కృతిశ్చ) జగత్తునకు నిమిత్తోపాదాన కారణములు రెండును (కుండకుం గుమ్మరివాడును మృత్తునుబోలె) జేతనబ్రహ్మమే యగునని (అవధారితే=) నిశ్చిత మైన యీ వేదార్థవిషయములో పరులచేత (ఉపక్షిప్తా=) విసిరికొట్టబడిన (విల... దోషాన్=) 'జగత్తు బ్రహ్మమునకంటె విలక్షణము (=భేదము) గా నున్నందున బ్రహ్మము జగత్కారణము గా నేరదు' అను మొదలగు దోషములను (బ్రి) సూ. II-1 మొదలగు సూత్రములను జూడుండు (ఆచార్యః=) బ్రహ్మసూత్ర కర్తయగు శ్రీ వ్యాసాచార్యుండు (పర్యహార్షీత్=) పరిహరించి వైచెను.

ఇదానీం పరపక్ష ప్రతిషేధ ప్రధానం ప్రకరణం ప్రారిప్సమాణః స్వపక్ష పరిగ్రహ ప్రధానం ప్రకరణ ముపసంహరతి

(ఇదానీం=) ఇప్పుడు పరపక్ష=) వేదాంతవిరోధులైన పరపక్షులయొక్క మతములను (ప్రతిషేధ=) ఖండించివైచుటయే (ప్రధానం=) ప్రధానముగాంగల (ప్రకరణం=) ద్వితీయపాదమును (ప్రారిప్సమాణః=) ప్రారంభింపం దలంచి వాడై సూత్రకారుండు (స్వపక్షపరిగ్రహప్రధానం=) స్వమత సిద్ధాంత దృఢీకరణ ప్రధానమైన (ప్రకరణం=) యీ ప్రథమపాద విషయమును నీయధికరణమందు (ఉపసంహారతి=) సంగ్రహపర్చుచున్నాడు.

యస్మాదస్మిన్ బ్రహ్మణికారణే పరిగృహ్యమాణే ప్రదర్శితేన ప్రకారేణ సర్వేకారణ ధర్మా ఉపపద్యంతే "సర్వజ్ఞం సర్వశక్తి మహామాయంచ బ్రహ్మ" ఇతి

ఎట్లనంగా బ్రహ్మమీజగత్తునకుం గారణమగునని (పరిగృహ్యమాణే=) నిశ్చయించుటకు బ్రహ్మమందుండ వలసిన (సర్వేకారణధర్మాః=) సర్వ ధర్మములు- అనంగా "(సర్వజ్ఞం...బ్రహ్మ=) బ్రహ్మము సర్వజ్ఞము-సర్వశక్తియైనది- మహామాయతోం గూడినది- యనునవి యెల్లను (ప్రదర్శితేన ప్రకారేణ=) ఈపాదాధికరణములయందుం బ్రదర్శింపంబడినప్రకారముగా బ్రహ్మమునందు (ఉపపద్యంతే) నున్నవనుట నిస్సందేహ విషయము.

బ్రహ్మ జగత్కారణవాద సిద్ధాంతము లన్నియు నవిలక్షణత్వా ద్యధికరణములోనే స్థిరపరుపంబడి యుండుటచేత, ఇందులో సంగ్రహముగా సర్వజ్ఞత్వము- సర్వశక్తిత్వము - మహామాయిత్వము అను ధర్మములు బ్రహ్మమం దున్నవని చెప్పంబడునవి- బ్రహ్మము సర్వజ్ఞమగుటచే జగత్తునకు నిమిత్తకారణమగుటకును సర్వశక్తి యగుటచే నుపాదాన కారణ మగుటకును, మహామాయి యగుటచే నిమిత్తోపాదాన కారణములు రెండును దానేయగుటకును సమర్థమగుచున్నదని సూచింపంబడినది. ఇందు ముఖ్యముగా నుద్దేశింపంబడినది మహామాయిత్వధర్మమే

ఇట్టి ధర్మము బ్రహ్మమందు మాత్రమే యుండుటచే బ్రహ్మము నిర్గుణమయ్యును బ్రహ్మ మున్నది యున్నట్లేయుండి (పాలు పెరుగైనట్లు) చెడకుండఁగను మారకుండగనే త్రాడున్నది యున్నట్లెయుండి భ్రాంతిద్వారా తనస్వభావమునకు వ్యతిరేకమైన పామును బుట్టించునట్లె) తనయందున్న మాయాశక్తివలన నీసగుణమైన జగత్తును బుట్టించుటకు సమర్థమగుచున్నదని నిశ్చయమగుచున్నది. కాన (నిమిత్త కారణము) ఈజగత్తును జేసినవాఁడు బ్రహ్మమే యనియు, (ఉపాదాన కారణము) బ్రహ్మమను పదార్థమునుండియే ఈజగత్తు పుట్టినదనియు, (అభిన్నము) బ్రహ్మమునకన్న నీజగత్తు భిన్నముగాదనియు నీసూత్రముచేఁ జెప్పబడుట మూలమున నిర్గుణమునుండి సగుణమెట్లు పుట్టఁగలదను నాక్షేపము మూలమట్టుగా ఖండింపఁబడినది కాబట్టియే బ్రహ్మమీజగత్తునకు అభిన్న నిమిత్తోపాదాన కారణమైనది. అనగా జగత్తు బ్రహ్మముయొక్క వివర్తముగాని యనువర్తముగాదు.

తస్మాదనతి శంకనీయ మిద మౌపనిషదం దర్శనమితి.

కాబట్టి బ్రహ్మమె జగత్కారణమను నీయుపనిషత్సిద్ధాంతము శంకింపఁ దగినదిగాదు,

ద్వితీయాధ్యాయము - ప్రథమపాదము సంపూర్ణము

పంచాక్షరీ ముద్రాక్షరశాల, గుంటూరు-2.